
'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 110

శుక్రవారం 11-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇంగ్లండ్ ఆచితూచి...

తొలి రోజు 251/4. రూట్ 99 బ్యాటింగ్. నితీశ్ రెడ్డికి 2 వికెట్లు. -15లో



2 లక్షల కోట్లకు క్విక్ కామర్స్

2027-28కి చేరుకుంటుందని కెరెర్ఎడ్జ్ రేటింగ్స్ అంచనా -15లో



ఎన్నికల ముందే ఎందుకు?

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతో సమస్యలేదని.. చేపట్టిన సమయమే అసలు సమస్యని సుప్రీంకోర్టు చెప్పింది.


వివరాలు 6లో ▸



హ్యాండ్ బ్యాగ్ రూ.70 కోట్లు!

ఫ్రెంచ్ నటి దివంగత జేన్ బిర్కిన్ వాడిన హ్యాండ్ బ్యాగ్ వేలంలో రూ.70 కోట్లకు అమ్ముడుపోయి సరికొత్త చరిత్ర సృష్టించింది.

వివరాలు 6లో ▸



చందమామను ఢీకొన్న వేళ..

గ్రహశకలం లేదంటే తోకచుక్క అనూహ్యంగా దిశ మార్చుకుని వచ్చి చంద్రుడి ఉపరితలంపై వినాశనం సృష్టించింది.

వివరాలు 6లో ▸



ఎమర్జెన్సీ.. చీకటి అధ్యాయం

ఎమర్జెన్సీ సమయంలో క్రమశిక్షణ పేరిట చేపట్టిన చర్యలు ఎన్నో దారుణాలకు దారి తీశాయని శశిథరూర్ విమర్శించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బచావత్‌కు 'బనకచర్ల' విరుద్ధం!



ఏపీ ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ఆమోదయోగ్యం కాదని జీఆర్ఎంబీ కుండబద్దలు కొట్టింది. 108వ టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ జారీ చేసిన మార్గదర్శకాలకు విరుద్ధమని చెప్పింది.

- వివరాలు 12లో▶

సినీ నటులపై ఈడీ కేసు



బెట్టింగ్ యాప్‌లకు ప్రచారకర్తలుగా వ్యవహరించిన నటులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా 29 మందిపై ఈడీ కేసు నమోదు చేసింది. పంజగుట్ట, మియాపూర్, సైబరాబాద్, సూర్యాపేట, విశాఖపట్నంలో నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా చర్యలు తీసుకుంది.

- వివరాలు 16లో▶

తప్పుడు పత్రాలతో మోసగించారు



తప్పుడు పత్రాలతో మోసానికి పాల్పడటంతో పాటు నిధుల గోల్‌మాల్‌కు పాల్పడిన నేరంపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు సహా ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐడీ అదనపు డీజీ చారుసిన్హా తెలిపారు.

- వివరాలు 16లో▶

సర్కార్ బడిలో ఐఐటీ పాఠాలు



డిజిటల్ ప్రపంచాన్ని శాసిస్తున్న అధునాతన సాంకేతిక కోర్సులు సర్కార్ బడి విద్యార్థులకు చేరువ కానున్నాయి. ఐఐటీ మద్రాస్ తన సాంకేతిక కోర్సుల విస్తరణలో భాగంగా సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పాఠాలు చెప్పనుంది.

- వివరాలు 2లో▶

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% కోటా

పంచాయతీరాజ్ చట్ట సవరణకు త్వరలో ఆర్డినెన్స్

సీఎం అధ్యక్షతన జరిగిన భేటీలో కేబినెట్ కీలక నిర్ణయాలు

వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం, వాకిటి



కేబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు వాకిటి, పొన్నం, జూపల్లి, అడ్లూరి

- త్వరలో 22,033 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు.. జాబ్ కేలండర్ రెడీ
- అమిటీ, సెయింట్ మేరీస్ విద్యా సంస్థలకు వర్సిటీ హోదా
- పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ సత్వరమే పూర్తి
- మత్స్యశాఖ బడ్జెట్ రూ.19 కోట్ల నుంచి రూ.122 కోట్లకు పెంపు
- గోశాలల ఏర్పాటు, నిర్వహణపై సీఎస్ నేతృత్వంలో కమిటీ
- 'ఆధార్'తో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరుపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పంచాయతీరాజ్ చట్టం–2018 సవరణకు త్వరలో ఆర్డినెన్స్ తీసుకురావాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన కేబినెట్.. పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీ అనంతరం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విలేకరులకు వివరాలు వెల్లడించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీతో పాటు కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం రాష్ట్రంలో కుల గణన నిర్వహించడాన్ని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును శాసనసభలో ఆమోదించి, గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించిన విషయం గుర్తు చేశారు. సీఎం, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, ఇతర మంత్రులు ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ పలువురు కేంద్రమంత్రులు, సంబంధిత అధికారులతో దీనిపై అనేకసార్లు చర్చించినా కొర్రీలు వేస్తూ కాలయాపన చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ భేటీకి అడ్వొకేట్ జనరల్‌ను కూడా ఆహ్వానించి ఆయన సలహాలు తీసుకుని, న్యాయపరమైన చిక్కులు రాకుండా బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఎన్నికలకు ఇబ్బందులు ఎదురవకుండా రాజకీయ పార్టీలు కూడా చిత్తశుద్ధితో సహకరించాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి ఇప్పటికే రాష్ట్రంలో 62 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని, రిజర్వేషన్లపై 50 శాతం క్యాప్ నిబంధన దేశంలో ఎప్పుడో పోయిందని అన్నారు.

కేబినెట్ నిర్ణయాలు 96% అమలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక దీనికి ముందు వరకు జరిగిన 18 మంత్రివర్గ

మిగతా 3వ పేజీలో ▶



పంచాయతీల స్థలాలు ప్రైవేట్‌పరం?

కార్బన్ హక్కుల పేరిట ఐఓఆర్‌ఏ అనే సంస్థకు 30 ఏళ్లపాటు ధారాదత్తం!

- హరిత సౌభాగ్యం ప్రాజెక్టులో పాల్గొనడానికి సర్కారు అనుమతి
- హరిత వనాల అభివృద్ధికి 12 వేల పంచాయతీలు తీర్మానం చేసి పంపాలని ఆదేశం?
- గ్రామ పంచాయతీల లెటర్ హెడ్‌లపై గ్రామ సభలు పెట్టి ఎన్‌వోసీలు ఇవ్వాలని నిర్దేశం
- ప్రస్తుతం పాలక మండళ్లు లేనందున అధికారులతోనే ఈ తతంగం పూర్తికానిచ్చే అవకాశం
- ఈ నిర్ణయంతో పంచాయతీలు భూములపై హక్కులు కోల్పోతాయని ఆందోళన
- భవిష్యత్తులో స్థలం కావాలంటే పంచాయతీలకు లభించని పరిస్థితి నెలకొంటుందన్న అభిప్రాయం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఓవైపు ఎన్నికలు నిర్వహించకుండా తాత్సారం చేస్తూ వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పంచాయతీల్లోని భూములను 30 ఏళ్లపాటు ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టడానికి సిద్ధమైంది. ఈ మేరకు హరిత సౌభాగ్యం (తెలంగాణ) ప్రాజెక్టులో పాల్గొనడానికి ఐఓఆర్‌ఏ ఎకొలాజికల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి ఇవ్వనుంది. అందులో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలు వెంటనే తీర్మానాలు చేసి పంపించాలని ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. పంచాయతీల పరిధిలోని స్థలాల్లో హరిత వనాలను అభివృద్ధి చేయడానికి 30 ఏళ్ల వరకు

మిగతా 12వ పేజీలో ▶

రోగులు, బోధకులు లేకున్నా అనుమతులా?

జాతీయ వైద్య కమిషన్ అధికారుల తీరుపై అనుమానాలు

- కొన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో లోపాలు పట్టించుకోకుండా అడ్మిషన్లకు ఓకే
- కాళోజీ వర్సిటీ వసతుల్లేవని తేల్చిన 4 కాలేజీలకు ఒక్క రోజులోనే గ్రీన్‌సిగ్నల్
- ఎస్‌ఎంసీ బృందంతో రాష్ట్ర వైద్యాధికారుల కుమ్మక్కు!
- రూ.కోట్లు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు
- ఈ వ్యవహారాలపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న వైనం
- ఎన్‌ఎంసీ సమావేశాలకు రాష్ట్ర మాజీ అధికారులు హాజరవుతుండటంపై విస్మయం



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ అధీనంలోని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తీరు కంచె చేనును మేసిన చందంగా తయారైందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా సాగుతున్న ప్రైవేటు మెడికల్ కాలేజీల దందాకు అడ్డుకట్ట వేసి, విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యను అందించేలా చూడాల్సిన ఎన్ఎంసీ అధికారులు లంచాలకు కక్కుర్తి పడుతూ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఆయా రాష్ట్రాల్లోని ప్రస్తుత, మాజీ వైద్యాధికారులతో కుమ్మక్కై ప్రైవేటు వైద్య కళాశాలల నుంచి రూ.కోట్లలో లంచాలుగా తీసుకున్నట్లు గుర్తించిన సీబీఐ.. ఓవైపు దేశ వ్యాప్తంగా దర్యాప్తు సాగిస్తుండగా, మరోవైపు ఇదేమీ పట్టనట్లు వైద్య కమిషన్ అధికారులు తమ లాలూచీని కొనసాగిస్తూ అధ్వాన స్థితిలో ఉన్న ప్రైవేటు వైద్య కళాశాలలకు సైతం వందశాతం మార్కులు వేస్తూ వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు ఆమోదముద్ర వేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి, ఏ మాత్రం వసతులు లేకున్నా.. కాలేజీలకు అనుమతులు కట్టబెడుతున్నారని తెలుస్తోంది.

వర్సిటీ అలా..ఎన్ఎంసీ ఇలా

రాష్ట్రంలోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇటీవల

మిగతా 2వ పేజీలో ▶



దేశ పటంలో తెలంగాణను తొలగిస్తారా?

- తప్పుబట్టిన కేటీఆర్
- బీజేపీ క్షమాపణకు డిమాండ్

12 లో



తెలంగాణ నీట్ అర్హులు 43,400 మంది

2 లో

కంప్యూటర్ కోర్సుల వైపే..

- ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లలో ఎమర్జింగ్ బ్రాంచీలనే ఎంచుకున్న విద్యార్థులు
- 10 వేల ర్యాంకు వరకు ఓపెన్ కేటగిరీలో సీటు వచ్చే చాన్స్
- ముగిసిన ఆప్షన్ల గడువు.. 18న సీట్ల కేటాయింపు.. 13న మాక్ సీట్లు
- ఖరారైన ఫీజులను ప్రభుత్వం నిలిపేయడంపై కోర్టుకెక్కనున్న మరికొన్ని కాలేజీలు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ తొలిదశ కౌన్సెలింగ్ ముగింపు దశకు చేరుకుంది. వెబ్ ఆప్షన్లు గురువారంతో ముగియగా ఈ నెల 13న మాక్ సీట్ల కేటాయింపు జరగనుంది. ఆ ప్రక్రియ పూర్తవ్వగానే వెబ్ ఆప్షన్లు మార్చుకోవడానికి మరో రెండు రోజుల గడువు లభించనుంది. ఈ నెల 18న తొలి దశ సీట్ల భర్తీ ఉంటుంది. ఇప్పటివరకు ఆప్షన్లు ఇచ్చిన వారి సంఖ్య లక్ష దాటింది. దాదాపు 40 వేల ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో 78 శాతం మంది కంప్యూటర్ కోర్సులనే మొదటి ఆప్షన్‌గా పెట్టుకున్నారు. ఇందులోనూ ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ బ్రాంచీలకు ప్రాధాన్యమిచ్చారు. సివిల్, మెకానికల్, ఈసీఈ, ఈఈఈ, సీఈసీ వంటి కోర్సుల్లో మెజారిటీ

మిగతా 2వ పేజీలో ▶

'క్యాబ్'లకు కళ్లెం?



- ఇన్నేళ్ల తర్వాత అవి రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోకి..
- తాజాగా మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలను సవరించిన కేంద్రం
- క్యాబ్ కనీస చార్జీ, సర్జ్ చార్జీల నిర్ధారణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- బైక్ ట్యాక్సీల కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: క్యాబ్ సర్వీసులు తొలిసారి రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోకి రాబోతున్నాయి. ఓలా, ఉబర్, రాపిడో లాంటి క్యాబ్ అగ్రిగేటర్లు రాష్ట్రంలో దాదాపు 11 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నాయి. కానీ, వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు తన నియంత్రణలోకి తీసుకోలేదు. ఫలితంగా ఇన్నేళ్లుగా అవే సొంతంగా చార్జీలను నిర్ధారించుకుంటూ, ఓ పద్ధతి అంటూ లేకుండా పీక్ డిమాండ్ పేరుతో తోచినంత చార్జీ పెంచుతూ ప్రయాణికుల జేబులను కొల్లగొడుతున్నాయి. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు వాటిని రాష్ట్ర ప్రభుత్వం నియంత్రణలోకి

మిగతా 5వ పేజీలో ▶

44కు చేరిన కల్తీ కల్లు బాధితులు

- నిమ్స్‌లో కోలుకున్న 27 మంది
- బాధితులను పరామర్శించిన మంత్రి దామోదర
- కల్లులో నెఫ్రోటాక్సిన్స్ కలవటం వల్లే దారుణం
- ఘటనపై నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్

5 లో

గూడు కట్టని బాధ

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవరోధాలు

గతంలో ఇల్లు మంజూరైతే కొత్త ఇల్లు రద్దు • విస్తీర్ణం పెరిగినా, తగ్గినా బిల్లుల నిలిపివేత
పాత ఇల్లు కూలగొట్టి, కొత్త ఇల్లు నిర్మించుకోలేక లబ్ధిదారుల ఆవేదన



కుమురం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలం గోవిందాపూర్‌కు చెందిన కురేట్కర్ శ్రీకాంత్ ఇంటికి 600 చదరపు అడుగులకు బదులు, మేస్త్రీ 682 చదరపు అడుగులతో పునాది వేశారు. నిబంధనల ప్రకారం 82 చదరపు అడుగులు ఎక్కువగా ఉండడంతో అధికారులు బిల్లు నిలిపివేశారు. దీంతో మళ్లీ నిబంధనల మేరకే ఇల్లు కడతానని బాండ్ పేపర్ రాసిస్తూ అధికంగా ఉన్న నిర్మాణాన్ని తొలగించి పనులు మొదలు పెట్టాల్సి ఉంది. గోవిందాపూర్ పైలట్ గ్రామం కాగా, ఇక్కడ 105 మందికి ఇళ్ల నిర్మాణానికి అనుమతి వస్తే, ఏడు ఇళ్లు విస్తీర్ణం మించి ఉన్నట్లు గుర్తించి అధికారులు నిలిపివేశారు.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఇందిరమ్మ ఇళ్ల పథకం నిబంధనలు, ఇతరత్రా కారణాలతో ఇళ్లు మంజూరై నిర్మాణాలు మొదలయ్యాక కూడా వేలాది ఇళ్లు మధ్యలో నిలిపివేయాల్సి వస్తోంది. కొన్నిచోట్ల నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అండర్ టేకింగ్ తీసుకుని నిబంధనలకు అనుగుణంగా మార్చుతున్నారు. పైలట్ గ్రామాల్లో చాలాచోట్ల ఇప్పటికీ పునాదుల దశలోనే ఇళ్లు నిలిచిపోయి ఉన్నాయి. ఈ పథకం కింద నిర్మించే ఇల్లు 400 నుంచి 600 చదరపు అడుగులలోపే ఉండాలి. ఒక చదరపు అడుగు పెరిగినా, తగ్గినా బిల్లు ఆపేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, 1.48 లక్షల ఇళ్ల నిర్మాణం మొదలయింది. బేస్‌మెంటు వరకు పూర్తయితే రూ.లక్ష సాయం అందించాలి. అయితే నిబంధనల మేరకు లేవని వేలాది ఇళ్లను రద్దు చేయడం, నిర్మాణం ఆపివేయడం, బిల్లులు నిలిపి వేయడం జరుగుతోందని బాధిత లబ్ధిదారులు వాపోతున్నారు.

మంజూరయ్యాక నిలిపేస్తూ..

పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో చాలా మంది లబ్ధిదారులు తక్కువ విస్తీర్ణంలో నిర్మాణం నచ్చక, ఇల్లు కట్టేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో కొందరు తమకు ఇల్లు వద్దని

మిగతా 5వ పేజీలో ▶

ఇదంజగత్



సార్! ఇప్పుడిక్కడున్నది మన ప్రభుత్వమే! కేజ్రీవాల్‌ది కాదు!!

క్లుప్తంగా...

ఆసుపత్రి నుంచి నందినగర్ నివాసానికి కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: సాధారణ వైద్య పరీక్షల కోసం గురువారం ఉదయం మరోమారు యశోద ఆసుపత్రికి వెళ్లిన బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు సాయంత్రం తిరిగి నందినగర్ నివాసానికి వెళ్లారు. అవసరమయ్యే పక్షంలో మరోసారి వైద్య పరీక్షలకు రావాల్సి ఉంటుందని వైద్యులు సూచించినట్లు తెలిసింది. తొలుత సాధారణ వైద్య పరీక్షల కోసం ఈ నెల 4న సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరిన కేసీఆర్, రెండు రోజుల పాటు ఆసుపత్రిలోనే ఉన్న విషయం తెలిసిందే. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక నందినగర్ నివాసంలోనే ఉంటున్న కేసీఆర్, తనను పరామర్శించేందుకు వస్తున్న బీఆర్ఎస్ నేతలు, ఉద్యమకారులు, వివిధ రంగాలకు చెందిన వారితో భేటీ అవుతున్నారు. అలాగే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, సాగునీటి రంగానికి సంబంధించిన సమస్యలపై కేసీఆర్ దిశా నిర్దేశం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

నేడు హైదరాబాద్‌లో 'దక్షిణ్ సంవాద్' స్వర్ణోత్సవం

పాల్గొననున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'దక్షిణ్ సంవాద్' స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేస్తున్న అధికారిక భాషా విభాగం తెలిపింది. దీని కోసం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశామని పేర్కొంది. గురువారం హైదరాబాద్‌లోని సీజీఓ టవర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధికారిక భాషా విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ మీనాక్షి జాలీ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డి, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొంటారని తెలిపారు. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఉన్నతాధికారులు, స్కాలర్లు, భాష పట్ల ఉత్సాహం కనబరిచే వారు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలివస్తారని వెల్లడించారు. భారతీయ భాషలన్నింటి మధ్య చర్చలు, సహకారాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమ ప్రధానోద్దేశమన్నారు. ఈ పత్రికా సమావేశానికి హైదరాబాద్‌లోని పత్రికా సమాచార కార్యాలయ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

'ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు నియంత్రించాలి'



నవీన్ నికోలస్‌కు వినతి పత్రం ఇస్తున్న వివిధ సంఘాల నేతలు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో రెండవ శనివారం సెలవు అమలయ్యేలా చూడాలని తెలంగాణ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్), ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. సంఘ నేతలు గురువారం పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్‌ను కలిసి, ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా సీట్లు ఇచ్చేలా చూడాలని కోరారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ నేతలు విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

'తక్షణమే జాబ్ కేలండర్ విడుదల చేయాలి'

సాక్షి, హైదరాబాద్: తక్షణమే జాబ్ కేలండర్ విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు.

సర్కార్ బడిలో ఐఐటీ పాఠాలు

సిరిసిల్ల విద్యార్థులకు ఐఐటీ మద్రాస్ శిక్షణ

ఆధునిక సాంకేతిక కోర్సుల్లో బోధన

ఆగస్టు నుంచి ఆన్‌లైన్ విధానంలో తరగతులు



శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సిరిసిల్ల కల్చరల్: డిజిటల్ ప్రపంచాన్ని శాసిస్తున్న అధునాతన సాంకేతిక కోర్సులు సర్కార్ బడి విద్యార్థులకు కూడా చేరువ కానున్నాయి. దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ ఐఐటీ మద్రాస్ తన సాంకేతిక కోర్సుల విస్తరణలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పాఠాలు చెప్పనుంది. స్థానిక గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అత్యాధునిక సాంకేతిక కోర్సుల్లోని మౌలిక అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఆన్‌లైన్ విధానంలో ఆగస్టు నుంచి రెండు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఐఐటీ మద్రాస్ లేఖ రాసింది. స్కూల్ కనెక్ట్‌లో భాగంగా ఐఐటీ మద్రాస్ సిరిసిల్లలోని రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో భాగస్వామ్యమైంది. ఈ-మెయిల్ ద్వారా ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు లేఖలు పంపింది. ఐఐటీ మద్రాస్, సెంటర్ ఫర్ ఔట్‌రీచ్ అండ్ డిజిటల్ ఎడ్యుకేషన్ (కోడ్) ద్వారా స్కూల్ కనెక్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా శివనగర్, గీతానగర్ ప్రభుత్వ పాఠశాలలను ఎంచుకుంది.

ఇవీ కోర్సులు..

డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏరోస్పేస్ ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, ఇంజినీరింగ్, బయోలాజికల్ సిస్టమ్స్, మేథ్స్ అన్‌ప్లగ్‌డ్ గేమ్స్ అండ్ పజిల్స్, పర్యావరణం, ఫన్ విత్ మేథ్స్ అండ్ కంప్యూటింగ్, లా, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, హ్యూమానిటీస్ వంటి పది కోర్సులను రెండు నెలల పాటు బోధిస్తారు. ముందుగానే చిత్రీకరించిన వీడియోలను ప్రతి సోమవారం పోర్టల్‌లో ఉంచుతారు. ఐఐటీ ప్రొఫెసర్లతో ప్రతి శనివారం ప్రత్యక్ష సంభాషణకు అవకాశం కల్పిస్తారు. విద్యార్థుల సందేహాలను వారు నివృత్తి చేస్తారు. ఫలితంగా ఆయా కోర్సుల్లో విద్యార్థులు తమ నైపుణ్యాలకు పదును పెట్టుకుంటారు.



గీతానగర్ హైస్కూల్ విద్యార్థులు



విద్యార్థులకు విస్తృత ప్రయోజనాలు

ఐఐటీ మద్రాస్‌తో అనుసంధానానికి ఎంపికవడం వ్యక్తిగతంగా సంతోషంగా ఉంది. ఇది మా పాఠశాల విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి ఎంతో దోహదం చేస్తుంది. అత్యాధునిక కోర్సుల మౌలికాంశాలపై శిక్షణ పిల్లల కెరీర్ నిర్మాణానికి ఉపకరిస్తుంది. డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కొత్తతరం సాంకేతికతల్లో సర్కార్ బడి పిల్లలు సత్తా చాటుతారు.

– చకినాల శ్రీనివాస్, శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

పేద బిడ్డలకు టెక్నాలజీ చేరువవుతుంది


ప్రభుత్వ బడిలో చదివే పేద విద్యార్థులకు టెక్నాలజీని చేరువ చేసేందుకు ఈ స్కూల్ కనెక్ట్ ఉపయోగపడుతుంది. ఐఐటీ మద్రాస్ తరగతులతోపాటు అక్కడి ప్రొఫెసర్లతో నేరుగా సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం కల్పించడం విద్యార్థులకు వరంగా భావించాలి. ఇంజినీరింగ్ కోర్సుల్లో మాత్రమే లభ్యమయ్యే అంశాలను పాఠశాల స్థాయిలోనే నేర్చుకునే అరుదైన అవకాశం ఇది.

– లోకిని శారద, హెచ్ఎం, గీతానగర్ జెడ్పీ హైస్కూల్

'ఫీజు'లపై జూన్‌లోగా నిర్ణయం తీసుకోలేరా?

ఏటా ఇదో ప్రహసనంలా మారిందంటూ హైకోర్టు వ్యాఖ్య

- ఫీజు పెంపు కోరుతూ ఇంజనీరింగ్ కాలేజీల పిటిషన్లపై విచారణ
- టీఏఎఫ్ఆర్‌సీ తీరుపై అసంతృప్తి.. నేడు మధ్యంతర ఉత్తర్వులిస్తామని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపుపై జూన్‌లోగా నిర్ణయం తీసుకోలేరా? అని తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ)పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏటా ఫీజుల అంశం ఓ ప్రహసనంలా మారిందని.. కౌన్సెలింగ్ ముగిసి తరగతులు మొదలయ్యే వరకు తేల్చకుండా కమిటీ వ్యవహరిస్తోందని విమర్శించింది. సీట్లు, ఫీజులు.. ఇలా ఏదో ఒక కారణంతో ఏటా కాలేజీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం సర్వసాధారణంగా మారిందని వ్యాఖ్యానించింది. నెలలుగా జరుగుతున్న అంశంలో లంచ్ మోషన్ రూపంలో పిటిషన్లు వేయడంపై కాలేజీల తీరును తప్పుబట్టింది. ఫీజుల పెంపుపై శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పింది. ఫీజుల పెంపునకు ప్రభుత్వం నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ పలు ఇంజనీరింగ్ కాలేజీలు హైకోర్టులో లంచ్ మోషన్ రూపంలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. కాలేజీల తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ 2024 డిసెంబర్‌లోనే ఇంజనీరింగ్ కళాశాలలు ప్రతిపాదనలు సమర్పించాయన్నారు. మార్చిలో భేటీ అయిన కమిటీ ఆ ప్రతిపాదనలకు అంగీకరించిందని చెప్పారు. దీనికి రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలే సాక్ష్యమన్నారు. దీంతో రిజిస్టర్‌ను వెంటనే కోర్టు ముందు ఉంచాలని అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. అనంతరం టీఏఎఫ్ఆర్‌సీ తరఫు సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం వాదనలు వినిపిస్తూ కాలేజీలు లాభాపేక్షతో పనిచేయరాదంటూ సుప్రీంకోర్టు గతంలో చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. కాలేజీల ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకోవడానికి సమయంపట్టే అవకాశం ఉన్నందున బ్లాక్ పీరియడ్ (2022–23 నుంచి 2024–25)లోని ఫీజులనే 2025–26కు కమిటీ సిఫార్సు చేసిందన్నారు. మధ్యంతర ఉత్తర్వుల్లో పెంపునకు అనుమతిస్తే తీర్పు విరుద్ధంగా వచ్చినా తిరిగి విద్యార్థులకు చెల్లించబోరని పేర్కొన్నారు.

70 శాతం పెంపు కోరుతున్నారు..

ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్ రెడ్డి వాదనలు వినిపిస్తూ కమిటీ ప్రతిపాదనలను ఆమోదించడం మాత్రమే సర్కార్ బాధ్యతన్నారు. కొన్ని కాలేజీలు 70 శాతం వరకు పెంపును కోరుతున్నాయని.. ఆ మేరకు పెంపునకు అనుమతిస్తే విద్యార్థులపై భారీగా భారం పడుతుందని నివేదించారు. దీనివల్ల లక్షన్నర మంది విద్యార్థులు ప్రభావితం అవుతారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడేళ్లకోసారి ఫీజుల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా ఆ మేరకు చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. డిసెంబర్‌లో ప్రతిపాదనలు పంపిస్తే జూన్ వరకు ఏం చేశారని టీఏఎఫ్ఆర్‌సీని ప్రశ్నించారు. మార్చిలో నోటిపై చేసినప్పుడు కాలేజీలైనా తెలుసుకోవాలని కదా అని వ్యాఖ్యానించారు. కౌన్సెలింగ్, అడ్మిషన్ల సమయం దాకా కాలయాపన చేయడాన్ని తప్పుబట్టింది. హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని కమిటీ ఉన్నా ప్రతిపాదనలపై ఆలస్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించింది. శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. కాగా, కేశవ్ మెమోరియల్ పిటిషన్‌ను మరో న్యాయమూర్తి ముందు ఉంచాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు.

సీబీఐటీకి గ్రీన్‌సిగ్నల్..

ఫీజుల పెంపునకు టీఏఎఫ్ఆర్‌సీ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ సీబీఐటీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఫీజు పెంపునకు అనుమతించారు. బీఈ, బీటెక్‌కు రూ. 2,23,000, ఎంటెక్‌కు రూ. 1,51,600, ఎంబీఏ, ఎంసీఏకు రూ. 1,40,000 పెంచాలని.. ఈ మేరకు టీజీఈఏపీసీఈటీ అడ్మిషన్లలో మార్పు చేయాలని కన్వీనర్‌ను ఆదేశించారు. 2025–26, 2027–28 బ్లాక్ పీరియడ్‌కు ఈ ఫీజులు వర్తిస్తాయని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.

విధానపరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేం

గిరిజన ప్రాంతాల్లో ఎస్టీ రిజర్వేషన్లపై హైకోర్టు సింగిల్ జడ్జి

సాక్షి, హైదరాబాద్: గిరిజన ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అందులో జోక్యం చేసుకోలేమని హైకోర్టు సింగిల్ జడ్జి స్పష్టం చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని బెంచ్ వద్ద మెన్షన్ చేయాలని సూచించారు. పిటిషన్‌ను సీజే ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. తెలంగాణలోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఎస్టీకి అనుకూలంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవుల్లో 100 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ నాన్ ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, ఆర్టికల్ 14, 15ను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 100 శాతం రిజర్వేషన్ అమలు చేయడం వల్ల గిరిజనులు లేని గ్రామాల్లో సర్పంచ్‌ల ఎన్నిక జరగడం లేదన్నారు. అలా ఏళ్లుగా సర్పంచ్‌లేని గ్రామాలున్నాయని చెప్పారు. అక్కడ ప్రత్యేక అధికారులు విధులు నిర్వహిస్తున్నారని, ఈ రిజర్వేషన్లను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరారు. గిరిజనులు లేని ప్రాంతాల్లో గిరిజనేతరులకు అవకాశం ఇచ్చేలా చట్టసవరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. గిరిజన ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు విధానపరమైన నిర్ణయమని, తాము జోక్యం చేసుకోలేమని చెప్పారు.

విద్యార్థులకు టాయిలెట్ల నిర్మాణాన్ని ఎలా అడ్డుకుంటారు?

పిటిషనర్ తీరును తప్పుబట్టిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఉండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన పిటిషనర్ తీరును హైకోర్టు తప్పుబట్టింది. పాఠశాలలో టాయిలెట్ల వసతి కల్పించడం కనీసవిధి.. దాన్ని అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేసింది. పరిపాలనా నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి తగిన కారణాలు కనిపించలేదంది. పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలలో జరుగుతున్న టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ ఉండవెల్లి గ్రామానికి చెందిన బి.నూతన్‌కుమార్‌రెడ్డి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సమీప నివాస గృహాలు, బోర్‌వెల్‌లకు ఆనుకొని ఉన్న స్థలంలో టాయిలెట్ల నిర్మాణం ఆరోగ్య, పర్యావరణ సమస్యలకు కారణమవుతుందన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అడిషనల్ కలెక్టర్ గతంలో జారీ చేసిన సూచనలకు అనుగుణంగా బాధిత నివాసితులతో సంప్రదించాలన్నారు. డ్రైనేజీ వసతి సరిగా లేని కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. పాఠశాల ఆవరణలోని ప్రస్తుత ప్రాంతంలో నిర్మాణ కార్యకలాపాలను వెంటనే నిలిపివేసి, మరొక ప్రాంతానికి టాయిలెట్ కాంప్లెక్స్‌ను మార్చేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ ఇంట్లో ఐదు టాయిలెట్లు నిర్మించుకున్నారని, విద్యార్థులకు వసతి కల్పించడాన్ని అడ్డుకుంటున్నారన్నారు. పిటిషనర్ ఇంటి నుంచి 7 ఫీట్ల దూరంలో 12 టాయిలెట్లు నిర్మిస్తున్నారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 360 మంది విద్యార్థులున్న పాఠశాలలో 250 వరకు బాలికలున్నారని టాయిలెట్ల నిర్మాణం తప్పనిసరి అన్నారు. ప్రస్తుత స్థలంలో టాయిలెట్ నిర్మాణం కొనసాగించడానికి అనుమతి ఇచ్చారు. తాగునీరు కాలుష్యమవుతుందన్న కారణం చూపడం సరికాదన్నారు.

గిరిజన శాఖలో 'కుర్చీ' పోరు

ఇంజనీరింగ్ విభాగం హెచ్ఓడీ సీటు కోసం పైరవీలు

- మంత్రి అడ్లూరి పేషీ చుట్టూ ఈఈల ప్రదక్షిణలు
- పోటీలో ఉన్న వారందరిపై భారీగా అవినీతి ఆరోపణలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ప్రత్యేకంగా ఉన్న ఇంజనీరింగ్ విభాగం అధిపతి పోస్టు కోసం జోరుగా పైరవీలు సాగుతున్నాయి. ఈ విభాగం చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా పనిచేసిన శంకరయ్య జూన్ 30న పదవీ విరమణ చేయటంతో ఆ కుర్చీలో తదుపరి ఎవరు కూర్చుంటారోననే చర్చ దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ (డీఎస్ఎస్)లో జోరుగా సాగుతోంది. విద్య, సంక్షేమ శాఖలకు సంబంధించిన నిర్మాణ పనులు చేపట్టేందుకు విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ఈడబ్ల్యూఐడీసీ) ఉన్నప్పటికీ... గిరిజన సంక్షేమ శాఖకు మాత్రం ప్రత్యేకంగా ఇంజనీరింగ్ విభాగం ఉంది. ఈ శాఖ నిర్మాణ పనులన్నీ ఈ విభాగం ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. ప్రస్తుతం ఈ పోస్టు ఖాళీ కావడంతో కుర్చీని దక్కించుకునేందుకు పైరవీలకు తెరలేచింది.

మంత్రి అడ్లూరి వద్దకు పంచాయితీ

గిరిజన సంక్షేమ శాఖలోని ఇంజనీరింగ్ విభాగాధిపతిగా చీఫ్ ఇంజనీర్ (సీఈ) ఉంటారు. ఆ తర్వాతి స్థాయిలో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ), ఆయన కింద ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లు ఉంటారు. వారి కింద ఉండే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారు. సీఈ శంకరయ్య పదవీ విరమణ చేయటంతో.. ఆ బాధ్యతలను తదుపరి కేడర్‌లో ఉన్న ఎస్ఈకి అర్హతలను బట్టి ఇవ్వాలి. కానీ, ఈ విభాగంలో కొంత కాలంగా ఎస్ఈ, ఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదోన్నతుల విషయంలో నెలకొన్న సీనియార్టీ వివాదంతో ఈ ప్రక్రియ కొన్నేళ్లుగా నిలిచిపోయింది. దీంతో ఈఈ పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లే కొనసాగుతున్నారు. ఇప్పుడు సీఈ కుర్చీ ఖాళీ కావడంతో ఆ ఇన్‌చార్జ్‌లు విభాగాధిపతి కుర్చీ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఒకే బ్యాచ్‌కు చెందిన నలుగురు డీఈఈలు ఏకంగా సీఈ కుర్చీ దక్కించుకునేందుకు ఉన్నతస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. వయసు, మెరిట్ ఆధారంగా తనకే సీఈ కుర్చీ దక్కుతుందని ఒక అధికారి ధీమాతో ఉండగా... ప్రభుత్వ పెద్దల అండతో అనూహ్యంగా మరో అధికారి తెరపైకి రావడంతో ఉత్కంఠకు తెరలేచింది. ప్రస్తుతం ఈ ఫైలు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేషీకి చేరింది. దీంతో పోటీలో ఉన్న డీఈఈలు మంత్రి పేషీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. అయితే, పోటీలో ఉన్న నలుగురు అధికారులపైనా పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలున్నాయి. ఇద్దరిపై ఏసీబీ కేసులు కూడా ఉన్నాయి. మరొకరు స్థానికత అంశంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సీఈ కుర్చీ ఎవరికి దక్కుతుందా? అనే ఆసక్తి నెలకొంది.

తెలంగాణ నీట్ అర్హుల జాబితా విడుదల

43,400 మంది జాబితా విడుదల చేసిన కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది నిర్వహించిన నీట్–యూజీ పరీక్షలో రాష్ట్రం నుంచి అర్హత సాధించిన 43,400 మంది జాబితాను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసింది. అయితే ఈ జాబితా కేవలం నీట్‌లో అర్హత పొందిన అభ్యర్థుల వివరాల కోసం మాత్రమేనని.. మెరిట్ జాబితా కాదని వర్సిటీ స్పష్టం చేసింది. పూర్తి ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితాను విడుదల చేయనుంది. ప్రత్యేక వర్గాలకు చెందిన అభ్యర్థులు (ఎన్‌సీసీ, సీఏపీ, పీఎంసీ, ఆంగ్లో–ఇండియన్, ఎస్‌సీసీఎల్) మెరిట్ జాబితాను విడిగా విడుదల చేస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ పేర్కొన్నారు. దివ్యాంగ అభ్యర్థులకు మెడికల్ బోర్డు ద్వారా పరీక్ష నిర్వహించి తుది జాబితాను ప్రకటిస్తామన్నారు.

ఈనెల చివరి వారంలో ఎంసీసీ కౌన్సెలింగ్?

నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల చివరి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి. రాష్ట్రాలకు చెందిన మెరిట్ జాబితాను ప్రకటించిన తరువాత ముందుగా జాతీయ స్థాయిలో మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఓపెన్ కోటా కౌన్సెలింగ్ జరుగుతుంది. ఈ ప్రక్రియ ఈనెల చివరి వారంలో ప్రారంభమవుతుంది. నేషనల్ కౌన్సెలింగ్ పూర్తయ్యాక రాష్ట్రంలో అభ్యర్థులు ఇచ్చే వెబ్ ఆప్షన్ల ఆధారంగా ఆగస్టు తొలి వారంలో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని వర్సిటీకి చెందిన ఓ కీలక అధికారి తెలిపారు.

కంప్యూటర్ కోర్సుల వైపే..

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు మొదటి ప్రాధాన్యతగా సీఎస్‌సీనే ఎంపిక చేసుకున్నారు. మిగతా కోర్ గ్రూపులకు పదవ ప్రాధాన్యతనిచ్చారు.

ఓపెన్ కేటగిరీకి 10 వేల లోపే..

ప్రాధాన్యత క్రమాన్ని పరిశీలిస్తే కంప్యూటర్ కోర్సుల్లో పోటీ కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 171 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయి. వాటి పరిధిలో కన్వీనర్ కోటా సీట్లు 76,795 ఉండగా అందులో 68 శాతం కంప్యూటర్, ఎమర్జింగ్, ఐటీ కోర్సులే ఉన్నాయి. తొలి దశలో 500 ర్యాంకు వరకు విద్యార్థులు కంప్యూటర్ కోర్సులకే ఆప్షన్లు ఇచ్చారు. వెయ్యి ర్యాంకు దాకా విద్యార్థులు సీఎస్ఈ, ఎమర్జింగ్ కోర్సులతోపాటు ఇతర బ్రాంచీలకు ఆప్షన్లు ఇచ్చారు. వాళ్లంతా జేఎన్‌టీయూ, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని క్యాంపస్ కాలేజీలను ఎంచుకున్నారు. 2 వేల లోపు ర్యాంకు విద్యార్థులు టాప్–10 కాలేజీలకు పోటీపడగా 5 వేల లోపు ర్యాంకు విద్యార్థులు టాప్–20 కాలేజీలకు ప్రాధాన్యమిచ్చారు. 10 వేల పైన ర్యాంకు వచ్చిన విద్యార్థులు మాత్రం అన్ని కాలేజీలను, అన్ని బ్రాంచీలను ఆప్షన్లుగా పెట్టుకున్నారు. అయితే వారిలో 70 శాతం మంది కంప్యూటర్ కోర్సులకే తొలి ప్రాధాన్యమిచ్చారు. ఈసారి నాన్–లోకల్ కోటా ఎత్తేయడంతో ఎక్కువ ర్యాంకు వచ్చినా సీటు వస్తుందని విద్యార్థులు ఆశిస్తున్నారు. టాప్–10 కాలేజీల్లో జనరల్ కేటగిరీలో సీఎస్ఈ, ఎమర్జింగ్ కోర్సుల్లో 4 వేల లోపు ర్యాంకు వరకు సీట్లు రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇతర కాలేజీల్లో 10 వేలలోపు ర్యాంకు వరకు సీట్లు పొందే వీలుందని భావిస్తున్నారు.

ఫీజులపై రగడ..

ఇంజనీరింగ్ ఫీజుల వ్యవహారం హైకోర్టుకు చేరింది. ఖరారైన ఫీజులను నిలిపేయడం, పాత ఫీజులనే అమలు చేయాలనే నిర్ణయాన్ని సీబీఐటీ కాలేజీ న్యాయస్థానంలో సవాల్ చేసింది. కాలేజీకి సానుకూలంగా కోర్టు ఉత్తర్వులు వెలువడిన వెంటనే అధికారులు కోర్టులో రివ్యూ పిటిషన్ వేశారు. కోర్టు దీనిపై శుక్రవారం విచారించే వీలుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇతర కాలేజీలు కూడా కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సీట్ల కేటాయింపు చేపడతారా లేక వాయిదా వేస్తారా అనే సందేహాలు కలుగుతున్నాయి. సాంకేతిక విద్యా విభాగం అధికారులు మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని చెబుతున్నారు. న్యాయస్థానం ఇచ్చే ఆదేశాలను బట్టి కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రోగులు, బోధకులు లేకున్నా అనుమతులా?

▶ మొదటి పేజీ తరువాయి

నాలుగు ప్రైవేటు కళాశాలల్లో తనిఖీలు జరిపి వైద్య విద్యకు అనువైన కనీస మౌలిక వనరులు లేవని, రోగులు, బోధనా సిబ్బంది లేకుండా ఏదో 'సాంఘిక శాస్త్రం' బోధించినట్లుగా వైద్య విద్య అందిస్తున్నట్లు గుర్తించింది. ఈ మేరకు 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసు జారీ చేసింది. విచిత్రమేంటంటే హెల్త్ యూనివర్సిటీ తనిఖీలు చేసిన కళాశాలల్లో ఒకటైన పటాన్‌చెరులోని రాజ రాజేశ్వరి మెడికల్ కాలేజీని బుధవారం సాయంత్రం సందర్శించిన ఎన్ఎంసీ అధికారులు 100 శాతం మార్కులు వేసినట్లు తెలుస్తోంది. ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆకస్మిక పర్యటన చేసినప్పుడు ఈ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రిలోని వార్డుల్లోని బెడ్లన్నీ రోగులు, సిబ్బందితో పాటు కనీసం స్టూడెంట్లు కూడా లేక వెలవెలబోతున్నట్లు అధికారులు తీసిన ఫొటోల్లో స్పష్టంగా కనిపిస్తుండగా, ఎన్ఎంసీ అధికారుల తనిఖీల సమయంలో ఇంతలోనే ఎలాంటి లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు అనుగుణంగా రోగులు, ఫ్యాకల్టీ, మౌలిక వసతులు ఎలా సమకూరాయో ఎన్ఎంసీ అధికారులే చెప్పాలని అంటున్నారు.

మరో 3 కాలేజీలకు కూడా..

రాజ రాజేశ్వరి మెడికల్ కాలేజీతో పాటు హైదరాబాద్ శివార్లలోని నోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, సీఎంఆర్ మెడికల్ కాలేజీలలో ఎన్ఎంసీ అధికారులు తనిఖీలు జరిపి, వైద్య విద్యను కొనసాగించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఉన్నట్లుగా తేల్చినట్లు తెలిసింది. ఈ మేరకు కమిషన్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం. రాష్ట్రానికి చెందిన ఆరోగ్య విశ్వవిద్యాలయం ఓవైపు ప్రైవేటు కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు జరుపుతూ, వసతులు లేని కళాశాలలను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేస్తుంటే.. మరోవైపు ఎన్ఎంసీ అధికారులు మాత్రం ఆయా కళాశాలలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రాక్టికల్స్ కోసం శవాలు కూడా సమకూర్చుకోలేని దుస్థితి

రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలలో చాలావరకు కాలేజీల్లో విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు అవసరమైన రోగులు లేరు. ప్రాక్టికల్స్ కోసం కనీసం శవాలు కూడా సమకూర్చుకోలేని పరిస్థితి ఉంది. వార్డుల్లో పడకలు ఉన్నా, ఏ ఒక్క పడక మీద పేషెంట్ లేని పరిస్థితిని సాక్షాత్తూ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ నందకుమార్ రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్ స్వయంగా చూశారు. మరోవైపు హౌస్ సర్జన్‌గా సేవలు అందించే విద్యార్థులకు స్టైపెండ్ ఇవ్వకపోగా, నాలుగున్నరేళ్ల కోర్సుకు గాను ఐదేళ్ల కాలానికి ఫీజు తీసుకోవడం, ఫేక్ ఫింగర్ ప్రింట్స్‌తో డాక్టర్ల హాజరు, ప్రాక్టికల్స్ కోసం ఫీజులు వసూలు చేయడం వంటి నిర్వాకాలను గుర్తించారు. అయినా ఎన్ఎంసీ అధికారులు వీటిని పట్టించుకోకుండా అన్నింటికీ ఆమోద ముద్ర వేసి రావడానికి రూ.కోట్లు లంచాలుగా ముట్టడమే కారణమని ప్రభుత్వ వైద్యాధికారులే ఆరోపిస్తున్నారు.

ఎన్ఎంసీ సమావేశాలకు మాజీ అధికారులేంటి?

నీట్ అడ్మిషన్లు, కాలేజీలకు అనుమతులు, రెన్యువల్, మెడికల్ కాలేజీలకు రేటింగ్ ఇవ్వడం వంటి అంశాలపై చర్చించేందుకు గాను ఎన్ఎంసీ నిర్వహించే సమావేశాలకు ఆయా రాష్ట్రాల హెల్త్ వర్సిటీల వీసీలను, వర్సిటీల్లో కీలక హోదాల్లో పనిచేసి రిటైర్ అయిన వారిని ఆహ్వానిస్తారు. అయితే కాళోజీ నారాయణరావు వర్సిటీ వీసీ నందకుమార్ రెడ్డికి బదులుగా మాజీ వీసీ కరుణాకర్ రెడ్డిని ఎన్ఎంసీ సమావేశాలకు ఆహ్వానిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. బుధవారం ఎన్ఎంసీలో జరిగిన సమావేశానికి కూడా నందకుమార్ రెడ్డికి ఆహ్వానం వెళ్లలేదని సమాచారం. గతంలో ఎంఏఆర్‌బీ (మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు)లో ఉన్న ఓ అధికారి కాలేజీలకు ర్యాంకుల కేటాయింపులో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో సస్పెండ్ కాగా, సదరు అధికారిని కూడా ఎన్ఎంసీ సమావేశాలకు ఆహ్వానిస్తుండడం గమనార్హం. ఒడిశాకు చెందిన మరో రిటైర్డ్ వీసీ కూడా ఎన్ఎంసీలో జరిగే అవకతవకల్లో కీలక వ్యక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. వసతుల్లేని ప్రైవేటు వైద్య కళాశాలల నుంచి కోట్లాది రూపాయలు దండుకుంటున్న అధికారులు, వాటికి అనుమతులివ్వడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రీల్స్, షార్ట్స్ చూడందే పొద్దు గడవని రోజులు వచ్చేశాయి. ఎక్కడ చూడండి, ఎవరిని చూడండి, ఎప్పుడు చూడండి.. వీటిలోనే లీనమైపోయి కనిపిస్తుంటారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలకు అతుక్కుపోతున్నారు. ఒకసారి ఈ రీల్స్ లేదా షార్ట్స్ ప్రపంచంలోకి వెళ్లామంటే.. వరుసపెట్టి ఎన్ని చూస్తామో మనకే తెలీదు. ఈ షార్ట్ వీడియోలు మనల్ని ఎందుకు ఇంతలా కట్టిపడేస్తున్నాయి? ఎందుకంటే అవి మనల్ని నవ్విస్తాయి. కవ్విస్తాయి. కబుర్లు చెబుతాయి. చాలావాటిలో మన చుట్టుపక్కల వాళ్లే కనిపిస్తారు. అన్నిటినీ మించి - సెకన్లలో, నిమిషాల్లో కొద్దిపాటి నిడివితో ముగుస్తాయి. ఒకప్పుడు కాలక్షేపంతో మొదలైన ఈ వీక్షణ ఇప్పుడు ఓ వ్యసనంలా మారింది. స్వ.. షార్ట్ వీడియోల వ్యసనం (ఎస్‌వీఏ) అని పిలిచే ఈ వ్యసనం వల్ల మన మెదడు పనితీరే మారిపోయే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం ఒకటి బాంబును పేల్చింది.

‘స్వ’యంకృతం

పెరుగుతున్న షార్ట్-ఫామ్ వీడియోల వ్యసనం

- జూదం, మాదకద్రవ్య వినియోగంతో సమానమే
- ఆర్థిక నష్టాన్ని కూడా పట్టించుకోని మానసిక స్థితి.. క్రమంగా మెదడు కూడా ‘దారి తప్పే’ ప్రమాదం

రీల్స్, షార్ట్స్, వగైరాలను చూసే అలవాటు కనుక మితిమీరితే మెదడులోని ‘రీవైరింగ్’ ప్రక్రియ గతి తప్పి మనిషి మనస్తత్వంలో ప్రతికూల మార్పులు సంభవించే అవకాశం ఉందని తాజా అధ్యయనం హెచ్చరించింది. సుప్రసిద్ధ సైన్స్ జర్నల్ ‘న్యూరోఇమేజ్’లో వచ్చిన ఈ పరిశోధనా వ్యాసం ప్రధానంగా షార్ట్-ఫామ్ వీడియోల వ్యసనం (ఎస్‌వీఏ – స్వ) వల్ల ప్రవర్తనల్లోని పెను మార్పుల గురించి చర్చించింది. ‘స్వ’ మెదడు కార్యకలాపాలను తారుమారు చేయగలదని, వాటికి అలవాటు పడిన వారిని మరింత ఉద్వేగభరితంగా, ఆర్థిక నష్టాలను సైతం పట్టించుకోనంతగా మొద్దుబారేలా చేస్తుందని ఈ కొత్త బ్రెయిన్ ఇమేజింగ్ అధ్యయనం వెల్లడించింది. అంతేకాదు, ఇలాంటివారు తొందర పడి తక్షణ నిర్ణయాలు తీసుకుంటారని, ఆ నిర్ణయ దుష్ఫలితాల పట్ల కూడా అవసరమైన స్పందన చూపించరని పేర్కొంది. తద్వారా వ్యక్తిగతంగా, వృత్తిలోనూ వారి అభివృద్ధి కుంటు పడుతుందని తెలిపింది.

మెదడు దారి తప్పుతోంది..

‘స్వ’ అన్నది జూదం, మాదకద్రవ్య వినియోగం వంటి వ్యసనాల కంటే తక్కువేమీ కాదని తెలిపింది. ఈ రెండు రకాలైన వ్యసనాల్లోనూ వ్యక్తులు దీర్ఘకాలిక పరిణామాలను విస్మరించి, తక్షణ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తారని అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా – నిర్ణయాలు తీసుకోవటానికి, నియమాలను పాటించటానికి కారణమయ్యే మెదడులోని ప్రదేశాలు తమ తీరు మార్చుకుని దారి తప్పుతున్నట్లు అధ్యయనం కనిపెట్టింది.



– సాక్షి, స్పెషల్ డెస్క్

ఊటబావుల్లాంటివి

షార్ట్-ఫామ్ వీడియోలు ఊటబావుల వంటివి. స్క్రోలింగ్ చేయటానికి ఓపిక ఉండాలే కానీ వాటిల్లో అంతులేని కంటెంట్ ఉంటుంది. ఆ కంటెంట్ కూడా మనకు నచ్చేలా, మనకు సంబంధించిన విషయమని అనిపించేలా ఉంటుంది. వాటి వల్ల తక్షణ మానసిక సంతృప్తి లభిస్తుంది. అదొక తీరని దాహం అవుతుంది. దీంతో మెదడు ఒత్తిడికి గురై, మెదడు ‘రీవైరింగ్’ పని తీరులో మార్పులు సంభవిస్తాయి. పర్యవసానంగా ప్రమాదాలను పసిగట్టే, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గుతుంది. ‘చివరికి అది ఎంతవరకు దారి తీస్తుందంటే – బతుకు బండిని నడిపించే డబ్బు విషయాల్లో జరిగిన నష్టాన్ని కూడా పెద్దగా పట్టించుకోరు’ అని అధ్యయనం తెలిపింది.

మెదడు ‘రీవైరింగ్’ అంటే?

రీవైరింగ్‌నే మెదడు పునఃశిక్షణ, న్యూరోప్లాస్టిసిటీ అని కూడా అంటారు. మెదడు నిరంతరం, జీవితాంతం కొత్త నాడీ సంబంధాలను ఏర్పరచుకుంటూ ఉంటుంది. ఆ విధంగా తన పునర్వ్యవస్థీకరణ సామర్థ్యాన్ని వినియోగించుకుంటుంది. మనిషి తన అనుభవాలకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవటానికి, గాయాల నుంచి కోలుకోవటానికి; అలవాట్లను, ఆలోచనా విధానాలను మార్చుకోవటానికి అనుమతిస్తుంది. అయితే షార్ట్-ఫామ్ రీల్స్‌ను అదేపనిగా చూసే అలవాటు మెదడు ఇలా రీవైరింగ్ చేసుకోవటాన్ని నిరోధిస్తుందని తాజా అధ్యయనం చెబుతోంది.

‘స్వ’.. మొత్తం ప్రపంచ ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమించింది. తాజాగా అధ్యయనం జరిగిన చైనాలో వినియోగదారులు సగటున రోజుకు 151 నిమిషాలు ఈ వీడియోలనే చూస్తూ గడుపుతున్నారు. దాదాపు 95.5 శాతం మంది ఇంటర్నెట్ యూజర్లు వీటిలోనే నిమగ్నమై ఉంటున్నారు. ఈ తీవ్రత.. ఏకాగ్రత, నిద్ర, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, నిరాశా నిస్పృహలను దరిచేర్చే ప్రమాదం ఉందని చైనాలోని టియాంజిన్ నార్మల్ విశ్వవిద్యాలయం సైకాలజీ ప్రొఫెసర్, అధ్యయన కర్త కియాంగ్ వాంగ్ అంటున్నారు.

నిద్రలేమి... నిరాశ నిస్పృహలు

ముఖ్యంగా, ‘స్వ’ ఉన్నవారిలో ఆర్థిక నష్టాల పట్ల పట్టింపు ఎందుకు ఉండటం లేదో కనుగొనాలని పరిశోధనా బృందం ప్రయత్నించింది. లాభాల కంటే నష్టాలకు ఎక్కువగా స్పందించే ధోరణిని.. నిర్ణయం తీసుకోవడంలో ముందు జాగ్రత్త లక్షణంగా పరిగణిస్తారు. ఈ లక్షణం ప్రమాదకర ప్రవర్తనను నివారించడానికి సహాయపడుతుంది. జూదం, మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలైన వారు తమ ఆర్థిక నష్టాల పట్ల కాస్తయినా స్పందనను చూపుతుండగా, షార్ట్-ఫామ్ వీడియో వ్యసనంలో ఇందుకు భిన్నంగా ఉండటానికి కారణాన్ని మాత్రం అధ్యయం కచ్చితంగా తేల్చలేకపోయింది. దానిని కనిపెట్టటానికి వారు ఈ రెండు రకాల వ్యసనాల కంప్యూటేషనల్ మోడలింగ్ (డీడీఎం), న్యూరోఇమేజింగ్ (ఎఫ్ఎంఆర్ఐ)లను ఆశ్రయించారు. కారణాల కోసం అన్వేషిస్తున్నారు.

ఎందుకు స్పందించడం లేదు?

యువతపై తీవ్ర ప్రభావం

ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇండియన్ సైకాలజీ గతంలో నిర్వహించిన అధ్యయనంలో యుక్త, మధ్య వయస్కుల్లో.. షార్ట్స్, రీల్స్ చూడటం వల్ల ఒక పని మీద ధ్యాస, శ్రద్ధ ఉండకపోవడం గమనించారు. ముఖ్యంగా రకరకాల అంశాలకు సంబంధించిన చాలా స్వల్ప వ్యవధి వీడియోలు మార్చి మార్చి చూడటం వల్ల... యువత ఒక సమయంలో ఒకే పనిమీద పూర్తి శ్రద్ధ పెట్టలేకపోతున్నారని తేలింది.

దేశంలోని నెట్ వినియోగదారుల్లో **80** శాతానికి పైగా షార్ట్ ఫామ్ వీడియోలు రోజూ వీక్షిస్తున్నారు.



ఇండియాలో నెట్ యూజర్లు రోజుకు గంటకుపైగానే షార్ట్-ఫామ్ వీడియోలు చూస్తున్నారని ఒక అంచనా.

క్లుప్తంగా...

రిజర్వేషన్లపై కేబినెట్ భేటీలో మాట్లాడాలి

మంత్రి పొన్నంకు బీసీ నేతల వినతి



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల పెంపు విషయాన్ని కేబినెట్ సమావేశంలో మాట్లాడాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బీసీ నేతలు కోరారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలోని బీసీ ప్రతినిధుల బృందం పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయింది. బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వం సమగ్ర విధానం ప్రకటించాలని, అలాగే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి సీఎం నేతృత్వంలో ఢిల్లీకి అఖిలపక్ష బృందాన్ని తీసుకువెళ్లాలని కోరారు. తాత్కాలిక పద్ధతిన బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం జీవో తెస్తే భవిష్యత్తులో న్యాయపరంగా ఈ జీవో నిలబడదనే విషయాన్ని ప్రభుత్వం గ్రహించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం


బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్



సాక్షి, హైదరాబాద్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మాజీ మంత్రి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కుమార్ చెప్పారు. గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ‘అందుబాటులో ప్రజా ప్రతినిధులు’కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. సమస్యలను విని అప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశాల ప్రకారం ‘అందుబాటులో ప్రజా ప్రతినిధులు’కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం చేపట్టడం మంచి పరిణామమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడుతుందని, ప్రజా సంక్షేమం ధ్యేయంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని అన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యేగా దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను కూడా ఈ ప్రభుత్వ హయాంలో పరిష్కరిస్తున్నట్లు ఆయన చెప్పారు.

రిజర్వేషన్లు ఇవ్వకుంటే ప్రతిఘటిస్తాం

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడతామని, లేదంటే ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ హెచ్చరించారు. గురువారం ఆయన సచివాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర నిధుల కోసం పలుమార్లు ప్రధానిని కలుస్తున్న సీఎం రేవంత్, బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎందుకు అడగడం లేదని నిలదీశారు. బీసీల కోసం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఆమరణ దీక్ష చేపట్టాలని కోరారు. రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర స్థాయిలో జీవో, లేదా ఆర్డినెన్సు, కేంద్ర స్థాయిలో రాజ్యాంగ సవరణ అవసరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు మాని బీసీ రిజర్వేషన్ల పెంపునకు నిబద్ధతతో కృషి చేయాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న ప్రధాన హామీతో కాంగ్రెస్‌ను గద్దెనెక్కించామని గుర్తు చేశారు. రిజర్వేషన్ హామీని అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని దాసు సురేశ్ హెచ్చరించారు.

నిజమే.. మేం జాగీరుదారులం కాదు

కాపలాదారులం.. తెలంగాణ తల్లి వాకిట జాగిలాలం

- భుజాలు తడుముకొని రాధాకృష్ణ నేరాన్ని అంగీకరించారు
- కులచట్రంలో ఇరుక్కుని ఉండటమే ఆయన మరుగుజ్జుతనం
- కేసీఆర్ దయాగుణం వల్లే నువ్వు..

చంద్రబాబు బయట ఉన్నారు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రపంచమంతా కుల, మతాల గోడల్ని బద్దలు కొట్టి నాగరికత వైపు వెళుతుంటే..ఆంధ్రజ్యోతి పత్రికాధిపతి రాధాకృష్ణ ఇంకా కులచట్రంలోనే ఇరుక్కుని మరుగుజ్జుతనంతో వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. కొత్తపలుకు పేరిట ఇటీవల ఆంధ్రజ్యోతిలో తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. ‘పోలీసులకు దొరికినప్పుడు దొంగ తత్తరపడినట్టు రాధాకృష్ణ రాతల్లోనూ అలాంటి ధోరణే కనిపిస్తోంది. భుజాలు తడుముకుని నేరాన్ని తన రాతల్లో రాధాకృష్ణ అంగీకరించాడు. హైదరాబాద్‌తో సహా తెలంగాణలో స్థిరపడిన వారందరూ చంద్రబాబు కంటే కేసీఆర్ పాలనలో సంతోషంగా స్వేచ్ఛగా ఉన్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని చంద్రబాబు నేరుగా కేసీఆర్‌తో ఢీకొన్నా సెటిలర్లు కేసీఆర్ వెంట నిలిచారు. 2023లోనూ అవే ఫలితాలు పునరావృతం అయ్యాయి. ఇక్కడ స్థిరపడిన ఆంధ్ర ప్రజలకు చంద్రబాబు, నువ్వు టీకేదారులు అని చెప్పుకున్నా..తిరస్కరించిన సంగతి గుర్తు పెట్టుకోండి. మొదటి నుంచి తెలంగాణను వ్యతిరేకిస్తున్న ఏపీకి చెందిన ఓ వర్గంవారు ఇక్కడి నాయకుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. వాళ్ల మీడియా ముసుగులు తొలగించి భరతం పడతామని నేను చెప్పాను. తమ అభిమాన నాయకుల వ్యక్తిత్వ హననంపై అభిమానులు, కార్యకర్తలు చేసిన చిన్న నిరసన మాత్రం మీకు చాలా పెద్దదిగా కనపడింది’అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాధాకృష్ణ రాతల్లో పేర్కొన్నట్టు ‘నిజమే మేము జాగీరుదారులం కాదు.. తెలంగాణతల్లి వాకిట జాగిలాలం, కాపలాదారులం’అని జగదీశ్‌రెడ్డి ప్రకటించారు.

కేసీఆర్ దయాగుణం వల్లే బయట ఉన్నారు

‘ఉద్యమ సందర్భంలో మీరెంత విషం చిమ్మినా, తెలంగాణ ఏర్పడిన తర్వాత మంత్రివర్గంపై, శాసనసభపై మీరు దిగజారి మాట్లాడినా ఏ విచారణ అక్కర లేకుండా, మిమ్మల్ని 100 సార్లు జైలుకు పంపే అవకాశం వచ్చినా కేసీఆర్ క్షమాభిక్ష, దయాగుణం వల్లే బయట ఉన్నావు. మీతో పాటు మీ గురువు చంద్రబాబును జైలుకు పంపే అవకాశం వచ్చినా వదిలేయడం కేసీఆర్ గొప్పతనం. మోదీ అండ, చంద్రబాబు చెంతన ఉన్నారని, తెలంగాణ సీఎం చెప్పుచేతుల్లోనే ఉన్నారని, ఉడత ఊపులకు భయపడనని హూంకరించిన మీరు వందల మంది పోలీసులను కాపలా తెచ్చుకున్నారు. వాళ్లను, వీళ్లను బతిమాలి జరగని దాడికి ఖండనలు ఇప్పించుకుంటున్న తీరు ఏ ఊపులకు మీరు భయపడుతున్నారో అర్థమవుతుంది. సాధారణంగా మరుగుజ్జు అంటే సహజత్వానికి భిన్నంగా ఉండడం, ఎదగాల్సిన స్థాయిలో ఎదగకపోవడం లేక మానసికంగా వికసించకపోవడం. తెలంగాణ వికాసం కోసం పోరాటం చేసిన నా పరిపక్వత, రాజకీయ ప్రస్థానమేంటో అందరికీ తెలుసు. రామోజీరావుతో పోల్చుకొని పోటీపడి ఆయన పోయిన తర్వాతనైనా ఆ పీఠంలో కూర్చుందామనుకొని, ఎక్కడికో చేరుకుందామనుకొని.. అదీ చేరుకోలేకపోయామనే బాధ నీలో కనిపిస్తోంది. ఇంకా జర్నలిజం ఓనమాలలోనే ఉన్న వానికి పాపులారిటీ వస్తుందని, పోటీకొస్తున్నాడని భయపడి లేని దాడిని సృష్టించుకొని నీవు చేస్తున్న హంగామా నీ మరుగుజ్జుస్థాయికి నిదర్శనం. మీడియా అనుకొని నమ్మి బెదిరింపులు లేదా మీ బ్లాక్‌మెయిల్‌తో మీ స్టూడియోకు వచ్చిన సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, వ్యాపార ప్రముఖులు, సినీతారలు, ఇతర ప్రముఖులతో ప్రవర్తించే తీరు, జుగుప్సాకరమైన ప్రవర్తన అహంకారానికి నిదర్శనం. చాలామంది మహిళా సెలబ్రిటీలు మీ ఇంటర్వ్యూకు రావడానికి భయపడుతున్నారనేది వాస్తవం’అని జగదీశ్‌రెడ్డి తన ప్రకటనలో రాధాకృష్ణ తీరును ఎండగట్టారు.

ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై మహేశ్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలుచేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ కొనియాడారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఆర్డినెన్స్ తేవాలని కేబినెట్ నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ‘2018 చట్టాన్ని సవరించి బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం సామాజిక విప్లవానికి నాంది. జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో చేసిన డిమాండ్‌ను దేశంలో మొదటగా అమలు చేస్తున్నాం. దీని కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రివర్గానికి పేరు పేరునా ధన్యవాదాలు. తెలంగాణ సమాజం, బీసీలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలి’అని మహేశ్ కుమార్ గౌడ్ కోరారు.

‘స్థానిక’ రిజర్వేషన్లపై నేడు కాంగ్రెస్ సంబరాలు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిన నేపథ్యంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించాలని నిర్ణయించారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో సంబరాలు నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సంబరాల్లో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మంత్రి వర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.కాగా, ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమని కాంగ్రెస్ బీసీ నేతలు పేర్కొన్నారు. బీసీలకు సముచిత హక్కుల కల్పన దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, సురేష్ శెట్కార్, విప్ ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు శంకర్, రాజ్ ఠాకూర్, ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

42 శాతం కోటాపై కోర్టులో కేవియట్?

- మంత్రివర్గ భేటీలో నిర్ణయం!
- కేబినెట్ తీర్మానాన్ని గవర్నర్ ఆమోదించే విషయమై చర్చ

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు తీసుకుని వస్తూ ఆర్డినెన్స్ తెచ్చిన తరువాత.. ఎవరైనా కోర్టులో సవాల్ చేస్తే తమను సంప్రదించకుండా ఉత్తర్వులు జారీ చేయరాదని కోరుతూనే కేవియట్ దాఖలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు. ఇప్పటికే 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు అవుతున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన పలు అంశాలను కేబినెట్‌లో చర్చించారు. కాగా మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని గవర్నర్ ఆమోదించే విషయమై కూడా చర్చ జరిగింది. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తీర్పు ఆధారంగా తమిళనాడు ప్రభుత్వం దాదాపు 10 బిల్లులను చట్టంగా మార్చిన అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. ఆర్డినెన్స్‌ను వారాంతంలో తీసుకువచ్చి, ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తే.. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయిందనే కారణంతో కోర్టులు కూడా జోక్యం చేసుకోవన్న అభిప్రాయం కేబినెట్‌లో వ్యక్తం అయినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషను 42 శాతానికి పెంచుతూ శాసనసభ ఆమోదించిన బిల్లును కేంద్రానికి పంపించినా.. ఇప్పటివరకు ఎలాంటి అనుమతి రాని నేపథ్యంలో ఆర్డినెన్స్ తీసుకుని రావడం వల్ల చిత్తశుద్ధిని నిరూపించుకున్నట్లు అవుతుందని కొందరు మంత్రులు అన్నట్లు సమాచారం. ఇప్పటికే 50 శాతం రిజర్వేషన్ల కంటే అధికంగా రెండు మూడు రాష్ట్రాల్లో రిజర్వేషన్లు అమలు అవుతున్న తీరును కూడా ఇందులో ప్రస్తావించనున్నట్లు తెలిసింది.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% కోటా

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశాల్లో 327 అంశాలపై చర్చించి 321 అంశాలపై నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. తాజాగా జరిగిన 19వ సమావేశంలో ఆ నిర్ణయాల అమలులో పురోగతిపై విస్తృతంగా చర్చించామని, 96 శాతం అంశాలకు సంబంధించి జీవోలు జారీ చేసి అమలు దశకు తీసుకెళ్లినట్టు తేలిందని చెప్పారు. కాగా ప్రతి రెండు వారాలకు ఒకసారి కేబినెట్ సమావేశం నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచన మేరకు మళ్లీ ఈ నెల 25న మంత్రివర్గ భేటీ జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి 3 నెలలకోసారి ఆ కాల వ్యవధిలో జరిగే ఆరు కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును సమీక్షించాలని కూడా నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు చేరవేసే వ్యవస్థ పనితీరును మళ్లీ కేబినెట్‌లోనే ఇలా సమీక్షించడం దేశంలోనే తొలిసారి అని అన్నారు.

ఈ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 50% సీట్లు

రాష్ట్రంలోని అమిటీ, సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ విద్యా సంస్థలకు వర్సిటీలుగా గుర్తింపు కల్పించాలని కేబినెట్ నిర్ణయించినట్టు పొంగులేటి తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 15 ఉత్తమ వర్సిటీల్లో అమిటీ 11/12వ స్థానంలో ఉందన్నారు. సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ యూనివర్సిటీ సైతం అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇవ్వనుందని చెప్పారు. సీఎం, డిప్యూటీ సీఎం, సీఎస్ చొరవతో ఈ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించడానికి ఆ సంస్థల యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు.

మార్చిలోగా మొత్తం లక్ష ఉద్యోగాల భర్తీ

ఈ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, వీటితో పాటు మరో 17,084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందని పొన్నం చెప్పారు. ఇక కొత్తగా 22,033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు జాబ్ కేలండర్ సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. వచ్చే మార్చిలోగా మొత్తం లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని మంత్రివర్గంలో నిర్ణయించామన్నారు. ఎస్సీల వర్గీకరణ సమస్యతో నోటిఫికేషన్ల జారీలో కొంత జాప్యం జరిగిందని ఆయన వివరించారు.

- రాష్ట్రంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన మిగులు భూసేకరణను సత్వరం పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. అనంతరం ఆ ప్రాజెక్టుల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్టు పొంగులేటి వెల్లడించారు.
- గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జెడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా, జెడ్పీ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా పరిగణించి బీసీ రిజర్వేషన్లు కల్పిస్తారు.
- సంగారెడ్డి జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పడిన జిన్నారం, ఇంద్రేశం మున్సిపాలిటీల పరిధిలో చేర్చే 18 గ్రామ పంచాయతీలను డీ లిస్టింగ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

4 చోట్ల అత్యాధునిక గోశాలలు

రాష్ట్రంలో అధునాతనంగా గోశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ కమిటీ వచ్చే కేబినెట్ సమావేశంలోపు తమ నివేదికను అందించాలని గడువు నిర్ణయించింది. సీఎం ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను, కొత్తగా నిర్మించే గోశాల డిజైన్లను మంత్రివర్గ భేటీలో ప్రదర్శించారు. రాష్ట్రంలో 306 గోశాలలున్నాయి. కాగా హైదరాబాద్‌లో ఎన్కేపల్లి, వెటర్నరీ యూనివర్సిటీ, వేములవాడ, యాదగిరిగుట్టలో అత్యాధునికంగా గోశాలలు నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు రాష్ట్రంలో ఉన్న గోశాలల రిజిస్ట్రేషన్లు, వాటి నిర్వహణపై సమగ్ర విధాన పత్రం రూపొందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మత్స్యకార సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. చెరువులు, కుంటల్లో 80-110 మి.మీ. సైజు గల 82 కోట్ల చేప పిల్లలను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన బడ్జెట్‌ను రూ.19 కోట్ల నుంచి రూ.122 కోట్లకు పెంచాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంపునకు సంస్కరణలు

- వివిధ ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించింది.
- ప్రభుత్వ ఉద్యోగుల హాజరుతో పాటు విధి నిర్వహణలో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన సంస్కరణలు తీసుకురావాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇప్పటికే ఉద్యోగులకు సంబంధించి నియమించిన అధికారుల కమిటీకి ఈ బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. రెండు నెలల్లో పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని కమిటీని ఆదేశించింది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఉభయసభలు సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలి

మీడియా అడ్వయిజరీ కమిటీ తొలి సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఉభయసభలు సజావుగా సాగేలా అందరూ సహకరించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మీడియా ప్రతినిధులు ఇందులో కీలకపాత్ర పోషించాలని సూచించారు. తెలంగాణ లెజిస్లేటివ్ మీడియా అడ్వయిజరీ నూతన కమిటీ తొలి సమావేశం బుధవారం శాసనసభ భవనంలోని కమిటీహాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో కీలకమైన శాసనసభ, శాసనమండలి గౌరవం, ప్రాధాన్యతలను కాపాడుతూ మీడియా సలహామండలి తగిన సేవలు అందించాలన్నారు. ఎంతో అనుభవమున్న సీనియర్ జర్నలిస్టులు తగిన సూచనలు, సలహాలతో సభను ముందుకు నడిపించడంలో తోడ్పడాలని చెప్పారు. శాసనసభ సమావేశాల సమయంలోనే కాక, ఇతర సమయాల్లో కూడా శాసనసభకు సంబంధించిన వార్తలకు తగు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో శాసనసభ, శాసన మండలి ఒకే భవనంలోకి రాబోతున్నాయని, ఈ మేరకు అవసరమైన మార్పులు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.
- శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ శాసనసభ, శాసన మండలి వ్యవహారాలలో మీడియా మరింత పాత్రను పోషించడానికే మీడియా అడ్వయిజరీ కమిటీని నియమించినట్టు తెలిపారు.

అసెంబ్లీ ఉభయ సభలు ప్రోరోగ్

సాక్షి, హైదరాబాద్: శాసనసభ, శాసన మండలిని ప్రోరోగ్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు గురువారం ఉత్తర్వులు జారీ చేశా రు. ఈ ఏడాది మార్చి 12 అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమై పది రోజుల పాటు కొనసాగాయి. అనంతరం నిరవధికంగా వాయిదా పడిన ఉభయసభలను గవర్నర్ విష్ణుదేవ్ వర్మ ఆదేశాల మేరకు ప్రోరోగ్ చేస్తున్నట్లు నరసింహాచార్యులు ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ఆర్డినెన్స్ జారీచేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిన నేపథ్యంలో ప్రభుత్వం హడావుడిగా ఉభయ సభలను ప్రోరోగ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



మఖ్దూమ్ భవన్ పునఃప్రారంభం సందర్భంగా డి. రాజా, సురవరం సుధాకర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాటామంతీ

తెలంగాణలోనూ ఓ వర్గం ఓట్లను తొలగించే కుట్ర జరిగే అవకాశం

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరుతో బిహార్‌లో ఓ వర్గానికి చెందిన ఓట్లను తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నమే భవిష్యత్‌లో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా జరగొచ్చని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రజలు, ప్రజాస్వామ్య పార్టీలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో పునర్నిర్మితమైన సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో రాజా ప్రసంగిస్తూ బిహార్ ప్రత్యేక సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ‘భారతదేశం ప్రస్తుతం సంక్షోభంలో ఉందని, కేంద్రంలో అధికారంలో ఉన్న మతతత్వ శక్తులు అంబేడ్కర్ సహా మహనీయులు అందించిన రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. కమ్యూనిస్టులది సిద్ధాంతం పునాది గల ఓ జీవన విధానం అని పేర్కొన్నారు.

- సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో వర్గ దోపిడీ కొనసాగినంత కాలం కమ్యూనిస్టులు ఉంటారని స్పష్టం చేశారు. తాము విద్యార్థి నాయకులుగా ఉన్న సమయంలో నిర్మించిన మఖ్దూంభవన్ 50 ఏళ్ల తర్వాత పునర్నిర్మితం అయిన భవనాన్ని తాను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.
- టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కమ్యూనిస్టు, కాంగ్రెస్ అనుబంధం విడదీయరానిదని, దాన్ని కొనసాగిస్తూ ముందుకు సాగాలన్నారు. డి.రాజా, సురవరం సుధాకర్‌రెడ్డి జీవితాలు తమకు స్ఫూర్తిదాయకమని, వారు తమ జీవితం మొత్తం ప్రజలకు త్యాగం చేశారని కొనియాడారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో ధర్నాలు నిషేధించారని, అనేక నిర్బంధాలు విధిస్తే, అన్ని రాజకీయ పార్టీలకు ‘మఖ్దూంభవన్’ నిరసనలకు వేదికగా మారిందని గుర్తు చేశారు.
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ పేద, ధనిక, కుల, మత, స్త్రీ, పురుష అసమానతలు లేని, సమాజ నిర్మాణానికి , సోషలిస్టు భావాలను ముందుకు తీసుకెళ్లే విషయంలో దోపిడీ వర్గాలకు కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు భావాలు కలిగిన వారే ప్రత్యామ్నాయం అవుతారని తెలిపారు.

ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేస్తారో, నిశ్చయంగా అలాంటి వారి (పూర్వపు) పాపాలను మేము తప్పక తొలగిస్తాము మరియు వారు చేసిన సత్కార్యాలకు ఉత్తమమైన ప్రతిఫలం ఇస్తాము.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 11 జూలై 2025

చిత్తశుద్ధి లేని నిషేధం!

రాజ్యాంగంలోని మూడు వ్యవస్థల తాలూకు సమస్త యంత్రాంగం కొలువు తీరిన దేశ రాజధాని ఢిల్లీలో ప్రమాదకర స్థాయికి చేరిన వాయు కాలుష్యం మన విధాన నిర్ణేతల వైఫల్యాలకు నిదర్శనం. ఈ నెల 1 నుంచి కాలం చెల్లిన వాహనాలను రోడ్లపై తిరగనివ్వబోమని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం) ఉత్తర్వులిచ్చింది. డీజిల్ వాహనాలు పదేళ్లకు మించి తిరుగుతున్నా, పెట్రోల్ వాహనాలు పదిహేనేళ్లకు మించి వినియోగిస్తున్నా వాటికి బంకుల్లో ఇంధన విక్రయాన్ని కమిషన్ నిషేధించింది. మొదట దీన్ని ఢిల్లీలో అమలుచేసి, దశలవారీగా జాతీయ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్) అంతటికీ విస్తరిస్తామని తెలిపింది. అందుకనుగుణంగా ఈ నెల 1న చర్యలు మొదలయ్యాయి కూడా. తొలిరోజు కాలం చెల్లిన 80 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. 450 వాహనాలకు పెట్రోల్, డీజిల్ అమ్మకాలను నిరాకరించారు. అసలు ఆ బాపతు వాహనాలు బంకుల్లో ప్రవేశించిన క్షణాల్లోనే 'మీది కాలం చెల్లిన వాహనం. ఇక్కడ ఇంధన విక్రయాలు జరపరు' అంటూ మైకులు ఉరమటంతో జనం విస్తుపోయారు. కానీ రెండో రోజుకల్లా నిషేధం నీరుగారింది. కేవలం ఏడంటే ఏడే వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మూడోరోజుకల్లా అదీ లేదు. మొదటి రెండు రోజులూ నిషేధం అమలు చేసినా ఇప్పటికీ చాలామంది వాహన యజమానులకు దానిపై అవగాహన లేదంటే ప్రభుత్వ ప్రచారం ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. నిబంధన అమలును నిలిపేయాలని ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం సీఏక్యూఎంను కోరటంతో అది అంగీకరించింది. వచ్చే నవంబర్ 1 నుంచి ఈ నిషేధం అమలవుతుందని తాజాగా ప్రకటించింది. ఎన్నేళ్ల నుంచి వాహనం వాడుతున్నారో తేల్చటానికి అనువైన డిజిటల్ ఆధారిత కెమెరాలు, సెన్సర్లు, స్పీకర్లు చాలాచోట్ల సరిగా లేవనీ, అందువల్లే ఈ వాయిదా అత్యవసరమనీ సీఏక్యూఎంకు రాసిన లేఖలో ప్రభుత్వం తెలిపింది.

ఢిల్లీ కాలుష్యానికి కేవలం కాలం చెల్లిన వాహనాలే కారణమా... కాలుష్యంలో వాటి వాటాయే అధికమా అని ప్రశ్నిస్తున్నవారు లేకపోలేదు. ఆ విచికిత్స మాట అటుంచి, ఏ చట్టమైనా మన దేశంలో ఎలా విఫలమవుతుందో చెప్పటానికి కేవలం ఈ రెండు రోజుల నిషేధమే రుజువు. నిషేధం మొదలయ్యాక పెద్దయెత్తున నిరసనలు పెల్లుబికాయి. ఇక చేసేది లేక ఆదరా బాదరాగా ఢిల్లీ ప్రభుత్వం సీఏక్యూఎంను ఆశ్రయించటం, అది వెంటనే అంగీకరించటం పూర్తయింది. కాలం చెల్లిన వాహనాలను నిలిపేయాలన్నది ఇప్పటి ఆలోచన కాదు. 2018లో సుప్రీంకోర్టే ఒక తీర్పులో ఈ సూచన చేసింది. దాన్ని అమలు చేస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారిక అంచనా ప్రకారం, ఢిల్లీలో కాలం చెల్లిన వాహనాల సంఖ్య 60 లక్షలు! ఢిల్లీలోని అయిదు ప్రాంతాలు– గురుగ్రాం, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతంబుద్ధ నగర్, సోనిపట్‌లలో వాహనాల తాకిడి అధికమని ఆ అంచనా చెబుతోంది.

రాజధాని నగరంలో వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి ఇంతవరకూ అమలు చేసిన ఏ విధానమూ విజయవంతమైన దాఖలా కనబడలేదు సరిగదా... మొన్న మార్చిలో విడుదలైన గత ఏడాది ప్రపంచ వాయు కాలుష్య నివేదిక ప్రపంచంలోని కాలుష్య నగరాల్లో ఢిల్లీది రెండో స్థానమని ప్రకటించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన మార్గదర్శకాల ఆధారంగా రూపొందిన ఈ నివేదిక ఢిల్లీ వాతావరణంలో సాధారణ స్థాయికన్నా 21 రెట్లు అధికంగా సూక్ష్మ ధూళి కణాలున్నాయని తేల్చింది. ఇంకా విషాదమేమంటే, అంతకు ముందు ఏడాది కన్నా 2024లో ఈ కాలుష్యం 6 శాతం పెరిగింది. ఢిల్లీలో సాధారణంగా ప్రతి యేటా నవంబర్ నెలకల్లా వాయు కాలుష్యం గురించిన చర్చ మొదలవుతుంది. అప్పటికల్లా శీతగాలుల తాకిడి మొదలై వాతావరణంలో కాలుష్యం నిలకడగా ఉండిపోతుంది. ఈసారి రెండు రోజుల నిషేధం ప్రహసనం వల్ల ముందే ఆ చర్చ ప్రారంభమైంది.

ఏ విధానమైనా అమలు చేసేముందు దాని అమలుకు సంబంధించిన మౌలిక సదుపాయాలెలా ఉన్నాయో ప్రభుత్వాలు సమీక్షించుకోవాలి. ఒక్క మానెసర్ ప్రాంతంలోని ఒక కేంద్రం తప్ప ఢిల్లీ మొత్తంలో ఎక్కడా ప్రామాణికమైన కేంద్రాలు లేవని నిపుణులు చెబుతున్నారు. కేవలం ప్రైవేటు కార్లకే నిబంధనలు వర్తిస్తాయన్నట్టు రవాణా విభాగం ప్రవర్తించింది. ప్రజారవాణా బస్సులు మొదలుకొని వాణిజ్య వాహనాల వరకూ అనేకం ఢిల్లీ కాలుష్యాన్ని అపారంగా పెంచుతున్నాయి. తాజా నిషేధం వాటి జోలికి పోలేదు. ఇక కాలుష్యంలో టూవీలర్‌ల వాటా దాదాపు 25 శాతం. అసలు వాహనం మోడల్‌ని బట్టి దాన్ని కాలం చెల్లిన వాహనంగా వర్గీకరించటం అశాస్త్రీయం. వాహనాన్ని అరుదుగా వాడేవారుండొచ్చు, అతి జాగ్రత్తలు తీసుకునే వారుండొచ్చు. అటువంటివి కాలం చెల్లినవి ఎలా అవుతాయి? వాహనం సాంకేతికంగా తగిన ఫిట్‌నెస్ కలిగి వుందా లేదా అనేది చూస్తే వేరుగా వుండేది. అన్నిటికన్నా ముఖ్యం – ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపర్చటం, నగరంలోని నలు మూలలకూ అన్ని సమయాల్లో విస్తృతంగా బస్సు సదుపాయం కల్పించటం. బస్సు కోసం రోడ్లపై గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకపోతే ఎవరైనా తడిసి మోపెడయ్యే సొంత వాహనం కోసం ఎందుకు ఎగబడతారు? వాహనాలు నానాటికీ పెరుగుతున్నాయంటే అది పాలకుల వైఫల్య పర్యవసానం. ఆ సంగతలా ఉంచి అసలు కాలం చెల్లిన వాహనాలను ఏం చేయదల్చుకున్నారు? వాటిని వదిలించుకోవటానికి ఏం ఆలోచించారు? సమస్యలు ఇన్నివున్నప్పుడు ఈ మొక్కుబడి నిషేధాల వల్ల ప్రయోజనం ఏమిటి?

అధిక జనాభాకు 'సుస్థిర' విరుగుడు

సందర్భం



డా॥ తమ్మా కోటిరెడ్డి

ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 1990 జూలై 11 నుండి ప్రతి సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించబడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జనాభా నేపథ్యంలో, జనాభా పెరుగుదల సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 2025 ప్రపంచ జనాభా దినోత్సవం థీమ్‌గా 'న్యాయమైన, ఆశాజనకమైన ప్రపంచంలో వారు కోరుకొనే కుటుంబాలను సృష్టించడానికి యువతను సాధికారం చేయడం'ను ఎంచుకొన్నారు.

మనిషే మూలధనం

ప్రపంచ జనాభా 2011లో 700 కోట్ల నుండి 2022లో 800 కోట్లకు పెరిగింది. 2025లో 820 కోట్లకు చేరుకుంది. వనరుల కొరత, పర్యావరణ క్షీణత, వలసలు, పట్టణీకరణ, అధిక వృద్ధాప్య జనాభా, బాల కార్మికులు, సామాజిక అసమానతలు లాంటి సమస్యలకు జనాభా పెరుగుదల దారి తీసింది. సుస్థిరతపై జనాభా ప్రభావం ముఖ్యాంశంగా నిలుస్తున్నందువల్ల ప్రపంచ దేశాలు ఈ సమస్యను అధిగమించవలసి ఉంది. సీఎమ్ఐఈ (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) 2023 నివేదిక ప్రకారం, భారత్‌లో యువతలో నిరుద్యోగిత 23 శాతం కాగా, గ్రామీణ యువత అల్ప ఉద్యోగిత, ఉపాధి లేకపోవడం లాంటి సమస్యలను ఎదుర్కొంటోంది.

భారత్ జనాభా 2001లో 102.87 కోట్ల నుండి 2011లో 121.09 కోట్లకు, 2025లో 146.39 కోట్లకు పెరిగింది. అయితే, సంతానోత్పత్తి రేటు (1.9), రీప్లేస్‌మెంట్ స్థాయికన్నా (2.1) తక్కువగా నమోదయింది. ఈ స్థితిని ఐక్యరాజ్యసమితి జనాభా సంక్షోభంగా అభివర్ణించింది. కాకపోతే ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్' రిపోర్ట్– 2025 ప్రకారం, మొత్తం జనాభాలో 15–64 వయోవర్గ జనాభా 68 శాతంగా ఉండటాన్ని బట్టి భవిష్యత్తులో భారత్ 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' పొందుతుంది. ఈ డెమోగ్రాఫిక్ డివిడెండ్ ద్వారా భారత్ సుస్థిరవృద్ధి సాధించాలంటే వ్యూహాత్మక పెట్టుబడులు, అభిలషణీయ విధానాల అమలుపై దృష్టి సారించాలి. మానవ మూల ధనంపై పెట్టుబడులు ఉపాధి అవకాశాలను పెంపొందించి, సమ్మిళిత వృద్ధి, పర్యావరణ సుస్థిరతతోపాటు దీర్ఘకాల ఆర్థిక శ్రేయస్సు, సామాజిక ప్రగతికి దారితీస్తాయి.

సుస్థిర వృద్ధి సాధనకు సవాళ్ళు

భారత్‌లో పట్టణ జనాభా 2036 నాటికి 60 కోట్లకు చేరుతుందని అంచనా. భూగర్భ జలాలు 2030 నాటికి 21 నగరాలలో అడుగంటుతాయని అంచనా. దాంతో ప్రజలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటారు. భూమి, నీరు, శక్తి, జీవ వైవిధ్యంపై ఒత్తిడి అధికమవుతుంది. మితిమీరిన సాగు, అడవుల నరికివేత, పట్టణాలలో భూముల ఆక్రమణ కారణంగా భారత్ మొత్తం భూవిస్తీర్ణంలో 29.7 శాతం డీగ్రేడెడ్ భూమిగా వర్గీకరింపబడింది.

భారత్‌లో సాంవత్సరిక ఘన వ్యర్థాలు 6.2 కోట్ల టన్నులు కాగా, ఈ మొత్తంలో 70 శాతాన్ని సేకరిస్తున్నప్పటికీ, దీనిలో 20 శాతంకన్నా తక్కువే ప్రాసెస్ అవుతోంది. వాయు కాలుష్యం కారణంగా భారత్‌లో ప్రతి సంవత్సరం 16 లక్షల అకాల మరణాలు సంభవిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ రక్షణ పరిమితుల కన్నా ఢిల్లీ, ముంబై నగరాల్లో పీఎం 2.5 స్థాయులు ఎక్కువున్నాయి.

రాష్ట్రాల మధ్య జనాభా వైవిధ్యాలు భారత్ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. మానవాభివృద్ధిలో ప్రాంతీయ అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేరళ, తమిళనాడు రాష్ట్రాలు సామాజిక సేవలపై అధికంగా పెట్టుబడులు పెడుతున్న కారణంగా ఆ యా రాష్ట్రాలలో సంతానోత్పత్తి రేటు తగ్గి వృద్ధాప్య వయోవర్గ జనాభా పెరుగుతున్నది. ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ బలహీనంగా ఉండటంతోపాటు, అందరికీ విద్య అందుబాటు తక్కువగా, లింగ అసమానతలు ఎక్కువగా ఉన్నాయి.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 (2019–21) ప్రకారం, పాఠశాల విద్యకు నోచుకోని మహిళలు సగటున 3.1 పిల్లలకు జన్మనివ్వగా, 12వ తరగతి మరియు ఆ పైన విద్యాధికులైన మహిళలు సగటున 1.7 పిల్లలకు జన్మనిచ్చారు. విద్యకు సంబంధించి బిహార్, రాజస్థాన్‌లలో లింగ అసమానతలు అధికం.

పర్యావరణ హితంగా సమాజ సంక్షేమం

వనరుల యాజమాన్యం, పర్యావరణ పరిరక్షణతో జనాభా వృద్ధిని సంతుల్యం (బ్యాలెన్స్) చేయడం సుస్థిరాభివృద్ధికి ప్రధానం. ఆర్థిక విధానాలలో పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమానతను సంఘటిత పరచడం ద్వారా భవిష్యత్ తరాల అవసరాలతో రాజీ పడకుండా, ప్రస్తుత అవసరాలను తీర్చవచ్చు. ఈ మూడు అంశాల మధ్య ఉన్న పరస్పర అనుసంధానాన్ని అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలు కనుగొన్నట్లయితే అన్ని అంశాల్లోనూ ఒకేసారి ప్రయోజనం కలుగుతుంది.

పర్యావరణ పరిరక్షణతో ఆర్థిక వృద్ధిని సమతుల్యం చేయడానికి బహుముఖ విధానం అవసరం. ఈ లక్ష్య సాధనకు సుస్థిర పద్ధతులు అవలంబించడం, పునరుత్పాదక శక్తిపై పెట్టుబడులు పెట్టడం అవసరం. ఈ చర్యలు పర్యావరణ ప్రభావాన్ని కనిష్ఠం చేసి, ఆర్థిక వృద్ధి పెంపునకు దోహదపడతాయి. బాధ్యతాయుత పర్యాటక పద్ధతులు పాటించినప్పుడు పర్యావరణ వ్యవస్థ పరిరక్షించబడి, స్థానిక ప్రజలు ప్రయోజనం పొందుతారు.

గత దశాబ్ద కాలంలో అనేక ప్రభుత్వాలు సంప్రదాయ ఆర్థిక నమూనాకు బదులుగా గ్రీన్ ఎకానమీని ప్రత్యామ్నాయంగా ఎంచుకోవడం జరిగింది. గ్రీన్ టెక్నాలజీని సమర్థవంతంగా ప్రోత్సహించాలంటే ఆర్థిక ప్రోత్సాహకాలు, నియంత్రణ సంస్థల మద్దతు, ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్యం అవసరం. అంతర్జాతీయ సహకారం ద్వారా నవ కల్పనలను ప్రోత్సహించాలి. ఆర్థిక ప్రోత్సాహకాలలో భాగంగా టాక్స్ క్రెడిట్, గ్రాంటు ఇస్తూ, సోలార్ ప్యానల్స్, విండ్ టర్బైన్స్ లాంటి పునరుత్పాదక శక్తి ఏర్పాట్లకు తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పించాలి. పరిశోధన–అభివృద్ధికి (ఆర్ అండ్ డీ) ఆర్థిక మద్దతునందించాలి.

విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి అవకాశాలను అందరికీ అందించటం ద్వారా సామాజిక సమ్మిళితం సాధించాలి. పర్యావరణ కార్యక్రమాలయిన రీఫారెస్టేషన్, వృథా యాజమాన్య కార్యక్రమాలలో వివిధ వర్గాల ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా, సామాజిక, పర్యావరణ అంశాలను సంఘటితపరచవచ్చు. అసంఘటిత రంగంలోని సంస్థల యాజమాన్యానికి సుస్థిరాభివృద్ధి పద్ధతులు అవలంబించే విషయంలో సరైన పరిజ్ఞానం లేకపోవచ్చు. సుస్థిరాభివృద్ధి విధానాల అమలు, వనరుల యాజమాన్యం, అందరికీ సమాన అవకాశాల కల్పనకు పటిష్ఠమైన సంస్థలు, సమర్థవంతమైన గవర్నెన్స్ అవసరం.

వినియోగదారులను కూడా సుస్థిర ఉత్పత్తుల వినియోగం వైపు మొగ్గు చూపే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండాలి. వనరుల వినియోగం తగ్గుదలకు, తక్కువ వృథాకు సుస్థిర పద్ధతులు తోడ్పడుతాయి. తద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. సామాజిక ప్రాధాన్యతలో భాగంగా న్యాయమైన వేతనాలు, సురక్షిత పని పరిస్థితులు, విద్య – ఆరోగ్య సంరక్షణ, సంస్కృతిని కాపాడుకోవడం అవసరం. పర్యావరణ సుస్థిరత, సామాజిక ప్రాధాన్యతలు దీర్ఘకాలంలో సమ్మిళిత వృద్ధి సాధనకు దోహదపడతాయి. మానవ మూలధనంపై పెట్టుబడులు ఆర్థిక వృద్ధి పెంపునకు అత్యవసరం.

వ్యాసకర్త ప్రొఫెసర్ – డీన్, ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఐ.ఎఫ్.హెచ్.ఈ, హైదరాబాద్



నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

- ప్రపంచ జనాభా 2011లో 700 కోట్ల నుండి 2025లో 820 కోట్లకు చేరుకుంది. వనరుల కొరత, పర్యావరణ క్షీణత, వలసలు, పట్టణీకరణ లాంటి సమస్యలకు జనాభా పెరుగుదల దారి తీసింది.
- భారత్‌లో పట్టణ జనాభా 2036 నాటికి 60 కోట్లకు చేరుతుందనీ, 2030 నాటికి భూగర్భ జలాలు 21 నగరాలలో అడుగంటుతాయనీ అంచనా.
- వనరుల వినియోగం తగ్గుదలకు, తక్కువ వృథాకు సుస్థిర పద్ధతులు తోడ్పడుతాయి. పర్యావరణ సుస్థిరత, సామాజిక ప్రాధాన్యతలు సమ్మిళిత వృద్ధికి దోహదపడతాయి.

సోషల్ మీడియా

రష్యా నుంచి కొందాం!



రఫేల్, ఎఫ్–35 సోర్సు కోడ్స్‌ను ఫ్రాన్స్, యూఎస్ ఎప్పటికీ పంచుకోవు. అదే రష్యా దానికి సిద్ధంగా ఉంది. కాలయాపన చేయకుండా ఎస్‌యూ–17 పొందడానికి ఈ ఒక్క కారణం చాలు (ఇంకా అనేకం ఉన్నాయి). ఎందుకంటే, మళ్లీ శిక్షణకు సమయం పడుతుంది. ట్రంప్‌ను చికాకు పెట్టొద్దనేది ఒకటే మోదీ ప్రభుత్వానికి అడ్డంకి. వివేకం మేల్కొనుగాక!

– ప్రవీణ్ సహానీ, ఆర్మీ మాజీ ఉన్నతాధికారి

ఎలా మారాం!



1907లో దేశపు మొదటి వ్యవస్థీకృత వ్యవసాయ సమ్మెను చూసిన రాష్ట్రం కేరళ. దళితులు, అవర్ణులను బడుల్లో చేర్చుకోవాలంటూ ట్రావెన్‌కోర్ రాజ్యం మీద ఒత్తిడి తెస్తూ మహాత్మా అయ్యంకాళి దానికి నాయకత్వం వహించారు. అలాంటి రాష్ట్రంలో సమ్మెలు అనైతికమని కొన్ని మీడియా సంస్థలు వ్యాఖ్యానిస్తున్నాయి.

– అద్వైద్, క్రానికలర్

గుప్పెడు మందిమే...



హోలోకాస్ట్‌కు ముందు ప్రపంచంలో 1.66 కోట్ల యూదులు ఉండేవారు. ఇప్పుడు వారి జనాభా 1.48 కోట్లు. 80 ఏళ్ల తర్వాత కూడా యూదుల జనాభా హోలోకాస్ట్ ముందరి దశకు చేరుకోలేదు.

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

రెండు ధ్రువాలు



మా అబ్బాయి 35 ఏళ్లకు రిటైర్ అవుతానని అంటున్నాడు. వాడి ఆలోచన నాకు నిజంగా నచ్చింది. 78 ఏళ్ల వయసులో మా నాన్న కొత్తగా వ్యాపారం మొదలు పెట్టాడు. ఆయన ఉత్సాహం నాకు అసూయ పుట్టిస్తోంది.

– అరుణ్ బోత్రా, పోలీస్ ఉన్నతాధికారి

ఎవరు బాధ్యులు?



మౌలిక సదుపాయాలు మొత్తం కుప్పకూలుతుండటం గురించి మనం ఎప్పుడైనా చర్చిస్తామా? వేలాది కోట్లు ఖర్చవుతున్నాయి. జవాబుదారీతనం శూన్యం.

– స్వాతి చతుర్వేది, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ఇదేనా ప్రజాస్వామ్యం?

ప్రజల కోసం నిలవాల్సిన పోలీస్ శాఖ, నేడు రాజకీయ నాయకుల మాటలకే కట్టుబడి ప్రజల్ని ప్రశ్నించకుండా చేయడం ఆంధ్రప్రదేశ్‌లో మామూలయ్యింది. న్యాయం, శాంతి భద్రతల కోసం పని చేయాల్సిన వ్యవస్థ, ఇప్పుడు కక్ష సాధింపులకు నాయకుల చేతుల్లో ఆయుధంగా మారిపోవడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే. దేశం అంతా భారత రాజ్యాంగాన్ని ఆధారంగా చేసుకొని ముందుకు సాగుతుంటే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఒక ఎర్ర పుస్తకాన్ని రాజ్యాంగంగా మలుచుకుని, పాలన కొనసాగిస్తున్నారు. భారతీయ పౌరుడిగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రాథమిక హక్కు ఉంది. కానీ, ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, వారిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రజల సమస్యలపై స్పందించాల్సిన కొన్ని మీడియా సంస్థలు కూటమి ప్రభుత్వానికి అమ్ముడుపోయి ప్రశంసల పాటలు పాడుతున్నాయి. ప్రజల తరఫున ప్రశ్నించిన మీడియా సంస్థలనేమో ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తోంది. ఇటువంటి కేసుల్లో హైకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని పోలీసుల తీరును గట్టిగా మందలించడం తెలిసిందే.



'ఏమైనా జరిగితే మన కోసం ప్రభుత్వం ఉంది, పోలీసులు ఉన్నారు' అన్న భరోసా ప్రజలకు కలగాలి. కానీ నేడు చిన్న పిల్లలు, మహిళలు సహా ఎవరికీ రక్షణ లేని పరిస్థితి ఏర్పడింది. ప్రతిపక్ష నాయకుడిగా సమస్యలను ఎత్తిచూపితే ఎదుర్కొనే ధైర్యం లేని ప్రభుత్వం ఆయనపై, ఆయన కార్యకర్తలపై దాడులకు ముందుంటోంది. ఒక ప్రజా నాయకుడు బయటికి వచ్చినప్పుడు తగిన భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం, ఆయనను కలవడానికి వచ్చే ప్రజలపై అమానుషంగా పోలీసులతో దాడి చేయించడం చూస్తే ఇది ప్రజాస్వామ్యమేనా అనే అనుమానం కలుగుతోంది.

ఇటీవల రోడ్డుపై శాంతియుతంగా ధర్నా చేసిన మహిళా వైద్యులను అరాచకంగా లాగడాలు, జుట్టు పట్టి తోసేయడం లాంటి చర్యలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరువు గాలిలో కలిపేసిన ఉదాహరణలు. ఇది మౌనం వహించే సమయం కాదు. మన హక్కుల కోసం పోరాడాల్సిన సమయం. ప్రజాస్వామ్యం అన్నది పాఠ్యపుస్తకాలలో చదవడానికి మాత్రమే కాకుండా, ప్రజల జీవితం మీద ప్రభావం చూపేలా ఆచరణలో కనిపించాలి. చైతన్యవంతులైన ప్రజలు ఈ పరిస్థితులను చూస్తూ ఊరుకోరని పాలకులు గ్రహించాలి.

– రక్కాసి గీతికా రెడ్డి । లా స్టూడెంట్

బీసీ చైతన్యం ఎటువైపు?

అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

ఇటీవలి కాలంలో బీసీలలో వచ్చిన చైతన్యాన్ని తమ వైపునకు తిప్పుకొనేందుకు వివిధ రాజకీయ పార్టీలు వ్యూహ రచనల్లో మునిగి ఉన్నాయి. గత రెండేళ్లుగా బీసీలలో కులాలకు సంబంధించిన చైతన్యం బాగా పెరిగింది. ఏ కులానికి ఆ కులంతో వచ్చే చైతన్యం మొత్తం 130 బీసీ కులాల చైతన్యంగా మారినప్పుడు మాత్రమే బలమైన బీసీ ఉద్యమం రూపుదాల్చుతుంది. ఇప్పటికిప్పుడుగా చూస్తే బీసీలలో జనాభా పరంగా ఎక్కువగా ఉన్న నాలుగైదు కులాల పైననే రాజకీయ పార్టీలు దృష్టి పెట్టాయి. తెలంగాణలో బలం పుంజుకొని నిలవాలని తాపత్రయ పడుతున్న రాజకీయ పార్టీలు 5 బీసీ పెద్ద కులాల నాయకులను తమ పార్టీలలోకి తెచ్చుకొని వాళ్లతో ప్రకటనలు చేయిస్తున్నాయి. మొత్తంగా ఏ రాజకీయ పార్టీ బీసీలకు ఏం మేలు చేసిందనే లెక్కలు తీసి మాట్లాడే బీసీ నాయకత్వం లేనంత కాలం... రాజకీయ పార్టీలు బీసీలను ఓట్లేసే యంత్రాలుగానే చూస్తాయి.

సమస్త బీసీ సమాజమంతా ఒక తాటిపైకి వచ్చి నినదించకపోతే బీసీల హక్కులు సాకారం కావు. వర్తమానంలో బీసీలలో వచ్చిన ప్రధాన కదలిక 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్' అమలుపైనే ఉన్నదన్నది స్పష్టం. కానీ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు జరగకుండా ఎన్నికలకు పోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అదే జరిగితే రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించవలసి వస్తుంది.

అన్ని రాజకీయ పార్టీల జెండాల కింద ఉన్న బీసీలు తమకున్న రాజకీయ ప్రాతినిధ్యాలను పక్కన పెట్టి 'స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకూ రిజర్వేషన్' అన్న ఒకే ఒక్క లక్ష్యం దిశగా ఒక తాటిపైకి రావాలి. బీఆర్ఎస్ నుంచి బీజేపీ దాకా, కాంగ్రెస్ నుంచి కమ్యూనిస్టు పార్టీల వరకూ... అన్ని పార్టీల్లో ఉన్న బీసీలంతా తమ కులాలకు చట్టసభల్లో న్యాయబద్ధమైన వాటా కోసం ఒక్కటి కావాలి. ఈ ఒక్కటి చేసే తాత్విక సూత్రాన్ని బీసీ ఉద్యమం రచించుకోవాలి. కొత్తపల్లి జయశంకర్ చెప్పినట్లుగా ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఒక్కటి కావాలన్న సూత్రీకరణ అందర్నీ ఏకం చేసే దారైంది. అలాంటి తాత్విక భూమికతోనే బీసీ ఉద్యమం బలంగా నిర్మించబడాలి.



- 'అధికారంలో ఉన్న బడుగు నేతలు బీసీల గురించి మాట్లాడితే ఉన్న పదవి పోతదని, ప్రతిపక్షంలో ఉన్న బీసీలు మాట్లాడితే రేపు అధికారంలోకి వచ్చాక పదవులు రావని తలంపులో ఉంటారు.' ఇప్పుడు జరుగుతోంది ఇదే.

జయశంకర్ 'పొడువని ముచ్చట'లో చెప్పిన విషయం గుర్తుకొస్తోంది: 'అధికారంలో ఉన్న బడుగు నేతలు బీసీల గురించి మాట్లాడితే ఉన్న పదవి పోతదని... ప్రతిపక్షంలో ఉన్న బీసీలు మాట్లాడితే రేపు అధికారంలోకి వచ్చాక పదవులు రావని తలంపులో ఉంటారు.' ఇది నిజం. ఇప్పుడు జరుగుతోంది కూడా అదే. తమ భావజాలాలను బీసీలు వదులుకోవాల్సిన అవసరం లేదు. అధికార ప్రతిపక్షాలలో ఉన్న బీసీ నేతలు వాళ్ల స్థానాలను విడిచి రావాల్సిన అవసరం లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఇంత కాలమైనా తమ కులాల వారికి దక్కని హక్కుల కోసం సమస్త బీసీ సమాజం ఎవరి పార్టీలో వారు ఉంటూనే పార్టీ నాయకత్వాలపై ఒత్తిడి తీసుకురావాలి. బీసీ విద్యావంతుల వేదిక, బీసీ రచయితల వేదికలు విస్తృతమై భావజాల ప్రచారాలు చేయాలి. భావజాలం లేకుండా ఏ ఉద్యమం నిలవదు.

బీసీ అస్తిత్వ చైతన్యాన్ని బీసీల కంటే రాజకీయ పార్టీలే ఎక్కువగా చెప్పే స్థితికి నెట్టివేయబడ్డాయి. 8 దశాబ్దాలుగా బీసీలను విస్మరించిన కాంగ్రెస్, బీజేపీలు బీసీల జనగణనపై గట్టిగా మాట్లాడటమే కాదు, దేశవ్యాప్త బీసీ జనగణనకు బీజేపీ ఒక అడుగు ముందుకేసి నిలబడింది కూడా. రాజకీయ పార్టీలు తమ అస్తిత్వం కోసం బీసీ అస్తిత్వాన్ని ముందుకు తేస్తున్నాయి. ఈ రకమైన సమయంలో బీసీ భావజాల ఉద్యమం బలంగా లేకపోతే రాజకీయ పార్టీలు తెలివిగా దాటవేస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని 'కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను సంపూర్ణంగా అమలు చేసేదాకా విశ్రమించమ'నే సంకేతాలను బీసీలు ఇవ్వాలి.

ప్రధానంగా ఇది కులాల ఉద్యమం కాదు... సగం జనాభాకు చెందిన మానవ హక్కుల ఉద్యమం అని చాటి చెప్పాలి. ఇది పై కులాలపై ద్వేషంతో చేసే ఉద్యమం కాదు. 'మా వాటా మాకే' అన్న న్యాయబద్ధ డిమాండ్‌తో కొనసాగే సమన్యాయ సమరం అని చాటి చెప్పాలి. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వం బహుజన స్వీయ రాజకీయ అస్తిత్వంగా మారే చారిత్రక సందర్భం ఇది. గ్రామ నిర్మాణం చేసిన వాళ్ల చేతికి గ్రామ స్వరాజ్యం దక్కాలన్న ఉత్పత్తి కులాల ఉద్యమం ఇది. సమాజంలో సగ భాగానికి దక్కాల్సినవి న్యాయబద్ధంగా దక్కినప్పుడే సమతా రాజ్యం సిద్ధించినట్లు!

వ్యాసకర్త తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

చెడుకు వాయిదా!

రాముడు వేసిన బాణంతో గాయపడిన రావణుడు కుప్పకూలాడు. అప్పుడు లక్ష్మణునితో రాముడు– 'రావణుడు అన్ని కళలలో ప్రావీణ్యం ఉన్నవాడు. రాజ నీతిజ్ఞుడు. అతడి రాజకీయ అనుభవం మనకు చాలా ఉపయోగకరం. అతడి దగ్గరకు వెళ్లి, నేను అడిగానని చెప్పి అతని ఉత్తమ సలహా తీసుకో' అన్నాడు.



జ్యోతిర్మయం

లక్ష్మణుడు రావణుడి పాదాల వద్ద నిలబడి, 'ఓ లంకేశ్వరా, నీ జ్ఞానం నీతో పాటు నశించకూడదు. నాకు బోధించడం ద్వారా, ప్రపంచం దానిని తెలుసుకోవడం వల్ల ప్రయోజనం పొందుతుంది. కాబట్టి నాకు బోధించండి' అని కోరాడు.

రాముడికి తన పట్ల ఉన్న గౌరవాన్ని తెలుసుకుని, లక్ష్మణుని చిరునవ్వుతో స్వాగతించిన రావణుడు ఆనందంతో తన సలహా ఇచ్చాడు: 'లక్ష్మణా! నేను ఒకప్పుడు సర్వశక్తిమంతుడిని. తొమ్మిది గ్రహాలు, యముడు, ఇంద్రుడు కూడా నాకు విధేయత చూపారు. అప్పుడు నేను ఏమనుకున్నానో తెలుసా? దేశంలోని ప్రతి ఒక్కరూ స్వర్గానికి వెళ్లాలి. ఎవరికీ నరకం లేదని ఒక శాసనం జారీ చేయాలి. అందరినీ మోసుకెళ్లే ఉద్దేశ్యంతో ఎగిరే నిచ్చెనను సృష్టించాలి అనుకున్నాను. కానీ ఈ మంచి ఉద్దేశ్యాన్ని అమలు చేయకుండా వాయిదా వేశాను. ఫలితంగా నేను ఈ రోజు బాధపడుతున్నాను.

శూర్పణఖ వచ్చి సీతాదేవి సౌందర్య శిఖరం అని చెప్పినప్పుడు, ఆమె నీకు తగినదని చెప్పినప్పుడు, నేను వెంటనే ఆమె దగ్గరకు వెళ్లాను. ఆ చర్యను వాయిదా వేసి ఉండవలసింది. ఫలితం అందరికీ వినాశనం! కాబట్టి నేను చెప్పాలనుకుంటున్నది ఏమిటంటే... మంచి పనిని వెంటనే చేయాలి. అది సత్ఫలితాన్నిస్తుంది. చెడు పనిని వాయిదా వేయాలి. వాయిదా వేయడం ద్వారా ఆ చెడు పని జరగకుండా ఉండే అవకాశం ఉంది. ద్వారపాలకుడితోనో లేదా సోదరుడితోనో శత్రుత్వం పెంచుకోకూడదు. మన తప్పులను ఎత్తి చూపే స్నేహితుడిని నమ్మాలి. నేను హనుమంతుడిని తక్కువ అంచనా వేశాను. అది తప్పు. శత్రువుని ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదు. ఆకాశంలోని నక్షత్రాలు మార్గదర్శకులు. ఓర్పు కంటే గొప్ప తపస్సు లేదు. సంతృప్తి కంటే గొప్ప ఆనందం లేదు. అలాగే కరుణ కంటే గొప్ప ధర్మం లేదు. క్షమాపణ కంటే శక్తిమంతమైన ఆయుధం లేదు' అని రావణుడు ముగించాడు. లక్ష్మణుడు రావణుడికి నమస్కరించి అతని బోధనలను స్వీకరించాడు.

– యామిజాల జగదీశ్

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.2.13 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** పూర్వాషాఢ ఉ.6.33 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.2.50 నుండి 4.30 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.23 వరకు, **అమృత ఘడియలు:** రా.12.51 నుండి 2.30 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.35.

క్లుప్తంగా...

మహాశాకంబరీగా శ్రీభద్రకాళి



హనుమకొండ కల్చరల్: వరంగల్ నగరంలోని చరిత్రాత్మక శ్రీభద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆషాఢశుద్ధ పౌర్ణమి గురువారం అమ్మవారు పరిపూర్ణ శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. అలయ అర్చకులు భద్రకాళి శేషు అధ్వర్యంలో వేదపండితులు రాత్రి 2 గంటల నుంచి అమ్మవారికి అభిషేకం, నిత్యాహ్నికం జరిపి మితాక్రమంలో, చిత్రా నిత్యాక్రమాలలో పూజలు నిర్వహించారు. అనంతరం టన్ను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, దుంపగడ్డలతో అమ్మవారిని మహాశాకంబరీ దేవిగా అలంకరించారు. ఉదయం 9 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు.

కల్తీ కల్లు దుకాణాలు కాంగ్రెస్ నేతలవే

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: కల్తీ కల్లు దుకాణాలు నడుపుతున్నది కాంగ్రెస్ నేతలేనని, వాటిని కట్టడి చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ నడిబొడ్డున కల్తీ కల్లు తాగి ఏడుగురు వ్యక్తులు మరణించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల ప్రాణాల పట్ల ప్రభుత్వానికి శ్రద్ధ లేదని, సీఎం వద్దే హోం శాఖ ఉన్నా కనీస మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ అంటే బీజేపీకి అయిష్టత

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌కు 'భారతీయ సాంస్కృతిక వైభవం'పేరిట ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ బహూకరించిన చిత్రపటంలో తెలంగాణ మ్యాప్ లేకపోవడంపై దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. బీజేపీ, టీడీపీలు తెలంగాణ ఏర్పాటును గుర్తించడం లేదని, ఆ రెండు పార్టీలకు తెలంగాణపై నరనరాన అయిష్టత ఉందనే విషయం బయటపడిందని ధ్వజమెత్తారు. టీడీపీ, బీజేపీ తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'ఈబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఈబీసీ జాతీయ అధ్యక్షుడు వి.రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన గురువారం టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈబీసీల అభివృద్ధికి మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేయాలని, ఈబీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అన్నింటినీ అగ్రవర్ణాలలోని నిరుపేదలకు వర్తింపజేయాలని కోరారు.

కన్న తల్లి భారమైంది..

- కుమారులకు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు



వృద్ధురాలితో మాట్లాడుతున్న పోలీసులు

గూడూరు: నలుగురు కొడుకులకు తమ కన్న తల్లిని చూసుకోవడం భారమైంది. దీంతో ఆ తల్లిని వదిలించుకునే ప్రయత్నం చేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భూపతిపేటలో గురువారం ఈ ఘటన వెలుగు చూసింది. వెంగంపేటకు చెందిన బొడ్డు భద్రమ్మ అనే వృద్ధురాలికి సుమారు 75 సంవత్సరాలు ఉన్నాయి. ఆమె భర్త గతంలోనే చనిపోగా, పెళ్లిళ్లు అయి వేరుగా ఉంటున్న ఆమె నలుగురు కొడుకులు తల్లిని వంతులవారీగా, నెలకు ఒకరు చొప్పున తీసుకెళ్లి చూసుకుంటున్నారు. ఈ క్రమంలో తన వంతు అయిపోయింది.. అంటూ ఓ కుమారుడు బుధవారం రాత్రి తల్లిని భూపతిపేట రైతు వేదికలో వదిలి వెళ్లాడు. దీంతో ఒంటరిగా ఉన్న ఆ వృద్ధురాలిని సమీపంలో ఉన్న వారు గుర్తించి ఓ ఆటో మాట్లాడి పెద్ద కొడుకు ఇంటికి పంపించగా, అతని భార్య.. ఈ నెల చూసుకోలేనంటూ అదే ఆటోలో తిరిగి వెనక్కి పంపించింది. ఆటోడ్రైవర్ భూపతిపేటలో ఉన్న మరో కొడుకు వద్దకు తల్లిని తీసుకెళ్లగా అతను ఆటో డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అప్పటికే అర్ధరాత్రి కావడంతో ఆ ఆటో డ్రైవర్ ఎటూ వెళ్లలేక జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ టైర్ల షెడ్డులో వృద్ధురాలిని దింపి వెళ్లాడు. గురువారం ఉదయం విషయం తెలుసుకున్న గూడూరు పోలీసులు అక్కడికి చేరుకొని ఆ వృద్ధురాలితో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆమె కొడుకులను స్టేషన్‌కు రప్పించారు. కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిని వారికి అప్పగించారు.

44కు చేరిన కల్తీ కల్లు బాధితులు

- నిమ్స్‌లో కోలుకున్న 27 మంది
- నలుగురికి ఇంకా కొనసాగుతున్న దయాలసిస్
- నిమ్స్‌లో బాధితులను పరామర్శించిన మంత్రి దామోదర
- కల్లులో నెఫ్రోటాక్సిన్స్ కలవటం వల్లే ప్రమాదం
- బాధితుల రక్తంలో భారీగా సీరం క్రియాటినైన్: వైద్యులు
- ఘటనపై నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్



నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్/ లక్డీకాపూల్: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య 44కు పెరిగింది. కల్తీ కల్లు తాగి ఇప్పటికే ఆరుగురు మరణించిన విషయం తెలిసిందే. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మీడియాతో మాట్లాడుతూ.. నిమ్స్‌లో 31 మంది చికిత్స పొందుతున్నారని, వీరిలో 27 మంది కోలుకున్నట్లు తెలిపారు. వీరిని శుక్రవారం నుంచి దశలవారీగా డిశ్చార్జి చేస్తారని వెల్లడించారు. నాలుగైదు రోజుల్లో అందరూ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యే అవకాశం ఉందని చెప్పారు. నలుగురు బాధితులకు దయాలసిస్ కొనసాగుతోందని తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో ఆరుగురు బాధితులు చికిత్స పొందుతున్నారని, మరో ఏడుగురు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరినట్లు వివరించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. మంత్రి వెంట నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డా.నిమ్మ సత్యనారాయణ, ఏఎంఎస్ డా.చరణ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

నెఫ్రోటాక్సిన్స్ వల్లే..

కల్లులో నెఫ్రోటాక్సిన్స్ (కొన్ని ఔషధాలు, ఇతర కెమికల్స్ కలిసి కిడ్నీలపై చెడు ప్రభావం చూపటం) కలవటం వల్లనే అది తాగినవారు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని వైద్యులు తెలిపారు. బాధితుల రక్తంలో సీరం క్రియాటినైన్ భారీగా పెరగడంలో వారి కిడ్నీల పనితీరుపై ప్రభావం పడిందని నిమ్స్ వైద్యు లు వెల్లడించారు. సాధారణంగా కల్లులో మత్తు కోసం డైజోఫాం, క్లోరోహైడ్రేట్, తీపి కోసం శాక్రిన్, నురగ కోసం అమ్మోనియం లాంటివి కలుపుతుంటారు. ఈ కల్లులో నెఫ్రోటాక్సిన్స్ కలవటం వల్లే ఎక్కువ మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొందరు మరణించారు. కండరాలపై శ్రమ పెరిగినప్పుడు శరీరంలో ఉత్పత్తి అయ్యే క్రియాటినైన్‌ను మూత్రపిండాలు రక్తం నుంచి శుద్ధి చేసి బయటకు పంపిస్తాయి. కానీ, ఈ క్రియాటి నైన్ అసాధారణంగా పెరిగిపోయినప్పుడు కిడ్నీలే దెబ్బతింటాయి. అప్పుడు ఈ వ్యర్థ పదార్థం గుండె, మెదడుతోపాటు ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుందని నిమ్స్ అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చరణ్‌రాజ్ వివరించారు. అలాంటి సమయంలో వెంటనే డయాలసిస్ చేయకపోతే వ్యక్తి మరణించే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

సమగ్ర నివేదిక ఇవ్వండి: మానవ హక్కుల కమిషన్

కల్తీ కల్లు సేవించి ఆరుగురు మృతి చెందిన ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై 20వ తేదీలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించింది. న్యాయవాది ఇమ్మనేని రామరావుతోపాటు పలువురు ఫిర్యాదు చేయటంతో ఈ ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిషోర్‌లతో కూడిన బెంచ్ గురువారం విచారణ చేపట్టి పోలీసులకు పలు ఆదేశాలిచ్చింది.

'గూడు'కట్టని బాధ

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులకు చెబితే ధ్రువీకరణ తీసుకుని రద్దు చేస్తున్నారు. ఇక ముగ్గు పోసి ఇళ్ల నిర్మించడంలో ఎవరైనా నెలల తరబడి జాప్యం చేస్తే కూడా రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. పునాదుల దశలో.. ఇచ్చే రూ.లక్షకు అదనంగా ఖర్చు కావడంతో చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. గతంలో ఇల్లు మంజూరైనట్లు గుర్తిస్తే ఆపేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 40,867 ఇళ్లకు 30,285 మందికి ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు. గత ఇందిరమ్మ ఇళ్ల కింద సర్కారు సాయం పొందారని సుమారు 1,200 మంది బిల్లులు నిలిపివేస్తూ రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. గతంలో ఇల్లు తీసుకున్న వారి పూర్తి వివరాలు వెల్లడైతే చాలాచోట్ల ఇళ్లు రద్దయ్యే అవకాశం ఉంది.



నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం ధర్మోరాకు చెందిన చిలువేరు లక్ష్మికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. పాత ఇల్లు కూల్చి నిర్మాణం చేపట్టాలని అధికారులు చెబితే నిర్మాణానికి సిద్ధమైంది. అయితే గతంలో ఇందిరమ్మ ఇల్లు కింద 15 సిమెంట్ సంచులు తీసుకున్నారని అధికారులు చెబుతూ, కొత్త ఇల్లు రద్దు చేయడంతో ఆందోళన చెందుతోంది. అప్పట్లో ఇల్లు మంజూరైనా ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇల్లు కట్టలేదని వాపోతోంది. ఉన్న ఇంటిని కూల్చివేయడంతో ఇబ్బందులు పడుతోంది.



నల్లగొండ జిల్లా చుండూరుకు చెందిన అన్నపూరి పద్మకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నికలకు ముందు ఇల్లు మంజూరైతే నిర్మాణం చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దరఖాస్తు చేసుకుంటే ఇల్లు మంజూరైంది. అయితే పాత నిర్మాణం కింద బిల్లు రాదని, పునాదులు, పిల్లర్ల వరకు నిర్మించిన ఇల్లును కూల్చి మళ్లీ ముగ్గుపోసి ప్రారంభిస్తేనే పథకం వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారని పద్మ వాపోతోంది.



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడకు చెందిన ఏల్ములే శైలజకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. సంతోషంతో పనులు మొదలుపెట్టగా, నాలుగు రోజుల క్రితం అటవీ అధికారుల వచ్చి, భూమి అటవీ పరిధిలో ఉందని నిర్మాణం చేపట్టరాదని అడ్డుకున్నారు. దీంతో ఇల్లు కట్టాలా? వద్దా? అని ఆవేదన చెందుతోంది. జిల్లాలో బెజ్జూరుతో సహా పలు మండలాల్లో పలు చోట్ల ఈ పరిస్థితి నెలకొంది.



కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణం పాత బాన్సువాడకు చెందిన ఒట్లంగారి పోచయ్య భార్య స్వరూప పేరుతో కొత్త ఇల్లు మంజూరైంది. దీంతో ఆయన పాత ఇంటిని కూల్చేసి, కొత్తది కడదామని అనుకునే లోపే పాత ఇల్లు పోచయ్య పేరుతో ఉందని, భార్య పేరుతో రద్దు చేసి మళ్లీ పోచయ్య పేరుతో ప్రతిపాదనలు పంపారు. ఇల్లు మంజూరయ్యే వరకు ఇంటి నిర్మాణం చేపట్టొద్దని అధికారులు నిలిపివేశారు. ఉన్న ఇల్లు కూల్చివేసిన పోచయ్య కుటుంబం అద్దె ఇంట్లో ఉంటోంది.

'క్యాబ్'లకు కళ్లెం?

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకోబోతోంది. దీంతో వాటి బేస్ చార్జీ, పెరుగుదల, పీక్ అవర్ సర్జ్‌లాంటివి రాష్ట్ర రవాణా శాఖ నిర్ధారించబోతోంది. క్యాబ్ సేవలపై వచ్చే ఫిర్యాదులను కూడా రవాణాశాఖ పరిశీలించి చర్యలు తీసుకోనుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు–2025ను విడుదల చేసిన విషయం తెలిసిందే. పీక్ అవర్స్‌లో క్యాబ్ బేస్ ఫేర్‌ను రెట్టింపు మేర పెంచుకోవటం, డిమాండ్ లేని వేళ, బేస్ ఫేర్‌లో 50 శాతానికి చార్జీ వసూలు చేయటం లాంటి కీలక సవరణలు చేసింది. వీటితోపాటు క్యాబ్ డ్రైవర్లకు రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా, రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్‌ను అగ్రిగేటర్లు కల్పించేలా అందులో పొందుపరిచింది. బుక్ చేసుకున్న క్యాబ్ ప్రయాణికుడి వరకు రావటానికి 3 కి.మీ. దూరం మించితే ఆ దూరానికి కూడా అదనపు చార్జీని లెక్కగట్టడం, సహేతుక కారణం చూపకుండా డ్రైవర్‌గాని, ప్రయాణికుడుగాని రైడ్ క్యాన్సిల్ చేసుకుంటే అపరాధ రుసుము చెల్లించాల్సి రావటం లాంటి అంశాలను కూడా అందులో చేర్చింది. ఈ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవటంతోపాటు వాటి అమలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఈ దిశగా చర్యలు తీసుకోగా, ఇప్పుడు తెలంగాణ కూడా కసరత్తు ప్రారంభించింది.

ఏంటీ ఉపయోగం..

గతంలో ఆటోరిక్షా వాలాలు ఎక్కువ చార్జీలు వసూలు చేస్తే ప్రయాణికులు రవాణాశాఖకు ఫిర్యాదు చేసే వీలుండేది, ఆ ఫిర్యాదులపై చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. కానీ, ప్రస్తుతం 90 శాతం మంది ఆటోవాలాలు క్యాబ్ అగ్రిగేటర్ల యాప్‌లతో అనుసంధానమయ్యారు. దీంతో వారు రవాణాశాఖ నిర్ధారించిన చార్జీలను పరిగణనలోకి తీసుకోవటం లేదు. పీక్ డిమాండ్ పేరుతో ఇష్టం వచ్చిన చార్జీలు వసూలు చేస్తున్నా ప్రయాణికులకు ఫిర్యాదు చేసే వీలు లేకుండా పోయింది. ఇప్పుడు అలాంటి ఆటోలతో పాటు క్యాబ్‌లపై ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది.

పీక్ అవర్ ఓ బ్రహ్మపదార్థం..

గతంలో ఆటోరిక్షాలకు ఉదయం, రాత్రి వేళలను పీక్ అవర్స్‌గా పేర్కొంటూ 1.5 శాతం ఎక్కువ చార్జీ వసూలు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. కానీ, క్యాబ్ సర్వీసులు 24 గంటలు పీక్ అవర్‌గా పేర్కొంటూ ఇష్టం వచ్చిన రీతిలో చార్జీలు వసూలు చేస్తున్నాయి. డిమాండ్ కాస్త ఎక్కువ ఉందని తెలియగానే, వాన కురవగానే, ట్రాఫిక్ జామ్ పెరగగానే, రోడ్డుమీద క్యాబ్‌ల సంఖ్య తక్కువ ఉన్నాయనగానే.. రెండుమూడు రెట్లు చార్జీలు పెరిగిపోతాయి. ఇప్పుడు దీన్ని నియంత్రించే వీలుంటుంది. బుక్ అయిన రైడ్‌ను డ్రైవర్ రద్దు చేసుకునే వీలు కూడా ఉండదు.

ప్రభుత్వానికీ ఆదాయం..

ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఓలా, ఉబర్, రాపిడో లాంటి అగ్రిగేటర్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి క్యాబ్ లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ప్రతి క్యాబ్ నుంచి రోడ్డు ట్యాక్స్ వసూలవుతుంది.

బైక్ ట్యాక్సీలకు ఓకే..

ప్రస్తుతం నగరంలో 1.30 లక్షల కార్లు క్యాబ్ సర్వీసుల్లో ఉన్నాయి. మరో లక్షన్నర వరకు ఆటోరిక్షాలున్నాయి. ఇవి కాకుండా కొన్నేళ్లుగా బైక్ ట్యాక్సీలు నడుస్తున్నాయి. వైట్ ప్లేట్‌తో ఉండే ఈ బైక్ ట్యాక్సీలు చట్టబద్ధం కాదని పేర్కొంటూ వాటిని రద్దు చేయాలని క్యాబ్, ఆటో డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. కానీ, తాజాగా కేంద్రం వాటికి అనుమతిని కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు రాష్ట్రంలో కూడా అవి యథావిధిగా నడవనున్నాయి. వాటికి పసుపు రంగు నంబర్ ప్లేట్ తప్పనిసరి చేయకపోవటం విశేషం. దీంతో వాటి సంఖ్య మరింత పెరిగే వీలుంది.

ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వొద్దు

ఎడ్ల బండ్ల రైతుల నిరసన



మోత్కూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎడ్లబండ్లతో నిరసన తెలుపుతున్న రైతులు

మోత్కూరు: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలింపునకు కొండగడప గ్రామంలోని బిక్కేరు వాగు నుంచి అధికారులు ట్రాక్టర్లకు అనుమతించడంపై గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఎడ్ల బండ్లతో నిరసన వ్యక్తం చేశారు. ఎడ్ల బండ్ల రైతులకు ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు ఇసుకకు రూ.3 వేలు తీసుకుంటుండగా, తాము ఒక ట్రాక్టర్ లోడ్‌తో సమానమైన ఐదు బండ్ల ఇసుకకు రూ.2 వేలు మాత్రమే తీసుకుంటున్నామని, దీనివల్ల ఇందిరమ్మ లబ్ధిదారులకు ఆర్థిక భారం తప్పుతుందన్నారు. బిక్కేరు వాగు నుంచి ట్రాక్టర్‌లతో ఇసుక తరలింపుపై హైకోర్టు స్టే ఉందని, అందుకని ఎడ్ల బండ్లనే అనుమతించాలని రైతులు డిమాండ్ చేశారు. ట్రాక్టర్లలో ఇసుక రవాణాకు అనుమతిస్తే ఎడ్ల బండ్ల రైతులం ఉపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రైతులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

- కొరడా దెబ్బలు కొట్టడానికి ఇది రాచరిక ప్రభుత్వమా అని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. దశాబ్దాలుగా ఒక ప్రజాస్వామ్యబద్ధ చర్చకు అవకాశం కల్పించే వేదికను సీఎం తూలనాడడం శోచనీయమన్నారు. తన వ్యాఖ్యలపై రేవంత్ బేషరతుగా జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

भारत सरकार
कारपोरेट कार्य मंत्रालय
त्वरित कॉर्पोरेट समापन प्रसंस्करण केंद्र (सी-पेस),
आई.आई.सी.ए. बिल्डिंग, 7वीं मंजिल,
प्लाट P-6,7,8, से.-5, आई.एम.टी. मानेसर, गुड़गांव,
हरियाणा - 122050.
Email: roc.cpace@mca.gov.in

భారత ప్రభుత్వం
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్ (C-PACE)
IICA బిల్డింగ్, 7వ అంతస్తు, ప్లాట్ పి-6, 7, 8, సెక్టార్-5, IMT మనేసర్, గుర్గావ్, హర్యానా - 122050
ఇమెయిల్: roc.cpace@mca.gov.in

ఫారం నం. STK-6

బహిరంగ ప్రకటన

[కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248లోని ఉప-సెక్షన్ (2) మరియు ఉప-సెక్షన్ (4) మరియు కంపెనీలు (కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్లు తొలగింపు) రూల్స్, 2016లోని రూల్ 7కు అనుగుణంగా]

బహిరంగ ప్రకటన నం. ROC/C-PACE/STK-2/248(2)/2025-26/801 తేది: 01.07.2025

నిర్దేశం:

దిగువ పేర్కొన్న కంపెనీలకు సంబంధించి కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 క్రింద తెలంగాణ రాష్ట్రంలోని (40) కంపెనీల పేర్లు కొట్టివేయడం లేదా తొలగింపు విషయంలో:

క్ర.సం.	పని ఐటం	CIN	కంపెనీ పేరు
1	AB4331657	U52293TS2025PTC196771	RELIABLE PACKERS AND MOVERS PRIVATE LIMITED
2	AB4898373	U62099TS2024PTC188643	NOVALOGIC TECHNOLOGIES PRIVATE LIMITED
3	AB4752551	U47211TS2024PTC191672	ALSOAMIR INTERNATIONAL PRIVATE LIMITED
4	AB4840983	U62011TS2024FTC189828	NABISEVEN PRIVATE LIMITED
5	AB4741080	U47219TS2024PTC190961	ADHARAHO FOODS PRIVATE LIMITED
6	AB4538697	U62099TS2024PTC189618	SNKRTRADE PRIVATE LIMITED
7	AB4790244	U36000TS2024PTC190022	PRASWE WATER PURIFIER TECHNOLOGY PRIVATE LIMITED
8	AB4155488	U62013TS2024PTC188467	NIREEHAYA TECHNOLOGY SOLUTIONS PRIVATE LIMITED
9	AB4453984	U86904TS2023PTC179533	PRANAYUSH INNOVATION PRIVATE LIMITED
10	AB4528452	U68200TS2023PTC178208	GOLDENKEY GSR INFRA PRIVATE LIMITED
11	AB4553187	U46497TS2023PTC176411	MEDITAS PHARMA PRIVATE LIMITED
12	AB4862816	U72900TG2022PTC168854	TENNESKIE TECHNOLOGIES PRIVATE LIMITED
13	AB4260615	U74999TG2022PTC162778	WEEIN SERVICES PRIVATE LIMITED
14	AB4443051	U70100TG2001PTC037157	GREENCITY HOUSING PRIVATE LIMITED
15	AB4484174	U72200TG2022PTC161524	TENET CLOUD PRIVATE LIMITED
16	AB4892384	U72900TG2022PTC159276	VAPRA SOFTTECH PRIVATE LIMITED
17	AB4402120	U72200TG2012PTC082014	MANGO AUTOMATION TECHNOLOGIES INDIA PRIVATE LIMITED
18	AB4586924	U18109TG2021OPC153582	KAROAI (OPC) PRIVATE LIMITED
19	AB4607280	U45309TG2021PTC154303	INFRARAISE PRIVATE LIMITED
20	AB4220593	U72900TG2021PTC151381	PYRROSDIGITAL PRIVATE LIMITED
21	AB4758721	U01110TG2021PTC148897	REIGNS HORTICULTURE PRIVATE LIMITED
22	AB4569531	U24299TG2020PTC146787	NUTRIX CROP SCIENCES PRIVATE LIMITED
23	AB4363748	U25209TG2020PTC141704	VEPACKS INDIA PRIVATE LIMITED
24	AB4612756	U74999TG2018PTC129099	BHUGANGA MINERALS AND INFRA PRIVATE LIMITED
25	AB4629983	U65100TG2018PTC127924	SAWJI CHITS AND FINANCE PRIVATE LIMITED
26	AB4629488	U72900TG2018PTC127932	CATURIYA RESEARCH LABS PRIVATE LIMITED
27	AB4511200	U74999TG2018PTC123743	AYURPOWER PRODUCTS PRIVATE LIMITED
28	AB4735513	U72501TG2018PTC126256	RENTGASM ENTERTAINMENT PRIVATE LIMITED
29	AB4449254	U93090TG2018OPC127658	CV OVERSEAS (OPC) PRIVATE LIMITED
30	AB4664183	U52602TG2018OPC122342	KHAMMAM LABSUPPLIES (OPC) PRIVATE LIMITED
31	AB4537053	U74999TG2017PTC120592	SANSHODHAN AN E-WASTE EXCHANGE PRIVATE LIMITED
32	AB4323755	U28994TG2016PTC109559	SD STEEL INDUSTRIES PRIVATE LIMITED
33	AB4360024	U33110TG2015PTC098856	FUTURE DIGITAL DENTAL PRIVATE LIMITED
34	AB4674510	U74900TG2013PTC090335	NOVAHOME ENTERPRISES PRIVATE LIMITED
35	AB3804342	U74120TG2012PTC078845	KAIZEN HR SERVICES PRIVATE LIMITED
36	AB4440776	U45209TG2011PTC076936	DREAM INDIA BUILDERS PRIVATE LIMITED
37	AB4752819	U51909TG2012PTC082623	SOHMAN TRADING AND SERVICES PRIVATE LIMITED
38	AB4127776	U72900TG2016PTC111865	SERIOUS GAMING PRIVATE LIMITED
39	AB4513797	U74900TG2009PTC062427	STARTUPOXYGEN.COM PRIVATE LIMITED
40	AB4819097	U72900TG2022OPC167042	DECISIVE TECHNOLOGY SOLUTIONS (OPC) PRIVATE LIMITED

(2) పైన పేర్కొన్న కంపెనీలు ప్రారంభమైన ఒక సంవత్సరంలోగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించడంలో విఫలమయ్యారని లేదా రెండు ఆర్థిక సంవత్సరాలకు ముందు కాలవ్యవధిలోగా సదరు కంపెనీ(లు) ఏవేని వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా మరియు ఎటువంటి దరఖాస్తులు చేయని కారణంగా కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 455 క్రింద నిద్రాణ స్థితిలో ఉన్న కంపెనీ స్థితిని పొందడం కోసం లేదా మెమోరాండంకు నిద్రాణ కంపెనీల కంపెనీ / సభ్యుల స్థాయిని పొందిన కంపెనీ(లు) కంపెనీ ప్రారంభ సమయంలో చెల్లించడానికి చేపట్టిన సభ్యత్వం చెల్లించని కారణంగా మరియు సెక్షన్ 10ఎ/లోని ఉప-సెక్షన్ (1) క్రింద కంపెనీ ప్రారంభం నుండి 180 రోజులలోగా ఈ ప్రభావానికి సంబంధించి డిక్లరేషన్ దాఖలు చేయని కారణంగా సెక్షన్ 12లోని ఉప-సెక్షన్ (9) క్రింద భౌతిక పరిశీలన తరువాత వెల్లడైనందున ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా తమ/ వారి రిజిస్ట్రేషన్‌ను కంపెనీలుగా కొనసాగించడానికి ఇష్టం లేనివారు కంపెనీల నమోదు నుండి తమ/ వారి పేర్లను తొలగించడానికి / కొట్టివేయడానికి అభ్యర్థించారు మరియు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 (2) క్రింద కంపెనీల నమోదు నుండి తమ/ వారి పేరు(ల) తొలగింపు కోసం పైన పేర్కొన్న కంపెనీల నుండి రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ దరఖాస్తులు స్వీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

(3) తదనుగుణంగా, పైన పేర్కొన్న కంపెనీ పేర్లను కంపెనీల నమోదు నుండి తొలగించడానికి లేదా కొట్టివేయడానికి కంపెనీలరిజిస్ట్రార్ ప్రతిపాదిస్తున్నారు.

(4) కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్ల తొలగింపు లేదా కొట్టివేయడం ప్రతిపాదనకు అభ్యంతరం తెలిపే ఎవరేని వ్యక్తి అతని లేదా ఆమె అభ్యంతరాన్ని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ముప్పై రోజులలోగా పైన తెలిపిన కార్యాలయ చిరునామాకు పంపగలరు.

రౌనక్ అగర్వాల్,
అసిస్టెంట్ రిజిస్ట్రార్,
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్

CBC 07123/11/0296/2526

2 వారాలు 230 ప్రదక్షిణలు 96 లక్షల కి.మీ.లు

ఐఎస్ఎస్‌లో 14 రోజులు పూర్తి చేసుకున్న శుభాంశు

14న తిరిగొచ్చే అవకాశం: నాసా



వాషింగ్టన్: నూటా నలభై కోట్ల మంది కలలను మోస్తూ నింగిలోకి దూసుకెళ్లి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని చేరి పలు రకాల పరిశోధనలతో బిజీగా మారిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అక్కడ 14 రోజులను పూర్తిచేసుకున్నారు. ఐఎస్ఎస్‌లో ఉంటూ ఇప్పటికే పుడమిని 230 సార్లు చుట్టేశారు. ఈయనతోపాటు ఐఎస్ఎస్‌కు విచ్చేసిన వ్యోమగాములు పెగ్గీ వాట్సన్ (అమెరికా), ఉజ్నాన్స్కీ విస్నేవ్స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)ల యాగ్జియం–4 బృందం ఇప్పటిదాకా ఐఎస్ఎస్‌లో ఉంటూ అంతరిక్షంలో 96 లక్షల కిలోమీటర్లు ప్రయాణించింది. ఐఎస్ఎస్‌కు చేరుకున్నాక శుభాంశు బృందం శాస్త్రసాంకేతిక రంగాలకు చెందిన పలు రకాల ప్రయోగాలు చేసింది. భూమి మీద ఆచరణలో ఉన్న ఎన్నో సిద్ధాంతాలను శూన్యస్థితిలో అక్కడ పరిశీలించింది. జీవవైద్య శాస్త్రం, రేడియోధార్మికత, న్యూరోసైన్స్, వ్యవసాయం, అంతరిక్ష సాంకేతికత ఇలా విభిన్న రంగాలకు సంబంధించి ప్రయోగాలు చేసింది. యాగ్జియం–4 మిషన్ వంటి ఒక ప్రైవేట్ వ్యోమగాముల బృందం ఇంతటి విస్తృతస్థాయిలో పరిశోధనలు చేయడం ఇదే తొలిసారి. అరవైకి పైగా ప్రయోగాలు ఈ బృంద సభ్యులు విజయవంతంగా పూర్తిచేశారు. చక్కెరవ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స విధానాలు, కేన్సర్ ట్రీమ్‌మెంట్‌లో కొత్తతరహా టెక్నాలజీ వాడకం, సుదీర్ఘకాలం ఖగోళయానం చేస్తే వ్యోమగామిపై రేడియేషన్ చూపే దుష్ప్రభావం, శూన్యస్థితిలో విత్తనాలు, సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా మనుగడ.. ఇలా భిన్న అంశాలపై శుభాంశు బృందం ప్రయోగాలు చేసి ఫలితాలను విశ్లేషించింది. భూమి నుంచి 250 మైళ్ల ఎత్తులో 230 సార్లు భూమిని చుట్టేసిన ఈ బృందం త్వరలోనే తిరిగి రానుంది. వారి తిరుగు ప్రయాణం ఈ నెల 14న ఉండొచ్చని నాసా పేర్కొంది.

చందమామను గ్రహశకలం ఢీకొట్టిన వేళ

వెలువడిన లక్ష కోట్ల అణుబాంబుల సమానమైన శక్తి

- చంద్రునిపై 2,500 కి.మీ. విస్తీర్ణంలో భారీ గొయ్యి
- 13 కిలోమీటర్ల లోతు గొయ్యి
- ఇదే ప్రాంతం నుంచి శాంపిళ్లను మోసుకొచ్చిన చాంగ్–6 వ్యోమనౌక



చిన్నతనంలో చేసే అతి అల్లరికి అమ్మ ఎప్పుడో ఒకసారి గట్టిగానే కొట్టేఉంటుంది. అలాగే చల్లని వెన్నెలను మనకు అందించే చందమామ కూడా ఒకప్పుడు భారీ దెబ్బతిన్నాడు. అంతరిక్షంనుంచి విరుచుకుపడిన ఒక ఖగోళ వస్తువు సృష్టించిన పెను ఉత్పాతమది. సౌర కుటుంబ చరిత్రలోనే కనీవినీ ఎరుగని భారీ తాడనంగా నమోదైంది. గ్రహశకలం లేదంటే తోకచుక్క అనూహ్యంగా దిశ మార్చుకుని వచ్చి చంద్రుడి ఉపరితలంపై అత్యంత వినాశనం సృష్టించింది. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా అణుబాంబులతో విరుచుకుపడి మారణహోమానికి పాల్పడింది. అమెరికా ప్రయోగించిన అణుబాంబుల కంటే ఏకంగా లక్ష కోట్ల అణుబాంబులకు సమానమైన శక్తితో ఆ గ్రహశకలం/తోకచుక్క చంద్రమామను ఢీకొట్టింది. దీంతో మనం లెక్కించడానికి, ఊహించడానికి కూడా సాధ్యంకానంతటి స్థాయిలో భారీ పేలుడు సంభవించింది. ఈ ధాటికి చంద్రుని ఉపరితలంపై 2,500 కిలోమీటర్ల విస్తీర్ణంలో భారీ గొయ్యి ఏర్పడింది. అంటే టెక్సాస్ రాష్ట్రంలోని వాకో సిటీ నుంచి వాషింగ్టన్ డీసీ నగరానికి ఉన్నంత దూరం స్థాయిలో ఈ గొయ్యి ఏర్పడింది. దీని లోతు ఏకంగా 13 కిలోమీటర్లు. ఇంతటి పెనువినాశనం ఇప్పుడు జరగలేదు. 380 కోట్ల సంవత్సరాల క్రితం ఈ అరుదైన ఖగోళ ఘటన జరిగింది.

మరి ఇప్పుడెందుకీ బిలం గోల?

చంద్రుడు ఏర్పడిన తొలినాళ్లలో ఏర్పడిన బిలం కావడంతో ఆనాటి ఘటన తాలూకు అవశేషాలు సజీవ సాక్ష్యాలుగా అక్కడే ఉంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆనాటి ఘటన తాలూకు ఆధారాలు అలాగే ఉంటాయనడానికి బలమైన కారణం ఉంది. చందమామపై ఎలాంటి వాతావరణం లేదు. గాలులు, వరదలు, కాలుష్యం వంటి కారణంగా అక్కడి ఉపరితలంపై ఎలాంటి మార్పులు సంభవించబోవు. ఆ లెక్కన ఆనాటి ఖగోళ రహస్యాలు అలాగే భద్రంగా ఉంటాయని భావిస్తున్నారు. భూమి ఏర్పడిన కొన్ని కోట్ల సంవత్సరాలకే చంద్రుడు ఆవిర్భవించాడు. ఈ లెక్కన అవని ఆవిర్భావ రహస్యాలు చందమామపై ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ రహస్యాలను ఛేదించేందుకు చైనా రంగంలోకి దిగింది. ఈ బిలం ఉన్న ప్రాంతానికి 'సౌత్ పోల్ ఐట్‌కెన్ బేసిన్'గా పిలుస్తారు. ఇది భూమి మీద నుంచి చూస్తే కనిపించదు. చంద్రుని ఆవలి వైపు ఎప్పుడూ చిమ్మచీకట్లో ఉంటుంది. దీంతో ఇక్కడి శాంపిళ్లను తీసుకురావడం సవాల్‌తో కూడిన పని. ఇంతటి అసాధ్యమైన పనిని చైనా సుసాధ్యంచేస్తూ ఛాంగ్–6 వ్యోమనౌక ద్వారా గత ఏడాది జూన్ 25వ తేదీన అక్కడి నుంచి 1,935 గ్రాముల నమూనాలను తీసుకొచ్చింది. ఈ శాంపిళ్లపై ఏడాదికాలంగా చేసిన పరిశోధన తాలూకు తాజా వివరాలు ''నేచర్'' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

17కు పెరిగిన మృతుల సంఖ్య


బ్రిడ్జిపై వేలాడుతున్న ట్యాంకర్

వడోదర/అహ్మదాబాద్: గుజరాత్‌లోని వడోదర జిల్లాలో బుధవారం ఉదయం వంతెన పాక్షికంగా కుప్పకూలిన ఘటనలో మరణాల సంఖ్య గురువారానికి 17కు పెరిగింది. ఇంకా ఆచూకీలేకుండా పోయిన నలుగురి కోసం మహిసాగర్ నదీ ప్రవాహం వెంట ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్ల బృందాలు విస్తృతంగా గాలింపు కొనసాగిస్తున్నాయి. ఆనంద్, వడోదర జిల్లాలను కలిపే 40 ఏళ్లనాటి ఏకైక గంభీర్ వంతెన కుప్పకూలడంతో రెండు జిల్లాల మధ్య రాకపోకలు పూర్తిగా తెగిపోయాయి. ''పాద్రా పట్టణ సమీపంలో కూలిన గంభీర–ముజ్‌పూర్ వంతెన వద్ద గాలింపు కొనసాగుతోంది. వర్షాలు, నదీ ప్రవాహం వెంట బురద కారణంగా గాలింపు చర్యలకు తీవ్ర ఆటంకం కల్గుతోంది'' అని వడోదర జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రోహన్ ఆనంద్ చెప్పారు. నదీ ప్రవాహం మధ్యలో పడిపోయిన వాహనాలను లాగేందుకు, గాలింపు చర్యల కోసం తాత్కాలికంగా ప్రత్యేక వంతెనను నిర్మించామని వడోదర జిల్లా కలెక్టర్ అనిల్ ధమేలియా చెప్పారు.

నాలుగేళ్లలో 16 వంతెన ప్రమాదాలు

వంతెన కూలిన ఘటనపై విపక్ష కాంగ్రెస్ స్పందించింది. '' గత నాలుగేళ్లలో రాష్ట్రంలో 16 వంతెన దుర్ఘటనలు జరిగాయి. ఈ అంశంలో సిట్‌తో దర్యాప్తు చేపట్టాల్సిందే. లేదంటే ఉద్యమం చేస్తాం. ప్రభుత్వపాలన అమోఘంగా ఉందంటూ ప్రసంగాలు, అడ్వర్టైజ్‌మెంట్లు ఇవ్వడంలోనే బీజేపీ నాయకత్వం, ప్రభుత్వ అధికారులు బిజీగా ఉన్నారు'' అని కాంగ్రెస్ విమర్శించింది. రాష్ట్రంలో నాయకత్వలోపం ఉందని, ఇలాంటి ప్రభుత్వానికి ఓటర్లు సరైన సమయంలో బుద్ధి చెప్తారని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వ్యాఖ్యానించారు. మరోవైపు ఈ ఘటనలో వంతెనల తనిఖీలో నిర్లక్ష్యం వహించారంటూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖకు చెందిన నలుగురు ఇంజనీర్లను గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ గురువారం సస్పెండ్ చేశారు. రోడ్లు, భవనాల శాఖను ఆయన దగ్గరే ఉంది.

ఎన్నికల ముందే 'సవరణ' ఎందుకు?

- బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై సుప్రీంకోర్టు ప్రశ్న
- ఈ ప్రక్రియ రాజ్యాంగబద్ధమే.. చేపట్టిన సమయమే అసలు సమస్య
- పిటిషనర్ల సందేహాలకు సమాధానం ఇవ్వండి
- ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశం



న్యూఢిల్లీ: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను యథాతథంగా కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆ ప్రక్రియ రాజ్యాంగబద్ధమేనని వెల్లడించింది. ప్రత్యేక సవరణను సవాలు చేస్తూ వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ లాయర్ రాకేశ్ ద్వివేది వాదనలు వినిపించారు. బిహార్‌లో 60 శాతం ఓటర్ల తనిఖీ పూర్తయ్యిందని చెప్పారు. ఓటర్లను సంప్రదించకుండా వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఎన్నికల సంఘం ఉద్దేశం, నిజాయతీని తాము శంకించడం లేదని, ప్రత్యేక సవరణ చేపట్టకుండా ఎన్నికల సంఘాన్ని అడ్డుకోవాలని భావించడం లేదని తెలిపింది. ప్రత్యేక సవరణతో సమస్య లేదని, చేపట్టిన సమయమే అసలు సమస్య అని పేర్కొంది. తీరా అసెంబ్లీ ఎన్నికల ముందు ఓటర్ల జాబితాను సవరించాల్సిన అవసరం ఏమిటని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. రాజ్యాంగబద్ధంగా జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణను ఆమోదిస్తున్నామని.. కానీ, ఎన్నికల ముందే ఈ ప్రక్రియ ఎందుకు మొదలుపెట్టారో చెప్పాలని పేర్కొంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టే అధికారం ఎన్నికల సంఘానికి లేదన్న పిటిషనర్ల వాదనను తిరస్కరించింది.

ఓటర్ల జాబితా సవరణ అనేది చాలా ముఖ్యమైన విషయమని చెప్పడంలో సందేహం లేదని, ఇది ప్రజాస్వామ్య మూలాలు, ఓటుకు ఉన్న శక్తికి సంబంధించిన అంశమని ధర్మాసనం అభిప్రాయపడింది. పిటిషనర్లు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని సూచించింది. ''నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన బిహార్‌లో ఈ సవరణ ప్రక్రియ ఇప్పుడే ఎందుకు ప్రారంభించారు? ఎన్నికలతో సంబంధం లేకుండా ఎందుకు చేపట్టకూడదు? ఎన్నికలకు కేవలం కొన్ని నెలల ముందే ప్రారంభించడం వెనుక ఔచిత్యం ఏమిటి?'' అని ప్రశ్నించింది. ప్రత్యేక సవరణపై మధ్యంతర స్టే విధించాలని పిటిషనర్లు కోరలేదని వెల్లడించింది. పిటిషనర్ల అభ్యంతరాలపై వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ నెల 21వ తేదీ నాటికి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది.

ఎన్నికలతో సంబంధం లేకుండా చేపట్టలేమా?

ప్రత్యేక సవరణలో ఓటర్ల అర్హతను నిర్ధారించడానికి ఆధార్ కార్డును ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదని ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ప్రతి ఓటర్ తప్పనిసరిగా భారతీయుడై ఉండాలని, ఆధార్ కార్డు అనేది ప్రజల పౌరసత్వానికి ధ్రువీకరణ కాదని రాజేశ్ ద్వివేది బదులిచ్చారు. ఓటర్ల పౌరసత్వాన్ని ధ్రువీకరించడం ఎన్నికల సంఘం బాధ్యత కాదని, అది కేంద్ర హోంశాఖ పరిధిలోని అంశమని ధర్మాసనం స్పష్టంచేసింది. నిజంగా పౌరసత్వాన్ని తేల్చాలని అనుకుంటే ఆ ప్రక్రియను గతంలోనే ప్రారంభిస్తే బాగుండేదని, ఇప్పటికే చాలా ఆలస్యమైందని పేర్కొంది. అందుకే అర్హులైన ఓటర్లను నిర్ధారించడానికి ఓటర్ ఐడీ కార్డు, రేషన్ కార్డుతోపాటు ఆధార్ కార్డును సైతం పరిగణనలోకి తీసుకోవాలని ఎన్నికల సంఘానికి సూచించింది.

పౌరసత్వం నిర్ధారణ మీ పనికాదు

ఉర్సులాపై వీగిన అవిశ్వాసం

బ్రసెల్స్: యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సుల్ వాన్ డెర్ లెయెన్ అవిశ్వాస పరీక్షలో నెగ్గారు. గురువారం ఓటింగ్ నిర్వహించారు. యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు ఆమెపై అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించారు. తీర్మానానికి వ్యతిరేకంగా 360 మంది, అనుకూలంగా కేవలం 175 మంది ఓటు వేశారు. 18 మంది గైర్హాజరయ్యారు. ఫ్రాన్స్‌లోని యూరోపియన్ పార్లమెంట్‌లో ఈ ఓటింగ్ జరిగింది. వ్యాక్సిన్లు తయారు చేసే ఫైజర్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌తో ఆమె రహస్యంగా సంభాషణలు సాగించారని, అవినీతికి పాల్పడ్డారని ఉర్సులాపై ఆరోపణలు వచ్చాయి. అందుకే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.

ఈ నెల 18న నావికాదళంలోకి 'నిస్తార్'

న్యూఢిల్లీ: దేశీయంగా నిర్మించిన మొట్టమొదటి డైవింగ్ సపోర్ట్ నౌక 'నిస్తార్' ఈ నెల 18న భారత నావికాదళంలో చేరనుంది. సముద్రంలో లోతైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టానికి, డీప్–సీ డైవింగ్‌కు ఈ నౌక దోహదపడుతుందని అధికారులు గురువారం వెల్లడించారు. విశాఖపట్నంలోని నావల్ డాక్‌యార్డ్‌లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతులు మీదుగా నిస్తార్‌ను నావికాదళంలో ప్రవేశపెట్టబోతున్నారు. విశాఖలో ఉన్న హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఈ నౌకను డిజైన్ చేసి, నిర్మించింది.

ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం

క్రమశిక్షణ, శాంతి పేరుతో ఎన్నో దారుణాలు జరిగాయి: శశి థరూర్



సాక్షి, న్యూఢిల్లీ: అవకాశం వచ్చినప్పుడల్లా తన సొంత పార్టీపై విరుచుకుపడుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ మరోసారి తన మాటలకు పదును పెట్టారు. 1975లో కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ)పై విమర్శలు గుప్పించారు. అప్పట్లో క్రమశిక్షణ, శాంతి పేరుతో ఎన్నో దారుణాలు జరిగాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం మలయాళ పత్రిక 'దీపిక'లో రాసిన వ్యాసంలో కాంగ్రెస్ పార్టీపై శశి థరూర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమర్జెన్సీ సమయంలో క్రమశిక్షణ పేరిట చేపట్టిన చర్యలు ఎన్నో దారుణాలకు దారితీశాయని, అవి క్షమించరాని తప్పులని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం అని తేల్చిచెప్పారు. ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ చేపట్టిన బలవంతపు కుటుంబ నియంత్రణ కార్యక్రమం అత్యవసర పరిస్థితి కాలంలో జరిగిన దారుణాలకు పెద్ద ఉదాహరణగా నిలిచిందని స్పష్టంచేశారు. గ్రామాల్లో నిర్దిష్ట లక్ష్యాలను చేరుకోవడం కోసం హింస, బెదిరింపులకు పాల్పడ్డారని విమర్శించారు. ఢిల్లీ వంటి నగరాల్లో పేదల గుడిసెలను నేలమట్టం చేసి వేలాది మంది ప్రజలను నిరాశ్రయులుగా మార్చారని ఆక్షేపించారు. ఇళ్లు కోల్పోయిన పేదల పునరావాసం, సంక్షేమం గురించి అప్పటి ప్రభుత్వం ఎలాంటి ఆసక్తి చూపలేదని వెల్లడించారు. అప్పటి దురాగతాలకు ప్రధాని ఇందిరా గాంధీ మద్దతు పలికారని ఆరోపించారు. ప్రత్యర్థులను జైల్లో పెట్టడం, ప్రజల ప్రాథమిక హక్కులను హరించడం, పత్రికలపై ఆంక్షలు విధించడం, చట్టాలను ఉల్లంఘించడం వంటివి మన రాజకీయాల్లో ఒక మచ్చగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎమర్జెన్సీని దేశ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుచిత్తుగా ఓడించారని గుర్తుచేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షకులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడూ తక్కువ చేసి చూడరాదని, ఇది మనకు దక్కిన విలువైన సంపద అని శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మనదేశం 1975లోని భారత్ కాదన్న విషయం గుర్తుంచుకోవాలని... మనం ఇప్పుడు మరింత ఆత్మవిశ్వాసంతో ఉన్నామని, మరింత అభివృద్ధి సాధించామని, బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థను కలిగి ఉన్నామని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థే మన బలమని ఉద్ఘాటించారు. అత్యవసర పరిస్థితి నుంచి నేర్చుకోవాల్సిన గుణపాఠాలు ఉన్నాయని వివరించారు. అధికారాన్ని ఒకచోటే కేంద్రీకరించడం, విరుద్ధ స్వరాలను అణచివేయడం, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాయడం వంటి దుష్పరిణామాలు మళ్లీ వేరే రూపాల్లో ప్రత్యక్షం అవుతూనే ఉంటాయన్నారు. దేశ ప్రయోజనాలు, సుస్థిరత అనే సాకులతో అలాంటి వాటిని సమర్థించడానికి ప్రయత్నిస్తారని చెప్పారు. కాబట్టి ప్రజాస్వామ్య పరిరక్షకులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టంచేశారు. అత్యవసర పరిస్థితి మనకు ఎప్పటికీ ఒక పెద్ద హెచ్చరిక అని శశి థరూర్ తేల్చిచెప్పారు. మరోవైపు ఎమర్జెన్సీ పట్ల శశి థరూర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.డి.సతీశన్, కె.మురళీధరన్ స్పందించారు. ఎప్పుడో విధించిన ఎమర్జెన్సీపై ఇప్పుడు మాట్లాడాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. శశి థరూర్ వ్యవహార శైలిపై తమ పార్టీ నాయకత్వం తగిన సమయంలో స్పందిస్తుందని పేర్కొన్నారు.

భూకంపంతో వణికిన హస్తిన

రిక్టర్‌స్కేల్‌పై 4.4 తీవ్రత

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ భూకంపంతో వణికింది. హరియాణాలోని ఝజ్జర్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో భూఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపకేంద్రాన్ని గుర్తించారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.4గా నమోదైందని జాతీయ భూకంపశాస్త్ర కేంద్రం ప్రకటించింది. ఢిల్లీ–ఎన్‌సీఆర్, హరియాణాతోపాటు ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లోనూ భూమి కంపించింది. భూప్రకంపనలతో హస్తినవాసులు వణికిపోయారు. గురువారం ఉదయం 9 గంటల నాలుగు నిమిషాలకు కొన్ని సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో ఢిల్లీలో కొందరు స్థానికులు ప్రాణభయంతో భవనాలు, ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. నా జీవితంలో ఈ స్థాయిలో భూప్రకంపనలు చూడటం ఇదే తొలిసారి అని ఝజ్జర్‌లో ఒక వృద్ధుడు భయంతో చెప్పారు. '' ఒక్కసారిగా భూమి కదలింది. దెబ్బకు ఇంట్లోంచి బయటికొచ్చాం. కొద్దిసేపటి తర్వాత ఇది భూకంపమని అర్థమైంది. ఉదయం మొత్తం ఎండ మండిపోయింది. రాత్రంగా వర్షం పడింది. ఉదయం చూస్తే ఇలా భూకంపం వచ్చింది. ఇలా వరసబెట్టి ప్రకృతి పరిణామాలను చూశాం. దీన్ని జీవితంలో మర్చిపోలేం'' అని ఢిల్లీలోని వికాస్‌పురి ప్రాంతానికి చెందిన సుల్తాన్ ఖాన్ చెప్పారు.



ప్రతీకార సుంకాలు తప్పవు

- అమెరికా ఉత్పత్తులపైనా 50 శాతం వేస్తాం
- బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా స్పష్టీకరణ

బ్రెసిలియా: తమ దేశ ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం ఎంతమేరకు సుంకాలు విధిస్తే.. అమెరికా ఉత్పత్తులపై తాము కూడా అంతే స్థాయిలో సుంకాలు విధిస్తామని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇన్సియో లులా డసిల్వా స్పష్టంచేశారు. బ్రెజిల్ ఉత్పత్తులపై ఆగస్టు 1వ తేదీ నుంచి ఏకంగా 50 శాతం టారిఫ్‌లు వసూలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జెయిర్ బోల్సోనారోకు వ్యతిరేకంగా డసిల్వా ప్రభుత్వం కుట్రలు సాగిస్తోందని, అందుకే 50 శాతం సుంకాలు విధించాలని నిర్ణయించినట్లు ట్రంప్ చెప్పారు. దీనిపై డసిల్వా బుధవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ట్రంప్ తీరును తప్పుపట్టారు. ఏకపక్షంగా టారిఫ్‌లు పెంచేస్తే తాము కూడా అదే రీతిలో ప్రతిస్పందించక తప్పదని పేర్కొన్నారు. ట్రంప్ వెనక్కి తగ్గకపోతే.. తమ దేశంలోకి దిగుమతి అయ్యే అమెరికా ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు వసూలు చేస్తామని ప్రకటించారు. బ్రెజిల్ ఒక సార్వభౌమ దేశమని, ఇతరుల పెత్తనాన్ని సహించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. బ్రెజిల్‌తో ద్రవ్యలోటు ఉందన్న ట్రంప్ ప్రకటనను కొట్టిపారేశారు.

రష్యా నుంచి చమురు కొనే దేశాలపై 500 శాతం టారిఫ్‌లు!

శాంక్షన్స్ బిల్లు పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సానుకూలత

వాషింగ్టన్: ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించే దిశగా రష్యా అధినేత పుతిన్‌పై మరింత ఒత్తిడి పెంచాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావిస్తున్నారు. రష్యాను లొంగదీసి, దారి తీసుకురావాలంటే ఆర్థికంగా దెబ్బకొట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై ఏకంగా 500 శాతం సుంకాలు విధించాలన్న ప్రతిపాదన పట్ల ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదిదన శాంక్షన్స్ బిల్లుకు మద్దతు ఇవ్వాలని భావిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ బిల్లును శాంక్షనింగ్ రష్యా యాక్ట్ ఆఫ్ 2025 అని అంటున్నారు. రష్యా నుంచి చమురు కొనే దేశాలపై 500 శాతం టారిఫ్‌లు విధించాలని ఈ బిల్లు ప్రతిపాదనల్లో చేర్చారు. దీనిపై ట్రంప్ తాజాగా కేబినెట్ సమావేశం సందర్భంగా మాట్లాడారు. ఈ బిల్లును తాను నిశితంగా పరిశీలిస్తున్నానని తెలిపారు. ఇది తనకు ఆమోదయోగ్యమేనని పరోక్షంగా సంకేతాలిచ్చారు.

నా ప్రాణాలకు ముప్పు నిజమే: ట్రంప్

వాషింగ్టన్: తన ప్రాణాలకు ముప్పు ఉన్న మాట నిజమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. డ్రోన్ దాడి చేసి ట్రంప్‌ను అంతం చేస్తామంటూ ఇరాన్ అధినేత అయతొల్లా అలీ ఖమేనీ సన్నిహితుడొకరు ఇటీవల హెచ్చరికలు జారీ చేశారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న మర్–ఎ–లాగో రిసార్ట్‌లో ట్రంప్ సన్ బాత్ చేస్తున్న సమయంలో డ్రోన్ ప్రయోగిస్తామని, అదే అనువైన ప్రదేశమని చెప్పారు. దీనిపై ట్రంప్ తాజాగా స్పందించారు. ఇది తనకు వచ్చిన బెదిరింపుగానే భావిస్తున్నానని తెలిపారు. తన ప్రాణాలకు ముప్పు ఉందన్న విషయంలో సందేహం లేదన్నారు. వాస్తవానికి ఏడేళ్ల వయసు నుంచి తాను సన్ బాత్ చేయడం లేదని వివరించారు. ఖమేనీ అనుచరుడి హెచ్చరికలను పరోక్షంగా ట్రంప్ తేలిగ్గా తీసుకున్నారు.

రూ.70 కోట్లు పలికిన హ్యాండ్ బ్యాగ్

నటి జేన్ బ్యాగ్‌కు రికార్డు ధర

పారిస్: అక్కడక్కడా చిరిగిపోయి, మరకలు పడి, బాగా వాడేసిన నల్లని బ్రాండెడ్ హ్యాండ్ బ్యాగ్. కానీ అది అలాంటిలాంటి బ్యాగ్ కాదు. అలనాటి అందాల హాలీవుడ్ నటి వాడిన బ్యాగ్. ఆ క్రేజ్ వల్లేనేమో, ప్రఖ్యాత ఫ్రెంచ్ నటి దివంగత జేన్ బిర్కిన్ వాడిన హ్యాండ్ బ్యాగ్ ఏకంగా 82 లక్షల డాలర్లకు, అంటే దాదాపు రూ.70 కోట్లకు అమ్ముడుపోయి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒక హ్యాండ్ బ్యాగ్‌కు ఇంతటి ధర పలకడం వేలంపాటల చరిత్రలో ఇదే తొలిసారి. ప్రఖ్యాత సోత్‌బీ వేలం సంస్థ దీనిని గురువారం ఆన్‌లైన్‌లో విక్రయించింది. 10 లక్షల డాలర్ల బిడ్డింగ్‌తో మొదలైన వేలం పాట క్షణాల్లో కోట్లు దాటేసి కొత్త రికార్డ్‌ను కొట్టేసింది. ఎట్టకేలకు జపాన్‌కు చెందిన ఒక అజ్ఞాత వ్యక్తి ఈ బ్యాగును సొంతం చేసుకున్నారు.

ఎవరీ బిర్కిన్?

తన అందం, అభినయంతో ఫ్రెంచ్ సినిమాలను ఒక ఊపు ఊపిన అలనాటి ప్రఖ్యాత బ్రిటిష్ నటి జేన్ బిర్కిన్. నేపథ్య గాయనిగా, ఫ్యాషన్ డిజైనర్‌గా, సామాజిక కార్యకర్తగా... ఇలా పనిచేసిన ప్రతి రంగంలోనూ తనదైన ముద్ర వేశారామె. నాటి సినీ, ఫ్యాషన్ ప్రపంచ ఐకాన్‌గా వెలిగిపోయారు. 1946 డిసెంబర్ 14న లండన్‌లోని మేరీలీబాన్‌లో జన్మించారు. 76వ ఏట పారిస్‌లో తుదిశ్వాస విడిచారు. హెర్మ్స్ లగ్జరీ వస్తువుల సంస్థ ప్రత్యేకంగా బిర్కిన్ కోసమే 1984లో ఈ బ్యాగును తయారుచేసింది. పారిస్ నుంచి లండన్ వెళ్తున్న విమానంలో బిర్కిన్ పక్క సీటులో హెర్మ్స్ సంస్థ చైర్మన్ జీన్ లూయిస్ డ్యూమస్ ప్రయాణించారు. ''విమానం ఎక్కినప్పుడు వస్తువులు పెట్టుకోవాలంటే వాంతి చేసుకునే కవర్‌లో పెట్టుకోవాల్సి వస్తోంది. మార్కెట్లో అందుబాటులో ఉన్న హ్యాండ్ బ్యాగులన్నీ చిన్నగా ఉన్నాయి. అల్లిన బుట్టను వాడడం ఇబ్బందిగా ఉంది. కాస్తంత పెద్ద బ్యాగు తయారు చేయొచ్చుగా!'' అని అతడిని బిర్కిన్ కోరింది. అడిగిందే తడవుగా సంస్థలోని నిష్ణాతులను పురమాయించి అత్యంత నాణ్యమైన తోలుతో, ప్రత్యేకతలతో పెద్ద బ్యాగ్‌ను తయారు చేయించి 1985లో ఆమెకు బహుమతిగా ఇచ్చారు. ఈ బ్యాగులను ఇకపై మీ పేరుతో అమ్ముకోవచ్చా అని అడిగితే ఆమె సరేనన్నారు. ఆమె చాన్నాళ్లపాటు అంటే 1985 నుంచి 1994 దాకా రోజూ ఆ బ్యాగును వెంట తీసుకెళ్లేది. అందాల నటి చేతిలో మరింత అందంగా కనిపించిన ఆ బ్యాగుకు ఫ్యాషన్ ప్రపంచం ఫిదా అయింది. తర్వాత మరో నాలుగు బ్యాగులను కూడా కంపెనీ నుంచి ఆమె బహుమతిగా అందుకున్నారు. కానీ ఈ బిర్కిన్ బ్యాగు మాత్రం ఫ్యాషన్ చిహ్నంగా స్థిరపడింది. దాంతో హెర్మ్స్ తయారీ బిర్కిన్ బ్యాగుల ధర సైతం అమాంతం పెరిగిపోయింది. కేవలం అత్యంత సంపన్నులు మాత్రమే కొనగలిగే బ్యాగ్‌గా మారిపోయింది.

బ్యాగుతో పాటు గోళ్ల కత్తెర

బిర్కిన్‌కు గోళ్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవడం అలవాటు. అందుకే ఆమెకు బహూకరించిన బ్యాగుకు కంపెనీ వెండి గోళ్ల కత్తెరనూ జతచేసింది. జిప్ లాక్ చేయడానికి బుల్లి తాళం కూడా ఇచ్చింది. బ్యాగుకు యూనిసెఫ్, మెడిసిన్స్ డ్యూ మోండే వంటి మానవీయ సంస్థల గుండ్రని స్టిక్కర్లను అతికించారామె. బిర్కిన్ 2023లో చనిపోయారు. అంతకు కొద్ది రోజుల ముందు మీడియాతో మాట్లాడుతూ, 'నా నటన, గానం, ఫ్యాషన్, సమాజసేవతో పాటు నేను చనిపోయాక నా బ్యాగ్ గురించి కూడా జనం మాట్లాడుకుంటే ఎంత బాగుంటుందో!' అని అన్నారు. ఆమె ఊహించినట్లే లగ్జరీ వస్తువుల ప్రపంచంలో ఇప్పుడా బ్యాగు ప్రత్యేక స్థానం ఆక్రమించుకుందని సోత్‌బీ హ్యాండ్‌బ్యాగులు, యాక్సెసరీల గ్లోబల్ హెడ్ మోర్గాన్ హ్యాలిమీ వ్యాఖ్యానించారు. ఒరిజినల్ బ్యాగును ఎయిడ్స్ ఛారిటీ నిధి కోసం వేలం పాట సంస్థకు ఆమె 1994లోనే ఇచ్చేశారు. 2000లో అది మరోసారి వేలానికి వచ్చింది. తర్వాత పాతికేళ్లుగా ఎవరికీ కనిపించలేదు. ఇన్నాళ్లకు సోత్‌బీ దాన్ని దక్కించుకుని గురువారం ఇలా రికార్డు స్థాయిలో విక్రయించింది. ఈ బ్యాగు మోడల్ అంటే తమకెంతో ఇష్టమని పలువురు సెలెబ్రిటీలు, ఆర్టిస్టులు, స్టైలిస్టులు గతంలో చెప్పారు.



సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 11 । జూలై । 2025



జంట జలాశయాలపై 4 ఎస్టీపీలు

ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు మురుగునీటి తంటా లేకుండా జలమండలి సన్నద్ధమైంది. ఇందుకోసం నాలుగు ఎస్టీపీలను నిర్మిస్తోంది. -10లో



రిమ్ జిమ్.. హోమ్ జిమ్..

నగరంలో ఆరోగ్యంపై అవగాహనతో పాటు కొత్త కొత్త ట్రెండ్స్ పెరుగుతున్నాయి. ఇదే క్రమంలో ప్రస్తుతం హోమ్ జిమ్స్‌కు డిమాండ్ ఊపందుకుంటోంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

గురుభ్యోన్నమః

ఓం సాయి.. శ్రీ సాయి.. జయజయ సాయి.. అంటూ సాయిబాబా నామస్మరణలతో గురువారం నగరం పులకరించింది. గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురువు స్థానం పరమ పావనమని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా దేవాలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.







దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద భక్తుల కిటకిట

నేటి నుంచి లాల్‌దర్వాజా బోనాలు



ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ తదితరులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం అమ్మవారికి అభిషేకం, 10.45 గంటలకు నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ముఖ్య అతిథులుగా హాజరై ధ్వజారోహణ, శిఖర పూజ నిర్వహించి నవరాత్రి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్ వెల్లడించారు. సాయంత్రం 6 గంటలకు కలశ స్థాపన ఉంటుంది. ఉత్సవాలలో అమ్మవారిని ప్రతిరోజూ వివిధ రూపాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయానికి రంగులు వేయడంతో పాటు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు గురువారం ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతీయాదవ్, మాజీ చైర్మన్ కె.వెంకటేష్‌లు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ప్రసాద్ వర్మ బోనాల ప్రారంభ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీబీఎస్‌లో ఆర్టీసీ టికెట్ బుకింగ్ కేంద్రం



సాక్షి, సిటీబ్యూరో: గౌలిగూడలోని సెంట్రల్ బస్టేషన్‌లో ఆర్టీసీ టికెట్ బుకింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత గురువారం దీనిని ప్రారంభించారు. ఈ కౌంటర్ ద్వారా ప్రయాణికులు హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు బెంగళూరు, చెన్నై, ముంబై, పుణె తదితర ప్రధాన నగరాలకు సైతం రిజర్వేషన్లు చేసుకోవచ్చని ఆమె వివరించారు. ప్రయాణికులు ఈ కొత్త కౌంటర్ ద్వారా ముందస్తు టికెట్ బుకింగ్ సౌకర్యాన్ని వినియోగించుకొని, సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చని సూచించారు.

రెండు రోజులు వైన్స్, బార్లు బంద్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బోనాల పండుగ సందర్భంగా ఈ నెల 13 నుంచి రెండు రోజుల పాటు వైన్స్, బార్లు మూసి ఉంచనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 13వ తేదీ ఉదయం 6 నుంచి 15 ఉదయం 6 గంటల వరకు సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ హైదరాబాద్‌లో వైన్స్, బార్లు బంద్ ఉంటాయన్నారు.

కల్లు దుకాణాల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కలకలం రేపిన కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లోని కల్లు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించింది. వివిధ చోట్ల కల్లు నమూనాలను సేకరించింది. జీహెచ్ఎంసీలోని 10 ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న కల్లు దుకాణాల్లో తనిఖీలను చేపట్టినట్లు రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ తెలిపారు. మరోవైపు ఆల్ప్రాజోలమ్ వంటి మత్తు పదార్థాలను అధిక మోతాదులో కలిపి కల్తీకల్లు విక్రయాలకు పాల్పడిన కేపీహెచ్‌బీ, హైదర్‌నగర్, హైదర్‌నగర్ (బి), సర్దార్ పటేల్‌నగర్ కల్లు దుకాణాల లైసెన్సులను అధికారులు రద్దు చేశారు.

రహదారి భద్రతపై ఆర్టీఏ పాఠాలు



సాక్షి, సిటీబ్యూరో: రహదారి భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని హైదరాబాద్ ఉపరవాణా కమిషనర్ ఆఫ్రిన్ సిద్దిఖీ సూచించారు. గురువారం నాంపల్లిలోని మల్లేపల్లి ఐటీఐ కళాశాలలో ఆర్టీఏ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సును ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని ప్రారంభించారు. రాష్ డ్రైవింగ్ ప్రమాదకరమని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల వాళ్లు ప్రమాదానికి గురికావడమే కాకుండా ఇతరులను కూడా ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని చెప్పారు. విద్యాసంస్థల్లో రహదారి భద్రతా క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన పెంపొందించాలని ఆమె కోరారు. ఖైరతాబాద్ ప్రాంతీయ రవాణా అధికారి పురుషోత్తమ్‌రెడ్డి రహదారి భద్రతపై పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంటా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్ సాగర్ జలమండలి పార్కులో వన మహోత్సవం



జలమండలి పార్కులో మొక్క నాటి నీరుపోస్తున్న ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులోని హిమాయత్ సాగర్ జలమండలి పార్క్‌లో గురువారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ మొక్కలు నాటారు. అంతకుముందు గ్రీన్ హౌస్‌ను ప్రారంభించిన ఎండీ.. అక్కడి మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఎన్సీ డైరెక్టర్ ఆపరేషన్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్లు సుదర్శన్, టీవీ శ్రీధర్, ఆపరేషన్ డైరెక్టర్-1 అమరేందర్‌రెడ్డి, పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి, సీజీఎం బ్రిజేష్, ఈఓ విజయకుమారి, జలమండలి డీసీఎఫ్ వెంకటేశ్వర్లు, ఆర్.ఎఫ్.ఓ నారాయణరావు పాల్గొన్నారు.

కెమికల్ కిక్కు!

మత్తెక్కిస్తున్న విష రసాయనాలు

- కుదేలవుతున్న పేదల జీవితాలు
- గాల్లో అమాయకుల ప్రాణాలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- ఇష్టారాజ్యంగా అక్రమ వ్యాపారులు
- కుదిపేసిన కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటన
- ఏడుగురికి చేరిన మృతుల సంఖ్య
- ఆస్పత్రుల్లో 45 మందికి చికిత్సలు

కూకట్‌పల్లి:

కూకట్‌పల్లి సర్కిల్, బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్‌ల పరిధిలోని కల్లు దుకాణాలలో కల్తీ కల్లు విక్రయించటంతో అనేక మంది తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే ఏడుగురు మృత్యువాత పడగా నిమ్స్‌తో పాటు వివిధ ఆస్పత్రుల్లో సుమారు 45 మంది చికిత్స పొందుతున్నారు. వాంతులు, విరేచనాలతో, జ్వరాలతో ఆస్పత్రుల పాలైన వారు ఒక్కొక్కరుగా మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు గురవుతున్నారు. బుధవారం ఆరుగురు మృత్యువాత పడగా గురువారం హైదర్‌నగర్ సాయిచరణ్ కాలనీకి చెందిన నర్సమ్మ (54) తీవ్ర అస్వస్థతకు గురై ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

కూలిపనులు చేసుకుంటున్న వారే..

హైదర్‌నగర్, శంషీగూడ, నిజాంపేట్, అడ్డగుట్ట, ఇందిరా హిల్స్, నడిగడ్డ తండా, వసంత్‌నగర్, ఎల్లమ్మబండ తదితర కాలనీల్లో పొట్టకూటి కోసం వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి కూలిపనులు చేసుకుంటున్న వారే అధికంగా నివసిస్తుంటారు. వీరు తక్కువ ధరలో కల్లు దొరకటంతో పాటు మత్తు ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయంతో కల్లుకు అలవాటు పడ్డారు. ప్రతి రోజు ఆయా ప్రాంతాల్లోని కల్లు దుకాణాల్లో కల్లు తాగుతుంటారు. వీరిని ఆసరాగా చేసుకుని కల్లు కాంపౌండ్ల నిర్వాహకులు కల్లును కల్తీ చేస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. ప్రమాదకరమైన క్లోరల్ హైడ్రేట్, డైజోఫాం, సిట్రిక్ యాసిడ్ వంటి రసాయనాలు నగర శివారులోని పారిశ్రామికవాడ నుంచి దొంగచాటున కొనుగోలు చేసి కల్తీ కల్లులో ఉపయోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



భాగ్యనగర్ కల్లు కాంపౌండ్ మూసివేయటంతో అక్కడే ఓ వ్యక్తి ఇలా..



ఎల్లమ్మబండ కల్లు కాంపౌండ్‌లో ఇలా..

మామూళ్ల మత్తులో అధికారులు..

ప్రతి నెలా టంచన్‌గా దుకాణాలను సందర్శించే అధికారులు, సిబ్బంది కేవలం మామూళ్ల లెక్కలను చూసుకుని కాగితాల్లో శాంపిల్స్ సేకరించినట్లు కల్లు స్వచ్ఛత గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించటం పరిపాటిగా మారింది. బాలానగర్ ఎక్సైజ్ అధికారులు మూడు రోజులుగా ఏ ఒక్కరికి కనీసం సమాధానం చెప్పకుండా స్థానికంగా ఎవరికీ అందుబాటులో లేకుండా మొహం చాటేస్తూ తిరుగుతున్నారు. కనీసం ప్రజాప్రతినిధులకు కూడా ఎలాంటి సమాధానం చెప్పటం లేదు. దీనిని బట్టి ఎక్సైజ్ అధికారులకు కల్లు దుకాణ యజమానులతో బంధం ఎంత బలంగా ఉందో అర్థమవుతోంది. నకిలీ గీత కార్మికులు నగరంలోని పలు మురికివాడల్లో ఒక షాపు అనుమతి తీసుకుని అనేక బ్లాక్ అడ్డాల్లో కల్తీ కల్లును విక్రయిస్తున్నారని ఆరోపణలున్నాయి.

మాఫియాను గుర్తించాలి..

అమాయకుల జీవితాలతో చెలగాటమాడే కల్తీ కల్లు మాఫియాను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కల్లు గీత కార్మికులకు తాటిచెట్టు ఎక్కి కల్లు తీసే పరీక్షలు పెట్టి వారిని గుర్తించాలని, వారికి మాత్రమే కల్లు అమ్ముకునేలా దుకాణాల లైసెన్స్‌లు మంజూరు చేయాలని పలువురు డిమాండు చేస్తున్నారు. కాంపౌండ్‌లోని కల్లును ఎప్పటికప్పుడు తనిఖీ చేసి చార్ట్‌లో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

కల్లు దుకాణాల మూసివేతతో వింత ప్రవర్తనలు..

కల్తీ కల్లు విషాదాంతం కారణంతో అధికారులు దుకాణాలు మూసివేయించారు. దీంతో రోజూ కల్లు తాగే ప్రజలు వీటి వద్ద వేచి చూస్తున్నారు. మరికొందరు పిచ్చిగా ప్రవర్తిస్తూ పడిపోతున్నారు. ఇంకొందరు కల్లు దొరక్క వైన్ షాపుల్లో దొరికే చీప్ లిక్కర్‌కు తాగుతున్నారు. గురువారం పలు కల్లు దుకాణాలు మూసివేయటంతో.. ఎల్లమ్మబండలోని కల్లు కాంపౌండ్‌కు తాకిడి పెరిగింది.

ఎక్సైజ్ అధికారుల దాడులు..

కూకట్‌పల్లిలో కల్తీ కల్లు ఘటనతో ఎక్సైజ్ శాఖ అప్రమత్తమైంది. 7 బృందాలుగా ఏర్పడి బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌నగర్ దాని అనుబంధ హెచ్ఎంటీ కాలనీ, సర్దార్ పటేల్ నగర్, కేపీహెచ్‌బీ భాగ్యనగర్ కాలనీల్లోని కల్లు దుకాణాల్లో నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఆల్ప్రాజోలం అనే మత్తు మందును కల్తీ చేసినట్లు అధికారులు ప్రాథమిక నివేదికలో తేల్చారు. సంబంధిత కల్లు కాంపౌండ్ల యజమానులు కూన రవితేజ గౌడ్, నాగేష్ గౌడ్, కూన సాయితేజ గౌడ్, భట్టి శ్రీనివాస్ గౌడ్‌లను గురువారం న్యాయస్థానం ముందు హాజరుపరిచామని, దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేసినట్లు బాలానగర్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన నర్సమ్మ

వినతి పత్రాలు అందించినా పట్టించుకోలేదు..



సాయిచరణ్ కాలనీకి చెందిన నర్సమ్మ కల్తీ కల్లుతాగి మృత్యువాత పడింది. ఈ ప్రాంతంలో కల్లు కాంపౌండ్ నిర్వహించవద్దని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండాపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కల్తీ కల్లుకు పేదలు బలవుతున్నారు. కల్లు దుకాణాలను నగరానికి దూరంగా తరలించాలి.

– చందు, సాయిచరణ్ కాలనీ వాసి

కుటుంబాలు ఛిన్నాభిన్నం..



కల్తీ కల్లుతో పేద ప్రజల జీవితాలు గాలిలో కలిసి పోతున్నాయి. పలువురు అనారోగ్యాల బారిన పడటంతో వారి కుటుంబాలు ఛిన్నాభిన్నమైపోతున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్‌లో గతంలో కల్తీ కల్లు తాగి కిడ్నీలు పాడై చనిపోయిన వారు కూడా ఉన్నారు. ఎక్సైజ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కల్తీ కల్లు దుకాణాలను కట్టడి చేయాలి.

– భద్రయ్య, కూకట్‌పల్లి

మూత్రపిండాలపై పెను ప్రభావం

క్లోరో హైడ్రేట్, డైజోఫాం, సిట్రిక్ యాసిడ్ వంటి రసాయనాలను చాలా అరుదుగా వాడతారు. వీటిని ఎక్కువ మోతాదులో తీసుకుంటే మూత్ర పిండాలతో సహా మిగతా అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. కల్తీ కల్లు తీసుకోవటం ఆరోగ్యానికి మంచిది కాదు. విక్రయించటం కూడా నేరమే.

– డాక్టర్ పి.వెంకటకృష్ణ, ఫెలోషిప్ ఇన్ డయాబిటాలజీ అండ్ జనరల్ ఫిజీషియన్

ఆటో.. రూట్ ఎటో!

డీలర్ల అక్రమార్జన కోసమే 20 వేల ఎల్పీజీ, సీఎన్జీ పర్మిట్లు

- ఔటర్ వరకు ఈవీలంటూనే ఎల్పీజీకి అనుమతులు
- పాత ఆటోలకు ఈవీ రిట్రోఫిట్‌మెంట్‌లు



సాక్షి, సిటీబ్యూరో: రాజధాని నగరంలో ఆటోపర్మిట్ల దోపిడీ పర్వం మొదలైంది. వారం రోజులుగా ఆటో రిక్షాల షోరూంలలో డ్రైవర్ల నమోదు ప్రక్రియ చేపట్టారు. మొదట వచ్చినవారికి మొదట కేటాయింపు (ఫస్ట్ టూ ఫస్ట్ కమ్) పద్ధతిలో జరుగుతున్న ఈ నమోదు వల్ల డ్రైవర్లు షోరూమ్‌లకు పరుగులు తీస్తున్నారు. కేవలం డ్రైవర్ల వివరాలను నమోదు చేసేందుకే సుమారు రూ.5000 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆటో రిక్షాల ధరలను బహిరంగంగా ప్రకటించకుండా డ్రైవర్లను నమోదు చేసుకోవడం వల్ల బ్లాక్ మార్కెటింగ్ జరిగే అవకాశం ఉన్నట్లు ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ అంశంపై ఆటో సంఘాల నాయకులు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు.

ఈవీలకు ప్రోత్సాహం ఏమైనట్టో..? .

నగరంలోని ఆటోల స్థానంలో ఔటర్ వరకు పూర్తిగా ఎలక్ట్రిక్ ఆటోలను అందుబాటులోకి తేనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలోనే ప్రకటించారు. కేంద్రం రూపొందించిన ఈవీ పాలసీకి అనుగుణంగా ఎలక్ట్రిక్ ఆటోలకు పన్ను నుంచి మినహాయింపు నిచ్చారు. ఒకవైపు ఈవీ పాలసీ కొనసాగుతుండగా కొత్తగా 65 వేల ఆటో పర్మిట్లకు అనుమతులను ఇవ్వడంలో మతలబు ఏంటని ఆటో సంఘాలు, పర్యావరణ సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. కేవలం ఈవీల ముసుగులో 20 వేల ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలను విక్రయించేందుకే ప్రభుత్వం ఈ పర్మిట్లను విడుదల చేసినట్లు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఎడాపెడా డ్రైవర్లను నమోదు చేసుకొన్న అనంతరం కొత్త ఆటోలకు కృత్రిమ కొరతను సృష్టించి భారీ ఎత్తున ధరలు పెంచేందుకు కొందరు డీలర్లు, ఫైనాన్షియర్లు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నట్లు ఆటో సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

రిట్రోఫిట్‌మెంట్..ఎందుకో

అక్రమార్కులకు కొమ్ముకాసే విధంగా ఉన్న కొత్త పర్మిట్ల విధానం పూర్తి లోపభూయిష్టంగా ఉంది. ఒకవైపు ఈవీ పాలసీ కొనసాగుతుండగా కొత్తగా 20 వేల ఈవీలతో పాటు మరో 20 వేల ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలకు అనుమతులను ఇచ్చారు. ఇవి కాకుండా 25 వేల పాత ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకొనేందుకు రిట్రోఫిట్‌మెంట్ అనుమతులను ఇచ్చారు. అక్రమార్కులకు కొమ్ముకాస్తూ విడుదల చేసిన ఆటోరిక్షా పర్మిట్ల పందేరంలో డ్రైవర్లే మరోసారి సమిధలుగా మారనున్నారు.

నమోదైన చోట కొనేందుకేనా...

ఆటోడ్రైవర్లు తెలంగాణలో ఎక్కడైనా కొనుగోలు చేయవచ్చని ఆర్టీఏ విధివిధానాల్లో పేర్కొన్నారు. ఈ మేరకు షోరూమ్‌లలో రవాణాశాఖ లాగిన్ సౌకర్యం కల్పించారు. షోరూమ్‌ల వద్ద నుంచి వచ్చే డ్రైవర్ల వివరాల ఆధారంగా ఆర్టీఏ అధికారులు పర్మిట్లను విడుదల చేస్తారు. ఈ పర్మిట్లపై సదరు డ్రైవర్ కొత్త ఆటోను కొనుగోలు చేసుకోవచ్చు. కానీ తమ వద్ద ఆటోను కొనుగోలు చేసే డ్రైవర్ల వివరాలను మాత్రమే షోరూమ్‌లలో నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ముందస్తుగా రూ.5000 చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం.

డీసీలు, జడ్‌సీలకు 'ఇన్‌స్టంట్' అనుమతుల రద్దు అధికారం

స్టాండింగ్ కమిటీ సమావేశంలో 16 అంశాలకు ఆమోదం



స్టాండింగ్ సమావేశంలో కమిషనర్, మేయర్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో అజెండాలోని 14 అంశాలు, టేబుల్ అజెండాలోని 2 అంశాలు కలిపి మొత్తం 16 అంశాలకు గురువారం ఆమోదం లభించింది. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆమోదం పొందిన ముఖ్యాంశాలిలా..

జీహెచ్ఎంసీలో 'ఇన్‌స్టంట్' భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి సర్కిళ్లలో వర్క్ కమెన్స్‌మెంట్ లెటర్ ఇవ్వకముందే తప్పులున్నట్లు గుర్తిస్తే అనుమతులు రద్దు చేసే అధికారం డిప్యూటీ కమిషనర్లకు అప్పగించడం. వర్క్ కమెన్స్‌మెంట్ లెటర్ ఇచ్చిన తర్వాత అయితే రద్దు చేసే అధికారం జోనల్ కమిషనర్లకు ఇవ్వడం. అనుమతుల్లేకుండా నిర్మించిన భవనాలను సెక్షన్ 455–ఎ కింద రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు అందిన దరఖాస్తుల పరిశీలన అధికారం జోనల్ కమిషనర్లకు అప్పగించడం.

- సరూర్‌నగర్ పెద్ద చెరువు ప్రధాన కట్ట మరమ్మతులు, బలోపేతం చేసే పనుల కోసం రూ. 5.60 కోట్ల అంచనా వ్యయంతో షార్ట్ టెండర్ పిలిచేందుకు పరిపాలన అనుమతి. జీహెచ్ఎంసీ నిబంధనల మేరకు బుద్ధభవన్‌లో హైడ్రా కార్యాలయానికి మూడేళ్ల వరకు(19 ఆగస్టు 2024 నుంచి 18 ఆగస్టు 2027 వరకు) లీజు కిచ్చేందుకు ఆమోదం. శాస్త్రి పురం ఆర్ఓబీ నుండి ఇన్నర్ రింగ్ రోడ్డు (మెహఫిల్ హోటల్) వరకు రూ. 4.95 కోట్ల అంచనా వ్యయంతో 100 అడుగుల రోడ్డు విస్తరణ.
- వనస్థలిపురం నుంచి వయా సాహెబ్ నగర్ మీదుగా ఓల్డ్ హయత్ నగర్ వరకు మిస్సింగ్ లింక్‌రోడ్ కింద రోడ్డును 24 అడుగులకు వెడల్పు చేయడంతో పాటు మాస్టర్‌ప్లాన్‌లో చేర్చేందుకు ప్రభుత్వానికి తెలియజేయడం. తద్వారా 102 ఆస్తులపై ప్రభావం పడనుంది. కమిషనర్ అధికారాల్లో కొన్ని అడ్మిన్, ఫైనాన్స్ అడిషనల్ కమిషనర్లకు బదలాయింపు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా ఇందిరమ్మ క్యాంటీన్లలో టిఫిన్ పథకం ప్రారంభించేందుకు ఆమోదం. టిఫిన్ ధర రూ.19 లు కాగా, లబ్ధిదారులు చెల్లించే రూ.5లు పోను మిగతా రూ.14 జీహెచ్ఎంసీ చెల్లించనుంది. అందుకు జీహెచ్ఎంసీకి ఏటా దాదాపు రూ.15.33 కోట్లు ఖర్చు కానుంది. ఇందిరమ్మ క్యాంటీన్ల ఏర్పాటుకు (కంటైనర్లకు)రూ. 11.43 కోట్లు ఖర్చు కానుంది. దానికి కూడా ఆమోదం లభించింది. తొలుత మింట్‌కాంపౌండ్, గౌలిదొడ్డి, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నట్లు సమాచారం. 23 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్వహణను ప్రైవేటుకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచేందుకు ఆమోదం.

డాక్టర్ నవనీత్ సాగర్ రెడ్డి కన్నుమూత



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ వైద్యులు, యశోద ఆసుపత్రిలో సీనియర్ డాక్టర్‌గా విశేష సేవలందించిన డా.నవనీత్ సాగర్ రెడ్డి గురువారం కన్నుమూశారు. నిరంతరం ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం పరితపించిన డా.నవనీత్ సాగర్ రెడ్డి మరణం వైద్యరంగానికి తీరని లోటని పలువురు వైద్యులు పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

డీఎన్ఏ పరీక్షలకు ఆనవాళ్లు లేవు!

డాలస్ ప్రమాదంలో హైదరాబాద్ కుటుంబం మృతి

- శనివారం ట్రక్కు ఢీకొట్టడంతో కారులో సజీవదహనం
- ప్రత్యామ్నాయాల ఆధారంగా ముందుకెళ్లిన అధికారులు
- కారు వివరాలు, ఇతర అంశాలతో మృతుల ధ్రువీకరణ
- శుక్రవారం అట్లాంటాలో వారి అంత్యక్రియలకు ఏర్పాట్లు



భార్యా పిల్లలతో వెంకట్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: అమెరికాలోని అలబామాలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సజీవదహనమైన హైదరాబాదీ కుటుంబానికి సంబంధించి అక్కడి అధికారులు డీఎన్ఏ నమూనాలు కూడా సేకరించలేకపోయారు. అగ్నికీలలు నలుగురి మృతదేహాలను పూర్తిగా కాల్చేయడంతో ఇది సాధ్యం కాలేదు. దీంతో అమెరికన్ అథారిటీస్ ఆయా పరిస్థితులతో పాటు కారు వివరాల ఆధారంగా మృతులను ధ్రువీకరించారు. వీరి అంత్యక్రియలు శుక్రవారం అమెరికాలోని అట్లాంటాలో జరుగనున్నాయి. హైదరాబాద్‌లోని తిరుమలగిరికి చెందిన పశుపతినాథ్, గిరిజ దంపతుల కుమారుడు శ్రీ వెంకట్ బెజుగంకు (40), జీడిమెట్లకు చెందిన తేజస్వి చోల్లేటితో (36) 2013లో వివాహం జరిగింది. వీరికి సిద్ధార్థ్ (9), మృద (7) సంతానం. ఐటీ ప్రొఫెషనల్స్ అయిన వారు మూడేళ్లుగా అమెరికాలో ఉంటున్నారు. పశుపతినాథ్ కుటుంబం ప్రస్తుతం కొంపల్లిలోని ఎన్సీఎల్‌లో ఉంటోంది. ఇటీవలే వీరు తమ కుమారుడి వద్దకు అమెరికా వెళ్లారు. వెంకట్ కుటుంబం డాలస్ సమీపంలోని సట్టన్ ఫీల్డ్స్ కమ్యూనిటీలో నివసిస్తోంది. అతడి సోదరి దీపిక అట్లాంటాలో ఉంటున్నారు. గత వారం తన తల్లిదండ్రులతో కలిసి వెంకట్ కుటుంబం సోదరి వద్దకు వెళ్లింది. శనివారం వీరంతా సట్టన్ ఫీల్డ్స్‌కు తిరుగు ప్రయాణం కాగా... వెంకట్ కుటుంబం కారులో, అతడి తల్లిదండ్రులు విమానంలో బయలుదేరారు. అక్కడి కాలమానం ప్రకారం ఆ రోజు రాత్రి 10.17 గంటల ప్రాంతంలో కారు అలబామాలోని గ్రీన్ కౌంటీలో ప్రాంతానికి చేరుకుంది. అదే సమయంలో రాంగ్ రూట్‌లో వచ్చిన మినీ ట్రక్కు వీరి కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారుకు నిప్పంటుకోవడంతో వెంకట్ కుటుంబం సజీవ దహనమైంది. విమానంలో డాలస్ చేరుకున్న అతడి తల్లిదండ్రులు ఎంతకూ తమ కుమారుడి కుటుంబం ఇంటికి రాకపోవడంతో ఆరా తీయగా ప్రమాద విషయం తెలిసింది. అలబామా అధికారులు తొలుత డీఎన్ఏ, ఆపై దంతాల నమూనాలు సేకరించడం ద్వారా వెంకట్ సహా నలుగురి గుర్తింపును ధ్రువీకరించాలని భావించారు. అయితే నమూనాలు సైతం సేకరించలేని విధంగా మృతదేహాలు కాలిపోవడంతో అది సాధ్యం కాలేదు. దీంతో అప్పటి పరిస్థితిలతో (సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్) పాటు కారు రిజిస్ట్రేషన్ వివరాలు, అందులో లభించిన మృతదేహాల సంఖ్య తదితరాలను పరిగణలోకి తీసుకుంటూ మృతులను గుర్తించారు. మృతదేహాలను గురువారం కుటుంబీకులకు అప్పగించారు. శుక్రవారం అట్లాంటాలో వారి అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే వెంకట్ తల్లిదండ్రులు అమెరికాలోనే ఉండగా.. తేజస్విని తల్లిదండ్రులు మంగళవారం బయలుదేరి వెళ్లారు.

ఏమిటీ డీఎన్ఏ పరీక్షలు..?

మొన్న అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం... నిన్న సంగారెడ్డిలో సిగాచీ పరిశ్రమలో పేలుడు... తాజాగా అమెరికాలో సజీవదహనమైన హైదరాబాదీ కుటుంబం.... ఈ మూడు సందర్భాల్లోనూ తెరపైకి వచ్చి వాటిలో సారూప్యత కలిగిన అంశం డీఎన్ఏ పరీక్షలు. రూపు కోల్పోయిన మృతదేహాలను గుర్తించడానికి ఈ విధానాన్ని వినియోగిస్తారు. ప్రతి వ్యక్తి శరీరంలో ఉండే కణాల్లో డీఆక్సీరైబో న్యూక్లిక్ యాసిడ్ (డీఎన్ఏ) అనే రసాయనం ఉంటుంది. ఇది ఆ శరీర నిర్మాణం, లక్షణాలు, వంశపారంపర్య సమాచారం తదితర వివరాలు కలిగి ఉంటుంది. డీఎన్ఏ పరీక్షలు చేయడానికి ముందు ఫోరెన్సిక్ నిపుణులు మృతదేహం నుంచి ఎముకలు, వెంట్రుకలు, దంతాలు లేదా సాఫ్ట్ టిష్యూల్లో ఏదో ఒకటి సేకరిస్తారు. దీనిని పోల్చడానికి ఒక రిఫరెన్స్ నమూనా అవసరం ఉంటుంది. దీన్ని తల్లిదండ్రులు, పిల్లలు, సోదరులు తదితరుల నుంచి సేకరిస్తారు. వీటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌ల్లో పరీక్షించడం ద్వారా రెండింటిలో ఉన్న డీఎన్ఏ ఒకటేనా? కాదా? అనేది తేలుస్తారు. మృతదేహాల గుర్తింపుతో పాటు పిల్లల విషయంలో భార్యాభర్తలు లేదా బంధువుల మధ్య ఏర్పడే సందేహాలను నివృత్తి చేయడానికీ డీఎన్ఏ పరీక్షలు చేయిస్తుంటారు. పాశ్చాత్య దేశాల్లో పుట్టిన ప్రతి వ్యక్తికీ సంబంధించిన డీఎన్ఏ, జీనోన్ సీక్వెన్సింగ్‌లతో డేటా బ్యాంక్ ఏర్పాటు చేస్తుంటారు.

నెల రోజుల్లో 25 మంది అరెస్టు

బాధితులకు రూ.3.67 కోట్లు రిఫండ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గత నెలలో వివిధ సైబర్ నేరాలకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో ఆపరేషన్లు నిర్వహించారు. ఆయా కేసుల్లో బ్యాంకు ఖాతాలు అందించిన, సమకూర్చిన వారితో పాటు దళారులతో కలిపి మొత్తం 25 మందిని అరెస్టు చేశారు. మరోపక్క నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయిన మొత్తంలో రూ.3.67 కోట్లు బాధితులకు రిఫండ్ చేయించారు. పట్టుబడిన నేరగాళ్లపై దేశ వ్యాప్తంగా 453 కేసులు నమోదై ఉండగా.. రాష్ట్రంలోని వాటి సంఖ్య 66గా ఉంది. వారి నుంచి 34 మొబైల్ ఫోన్లు, 20 చెక్‌బుక్స్, 17 డెబిట్ కార్డులు, 8 సిమ్‌కార్డులు, 16 బ్యాంక్ పాస్‌పుస్తకాలతో పాటు రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. చైల్డ్ పోర్న్ వీడియోల కేసుల్లోనూ సైబర్ క్రైమ్ పోలీసులు 22 కేసులు నమోదు చేశారు. ఆయా నిందితులు నివసించే ప్రాంతాల్లోని ఠాణాలకు ఈ కేసులను బదిలీ చేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.

పబ్‌లపై ఈగల్ నిఘా

- తరచూ డ్రగ్స్ పార్టీల నిర్వహణ
- పెడ్లర్ సూర్య అరెస్టుతో వెలుగులోకి అనేక అంశాలు
- పలు పబ్‌లు, రెస్టారెంట్ల యజమానులకు నోటీసులు

సాక్షి, సిటీబ్యూరో: కొంపల్లిలోని మల్నాడు రెస్టారెంట్ యజమాని, డ్రగ్ పెడ్లర్ సూర్య అరెస్టుతో సైబరాబాద్ నార్కోటిక్ బ్యూరో ఈగల్ టీం అప్రమత్తమైంది. సూర్య అరెస్టుతో నగరంలోని పలు పబ్‌లలో డ్రగ్ లింకులు బయటపడటంతో పోలీసులు నిఘా పెంచారు. ఈ నెల 7న సైబరాబాద్ నార్కోటిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రెడ్డికి సూర్య తన రెస్టారెంట్‌కు టాటా స్కార్పియో వాహనంలో మాదకద్రవ్యాలతో వస్తున్నాడని సమాచారం అందడంతో తన బృందంతో మల్నాడు రెస్టారెంట్ సమీపంలో నిఘా పెట్టారు. అతడి వాహనాన్ని తనిఖీ చేయగా 3.2 గ్రాముల ఓజీ వీడ్, 1.6 గ్రాముల ఎక్స్‌టసీ మాత్రలు, 10 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. వాటిలో కొంత భాగాన్ని కొరియర్ ద్వారా డెలివరీ చేసిన ఒక మహిళ పాదరక్షల్లో దాచి పెట్టారు. విచారణ సమయంలో సూర్య హైదరాబాద్‌లోని ప్రముఖ పబ్బులలో నిర్వహించే పార్టీల ద్వారా క్రమం తప్పకుండా డ్రగ్స్ సేవించి పంపిణీ చేస్తున్నట్లు అంగీకరించాడు. వీటిల్లో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ప్రిజం పబ్, జూబ్లీహిల్స్‌లోని ఫార్మ్ పబ్, మాదాపూర్‌లోని బర్డ్ బాక్స్, హైటెక్ సిటీలోని బ్లాక్ 22 వంటివి ఉన్నాయి. ఆయా పబ్‌లలో డ్రగ్స్‌ను ఉపయోగించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారని, నైజీరియా, ఢిల్లీలోని ఇతర ప్రాంతాల నుంచి విదేశీ డ్రగ్ పెడ్లర్ల నుంచి డ్రగ్స్ సేకరించి, పార్టీలు నిర్వహిస్తున్నట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. దీంతో పబ్ యజమానులు రాజా శ్రీకర్, పృథ్వీ వీరమాచినేని, రోహిత్ మెడిశెట్టిల ప్రమేయం ఉన్నట్లు సూర్య పోలీసుల ముందు అంగీకరించాడు. దీంతో ఆయా పబ్‌లపై కేసులు నమోదు చేసిన పోలీసులు.. వాటి యజమానులకు నోటీసులు జారీ చేసింది. వచ్చే వారం విచారణ కోసం యజమానులను సమన్లు జారీ చేశారు. త్వరలోనే మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

నిమ్స్ బాత్‌రూమ్‌లో మృతశిశువు

ఓపీ బిల్డింగ్‌లోని మహిళల టాయిలెట్‌లో ఘటన

లక్డీకాపూల్ : నిమ్స్ ఆస్పత్రిలో మృతశిశువు ఉదంతం కలకలం రేపింది. గురువారం ఈ ఘటన నిమ్స్ ఓపీడీ బ్లాక్ బాతురూమ్‌లో వెలుగుచూసింది. నిమ్స్ సిబ్బంది కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిమ్స్ ఆర్థోపెడిక్ విభాగం సమీపంలోని మరుగుదొడ్డిలో నీళ్ల జామ్ కావడంతో శుభ్రం చేసేందుకు అక్కడికి వెళ్లిన ఆస్పత్రి పారిశుద్ధ్య సిబ్బంది బాత్‌రూంలో అప్పుడే పుట్టిన మగ శిశువు మృతదేహాన్ని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై ఆస్పత్రి పాలన విభాగం అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు. మృతశిశువును ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ సంఘటనపై నిమ్స్ డైరెక్టర్ బీరప్ప సమగ్ర దర్యాప్తునకు ఆదేశించినట్టు సమాచారం. కాగా శిశువు అవయవ నిర్మాణం లోపభూయిష్టంగా ఉండడమే కాకుండా పొట్ట భాగంలో ఉండాల్సిన పేగులు బొడ్డు వద్ద బయటకు కనిపిస్తున్నాయి. జన్యుపరమైన సమస్యతో శిశువు జన్మించి మృతి చెంది ఉండవచ్చని నిమ్స్ వర్గాలు భావిస్తున్నాయి.

అమెజాన్‌కు మొట్టికాయ

- బాధితుడికి రూ.35వేల నష్టపరిహారం ఇవ్వాల్సిందే
- ఈ మొత్తాన్ని 45 రోజుల్లో చెల్లించాలి
- జిల్లా వినియోగదారుల ఫోరం–1 ఆదేశం

సిటీ కోర్టులు : ఆన్‌లైన్‌లో అమెజాన్ ద్వారా ప్రొడక్ట్ కొనుగోలు చేసిన కస్టమర్‌కు సరైన సమయంలో సర్వీస్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం ముమ్మటికీ అమెజాన్ కంపెనీ సర్వీస్ లోపమేనని హైదరాబాద్ జిల్లా వినియోగదారుల ఫోరం–1 కమిషన్ అభిప్రాయపడింది. బాధితుడు చెల్లించిన రూ.20 వేలు, మానసిక ఇబ్బందులకు గురి చేసినందుకు రూ.10 వేలు, కోర్టు ఖర్చుల కోసం మరో రూ.5వేలు మొత్తం రూ.35వేల నష్టపరిహారాన్ని 45 రోజుల్లోపు చెల్లించాలని హైదరాబాద్ వినియోగదారుల ఫోరం–1 అధ్యక్షురాలు ఉమా వెంకటసుబ్బాలక్ష్మి, మెంబర్లు సి.లక్ష్మీప్రసన్న, డి.మాధవిలతతో కూడిన బెంచ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

20వేలు పెట్టి కొన్నా రెండు రోజులు పనిచేయలేదు..

యుసుఫ్‌గూడకు చెందిన గజ్జెల శ్రీనివాస్ బోట్ కంపెనీ ప్రొడక్ట్ 5500 డీఏ సౌండ్‌బార్‌ను ఆన్‌లైన్ ద్వారా అమెజాన్ నుంచి రూ.20వేలతో కొనుగోలు చేశాడు. అయితే అది పని చేయకపోవడంతో కంపెనీకి ఫిర్యాదు చేయగా టెక్నీషియన్ వచ్చి అది సరిగ్గా లేదని దానిని తిరిగి తీసుకొని మరో ప్రొడక్ట్‌ను ఆర్డర్ పెట్టారు. అదేరోజు కొత్త ప్రొడక్ట్ వచ్చింది.. అదికూడా సరిగ్గా పని చేయకపోవడంతో బాధితుడు తన డబ్బులు తనకు తిరిగి ఇవ్వాలని లేదా మంచి ప్రొడక్ట్‌ను ఇవ్వాలని ఫిర్యాదు చేయడంతో పాటు పలు మార్లు ఫోన్ చేశారు. దీనికి కంపెనీ వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అతను వినియోగదారుల ఫోరంలో కేసు దాఖలు చేశారు. హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్–1 విచారణ చేపట్టింది. వెంటనే ప్రత్యర్థికి నోటీసులు జారీ చేయగా వారు కౌంటర్ దాఖలు చేశారు. అనంతరం ఇరువురి వాదనలు విన్న కమిషన్ అమెజాన్ కంపెనీ సరైన సర్వీస్ ఇవ్వకపోగా బాధితుడి ఫిర్యాదు కూడా తీసుకోకుండా మానసికంగా ఇబ్బందులకు గురిచేసినందుకు నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. పైన పేర్కొన్న మొత్తాన్ని 45 రోజుల్లోపు 9 శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జడ్సీ లాగిన్ ఓపెన్ చేసేందుకు యత్నం

విధుల నుంచి ఆపరేటర్ తొలగింపు

గచ్చిబౌలి: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖాడే లాగిన్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్‌లో సెక్షన్ రైటర్‌గా ఉన్న అభిలాష్ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు రోజుల క్రితం రాత్రి అతను శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్‌లో కమిషనర్ హేమంత్ బోర్ఖాడే లాగిన్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించాడు. జడ్సీ ఫోన్‌కు ఓటీపీ వెళ్లడంతో అప్రమత్తమైన ఆయన అంతర్గత విచారణ చేపట్టగా అభిలాష్‌కు చెందిన ఐడీగా నుంచి ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. అభిలాష్‌పై చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్ జోనల్ కమిషనర్‌కు లేఖ రాశారు. దీంతో జోనల్ కమిషనర్ సంబంధిత ఏజెన్సీకి అతడిని సరెండర్ చేశారు. జోనల్ కమిషనర్ లాగిన్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించడం చర్చనీయాంశంగా మారింది. అవినీతికి కేరాఫ్‌గా మారిన టైన్‌ప్లానింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్, ప్రైవేట్ సిబ్బంది తరచూ అధికారుల లాగిన్‌లను వాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఏసీబీ వలలో మహిళా పీఎస్ ఎస్ఐ



ఎస్ఐ వేణుగోపాల్

గచ్చిబౌలి: ఓ కేసులో పేరు తొలగించేందుకు డబ్బులు తీసుకుంటూ గచ్చిబౌలి ఉమెన్ పీఎస్ ఎస్ఐ వేణుగోపాల్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే..కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ భర్తతో పాటు అత్తింటి వారిపై గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇరు పక్షాలను పిలిచి మాట్లాడారు. గృహహింస కేసులో తల్లి పేరును తొలగించేందుకు ఎస్ఐ వేణు గోపాల్ రూ.25 వేలు డిమాండ్ చేశాడు. దీంతో సదరు మహిళ భర్త ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వేణు గోపాల్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ హైదరాబాద్ రేంజ్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో దాడి చేసిన పోలీసులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు.

బల్దియాలో బదిలీలు

సాక్షి,సిటీబ్యూరో: ఇటీవల పలువురు మునిసిపల్ కమిషనర్లు పదోన్నతులు పొందిన నేపథ్యంలో జీహెచ్ఎంసీలోనే పని చేస్తున్న వారిని ఇతర సర్కిళ్లకు బదిలీ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయినవారు , పోస్టింగ్‌లు పొందిన వారు మొత్తం 23 మంది ఉన్నారు. వీరిలో సర్కిళ్లలో కీలక అధికారులైన డిప్యూటీ కమిషనర్ల (డీసీ)పోస్టింగ్‌లు ఇలా ఉన్నాయి.

- చార్మినార్ జోన్‌లో డిప్యూటీ కమిషనర్(డీసీ)గా పని చేస్తున్న మహ్మద్ సాబేర్, కార్వాన్ సర్కిల్ డీసీగా అహ్మద్ షఫీయుల్లా, చందానగర్ డీసీగా డి.శశిరేఖ, మలక్‌పేట డీసీగా ఎంకేఐ అలీ, ఖైరతాబాద్ డీసీగా ఎస్.జయంత్, యూసుఫ్‌గూడ డీసీగా జి.రజనీకాంత్‌రెడ్డి, మల్కాజిగిరి డీసీగా జకియా సుల్తానా, ఉప్పల్ డీసీగా జి.రాజు, సికిందరాబాద్ డీసీగా జి.ఆంజనేయులు, గోషామహల్ డీసీగా జి.ఉమాప్రకాశ్, ఎల్బీనగర్ డీసీగా కె.మల్లికార్జునరావు, మూసాపేట డీసీగా సేవా ఇస్లావత్, హయత్‌నగర్ డీసీగా బి.వంశీకృష్ణ, బేగంపేట డీసీగా డి.ఢాకునాయక్‌లను నియమించారు.
- సి.అరుణకుమారిని ఫలక్‌నుమా డీసీగా, కె.రవికుమార్‌ను రాజేంద్రనగర్ డీసీగా యథాస్థానంలో ఉంచారు. బి.యాదయ్యను ఎస్టేట్ ఆఫీసర్‌గా, డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీస్ జేసీగా నియమించారు.పద్మను అడ్వర్టయిజ్‌మెంట్ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు.

నీలమణిపై మక్కువ నిండా ముంచింది!

- హైదరాబాదీ నవాబ్‌ను మోసం చేసిన కశ్మీరీలు
- రూ.3 కోట్లు తీసుకుని నకిలీది అంటగట్టిన వైనం
- ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన జమ్మూ పోలీసులు
- రూ.65 లక్షలు రికవరీ... ఆస్తుల స్వాధీనానికి సన్నాహాలు



సాక్షి, సిటీబ్యూరో: కాశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలోని పాడ్దర్ ప్రాంతంలోని ఎత్తైన పర్వతాల్లో దొరికే నీలమణికి ప్రపంచంలోనే మంచి డిమాండ్ ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న ఇద్దరు కాశ్మీరీలు హైదరాబాద్‌కు చెందిన నవాబ్ మీర్ ఫిరాసత్ అలీ ఖాన్‌కు రూ.3 కోట్ల మేర టోకరా వేశారు. గత ఏడాది జరిగిన ఈ మోసంపై ఆయన జమ్మూలోని బహుఫోర్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీన్ని దర్యాప్తు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.65 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాన్ని కోర్టు ద్వారా బుధవారం నవాబ్ మీర్ ఫిరాసత్‌కు అందించారు. అలీ ఖాన్‌కు విలువైన మణులు, రత్నాలు సేకరణ హాబీగా ఉంది. దీనికోసం ఆయన దేశ విదేశాలకు చెందిన వ్యాపారులను సంప్రదిస్తుంటారు. ఈ విషయం తెలిసిన జమ్మూలోని రాజౌరికి చెందిన మహ్మద్ రాయజ్, పూంచ్ వాసి మహ్మద్ తాజ్ ఖాన్ పథకం ప్రకారం ఫిరాసత్‌ను సంప్రదించారు. పలుమార్లు హైదరాబాద్ వచ్చిన వెళ్లిన వారు తమ వద్ద విలువైన నీలమణి, అలాంటి మణులతో చేసిన ఆభరణాలు ఉన్నాయంటూ నమ్మబలికారు. తొలుత ఓ మణి ఖరీదు చేయడానికి ఆసక్తి చూపిన ఫిరాసత్ రూ.3 కోట్లు చెల్లించారు. అతడిని గత ఏడాది నవంబర్‌లో రాజౌరీకి పిలిపించిన వారు నకిలీ మణి అప్పగించారు. మరికొన్ని ఆభరణాల విక్రయం కోసం రూ.25 కోట్లకు బేరసారాలు చేశారు. ఆ ద్వయం అందించిన నీలమణిని పరీక్షించిన ఫిరాసత్ నకిలీదని గుర్తించారు. దీనిపై జమ్మూలోని బహు ఫోర్ట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు నిందితుల కోసం వేట ప్రారంభించారు. సుదీర్ఘకాలం అజ్ఞాతంలో ఉన్న ఈ ద్వయం గత వారం చిక్కింది. వీరి నుంచి రూ.65 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కోర్టుకు అప్పగించారు. న్యాయస్థానం అనుమతితో ఆ మొత్తాన్ని బాధితుడికి చేర్చారు. నిందితుల నుంచి పోలీసులు మరికొన్ని నకిలీ నీలమణులు పొదిగిన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఫిరాసత్ నుంచి కాజేసిన మొత్తం వెచ్చించి వారు నిందితులు జమ్మూ, కాశ్మీర్‌లో ఆస్తులు ఖరీదు చేసినట్లు పోలీసులు గుర్తించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని (బీఎన్ఎస్ఎస్) 107 సెక్షన్ ప్రకారం ఇలాంటి ఆస్తులను జప్తు చేసే అధికారం పోలీసులకు ఉంది. దీంతో ఆ కోణంలో చర్యలు తీసుకుంటున్నారు.

చైన్ స్నాచర్ల ఆటకట్టు

- బీటెక్ చదువుతున్నప్పటినుంచే స్నాచింగ్‌లు
- నిందితుల్లో ఒకరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ గోవర్ధన్

అమీర్‌పేట: వారిద్దరూ స్నేహితులు.. బీటెక్ చదువుతున్నప్పటినుంచే చైన్ స్నాచింగ్‌లకు అలవాటు పడ్డారు. ప్రస్తుతం నగరంలో ఉంటూ ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా తమ వైఖరి మార్చుకోలేదు. ఎస్ఆర్‌నగర్‌లో స్నాచింగ్‌కు పాల్పడగా 24 గంటల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ టి.గోవర్ధన్ వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాకు లీలా కృష్ణ ప్రసాద్, కోల దినేష్ స్నేహితులు. 2021లో వారు బీటెక్ చదువుతుండగానే గుంటూరులో మూడు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ప్రస్తుతం కృష్ణ ప్రసాద్ టెక్ మహీంద్రలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, దినేష్ అమీర్‌పేటలోని ఓ కోచింగ్ సెంటర్‌లో సాఫ్ట్‌వేర్ కోర్సు నేర్చుకుంటున్నాడు. ఇద్దరూ కలిసి ఎస్ఆర్ నగర్‌లోని గౌతమి గ్రాండ్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నారు. బుధవారం ఉదయం వారు బైక్‌పై బంజారాహిల్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. మధ్యాహ్నం ఎస్ఆర్‌నగర్ బీకేగూడలోని ఓ టీ స్టాల్ వద్దకు చేరుకున్నారు. దినేష్ అక్కడే నిల్చుండగా కృష్ణ ప్రసాద్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని 5 తులాల పుస్తెల తాడు లాక్కెళ్లాడు. అనంతరం ఇద్దరు బైక్‌పై పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేసి వారి బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్‌లకు అలవాటు పడిన వీరు స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏసీపీ రాఘవేంద్రరావు, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

శాకాంబరీ దేవిగా విజయ కనకదుర్గా దేవి



బంజారాహిల్స్: ఆషాఢ మాసం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం-12లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన శ్రీ విజయ కనక దుర్గా దేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారిని వివిధ రకాల పండ్లు, పూలు, కూరగాయలతో అలంకరించారు. శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.

భక్తిశ్రద్ధలతో వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఫిలింనగర్: గురు పౌర్ణమి సందర్భంగా ఫిలింనగర్‌లోని దైవసన్నిధానంలో ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు శ్రీ రమాసమేత సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ప్రతీ పౌర్ణమికి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నామన్నారు.

బోరబండలో మెగా హెల్త్ క్యాంపు

రహమత్‌నగర్: బోరబండ డివిజన్ తుర్రేబాజ్ ఖాన్ కమ్యూనిటీ హాల్లో గురువారం మాన్సూన్ మెగాహెల్త్ క్యాంపు నిర్వహించారు.ఈ శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుభాన్, షంషీర్‌బేగ్, హీనా, నాయకులు హబీబాసుల్తానా, కవిత, మహేశ్వరి పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్ చేస్తే ఇంటికే చలాన్!

అందుబాటులోకి రానున్న స్మార్ట్ పార్కింగ్‌లు	సర్కిల్‌కు 30 చొప్పున ఏర్పాటు..	ఖైరతాబాద్ జోనల్ పరిధిలో మొదలైన ప్రక్రియ	గంటకు రూ.25 చొప్పున వసూలు

బంజారాహిల్స్: రోడ్ల పక్కన స్థలం ఖాళీగా ఉంది కదా అని.. జీహెచ్‌ఎంసీ పార్కుల ముందు పార్కింగ్ సదుపాయం ఉంది కదా..! అని ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేసి వెళ్తే జీహెచ్‌ఎంసీ ఇంటికే చలాన్లు పంపిస్తుంది. ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై, పార్కు ల పక్కన అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేస్తూ జారుకుంటే జీహెచ్‌ఎంసీ ఇక నుంచి చూస్తూ ఊరుకోదు. ఇందుకోసం స్మార్ట్ పార్కింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తుంది. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్ సర్కిల్-17, జూబ్లీహిల్స్ సర్కిల్-18, గోషామహల్, కార్వాన్, మెహిదీపట్నం తదితర ఐదు సర్కిళ్ల పరిధిలో స్మార్ట్ పార్కింగ్‌లను అందుబాటులోకి తీసుకురానుంది.

30 చోట్ల ఏర్పాటు

ఒక్కో సర్కిల్ పరిధిలో 30 చోట్ల స్మార్ట్ పార్కింగ్‌లను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సింగపూర్ సిటీ తరహా ఇక్కడ కూడా స్మార్ట్ పార్కింగ్‌లను ఏర్పాటు చేయడమే కాకుండా ఇందుకోసం అనుభవం ఉన్న రెండ ఏజెన్సీలను ఎంపిక చేశారు. ఈ రెండు ఏజెన్సీలు ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్మార్ట్ పార్కింగ్‌లు ఎలా ఉండబో



స్మార్ట్ పార్కింగ్‌లపై అధికారులతో చర్చిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్‌జయంతి

తున్నాయో, ఛార్జీలు ఎలా వసూలు చేస్తారో, చలానాలు ఎలా పంపిస్తారో అధికారులకు వివరించాయి. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఎస్ఈ రత్నాకర్, ఐటీ జాయింట్ కమిషనర్, ఆయా సర్కిళ్ల ఇంజినీర్లతో సమావేశమై స్మార్ట్ పార్కింగ్ వల్ల ప్రయోజనాలు వివరించడం జరిగింది. ముఖ్యంగా ఖైరతాబాద్, పంజగుట్ట, అమీర్‌పేట, ఎస్సార్‌నగర్ ప్రధాన రోడ్లలో గంటల తరబడి అక్రమ పార్కింగ్‌ల చేయడం వల్ల ఏర్పడుతున్న నష్టాలను చర్చించారు. ఈ జాతీయ రహదారిలో ఫుట్‌పాత్‌లతో పాటు రోడ్ల పక్కన, జీహెచ్‌ఎంసీ ఖాళీ స్థలాల్లో అక్రమ పార్కింగ్‌లు చేయడం వల్ల తీవ్ర నష్టాలు ఎదురవుతున్నట్లు గుర్తించారు.

సమయాన్ని బట్టి చార్జీలు..

జీహెచ్‌ఎంసీ గుర్తించిన 30 స్మార్ట్ పార్కింగ్‌లలో వాహనాలు పార్కింగ్ చేసే వారి నుంచి గంటకు రూ.25 చొప్పున వసూలు చేస్తారు. వాహనం నెంబర్ ఆధారంగా ఇంటికే చలానా వెళ్తుంది. సదరు వాహనదారుడు ఆన్‌లైన్‌లో ఛార్జీలు చెల్లించుకోవడానికి అవకాశం కల్పించారు. సంబంధిత ఏజెన్సీలు తమకు అనుసంధానమై ఉన్న స్మార్ట్ పార్కింగ్ యాప్ ద్వారా ఏ వాహనం ఎక్కడ పార్కింగ్ చేసి ఉందో గుర్తించి సమయాన్ని బట్టి ఛార్జీలు పంపిస్తారు. స్మార్ట్ పార్కింగ్స్‌లో సోలార్ ప్యానెళ్ల ద్వారా ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పాయింట్లను కూడా ఏర్పాటుచేయనున్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తారు. అక్రమంగా పార్కింగ్ చేసిన వారికి ఆన్‌లైన్‌లో చలానాలు పంపించనున్నారు. కొన్నిచోట్ల రోడ్ల పక్కన ఖాళీగా ఉన్న ప్రైవేటు స్థలాల్లో కూడా జీహెచ్‌ఎంసీ అద్దెకు తీసుకుని స్మార్ట్ పార్కింగ్‌ను ఏర్పాటు చేయనుంది. వసూలు చేసిన ఛార్జీల్లోనే ప్రైవేటు వ్యక్తులకు అద్దెలు చెల్లిస్తారు. ఒక వాహనం ఏ సమయం నుంచి ఏ సమయం దాకా పార్కింగ్ చేశారో ఏఐ ద్వారా తెలుసుకోనున్నారు. సదరు ఏజెన్సీలే ఈ పార్కింగ్‌ను నిర్వహించనున్నాయి.

కల్తీ కల్లుపై నిఘా కరువు!

విచ్చలవిడిగా కాంపౌండ్‌ల నిర్వహణ

బంజారాహిల్స్: కూకట్‌పల్లిలో కల్తీకల్లు తాగి పలువురు మృతి చెందగా మరికొంతమంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటనలు తీవ్రంగా కలచివేస్తున్నాయి. ఎక్సైజ్ పోలీసుల నిర్వాకంతోనే ఈ ఘటనలు చోటు చేసుకుంటుండగా ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోనూ లైసెన్స్ లేకుండానే కొన్ని కల్లు కాంపౌండ్‌లు కొనసాగుతుండగా, దాదాపు అన్నింట్లోనూ ఆల్ప్రాజోలంతో తయారు చేసిన కల్తీ కల్లును విక్రయిస్తున్నట్లు గతంలోనే బంజారాహిల్స్, ఖైరతాబాద్ తదితర పోలీస్‌స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని ఇందిరానగర్‌లో కల్తీ కల్లు తాగి ఇద్దరు మృతి చెందగా బంజారాహిల్స్ పోలీసులు ఈ కల్లు కాంపౌండ్‌ను సీజ్ చేశారు. అయితే కల్లు కాంపౌండ్ నిర్వాహకుల ఒత్తిడితో భారీగా మామూళ్లు పంచడంతో ఇటీవల ఈ దుకాణం తెరుచుకుంది. కొన్ని కల్లు కాంపౌండ్లకు లైసెన్స్ కూడా లేదని ఇటీవల పోలీసులకు ఫిర్యాదులు కూడా అందాయి. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో నడుస్తున్న కల్లు కాంపౌండ్‌లో అల్ప్రాజోలంతోనే కల్లు తయారుచే స్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. కూకట్‌పల్లి ఘటనతో ఇక్కడ అమీర్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ఎక్సైజ్ పోలీసులు ఇంకా కళ్లు తెరవలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం ఉండే ఖైరతాబాద్ నియోజకవర్గంలో కల్లు కాంపౌండ్‌లపై కేసులు నమోదవుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.

కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు



కల్లు కాంపౌండ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బంజారాహిల్స్: కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటన నేపథ్యంలో అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులు వివిధ కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు నిర్వహించారు. అమీర్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎస్ఐలు రాధ, వాణి, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, కానిస్టేబుల్ శ్రీశైలం గురువారం తచింతల్ బస్తీ పరిధిలోని ఫిలింనగర్ కల్లు కాంపౌండ్‌లో తనిఖీలు నిర్వహించిన శాంపిళ్లను సేకరించారు. అలాగే అమీర్‌పేట, బోరబండ, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో కూడా కల్లు కాంపౌండ్‌లలో తనిఖీలు నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ పటేల్ బానోత్ తెలిపారు.

సత్యసాయి నిగమాగమంలో వైద్య శిబిరం

శ్రీనగర్‌కాలనీ: చేనేత కళాకారులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యం పట్ల ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమని కార్డియాలజిస్ట్ డాక్టర్ టిప్పు సుల్తాన్ అన్నారు. గురువారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత వస్త్రప్రదర్శనలోని చేనేత కళాకారులకు జయంతి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న టిప్పు సుల్తాన్

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న హిమబిందుసింగ్, కృష్ణమూర్తి

శ్రీనగర్‌కాలనీ: నేటి ఆధునిక జీవనంలో అడల్‌సెంట్ రేటు పెరుగుతుందని, 09-18 ఏళ్ల పిల్లలు మానసిక, శారీరక, డిజిటల్ డిప్రెషన్‌తో బాధపడుతున్నారని, వారికి సన్మార్గంలో నడిపించేలా చేయడమే అడల్‌సెంట్ హెల్త్ అకాడమీ లక్ష్యమని అకాడమీ జాతీయ చైర్మన్ డాక్టర్ హిమబిందు సింగ్, ఆర్గనైజింగ్ చైర్ పర్సన్ డాక్టర్ కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.నౌనిహాల్ సింగ్ పేర్కొన్నారు. గురువారం శ్రీనగర్‌కాలనీలోని తన్వీర్ హాస్పిటల్‌లో ఈ నెల 12, 13 తేదీలలో లక్డీకపూల్‌లోని అడోబ్ హోటల్‌లో నిర్వహించనున్న సెంట్రల్ జోన్ అడల్‌సెంట్ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ని అకాడమీ ఆర్గనైజింగ్ ట్రెజరర్ డాక్టర్ ఎస్.రవికుమార్, సెక్రటరీ డాక్టర్ ఎస్ఎల్ శ్రీధర్‌తో కలిసి ఆవిష్కరించారు.

గుంతలమయంగా రహదారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ రోడ్డునెంబర్-9 అంబేడ్కర్‌నగర్ బస్తీలో గుంతలమయమైన రహదారులతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదిన్నర క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణం కోసం ఇక్కడ రోడ్డును తవ్వి పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత రోడ్డు వేయాల్సి ఉండగా జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ డివిజన్ ఇంజినీర్లు నిర్లక్ష్యం వహించారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ రోడ్డు వేయాలంటూ మొర పెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిలింనగర్‌లో రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయని ఇటీవల బస్తీవాసులు ఏకంగా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.



శుభాకాంక్షలు

శ్రీనగర్‌కాలనీ: హైదరాబాద్ జిల్లా నూతన ఇన్‌చార్జిగా నియమితులైన జగ్గారెడ్డిని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జగ్గారెడ్డి నేతృత్వంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఉప ఎన్నికలు, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు.



అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్‌లో కొనసాగుతున్న వాటర్ వర్క్స్, తదితర పనులను కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పర్యవేక్షించారు. గురువారం స్ట్రీట్ నెం-14 లోని రేయిన్ వాటర్, డ్రైనేజీ సమస్యలను తొలగించడానికి చేపట్టిన పనులతో స్థానికులకు ఇబ్బందులు రాకుండా చూడాలని జలమండలి, మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. స్ట్రీట్ నెం-7లోని సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ వెంట రామన్‌గౌడ్, మహేష్, జాకీ, జైస్వాల్, అజర్, అఖిల్, అభిషేక్ ఉన్నారు.

టైమర్ బాక్స్‌కు మరమ్మతు చేయాలి



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్ స్ట్రీట్‌నెంబర్-17లో గత నెల రోజుల నుంచి టైమర్ పనిచేయడం లేదని, ఫీజులు కూడా కాలిపోయానని, దీంతో ఇక్కడ ఉన్న వీధిదీపాలు వెలగడం లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. గత నెల రోజుల నుంచి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 100 స్ట్రీట్‌లైట్లు వెలగకపోవడంతో బస్తీలో అంధకారం నెలకొందని ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



బంజారాహిల్స్: గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని జూబ్లీహిల్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లో మెట్రో పిల్లర్ నెంబర్ సీ-1684 సమీపంలోని బస్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు 108 సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహంపై రెండు చోట్ల గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడికి 35-40 ఏళ్ల ఉంటుందని ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి



రహమత్‌నగర్: మహిళాభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎస్పీఆర్‌హిల్స్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రుణాలు, వివిధ రకాల సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్-19 డీఎంసీ జకీయా సుల్తానా, వివిద శాఖలకు చెందిన అధికా రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఈఎస్ఐసీలో సర్వర్ డౌన్

అమీర్‌పేట: సర్వర్ డౌన్ కారణంగా సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రిలో వైద్య సేవలు నిలిచి పోయాయి. వైద్యం కోసం వచ్చిన వందలాది మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రిలో గురువారం అన్ని రకాల ఓపీ సేవలు అందుబాటులో ఉడటంతో ఉదయం 7 గంటల నుంచే రోగులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకుని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు క్యూలైన్లలో నిలుచున్నారు. సర్వర్ డౌన్ వల్ల ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌లు జరగక పోవడంతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

రెండు గంటలు స్లిప్పులు ఇచ్చి కౌంటర్ల మూసివేత :
సాధారణంగా ప్రతి రోజూ ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం ద్వారా ఓపీలో స్లిప్పులు జారీ చేస్తారు.అయితే సర్వర్ గౌడ్‌తో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. చేసేదేమి లేక ఉదయం11 గంటలకు ఆఫ్‌లైన్ ఓపీ స్లిప్పుల జారీ ప్రక్రియ ప్రారంభించారు. మధ్నాహ్నం ఒంటి గంట వరకు స్లిప్పులు ఇచ్చి కౌంటర్లను మూసివేయడంతో కార్మికులు ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

బంజారాహిల్స్: గురుపౌర్ణమి సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలోని సాయిబాబా ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని విశ్వసాయి మందిరంలో బాబాకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్న హారతిని ఘనంగా నిర్వహించారు. ఫిలింనగర దైవసన్నిదానంలోని సాయిబాబాకు సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంజగుట్ట ద్వారాకపురి కాలనీలోని శ్రీ సాయిబాబా ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

బోరబండలో..
రహమత్‌నగర్: గురుపౌర్ణమి సందర్భంగా గురువారం బోరబండలోని సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువులు విజ్ఞానాన్ని అందించి, ప్రయోజకులు చేస్తారన్నారు.



మాట్లాడుతున్న బాబా ఫసియుద్దిన్



ఫిలింనగర్ దైవసన్నిదానంలో బాబా పూజల్లో పాల్గొన్న రచయిత పరుచూరి గోపాలకృష్ణ

ఈపూజల్లో ఆలయ చైర్మన్ ఆనంద్, నాయకులు కాసుల మహేష్ కుమార్ గౌడ్, చెట్టి దేవేందర్, బాలరాజ్‌గౌడ్, రవీందర్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

శాలివాహననగర్‌కాలనీలో..
శ్రీనగర్‌కాలనీ: వ్యాస మహర్షి, శంకరాచార్యులు లాంటి ఎంతో మంది గురువుల మార్గదర్శకాలతో భారత దేశం ధర్మాన్ని పాటిస్తూ సుభిక్షంగా ఉందని బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు అన్నారు. గురువారం శాలివాహననగర్‌కాలనీలోని కమ్యూనిటీహాల్లో నిర్వహించిన గురుపౌర్ణిమ వేడుకల్లో ఆయన పాల్గొని యోగా గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటన్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు గౌతమ్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

వేధింపుల కేసులో నిందితుడి అరెస్ట్



ఫిలింనగర్: మాజీ ప్రియురాలి వెంటపడి వేధిస్తున్న కేసులో నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..కరీంనగర్ జిల్లా, మాచన్‌పల్లి గ్రామానికి చెందిన బొల్లేపల్లి సాయికుమార్ అలియాస్ కిరణ్ బోయిగూడలో ఉంటూ ముషీరాబాద్‌లోని ఓ వైన్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం అతడికి షేక్‌పేటకు చెందిన యువతి (26)తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. కొన్నాళ్లు వీరిద్దరూ స్నేహంగా ఉన్నారు. ఏడాది క్రితం ఆమెకు మరొకరితో వివాహం జరిగింది. అంతకు ముందే కిరణ్‌కు ఆమె బ్రేకప్ చెప్పింది. గత కొంతకాలంగా కిరణ్ మళ్లీ ఆమెను వెంటపడి వేధించడమే కాకుండా తన దగ్గరకు రాకపోతే అంతు చూస్తానని బెదిరించసాగాడు. ఆమె ఫోటోలను వైరల్ చేస్తానంటూ బ్లాక్‌మెయిలింగ్ చేయసాగాడు. రెండు రోజుల క్రితం ఆమె పనిచేస్తున్న డెంటల్ క్లినిక్‌కు వెళ్లి తీవ్రంగా కొట్టి తనతో బైక్‌పై కూర్చోవాలంటూ హింసించాడు. దీంతో ఆమె తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిలింనగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఓయూ దూరవిద్య ప్రవేశ ప్రకటనలో జాప్యం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య ప్రవేశ ప్రకటన విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా తదితర కోర్సుల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఓయూ అధికారులు ఇంత వరకు నోటిఫికేషన్ జారీ చేయలేదు. ఇతర వర్సిటీ దూరవిద్య కేంద్రాలు, ఇందిరా గాంధీ (ఇగ్నో), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాలు సైతం నోటిఫికేషన్లు విడుదల చేసి ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించారు. నోటిఫికేషన్ వివరాల కోసం ప్రతిరోజు 200 నుంచి 250 మంది వరకు అభ్యర్థులు ఓయూ దూర విద్య కేంద్రానికి ఫోన్ చేస్తున్నారు. అయినా అధికారులు నోటిఫికేషన్ విడుదలలో జాప్యాన్ని ప్రదర్శిస్తున్నారు. తక్షణం నోటిఫికేషన్‌ను జారీ చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

అంబేడ్కర్ వర్సిటీ బీఎల్ఐఎస్సీ పరీక్షలు వాయిదా

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరగాల్సిన బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే పరీక్ష తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు విద్యార్థులు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని లేదా వారి సంబంధిత అధ్యయన కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన

అదనపు భవనం నిర్మించాలని కలెక్టర్‌కు సూచించిన చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్



రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ ఈవీఎంల గోడౌన్స్‌లో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రి గదులను గురువారం రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సి.సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈఓ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పునర్విభజనలో భాగంగా భవిష్యత్తులో జిల్లాలో నియోజకవర్గాల సంఖ్య పెరగనున్నందున ఈవీఎంలు భద్రపరిచేందుకు అదనపు భవనం నిర్మించాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ త్వరలో కొత్త భవనం నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి బొమ్మ రాములు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల/కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తాత్కాలిక ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు ఆ విభాగం రంగారెడ్డి జిల్లా కో ఆర్డినేటర్ యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషల్ స్టడీస్ సబ్జెక్టు బోధించేందుకు పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారి నుంచి ఈ నెల 11 నుంచి 14 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మన్సూరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.

డబుల్ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

లక్డీకాపూల్: ప్రధానమంత్రి కార్యాలయ డైరెక్టర్ మనీత్ కౌర్ గురువారం జీహెచ్ఎంసీ పరిధిలోని పలు 2బీహెచ్‌కే గృహ నిర్మాణ ప్రాజెక్టులను పరిశీలించారు. కొల్లూరు ఫేస్–2లో నిర్మించిన 15,660 గృహాలు, దూల నాగపల్లిలో నిర్మించిన 1,544 గృహాలను సందర్శించారు. ఆమె వెంట జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రవీణ్, హౌసింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు. లబ్ధిదారులతో ముఖాముఖీ చర్చించి వారికి అందుతున్న వసతులు, ఆరోగ్య సేవలు, విద్యా సౌకర్యాలు, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. బుధవారం న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన డైరెక్టర్‌కు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఇలంబర్తి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హౌసింగ్ ఎం.డి. గౌతమ్ పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఇందిరానగర్, బన్సీలాల్‌పేట్, జీవీఎం కాలనీల్లో నిర్మించిన రెండు పడకల గృహ సముదాయాలను కూడా ఆమె సందర్శించారు. ఆమె హౌసింగ్ మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో సెక్రటేరియట్‌లో సమీక్ష చేశారు.

12న ఐసీజేసీ ఉచిత కెరీర్ కౌన్సెలింగ్

హైదరాబాద్: ఇంటర్మీడియెట్, ప్లస్ టువిద్యార్థుల కోసం ఈ నెల 12న ఉచితంగా కెరీర్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ క్రిస్టియన్ జర్నలిస్ట్స్ కలెక్టివ్(ఐసీజేసీ) అధ్యక్షుడు డాక్టర్ కె.స్టీవెన్‌సన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనికార్పస్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో సికింద్రాబాద్‌లోని వెస్లీ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో శనివారం ఉదయం జరుగుతుందని పేర్కొన్నారు. మెడికల్, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఆర్కిటెక్చర్ విద్య కోర్సులు, ఉపాధి అవకాశాలపై ఉస్మానియా, జేఎన్‌టీయూల ప్రొఫెసర్లు విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇస్తారని వివరించారు. విద్యార్థులతో నిపుణుల ముఖాముఖి కూడా ఉంటుందని, తల్లిదండ్రులు కూడా కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 90307 15343, 90101 55509, 98495 10216 నంబర్లలో సంప్రదించవచ్చు.

జంట జలాశయాలపై 4 ఎస్టీపీలు

- శరవేగంగా నిర్మాణ పనులు
- మార్చి నాటికి పనుల పూర్తికి చర్యలు
- పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి



కొత్వాల్ గూడ ఎస్టీపీ నిర్మాణ పనుల గురించి అధికారులతో ఆరా తీస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు మురుగునీటి తంటా లేకుండా జలమండలి సన్నద్ధమైంది. వాటిల్లోకి మురుగునీరు చేరకుండా మొత్తం 20 ఎంఎల్‌డీల సామర్థ్యంతో నాలుగు ఎస్టీపీలను జలమండలి అధికారులు నిర్మిస్తున్నారు. హైదరాబాద్ మహానగరం, ఓఆర్ఆర్ లోపల వంద శాతం మురుగు నీటిని శుద్ధి చేయడమే లక్ష్యంగా 20 కొత్త ఎస్టీపీల నిర్మాణాలు పూర్తి చేసిన జలమండలి తాజాగా అమృత్–2.0 పథకంలో భాగంగా మరో 39 ఎస్టీపీల నిర్మాణాలకు సిద్ధమైంది. మరోవైపు జంట జలాశయాల్లో మురుగు చేరకుండా సుమారు రూ.82.23 కోట్లతో కొత్వాల్‌గూడ 6 ఎంఎల్‌డీలు, నాగిరెడ్డిగూడలో 5 ఎంఎల్‌డీలు, హిమాయత్ నగర్‌లో 5 ఎంఎల్‌డీలు, జన్వాడలో 4 ఎంఎల్‌డీల సామర్థ్యం కలిగిన ఎస్టీపీల నిర్మాణం చేపట్టారు. పరిసర ప్రాంతాలైన కొత్వాల్‌గూడ, కావ్యగూడ, శంషాబాద్, నాగిరెడ్డిగూడ, అజీజ్ నగర్, బి.నాగిరెడ్డిగూడ, హిమాయత్ నగర్, చిలుకూరు, మొయినాబాద్, జన్వాడ, మీర్జాగూడ, మియాఖాన్ గడ్డ, శంకర్‌పల్లి తదితర ప్రాంతాల మురుగునీరు జంట జలాశయాలకు చేరే ప్రమాదముంది. భవిష్యత్తులో నిర్మాణాల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున మరింత మురుగు పెరిగితే జలాశయాలు పూర్తిగా కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉంది. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా జంట జలాశయాల్లోకి మురుగు చేరకుండా మళ్లించి ఎస్టీపీలో శుద్ధి చేసి తిరిగి వదిలే విధంగా ప్రణాళిక రూపొందించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఎస్టీపీల నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా జలమండలి చర్యలకు ఉపక్రమించింది.

పనులు పరిశీలించిన ఎండీ

సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను గురువారం జలమండలి ఎం.డి.అశోక్ రెడ్డి పరిశీలించి పరిశీలించారు. కొత్వాల్‌గూడ ఎస్టీపీ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వం ఎస్టీపీకి కేటాయించిన భూమి చుట్టూ ఫెన్సింగ్ చేసి, సరిహద్దులను సరిచూసుకోవాలని సూచించారు. సీవరేజ్ మాస్టర్ ప్లాన్ పరిధిలోకి రాని, జీఓ–11 పరధిలోకి రాని ప్రాంతాన్ని గుర్తించి 2050 సంవత్సరం వరకు ఉత్పన్నమయ్యే మురుగును అంచనా వేసి దానిని శుద్ధి చేయడానికి అవసరమయ్యే ఎస్టీపీల నిర్మాణం తదితర అంశాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణ సమయంలో కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలని, తప్పనిసరిగా రక్షణ చర్యలను పాటించాలన్నారు. అనంతరం నాగిరెడ్డి గూడ ఎస్టీపీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ఎస్టీపీల అధికారులతోపాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులు ఉన్నారు.

‘ఎస్కీ’కి ఐఎస్ఓ సర్టిఫికేషన్

– డాక్టర్ రామేశ్వరరావు



‘ఎస్కీ’లో ఐఎస్ఓ సర్టిఫికేషన్‌ను రామేశ్వరరావుకు అందిస్తున్న శివయ్య

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)కు హైమ్ ఇంటర్నేషనల్ ఆడిట్ సంస్థ ద్వారా ఐఎస్ఓ సర్టిఫికేషన్ లభించింది. ఈ సందర్భంగా ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు మాట్లాడుతూ నాణ్యతకు ఐఎస్ఓ సర్టిఫికేషన్ గుర్తింపు లాంటిదన్నారు. ఇది వినియోగదారుల నమ్మకాన్ని పెంచడమే కాకుండా సంస్థ మార్కెట్‌ను విస్తరించేందుకు దోహదపడుతుందన్నారు. ఎస్కీలో గత నాలుగు దశాబ్దాలుగా అద్భుతమైన ఫ్యాకల్టీతో నాణ్యమైన సేవలను అందించగలుగుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న ఆధునిక సదుపాయాలు, ప్రాంగణంలోని శుభ్రత, ఉద్యోగుల నిబద్ధత వల్ల ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు. హైమ్ ఇంటర్నేషనల్ ఆడిట్ సంస్థ ఆడిటర్ ఎ.శివయ్య మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, శిక్షణా సంస్థలు, పరిశ్రమలు ప్రజలకు అందించే సేవలు, ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో ఒక తృతీయ పక్షం ద్వారా ఆడిట్ చేసి నిర్ధారించినప్పుడే ఐఎస్ఓ సర్టిఫికేట్ మంజూరవుతుందన్నారు. ఎస్కీ మూడేళ్లుగా అన్ని ప్రమాణాల్లో అగ్రగామిగా నిలుస్తూ ఐఎస్ఓ గుర్తింపును పొందుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్కీ అధికారులు రేవతి, ఎస్.లక్ష్మీకాంతరావు, డాక్టర్ పి.రాజారావు, మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ జ్యోతి, డాక్టర్ భరత్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో కర్ణాటక చిన్నారికి గుండె ఆపరేషన్

ఉచితంగా చేయించి ఔదార్యం చాటుకున్న మంత్రి దామోదర



ఆపరేషన్ చేయించుకున్న చిన్నారితో మంత్రి దామోదర

లక్డీకాపూల్: తీవ్ర గుండె జబ్బుతో బాధపడుతున్న చిన్నారికి మంత్రి దామోదర రాజనర్సింహ చేయూతనందించారు. నిమ్స్‌లో ఆ పాపకు ఉచితంగా ఆపరేషన్ చేయించి ఔదార్యాన్ని చాటుకున్నారు. కర్ణాటకకు చెందిన చంద్రకాంత్ దంపతులు మలక్‌పేట్ ప్రాంతంలో నివసిస్తూ, అక్కడే ఓ హోటల్‌లో పనిచేస్తున్నారు. చంద్రకాంత్ దంపతుల కూతురు ఐశ్వర్య(8) తరచూ అనారోగ్యం బారిన పడుతుండటంతో స్థానికంగా ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పాప గుండె జబ్బుతో బాధపడుతోందని ఆపరేషన్ చేయకపోతే ప్రాణాలకు ప్రమాదమని అక్కడి వైద్యులు తెలిపారు. ఆపరేషన్ కోసం కనీసం రూ.5 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. కర్ణాటకకు చెందినవారు కావడంతో వారికి ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ కార్డు లేవు. కర్ణాటకకు చెందిన ఆధార్‌కార్డు ఉంది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి పాప ఆరోగ్యపరిస్థితిని వివరించారు. దీంతో మంత్రి చలించి చిన్నారిని నిమ్స్‌లో అడ్మిట్ చేయించారు. మంత్రి ఆదేశాలతో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప చిన్నారి ఆపరేషన్‌కు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ నెల 4న గుండె వైద్య నిపుణులు గోపాల్, ప్రవీణ్ నేతృత్వంలోని వైద్య బృందం విజయవంతంగా శస్త్రచికిత్స చేసింది. అనంతరం పూర్తిగా కోలుకోవడంతో ఐశ్వర్యను డిశ్చార్జ్ చేశారు. దీంతో చంద్రకాంత్ దంపతులు గురువారం పాపతోపాటు సెక్రటేరియట్‌లో మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పాప ప్రాణాలు కాపాడిన దేవుడంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా వారికి మంత్రి భరోసా నిచ్చి పాపను అప్యాయంగా పలకరించారు.

గోల్కొండ కోటలో ఘనంగా 5వ పూజ



అమ్మవారిని దర్శించుకుంటున్న కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ డైరెక్టర్ భీమా అజ్మీరి, మల్లేశం తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోటకు భారీ సంఖ్యలో భక్తు లు తరలివచ్చారు. ఆషాఢ మాసం బోనాల వేడుకల్లో భాగంగా గురువారం గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవార్లకు 5వ పూజ నిర్వహించారు. గోల్కొండ బడాబజార్, బంజారి దర్వాజా, రాందేవ్‌గూడ రోడ్డు నుంచి ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు కోటకు చేరుకోవడం ప్రారంభించారు. పోతరాజులు, శివసత్తులు సందడి చేశారు. కార్వాన్, పురానాపూల్, సబ్జిమండీ తదితర ప్రాంతాల నుంచి అమ్మవారికి సమర్పించేందుకు అలంకరించిన తొట్టెలను యువకులు డప్పు వాయిద్యాలు, బాజాబజంత్రీలతో ఊరేగింపుగా గోల్కొంట కోట చౌరస్తాకు తరలివచ్చారు. విదేశీ పర్యాటకులు సైతం తొట్టెల, నాగదేవత పుట్ట వద్ద పూజలు, నగీనా బ్యారెక్స్‌లో బోనం కుండల అలంకరణను ఆసక్తిగా తిలకించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి వసంత పర్యవేక్షణలో జరిగిన పూజా వేడుకల్లో పలువురు ప్రముఖులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ డైరెక్టర్ భీమా అజ్మీరి, గోల్కొండ కోట సీనియర్ పరిరక్షణ అధికా రి ఎం.మల్లేశం, జస్టిస్ బి.ఎస్.జగ్జీవన్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు వారిని ఆహ్వానించి శాలువా కప్పి సన్మానించారు. పూజారులు సర్వేష్, బి.సురేష్ చారి తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ కుటుంబ సభ్యులు కూడా ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే కల్తీకల్లు విషాదం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

లక్డీకాపూల్: కల్తీ కల్లును అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. గురువారం నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కల్తీకల్లు బాధితులను ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కల్తీ కల్లు తాగి ఇప్పటికే ఆరుగురు చనిపోయారని, కొంతమంది ఐసీయూలో చికిత్స పొందుతున్నారని విచారం వ్యక్తం చేశారు. మరో ఏడుగురికి కిడ్నీ ఫెయిలైనట్లు వైద్యులు చెప్పారన్నారు. డ్రగ్స్, ఇతర రసాయనాలతో తయారు చేసిన కల్లు వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని, ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలను విస్మరించారని ఆరోపించారు. హైదరాబాద్‌లో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోయిందని ఆరోపించారు. ఎక్సైజ్ సిబ్బంది సహకారంతోనే కల్తీ జరుగుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని సూచించారు. కల్తీ కల్లు తాగి మృతి చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని రాచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

– జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

సాక్షి, మేడ్చల్ జిల్లా: చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి రోడ్డు ప్రమాదాలను నివారించడమే కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టరు, జిల్లా రోడ్డు భద్రత కమిటీ చైర్‌పర్సన్ రాధికాగుప్తా అన్నారు. గురువారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని సమస్యాత్మకమైన, మరమ్మతులకు అవసరమైన రోడ్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదనపు కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ గత సమావేశంలో గుర్తించిన సమస్యల పరిష్కారం, పెండింగ్ వివరాల గురించి అధికారులను, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని, అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్న చిన్న మరమ్మతులను మున్సిపల్ కమిషనర్లు పూర్తి చేయాలని సూచించారు. రోడ్ల పై వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రోడ్లు, భవనాల అధికారి, జిల్లా రవాణా అధికారి, ట్రాఫిక్ అదనపు డీసీపీ, ఏసీపీ సైబరాబాద్, కూకట్‌పల్లి, మేడ్చల్, మునిసిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యలపై సచివాలయం ముట్టడి

– పలువురు ఆప్ నేతల అరెస్ట్

హిమాయత్‌నగర్: విద్యా రంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ గురువారం రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడించింది. ఆప్ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ సచివాలయం గేటు వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసులు, ఆప్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగి పరిస్థితి ఉద్రికత్తగా మారింది. పోలీసులు బలవంతంగా పలువురు కార్యకర్తలను అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ విద్య కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లో లక్షల ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బుక్స్, యూనిఫాంలు అమ్ముతున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు కేటాయించాని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర నేతలు బుర్ర రాము గౌడ్, ఎం.డి.మజీద్, డా.అన్సారి, విజయ్ ముల్లంగి, దర్శనం రమేష్, ఎం.డి.సోహైల్, డా.లక్ష్య నాయుడు, జావీద్ షరీఫ్, కొడంగల్ శ్రీనివాస్, హేమ జిల్లోజు, షాబాజ్, రాకేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలి

– గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సరస్వతి లిటరరీ ఫెస్ట్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

బాలానగర్: భారతీయ సాహిత్యం, సంస్కృతిని కాపాడుకోవడానికి అందరూ కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. జేఎన్‌టీయూలో గురువారం వ్యాసపౌర్ణిమ సందర్భంగా వర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సరస్వతి లిటరరీ ఫెస్ట్‌ను గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ సాంకేతిక యుగంలో ఎవరైనా మూలాలు మరిచిపోకుండా ఉంటేనే సరైన ఫలితాలు సాధించగలుగుతారని అన్నారు. భారతీయ సంస్కృతి అందించిన సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తూనే అభివృద్ధిలో ముందుకు సాగాలని సూచించారు. గ్లోబల్ విలేజ్ అనే భావనకు వసుధైక కుటుంబం అనే మాటే ఆధారమని అన్నారు. వర్మ ఫౌండేషన్ చైర్మన్ వర్మ మాట్లాడుతూ పుస్తకాలకే పరిమితం కాకుండా భావ వ్యక్తీకరణకు ఇదొక వేదికలా ఉపయోగపడుతుందని అన్నారు. వివిధ కళాత్మక ప్రదర్శనలతో భారతీయ చారిత్రక గొప్పదనాన్ని విద్యార్థులకు చేరవేసే ఆలోచనలతో గత కొన్ని సంవత్సరాలుగా పలు రాష్ట్రాల్లో సరస్వతి లిటరరీ ఫెస్ట్‌లను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఫెస్ట్‌లో భాగంగా 21వ శతాబ్దంలో భారతీయ జ్ఞాన వ్యవస్థల ప్రాధాన్యత, వినోద రంగంలో కథలు చెప్పడం, డిజిటల్ యుగంలో కథలు, స్థిరత్వం సాహిత్యం అంశాలపై చర్చ, పంచతంత్ర కథలు చెప్పడం వంటివి నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సయంట్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.వి.ఆర్.మోహన్ రెడ్డి, అమరవాణి, జిజ్ఞాస ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉజ్జయినీ మహంకాళికి బంగారు బోనం



అక్కన్న, మాదన్న దేవాలయం వద్ద బంగారు బోనమెత్తిన జోగిని నిషా క్రాంతితో ఉత్సవాల నిర్వాహకులు

అక్కన్న, మాదన్న దేవాలయం నుంచి ఊరేగింపు

చార్మినార్: పాతబస్తీ భక్తులు గురువారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బంగారు పాత్రలోని బోనం, పట్టువస్త్రాలు, వడి బియ్యం సమర్పించారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని అమ్మవారి దేవాలయాలతో పాటు విజయవాడలోని కనకదుర్గ అమ్మవార్లకు బంగారు బోనాలను సమర్పిస్తున్నారు. ఇప్పటికే మొదటి బోనాన్ని గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బోనాన్ని విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి, మూడో బోనాన్ని బల్కంపేట్ ఎల్లమ్మ తల్లికి, నాలుగో బోనాన్ని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి సమర్పించారు. ఇక ఐదో బోనాన్ని గురువారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి సమర్పించారు. పాతబస్తీ హరిబౌలిలోని అక్కన్న మాదన్న దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అంగరంగ వైభవంగా సికింద్రాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. దారిపొడవునా పోతురాజుల నృత్యాలు, కళా ప్రదర్శనలతో కన్నుల పండువగా ఊరేగింపు కొనసాగింది.

15న చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి...

సప్త మాతృకలకు సప్తబంగారు బోనం కార్యక్రమంలో భాగంగా ఆరో బంగారు బోనాన్ని చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి సమర్పించున్నామని కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు. మీరాలం మండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భారీ ఊరేగింపుగా భాగ్యలక్ష్మీ అమ్మవారికి బంగారు బోనం, పట్టు వస్త్రాలు, వడి బియ్యం సమర్పించనున్నామన్నారు. అనంతరం 17న లాల్ దర్వాజ సింహవాహినీ దేవాలయం అమ్మవారికి బంగారు పాత్రలో నైవేద్యాన్ని సమర్పించనున్నట్లు చెప్పారు.

రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- గైర్హాజరవుతున్న విద్యార్థులను తొలగించాలి
- హెచ్ఎంల పనితీరుపై డీఈఓ తీవ్ర అసంతృప్తి



సాక్షి, సిటీబ్యూరో: పాఠశాల రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి ప్రధానోపాధ్యాయులను తీవ్రంగా హెచ్చరించారు. గురువారం నగరంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. దీర్ఘకాలికంగా గైర్హాజరవుతున్న విద్యార్థులను గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. పాఠశాలలో ఖచ్చితమైన నమోదు వివరాలు ప్రతిబింబించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొదటగా బహదూర్‌పురా మండలంలోని ముస్తఫానగర్, అచ్చిరెడ్డి నగర్–2, అచ్చిరెడ్డినగర్–3, మూసాబౌలి, చార్‌మహెల్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పలు అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల్లో యూనిఫామ్స్ పంపిణీ, పాఠ్యపుస్తకాలు, బేస్‌లైన్ పరీక్షల నిర్వహణ, ఆన్‌లైన్ ఎంట్రీలను తనిఖీ చేశారు. అచ్చిరెడ్డి నగర్–2 పాఠశాలలో తక్కువ విద్యార్థుల హాజరు, పాఠశాల రికార్డులు, ఎఫ్ఆర్ఎస్ హాజరు, హాజరు రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న హెడ్ మాస్టర్‌ను తీవ్రంగా మందలించారు. చార్‌మహెల్ ఉన్నత పాఠశాల ఆవరణ శుభ్రంగా లేకపోవడం, అత్యల్పంగా విద్యార్థుల నమోదు సంఖ్యపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మూసాబౌలి పాఠశాలలో కూడా విద్యార్థుల నమోదు పెంపు ఎలాంటి చొరవ తీసుకోకపోవడంపట్ల అసహనం వ్యక్తం చేశారు. డీఈఓ వెంట సెక్టోరల్ అధికారిణి ఉమాదేవి తదితరులు ఉన్నారు.

ఒక వర్గం ఓట్ల తొలగింపునకు కుట్ర

ఎన్నికల కమిషన్‌పై సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ధ్వజం



నూతన భవవనాన్ని ప్రారంభిస్తున్న సీపీఐ నాయకులు

హిమాయత్‌నగర్: బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరుతో ఒక వర్గం ఓట్లను తొలగించేందుకు ఎన్నికల కమిషన్ యత్నిస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆరోపించారు. బిహార్ మాదిరిగానే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కేరళల్లో ఓట్లను తొలగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రజలు, ప్రజాస్వామ్య పార్టీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హిమాయత్‌నగర్‌లో పునర్నిర్మితమైన సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో రాజా మాట్లాడారు. మఖ్దూం భవన్ కేవలం పార్టీ కార్యాలయం కాదని, రాష్ట్రంలో విప్లవానికి నిలయమని అన్నారు. ఇక్కడికి వచ్చిన కమ్యూనిస్టు శ్రేణులు పోరాట స్ఫూర్తితో ముందుకు వెళతారని అన్నారు. సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సువరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో వర్గ దోపిడీ కొనసాగినంత కాలం కమ్యూనిస్టులు ఉంటారని స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ లౌకిక, ప్రజాస్వామిక భారతదేశాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కలిసి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ఎత్తివేయగా, అన్ని రాజకీయ పార్టీల నిరసనలకు ‘మఖ్దూం భవన్’వేదికగా మారిందని గుర్తు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ బీజేపీని గద్దె దించేందుకు అందరూ కలిసి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్(న్యూడెమోక్రసి) రాష్ట్ర నాయకులు వెంకట్రామయ్య, సీపీఐఎంఎల్(మాస్‌లైన్) రాష్ట్ర నాయకుడు అన్వేష్, ఆర్ఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ అధ్యక్షుడిని తొలగించాలని ఆందోళన

ఉప్పల్: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా టికెట్ల విషయంలో అక్రమాలకు పాల్పడిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావును వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉప్పల్ స్టేడియం గేటు వద్ద డీవైఎఫ్ఐ నాయుకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువు అయినందు వల్ల రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఆయన సభ్యత్వాన్ని కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీఏ కార్యదర్శి, సీఈఓలపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జావీద్, నాయకులు మూర్తి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ఆరోగ్యంపై అవగాహనతో పాటు కొత్త కొత్త ట్రెండ్స్ పెరుగుతున్నాయి. ఇదే క్రమంలో ప్రస్తుతం హోమ్ జిమ్స్‌కు డిమాండ్ ఊపందుకుంటోంది. ఒకప్పుడు కేవలం సెలబ్రిటీలు, సంపన్నులకు మాత్రమే పరిమితమైన ఇవి ప్రస్తుతం మధ్య తరగతి ఇళ్లలో సైతం సాధారణంగా మారాయి. బ్యాచిలర్ హోమ్స్‌లో, కో-లివింగ్ ఫ్లాట్స్‌లో సైతం నలుగురైదుగురు యువత కలిసి వీటిని ఏర్పాటు చేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. హోమ్ జిమ్ కాన్సెప్ట్ ఇటీవల కాలంలో నగరంలో స్థిరపడుతోంది.

- సాక్షి, సిటీబ్యూరో



రిచ్ హోమ్ జిమ్..

కోవిడ్ తర్వాత ఊపందుకున్న హోమ్ జిమ్ ట్రెండ్

- సెలబ్రిటీలు, సంపన్నుల నుంచి మిడిల్ క్లాస్ వరకూ
- సిటీలో ఖరీదుగా మారిన జిమ్ సభ్యత్వాలూ కారణమే
- బ్యాచిలర్ రూమ్స్, కోలివింగ్ ఫ్లాట్స్‌లోనూ ఏర్పాటు
- రూ.1.50 నుంచి రూ.5లక్షల లోపు ఖర్చుతో సొంత జిమ్

నగరంలో హోమ్ జిమ్ ట్రెండ్ ఊపందుకోడానికి కోవిడ్ పుణ్యమాని వర్క్ కల్చర్‌లో వచ్చిన మార్పులు, వర్క్ ఫ్రమ్ హోమ్ కూడా ఒక కారణమే. ఇంట్లో అధిక సమయం గడపడం అలవాటవుతున్న పలువురు వృత్తి నిపుణులు ఇంట్లోనే వ్యాయామశాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే హోమ్ జిమ్ ఏర్పాటు చేసుకునే ముందు దాని వల్ల కలిగే ప్రయోజనాల నుంచి ప్రతికూలతల వరకూ ఒకసారి బేరీజు వేసుకోవడం మంచిదని ఫిట్‌నెస్ రంగ నిపుణులు సూచిస్తున్నారు.

స్థలం ఉంటేనే ఫలం..

ఒక మోస్తరు హోమ్ జిమ్ ఏర్పాటుకు కనీసం 60–100 చదరపు అడుగుల స్థలం అవసరం అవుతుందని అంచనా. బేసిక్ హోమ్ జిమ్ అయితే 60–80 చదరపు అడుగులు (ఉదాహరణకు బెడ్ రూమ్ కార్నర్ లేదా బాల్కనీలో) అలా కాకుండా ఫుల్ సెటప్ చేసుకోవాలంటే.. 100–150 చ.అ. (ఒక ప్రత్యేక గది అయితే మరింత మంచిది) అవసరం అవుతుంది.

బడ్జెట్ ఇలా..

హోమ్ జిమ్ బడ్జెట్ వ్యక్తిగత అవసరాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ఎంట్రీ లెవల్ హోమ్ జిమ్‌కైతే పెట్టుబడిగా రూ.30,000 నుంచి రూ.50,000 మధ్య సరిపోతుంది. అదే మిడ్ రేంజ్‌లో వెళ్లాలనుకుంటే రూ.50,000 నుంచి రూ.1.5 లక్షలు, పూర్తి సెటప్ కోరుకుంటే రూ.2 లక్షలు నుంచి రూ.5 లక్షల వరకూ (బ్రాండెడ్ ఎక్విప్‌మెంట్‌ను బట్టి మారవచ్చు) వెచ్చించాల్సి ఉంటుంది.





అందుబాటులో బ్రాండ్స్..

నగరంలో జిమ్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేయాలంటే.. డెకథ్లాన్, ఫిట్‌లైన్ ఇండియా, అఫ్టాన్ ఫిట్‌నెస్, పవర్ మ్యాక్స్ ఫిట్‌నెస్, ప్రోలైన్ ఫిట్‌నెస్ వంటి బ్రాండ్స్ వ్యాయామ పరికరాలను అందిస్తున్నాయి. వీటిలో కొన్ని పూర్తిగా హోమ జిమ్స్ సెటప్‌ను ఒక ప్యాకేజీగా కూడా అందిస్తున్నాయి. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ విపణుల ద్వారానూ కొనుగోలు చేయవచ్చు.

ఇవీ ప్రయోజనాలు..

- నగర ట్రాఫిక్‌లో రాకపోకలకు పట్టే సమయం, ఎండ, వాన తదితర వాతావరణ అడ్డంకులు ఉండవు.
- జిమ్‌లో పదుల సంఖ్యలో ఉండే ఇతర సభ్యుల మధ్య చేయడం, కొన్ని సార్లు ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉండకపోవడం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.
- ఒక్క హోమ్ జిమ్‌తో కుటుంబ సభ్యులందరికీ వ్యాయామం చేసే అవకాశం లభిస్తుంది. ఒకరికొకరు ప్రోత్సహించుకుంటూ చక్కని ఆరోగ్యకర వాతావరణానికి దోహదపడుతుంది.
- దీర్ఘకాలిక పెట్టుబడిగా దీన్ని చెప్పుకోవచ్చు. నెలవారీగానో, వార్షిక ఫీజు రూపంలోనో చెల్లించాల్సిన జిమ్ మెంబర్‌షిప్ ఖర్చును దూరం చేసుకోవచ్చు. కుటుంబ సభ్యులు, ఒకరిద్దరు సన్నిహితులను కూడా కలుపుకుంటే స్వల్ప కాలంలోనే పెట్టుబడి రికవరీ అయినట్టు భావించవచ్చు.

ప్రాథమిక పరికరాలు..

ఇంట్లో జిమ్‌లో ఉండాల్సిన పరికరాల్లో డంబెల్స్ సెట్స్ (రూ.3,000 నుంచి రూ.10,000) రాడ్స్, వెయిట్స్ (రూ.5,000 నుంచి రూ.15,000), బెంచ్ ప్రెస్ (రూ.8,000 నుంచి రూ.20,000) యోగా మ్యాట్, రెసిస్టెన్స్ బ్యాండ్స్ (రూ.1,000 నుంచి రూ.3,000), ట్రెడ్‌మిల్ లేదా ఎలిప్టికల్ మిషన్ (రూ.20,000 నుంచి రూ.లక్ష) ఆల్ ఇన్ వన్ మల్టీ జిమ్ మిషన్ (రూ.40,000 నుంచి రూ.1.5 లక్షల వరకు), లాట్ మిషన్ (రూ.15,000 నుంచి రూ.25,000)లు కొనుగోలు చేయాలి.



ప్రతికూలతలు..

- సరైన శిక్షకులు అందుబాటులో లేకపోవడం ఒక సమస్య. ఒక వేళ ఇంటికి వచ్చి శిక్షణ ఇచ్చే ట్రైనర్స్‌ను ఎంచుకుంటే వారికి చెల్లించాల్సిన మొత్తం ఆర్థిక భారంగా మారుతుంది.
- ఒంటరిగా చేయడం వల్ల సరిపడా మోటివేషన్ దొరకదు. వర్కవుట్స్‌ను వాయిదా వేసే అవకాశం ఎక్కువ.
- ఎంత వరకూ చేయాలో, ఏ వర్కవుట్ ఎలా చేయాలో తెలుసుకుని చేయకపోతే కొన్ని ఇబ్బందులు తప్పవు.
- అద్దెకు ఉంటున్న ఇళ్లు అయితే ఇంటి యజమానులతో ఇబ్బందులు రావచ్చు. అంతేకాకుండా ఇళ్లు మారే సమయంలో ఈ ఎక్విప్‌మెంట్ భారంగా పరిణమించవచ్చు.

ఎనిమిదో వింత..



సాక్షి, సిటీబ్యూరో: అద్భుతాలు సాకారం చేయడానికి వయసు అడ్డుకాదని నిరూపించింది నగరానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి. 3వ తరగతి విద్యార్థిని అయిన 'నిర్వి ప్రద్యుమ్న' కూకట్‌పల్లిలోని అశోక వన్ మాల్లో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో 50కి పైగా చదరంగపు ఓపెనింగ్ ట్రాప్స్‌ను 50కి పైగా బోర్డులపై కేవలం 30 నిమిషాల్లో ప్రదర్శించి ఆశ్చర్యపరిచింది. అంతేకాకుండా, 195 దేశాల అధికారిక కరెన్సీలను కేవలం నాలుగు నిమిషాల 26 సెకన్లలో గుర్తించగలిగింది. తద్వారా 'నిర్వి' భారతదేశపు అత్యంత పిన్న వయస్కురాలైన ప్రతిభావంతుల జాబితాలో చేరింది. ఈ కార్యక్రమానికి హాజరైన జాతీయ సీనియర్ చెస్ అర్బిటర్ ఉజ్వల్ చౌహాన్, నిర్వి అద్భుత ప్రతిభను ధ్రువీకరించి, లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపుతున్నట్లు ప్రకటించారు. చిన్నా ప్రతిభను నిర్వాహకులు ప్రశంసించారు.

'మేనేజ్ చేద్దాం' చిత్ర ప్రదర్శన..



- ఆకట్టుకుంటున్న చిత్రాలు, స్కల్ప్చర్స్
- ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగింపు

మాదాపూర్ : వివిధ రాష్ట్రాలకు చెందిన ఆర్ట్ అధ్యాపకులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు బోధన చేస్తూ కొంత సమయాన్ని కేటాయించి చిత్రాలు, స్కల్ప్చర్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ అర్ట్‌గ్యాలరీలో అధ్యాపకులు వేసిన చిత్రాలను 'మేనేజ్ చేద్దాం' పేరిట ప్రదర్శనగా సినిమా డైరెక్టర్ చందు మొండేటి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థులకు బోధిస్తూ చిత్రాలు వేయడం అభినందనీయమని కొనియాడారు. హైదరాబాద్ అర్ట్‌సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి మాట్లాడుతూ స్కల్ప్చర్స్ తయారు చేయడానికి చాలా సమయం కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు. అలాంటి వాటిని కూడా సమయం కేటాయించి రూపొందించడం గర్వకారణమన్నారు. అధ్యాపకులు వేసిన 65 చిత్రాలు, 25 స్కల్ప్చర్స్, రెండు ఇన్‌స్టలేషన్స్ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. ఈనెల 20వ తేదీ వరకూ ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూఓహెచ్ ప్రొఫెసర్ కీర్తన తంగవేలు, కళాకారుడు సురేష్, పద్మారెడ్డి పాల్గొన్నారు.





హైదరాబాద్ నగరం మరోసారి నవ్వుల పండుగకు వేదిక కానుంది. డిజిటల్ హాస్య తార 'అయ్యో శ్రద్ధా'గా గుర్తింపు పొందిన శ్రద్ధా జైన్ తన అద్భుత స్టాండప్ కామెడీ షో 'సో మినీ థింగ్స్' పేరుతో దేశంలో చివరి సారి ప్రదర్శించనుంది. ఈ హృద్యమైన వినోద యాత్ర ఈ నెల 27న హైటెక్ సిటీలోని శిల్పకళా వేదిక ఈ కార్యక్రమానికి ఆతిథ్యం ఇస్తోంది. ఈ ప్రదర్శన కేవలం వినోదం మాత్రమే కాదు.. భారతీయ కుటుంబ జీవనాన్ని, మన ఊహల్ని, నిత్యజీవితంలో మినీ మినీ కహానీలను పరిపూర్ణంగా హాస్యంగా మలిచే ఓ అనుభూతిని ప్రదర్శించనుంది. – సాక్షి, సిటీబ్యూరో

సో మినీ థింగ్స్..

- నగరంలో శ్రద్ధా జైన్ స్పెషల్ షో..
- మూడు ఖండాలు, 45 ప్రముఖ నగరాల్లో ప్రదర్శనలు..
- ఈ నెల్లో హైదరాబాద్‌లో తన ప్రతిష్టాత్మక ఈవెంట్
- టాప్ ఇండియన్ కామెడీ షో డిజిటల్ స్టార్, అయ్యో శ్రద్ధగా ప్రసిద్ధి
- ప్రధానమంత్రి నుంచి 'మోస్ట్ క్రియేటివ్ క్రియేటర్' అవార్డు

శ్రద్ధా కామెడీ మాయాజాలం మానసిక అంతర్భావాల పరంగా అద్భుతంగా ఉంటుందని అభిమానుల మాట. ఓ చిన్న పిల్లవాడిలా జిజ్ఞాసతో, అమాయకంగా ఆలోచించే తత్వం ఆమె పండించే ప్రతి కథనంలో కనిపిస్తుంది. 'సో మినీ థింగ్స్' అనే పేరు కూడా ఆమె ప్రదర్శనలోని మినీ కథలు, మినీ ఎమోషన్స్, మినీ వెర్షన్లకు అద్దం పట్టినట్లే ఉండనుంది. భారతీయ కుటుంబాల్లోని సరదా సంభాషణలు, అపరిచిత సందర్భాల్లో తలెత్తే హాస్యాన్ని తన ప్రత్యేక శైలిలో మలచి ప్రేక్షకులకు అందించడం ఆమె ప్రత్యేకత. ఈ ప్రదర్శనకు నిర్మాతలుగా వ్యవహరిస్తున్న లైవ్‌ట్రీ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ సోను నిగమ్, హరిహరన్ వంటి సంగీత దిగ్గజాల లైవ్ షోల వేదికగా నిలిచింది. ప్రస్తుతం శ్రద్ధా షోను ప్రపంచవ్యాప్తంగా 45 నగరాల్లో ప్రదర్శించి, ఇప్పుడు చివరగా భారత్‌లో ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే పుణె, ఢిల్లీ వంటి నగరాల్లో భారీ ప్రేక్షకాభిమానంతో ప్రారంభమైన ఈ చివరి టూర్, ముంబై, చెన్నై, హైదరాబాద్ షోతో ముగుస్తుంది.



కామెడీ క్వీన్..

ఈ సందర్భంగా సీఈఓ శరత్ వత్సా మాట్లాడుతూ.'దాదాపు 90 నిమిషాలు ప్రేక్షకులు నవ్వుల ప్రపంచంలో మునిగి తేలాక వారి మనసు తేలికపడి, హృదయాన్ని హత్తుకునే అనుభూతితో బయటికి రావడం.. ఇదే మాకు సంతృప్తి. 2024లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి 'మోస్ట్ క్రియేటివ్ క్రియేటర్ – ఫిమేల్' అవార్డును అందుకున్న ఈ ఇంజినీర్, ఆర్టే, కంటెంట్ క్రియేటర్ ప్రస్తుతం కామెడీ ప్రపంచానికి ఒక మైలు రాయిలా మారిపోయింది' అని తెలిపారు.

ఏటీజీసీ బయోటెక్‌కు
'అగ్రి' అవార్డ్..



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన.. ఏటీజీసీ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ప్రతిష్టాత్మక 'ఇన్నోవేషన్ లీడర్‌షిప్' అవార్డు లభించింది. న్యూఢిల్లీలో 'అగ్రికల్చర్ టుడే' నిర్వహించిన 'అగ్రికల్చర్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.సదాశివం అధ్యక్షతన జాతీయ అవార్డుల కమిటీ తమను ఈ అవార్డుకు ఎంపిక చేసిందని, మొత్తం 26 పేటెంట్లు, 50కి పైగా వాణిజ్య దశలో ఉన్న ఉత్పత్తులతో మన దేశాన్ని ప్రపంచ బయోటెక్నాలజీ శక్తి కేంద్రంగా మార్చే కృషికి ఇది గుర్తింపు అనీ ఈ సందర్భంగా సంస్థ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ అవార్డు భారతీయ సైన్స్ సామర్థ్యాన్ని చాటి చెబుతోందని ఏటీజీసీ బయోటెక్ చైర్మన్, ఎండీ డాక్టర్ మార్కండేయ గొరంట్ల, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వీబీ రెడ్డి అభిప్రాయపడ్డారు.

సినీ టాలెంట్‌కు ప్రోత్సాహం..
స్క్రీన్ అకాడమీ..



సాక్షి, సిటీ బ్యూరో: ఫిల్మ్ స్కూల్స్ సినిమా రంగంలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా లాభాపేక్ష రహిత కార్యక్రమంగా స్క్రీన్ అకాడమీ ఏర్పాటైంది. దీనిలో కేన్స్, ఆస్కార్ విజేతలు, గునీత్ మోంగా, పాయల్ కపాడియా, రెసుల్ పుకుట్టి, ప్రముఖ స్క్రీన్ రైటర్ అంజుమ్ రాజ బలి వంటి వారు మార్గదర్శకులుగా ఈ అకాడమీకి సేవలు అందించనున్నారని, భారతదేశంలోని అగ్ర శ్రేణి చలనచిత్ర సంస్థలతో, ఫిల్మ్ స్కూల్స్‌తో కలిసి ఈ అకాడమీ పనిచేయనుందనీ ఈ సందర్భంగా అకాడమీని సంయుక్తంగా నెలకొల్పిన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్, స్క్రీన్ ప్రతినిధులు తెలిపారు. లోధా ఫౌండేషన్‌కు చెందిన అభిషేక్ లోధా మద్దతుతో నెలకొల్పిన స్క్రీన్ అకాడమీ, చలనచిత్ర పాఠశాలలు నామినేట్ చేసిన విద్యార్థులకు ఏటా పోస్ట్ గ్రాడ్యుయేట్ ఫెలోషిప్‌లను అందిస్తుందని, దశలవారీగా తన కార్యకలాపాలను విస్తరించనుందని అన్నారు. దరఖాస్తు ప్రక్రియ, ఇతర వివరాలకు www. screenacademy. org ని సందర్శించవచ్చు.

అయినసూ.. మీరు నాన్‌లోకల్!

- తెలంగాణలో ఇంటర్ చదివిన ఏపీ విద్యార్థులకు చంద్రబాబు కూటమి సర్కారు షాక్
- ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలకు మోకాలడ్డు
- విద్యార్థి తల్లిదండ్రులు పదేళ్లు ఏపీలో నివసించినట్టు సర్టిఫికెట్ తేవాలంటూ నిబంధన

సాక్షి, అమరావతి: ఏపీలో ఇంజనీరింగ్ ప్రవేశాల వేళ లోకల్, నాన్‌లోకల్ కోటా విభజన విద్యార్థుల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తోంది. పదో తరగతి వర కు ఏపీలోనే చదివి.. తెలంగాణలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులను నాన్ లోకల్ (స్థానికేతరులు)గా ఏపీ ప్రభుత్వం పరిగణిస్తోంది. తెలంగాణ లో ఇంటర్ పూర్తి చేసిన ఏపీ విద్యార్థులు ఈఏపీసెట్ ద్వారా ఇంజనీరింగ్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోగా.. వారికి స్థానిక కోటా వర్తించడం లేదు. మరోవైపు స్థానికేతర కోటా పొందడానికి కూడా వీలులేకుండా వారి భవిష్యత్‌తో రాష్ట్ర ప్రభుత్వం చెలగాట మాడుతోంది. విద్యార్థుల తల్లిదండ్రులు పదేళ్ల పాటు ఏపీలో నివసిస్తున్నట్టు చూపిస్తే స్థానికేతర కోటాలో కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని ప్రభుత్వం చెబుతోంది. కానీ, విద్యార్థి తల్లిదండ్రులకు నివాస ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి నిరాకరిస్తోంది. పైగా ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ అధికారులు పదేళ్లు తల్లిదండ్రుల స్టడీ సర్టిఫికెట్స్ ఏపీలో ఉంటే కౌన్సెలింగ్‌కు అనుమతిస్తామని చెబుతున్నారు. కానీ, చదువు లేని తల్లిదండ్రులున్న విద్యార్థుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై ఈఏపీ సెట్ హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదులు వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

'దేశ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. చమురు కంపెనీల దగ్గర సరిపడా నిల్వలు ఉన్నాయి. వివిధ మార్గాల ద్వారా ఇంధన సరఫరాలు నిరంతరాయంగా అందుతున్నాయి. హార్ముజ్ మార్గం బందైనా భారత్‌కి ఇబ్బంది లేదు. వేరే మార్గాల్లో భారత్‌కు క్రూడాయిల్ వస్తుంది' - ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం, హార్ముజ్ మార్గం మూసేస్తారన్న ఊహాగానాల నేపథ్యంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి ఇటీవల చెప్పిన మాటలివి. ఆయన చెప్పింది నిజమే. ఇప్పటికే మనదేశం ప్రపంచంలోనే అతిపొడవైన ఎల్‌పీజీ పైప్‌లైన్ ప్రాజెక్టు నిర్మిస్తోంది. ఇలాంటి పైప్‌లైన్లే ప్రపంచ దేశాలకు చమురు, సహజ వాయువుల వంటి ఇంధనాలు అందిస్తున్న ప్రాణవాయువులు. ఈ పైప్‌లైన్లు ప్రపంచ దేశాలను చుడుతూ భారీగా విస్తరిస్తున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్



సహజ వనరుల లైఫ్‘లైన్’!

ప్రపంచవ్యాప్తంగా ఎన్ని కిలోమీటర్ల పొడవుతో గ్యాస్ పైప్‌లైన్ అందుబాటులో ఉందో తెలుసా?
14.2 లక్షల కిలోమీటర్లు.

అంటే భూమిని 35సార్లు చుట్టొచ్చన్న మాట. లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) పైప్‌లైన్ల సామర్థ్యం 5 బిలియన్ (500 కోట్ల) టన్నులు. అలాగే చమురును సరఫరా చేసే పైప్‌లైన్ల పొడవు
5,04,000 కిలోమీటర్లు.

చమురు, సహజ వాయువు.. ప్రపంచాన్ని నడిపిస్తున్న సహజ ఇంధన వనరులు ఇవి. ఆర్థిక వ్యవస్థ రథచక్రాలివి. ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వం, సమర్థవంతమైన వనరుల పంపిణీకి చమురు, సహజ వాయువు పైప్‌లైన్లు కీలకమైనవి. 'అన్నింటా మనం' అన్నట్టు చమురు, సహజ వాయువు రంగంలో భారత్ సైతం తనదైన ముద్రవేస్తోంది. ప్రపంచంలో అతిపొడవైన లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) పైప్‌లైన్ ప్రాజెక్టుకు మన దేశం శ్రీకారం చుట్టింది.


అగ్రదేశాల సరసన మనమూ..

అమెరికాకు చెందిన ప్రముఖ ఇంధన రంగ విశ్లేషణ సంస్థ 'గ్లోబల్ ఎనర్జీ మానిటర్' గణాంకాల ప్రకారం అంతర్జాతీయంగా 59,100 కిలోమీటర్ల గ్యాస్ సరఫరా పైప్‌లైన్స్ నిర్మాణంలో ఉన్నాయి. మరో 1,51,300 కిలోమీటర్ల పైప్‌లైన్ ప్రాజెక్టులు ప్రతిపాదన దశలో ఉన్నాయి. వీటన్నింటి అంచనా వ్యయం 533.6 బిలియన్ డాలర్లు. అభివృద్ధి చేస్తున్న పైప్‌లైన్ల పరంగా చైనా, రష్యా, భారత్, ఆస్ట్రేలియా, యూఎస్ ముందున్నాయి. చమురు సరఫరా కోసం 9,100 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణంలో ఉంది. మరో 21,900 కిలోమీటర్ల ప్రాజెక్టులకు ప్రతిపాదనలు ఉన్నాయి. 2023 మే నాటికి 25.3 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో నిర్మాణంలో ఉన్న మొత్తం చమురు సరఫరా పైప్‌లైన్స్‌లో 49 శాతం ఆఫ్రికా, మధ్యప్రాచ్యంలో విస్తరించాయి. ఈ ప్రాంతాలు 4,400 కిలోమీటర్ల ముడి చమురు సరఫరా పైప్‌లైన్స్‌ను నిర్మిస్తున్నాయి. అలాగే 10,800 కిలోమీటర్ల ప్రాజెక్టులు ప్రతిపాదనలో ఉన్నాయి.

టాప్-5లో గెయిల్

గ్యాస్ సరఫరా కోసం చైనాలో 21.9 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో 17,800 కిలోమీటర్లు, భారత్‌లో 20.7 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో 14,300 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం జరుగుతోంది. ప్రపంచంలో ఇతర అన్ని దేశాల్లో అభివృద్ధి దశలో ఉన్న మొత్తం పైప్‌లైన్ కంటే ఈ రెండు దేశాలు నిర్మిస్తున్నవే అధికం కావడం విశేషం. గ్యాస్ పైప్‌లైన్స్‌ను అభివృద్ధి చేస్తున్న టాప్-5 మాతృ సంస్థలు ప్రభుత్వ రంగానికి చెందినవి కావడం విశేషం. రష్యాలో గ్యాస్‌ప్రామ్, చైనా-పైప్‌చైనా, భారత్-గెయిల్, నైజీరియా-ఎన్ఎన్‌పీసీ, ఇరాన్‌లో చమురు మంత్రిత్వ శాఖ వీటిలో ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న అత్యంత పొడవైన గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టులు 2,775 కిలోమీటర్ల ఇరాన్-పాకిస్తాన్ పైప్‌లైన్, అలాగే భారత్‌లో 2,655 కిలోమీటర్ల జగదీష్‌పూర్-హల్దియా-బొకారో-ధమ్రా సహజ వాయువు పైప్‌లైన్. నిర్మాణంలో ఉన్న అతి పొడవైన చమురు పైప్‌లైన్ ప్రాజెక్టుల్లో ఆఫ్రికాలోని చైనా నేషనల్ పెట్రోలియం కార్పొరేషన్ యాజమాన్యంలోని 1,950 కిలోమీటర్ల నైజర్-బెనిన్ ఆయిల్ పైప్‌లైన్, భారత్‌లో నుమాలిఘర్ రిఫైనరీ లిమిటెడ్‌కు చెందిన 1,635 కిలోమీటర్ల పారాదీప్ నుమాలిఘర్ క్రూడ్ పైప్‌లైన్ (పీఎన్‌సీపీఎల్) టాప్-2లో నిలిచాయి.

ప్రపంచాన్ని చుడుతున్న చమురు, గ్యాస్ పైప్‌లైన్స్ | అత్యంత పొడవైన ఎల్‌పీజీ పైప్‌లైన్ నిర్మిస్తున్న భారత్



2,800 కి.మీ. పొడవు!

ప్రపంచంలో అతిపొడవైన ఎల్‌పీజీ పైప్‌లైన్ ప్రాజెక్టును భారత్ చేపట్టింది. ఇందుకోసం ప్రభుత్వ రంగ సంస్థలైన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఇండియన్ ఆయిల్ సంయుక్తంగా ఐహెచ్‌బీఎల్ పేరుతో సంయుక్త భాగస్వామ్య కంపెనీని ఏర్పాటు చేశాయి. ప్రాజెక్టు కోసం 1.3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నారు. 2,800 కిలోమీటర్ల పొడవైన ఈ పైప్‌లైన్ ప్రాజెక్టులో గుజరాత్‌లోని కాండ్లను ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌తో అనుసంధానిస్తారు. ఏటా 83 లక్షల టన్నుల ఎల్పీజీని రవాణా చేయగల సామర్థ్యం దీని సొంతం. ఇది దేశ మొత్తం ఎల్పీజీ డిమాండ్‌లో 25 శాతం.

క్లుప్తంగా...

నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసింది కాంగ్రెస్సే

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనంతోనే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు మూలనపడిందని, 50 ఏళ్ల పాలనలో తెలంగాణ నీటిపారుదల రంగాన్ని, సాగు రంగాన్ని కాంగ్రెస్ నిర్వీర్యం చేసిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన పీపీటీతో సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్, ఆర్థిక మంత్రి భట్టి అజ్ఞానం మరోసారి బయటపడిందన్నారు. చెప్పిందే చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆంధ్రాకు నీళ్ల తరలింపులో కాంగ్రెస్ తోడ్పాటు అందిస్తోందని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు చేపట్టేందుకు మహారాష్ట్ర ఒప్పుకోకున్నా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాలువలు తవ్వి, మొబిలైజేషన్ అడ్వాన్సులను కాంట్రాక్టర్లకు కట్టబెట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు.

దివ్యాంగుల సంక్షేమంలో 15 విజయాలు సాధించాం

ముత్తినేని వీరయ్య వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిన్నరలో దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించి 15 విజయాలు సాధించినట్లు తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. చైర్మన్‌గా ఏడాది కాలాన్ని పూర్తి చేసుకున్న నేపథ్యంలో గురువారం ఆయన వికలాంగుల కార్పొరేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ఉన్నత విద్యలో 5 శాతం రిజర్వేషన్లు, రాజీవ్ యువవికాసం పథకం కింద 5 శాతం కోటా, దివ్యాంగుల సంక్షేమానికి అత్యధికంగా రూ.300 కోట్లు ప్రత్యేక బడ్జెట్, బెంచ్‌మార్క్ వైకల్యంతో ఉపకరణాల పంపిణీ, కోర్టు ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు, దివ్యాంగుల పెళ్లికానుక ఇలా పదిహేను కేటగిరీల్లో వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను తీసుకువచ్చిందన్నారు.

'సోలార్' పనుల్లో జాప్యం చేస్తే బ్లాక్ లిస్ట్

కాంట్రాక్టు సంస్థలకు సింగరేణి సీఎండీ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: సోలార్ ప్లాంట్ల నిర్మాణాలను నిర్ణీత వ్యవధిలోనే పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలను సింగరేణి సీఎండీ ఎన్. బలరాం కోరారు. పనుల్లో జాప్యం చేసే సంస్థలను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఆయన కాంట్రాక్టు సంస్థలతో సమీక్షించారు. తొలి దశలో పూర్తవ్వాల్సి 54.5 మెగావాట్లు, రెండో దశలో పూర్తవ్వాల్సిన 67.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ల నిర్మాణ పురోగతిని ఆయన పరిశీలించారు. అక్టోబర్ నాటికి పనులు పూర్తవ్వాలని ఆదేశించారు. పనులు ఆలస్యమయితే అధికారులను బాధ్యులను చేస్తామని, వారి పనితీరును సర్వీసు రికార్డుల్లో నమోదు చేస్తామని తెలిపారు. మందమర్రిలో 28 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంటుకు అనుబంధంగా చేపడుతున్న బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టంను ఆగస్టులోపు పూర్తి చేయాలని కోరారు. సూర్య ఘర్ పథకం కింద సింగరేణిలో వివిధ భవనాలపై చేపట్టే రూఫ్‌టాప్ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, సుభాని, సోలార్ ప్రాజెక్టుల జీఎం బి.సీతారామం పాల్గొన్నారు.

బచావత్‌కు 'బనకచర్ల' విరుద్ధం!

- ప్రాజెక్టు ఆమోదయోగ్యం కాదన్న గోదావరి బోర్డు
- పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన టీఏసీ అనుమతుల ఉల్లంఘన
- గోదావరి వరద జలాలపై పరీవాహకంలోని అన్ని రాష్ట్రాలకు హక్కులు
- వాటిని ఇతర బేసిన్లకు తరలిస్తే ఆ రాష్ట్రాలకూ వాటా ఇవ్వాల్సిందే
- సీడబ్ల్యూసీకి రాసిన లేఖలో తేల్చి చెప్పిన జీఆర్ఎంబీ



సాక్షి, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ఆమోదయోగ్యం కాదని గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) కుండబద్దలు కొట్టింది. గోదావరి జలాల పంపిణీపై బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుతో పాటు పోలవరం ప్రాజెక్టుకు అనుమతిస్తూ 2011లో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)లోని 108వ టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) జారీ చేసిన మార్గదర్శకాలకు ఈ ప్రాజెక్టు విరుద్ధమని తేల్చి చెప్పింది. ఈ మేరకు గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ప్రీ ఫీజబిలిటీ రిపోర్టుపై తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ.. గోదావరి బోర్డు తాజాగా సీడబ్ల్యూసీకి లేఖ రాసింది.

జీఆర్ఎంబీ అభిప్రాయం కోరిన సీడబ్ల్యూసీ

బనకచర్ల ప్రాజెక్టును నిర్మించి రోజుకు 2 టీఎంసీలు చొప్పున మొత్తం 200 టీఎంసీల గోదావరి జలాలను క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించి 3 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు 9.14 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రత్యామ్నాయ నీటి వసతి, 80 లక్షల మందికి తాగునీటి సదుపాయం కల్పిస్తామని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖకు ప్రాజెక్టు ప్రీ ఫీజబిలిటీ రిపోర్టును సమర్పించింది. దానిని గత మే 23న గోదావరి బోర్డు, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాలకు పంపిన సీడబ్ల్యూసీ అభిప్రాయాలు కోరింది. ఈ నేపథ్యంలో గోదావరి బోర్డు తన అభిప్రాయాన్ని తెలియజేసింది.

ప్రాజెక్టు విస్తరణ కుదరదన్న బోర్డు

పోలవరం ప్రాజెక్టుకు అనుమతిస్తూ టీఏసీ జారీ చేసిన ఆపరేషన్స్ ప్రొటోకాల్స్ ప్రకారం ఆ ప్రాజెక్టు విస్తరణకు ఎలాంటి చర్యలు తీసుకోరాదని జీఆర్ఎంబీ స్పష్టం చేసింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పులోని 14(డీ) క్లాజు ప్రకారం గోదావరిలోని వరద జలాలపై అన్ని రాష్ట్రాలకు హక్కు ఉంటుందని తెలిపింది. ఒక వేళ గోదావరి జలాలను మరో నది పరీవాహక ప్రాంతానికి తరలిస్తే ఆ జలాలపై పరీవాహక ప్రాంతంలోని ఇతర రాష్ట్రాలకూ వాటాలుంటాయని వివరించింది. పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా పరీవాహక ప్రాంతానికి 80 టీఎంసీల జలాలను తరలిస్తే దానికి బదులుగా నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలకు 80 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయిస్తూ బచావత్ ట్రిబ్యునల్ నిర్ణయం తీసుకుందని గుర్తు చేసింది. ఇదే సూత్రం బనకచర్ల ప్రాజెక్టుకు సైతం వర్తిస్తుందని స్పష్టం చేసింది. గోదావరిలో వరద, మిగులు జలాల లభ్యతపై స్పష్టత రావాల్సి ఉందని పేర్కొంది. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా వరద జలాలనే తరలిస్తామని ఏపీ ప్రతిపాదించినప్పటికీ వాస్తవంగా తరలించేది వరద జలాలా? మిగులు జలాలా? నికర జలాలా? అనే అంశంపై సైతం స్పష్టత లేదని తెలిపింది.

• 'నాడు - నేడు' బడిలో.. తనయుడి 'వందనం'!

'అమ్మఒడి' దొంగలు!

లోకేశ్ ఆలోచనల నుంచి పుట్టిందే 'తల్లికి వందనం' పథకమన్న సీఎం చంద్రబాబు

పిల్లలు, ఉపాధ్యాయుల ఎదుట నిస్సిగ్గుగా అబద్ధాలు

సీఎం వ్యాఖ్యలతో నిర్ఘాంతపోయిన యావత్ తెలుగు సమాజం

తల్లికి వందనం పథకాన్ని ప్రారంభిస్తూ.. అమ్మ ఒడి మార్గదర్శకాల ప్రకారమే అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు

అదే విషయాన్ని గుర్తు చేస్తున్న తల్లిదండ్రులు, నెటిజన్లు..

నాడు-నేడు కింద కొత్తచెరువు జడ్పీ పాఠశాలను తీర్చిదిద్దిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

అక్కడ కుర్చీలు, టేబుళ్లు, డిజిటల్ బోర్డులు, ఇతర సదుపాయాలు సమకూర్చింది గత ప్రభుత్వమే.. ఇప్పుడు అదే స్కూలుకు వెళ్లి సీఎం చంద్రబాబు అబద్ధాలు

పేదరికం చదువులకు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో 2019లో 'అమ్మ ఒడి' పథకానికి శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్

40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందనే చెప్పుకునే చంద్రబాబు ఏనాడైనా కనీసం ఇలాంటి ఆలోచననైనా చేశారా? అని ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు, విద్యావేత్తలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పంచాయతీల స్థలాలు ప్రైవేట్‌పరం?

▶ మొదటి పేజీ తరువాయి

సదరు సంస్థకు గ్రామ సభ పూర్తి అంగీకారంతో అప్పగిస్తున్నట్లు నిరభ్యంతర పత్రాన్ని సమర్పించడానికి సర్కారు కార్యాచరణ సిద్ధం చేసింది. అయితే 30 ఏళ్లపాటు కార్బన్ హక్కులను ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టడం వల్ల ఆ భూములను మరే ఇతర కార్యక్రమాలకు వినియోగించుకోవడానికి పంచాయతీలకు అధికారం లేకుండా పోతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీల పాలక మండళ్లు అధికారంలో లేని సమయంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం పంచాయతీలు తమ భూములపై హక్కులు కోల్పోవడమే అవుతుందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం పంచాయతీల్లో పాలక మండళ్లు లేని కారణంగా అధికారులే ఈ తతంగం పూర్తికానిచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అవగాహన లేకుండా తీర్మానాలెలా?

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎలాంటి న్యాయ వివాదాలు లేని భూములనే ప్రైవేటు సంస్థకు అప్పగిస్తున్నట్లు పంచాయతీలు తీర్మానంలో పేర్కొనాల్సి రానుంది. కార్బన్ హక్కుల ద్వారా వచ్చే ఆదాయంలో కమ్యూనిటీ అవసరాలకు సంస్థ వినియోగించాలని పేర్కొంటున్నా గ్రామ పంచాయతీలకు దీనిపై ఎలాంటి అవగాహన లేకుండా తీర్మానాలు చేసి ఇవ్వడం వల్ల పంచాయతీలకు రాబోయే 30 ఏళ్లలో ఏవైనా అవసరం కోసం భూమి కావాలంటే లభించని పరిస్థితులు నెలకొంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ కార్బన్ క్రెడిట్స్‌తో వచ్చే ఆదాయంలో గ్రామ పంచాయతీలకు ఎంత చెల్లించాలి? ఎప్పుడు ఎంత వస్తుందో తెలియని పరిస్థితి ఎదురవనుంది.

అనుమానాలెన్నో..

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 వేలకుపైగా ఉన్న గ్రామ పంచాయతీల స్థలాలను ఓ ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టాలన్న నిర్ణయంలో ఆంతర్యం ఏమిటన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పంచాయతీల స్థలాల్లో ఎలాంటి మొక్కలు నాటుతారు? అవి స్థానిక పర్యావరణానికి అనుకూలంగా ఉంటాయా? ఒకే రకమైన మొక్కలు నాటడం ద్వారా జీవవైవిధ్యానికి ప్రమాదం కలిగే అవకాశాలు కూడా ఉంటాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఒప్పంద పత్రాలు రూపొందించింది ప్రైవేటు సంస్థే..

ఈ సంస్థకు పంచాయతీ స్థలాలపై పూర్తి అజమాయిషీని కట్టబెట్టడానికి వీలుగా సదరు సంస్థనే ఈ ఒప్పంద పత్రాలను పకడ్బందీగా రూపొందించడం గమనార్హం. ఈ తీర్మానాలకు సంబంధించి గ్రామ సభ మినిట్స్, సభకు హాజరైన సభ్యుల వివరాలు, ఫొటో/వీడియో డాక్యుమెంటేషన్ చేయడం, తీర్మానంపై సర్పంచ్, గ్రామ కార్యదర్శి, సాక్షుల సంతకాలు, వార్డు సభ్యులు, సమావేశంలో పాల్గొన్న వారి సంతకాలు, ఎన్‌వోసీపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సంతకం, పంచాయతీకి ఎక్కడెక్కడ స్థలాలు ఉన్నాయి? తదితర వివరాలతో సర్వే నంబర్లు తీసుకోవాలని పత్రాల్లో పేర్కొన్నారు. అలాగే అంగీకార పత్రంలో రాష్ట్ర ఆదేశాల మేరకు కార్బన్ ఆదాయం, ప్రయోజనాల భాగస్వామ్య విధానం నుంచి ప్రయోజనం పొందే కమ్యూనిటీ హక్కు, ప్రాజెక్టులో పాల్గొనడానికి ఎలాంటి బలవంతం లేకుండా స్వచ్ఛందంగా పాల్గొంటున్నామని పేర్కొనాల్సి రానుంది. గ్రామ సభలో చర్చించడానికి తగినంత సమయం ఇచ్చారని, తాము ముందస్తు ఉచిత సమ్మతిని స్వచ్ఛందంగా ఇస్తున్నట్లు గ్రామ సభలో పాల్గొన్న వారు ఇచ్చేలా ఒప్పందాన్ని రూపొందించడం గమనార్హం.

వడివడిగా మహిళా శక్తి చీరల ఉత్పత్తి

ప్రభుత్వ శాఖల ద్వారా సెప్టెంబర్‌లోపు ఆర్డర్లు తెప్పించుకోవాలి: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా కార్మికులకు ఉపాధి లభించడంతో పాటు చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం లభిస్తుందని వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పనితీరుపై గురువారం ఆ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు అందచేసే మహిళా శక్తి చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని, ఉత్పత్తి త్వరితగతిన పూర్తి చేయడానికి పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. వచ్చే ఏడాదికి సంబంధించిన వస్త్రాల కోసం అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్ల నుంచి సెప్టెంబర్ నెలాఖరులోగా ఆర్డర్లు తెప్పించుకోవాలన్నారు. చేనేత కార్మికుల వ్యక్తిగత రుణాల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి, కార్మికుల ఖాతాలలో వెంటనే నిధులు జమ చేయాలని అధికారులకు సూచించారు. టెస్కో షోరూంల పనితీరును మెరుగుపరచి వాటిని లాభాల బాటలో నడిపించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని హైదరాబాద్ నుంచి తరలించి యాదాద్రి జిల్లా పోచంపల్లిలో సంవత్సరంలోగా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ తెలంగాణ నేతన్నకు భరోసా పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 48.8 కోట్లు కేటాయించిందని, నేత కార్మికుల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. చేనేత కార్మికుల వ్యక్తిగత రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ.33 కోట్లు విడుదల చేసిందని, ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5,691 మంది చేనేత కార్మికులు లబ్ధి పొందనున్నారని వివరించారు.

ఉప్పొంగిన 'ప్రాణహిత'

- కాళేశ్వరం ఘాట్ వద్ద 10.690 మీటర్ల ఎత్తులో నీటిమట్టం
- మేడిగడ్డ బరాజ్ వద్ద 6.36 లక్షల క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో


సిర్పూర్(టి): ఉప్పొంగి ప్రవహిస్తున్న పెన్‌గంగ నది

చింతలమానెపల్లి/కాళేశ్వరం/ ఆసిఫాబాద్/ములకలపల్లి: ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలు, ఉప నదుల వరదల కారణంగా ప్రాణహిత నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. చింతలమానెపల్లి మండలం గూడెం వద్ద అంతర్రాష్ట్ర బ్రిడ్జిని తాకేలా ప్రాణహిత ప్రవహిస్తోంది. నదిలో చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు అప్రమత్తం చేశారు. మండలంలోని దిందా వాగులో పడి కేతిని గ్రామానికి చెందిన సెడ్మెక సుమన్(18) గల్లంతయ్యాడు. స్నేహితులతో కలిసి వాగు అవతలి వైపు ఉన్న వ్యవసాయ భూముల వద్దకు వెళ్లి వచ్చే క్రమంలో నది దాటేందుకు ప్రయత్నించి పట్టు తప్పాడు. ఈ క్రమంలో గట్టుపై ఉన్న చెట్టును పట్టుకోగా కొమ్మ విరిగి వరద ఉధృతిలో కొట్టుకుపోయాడు.

- సిర్పూర్(టి) మండలంలో వెంకట్రావుపేట్-పోడ్సా అంతర్రాష్ట్ర హైలెవల్ వంతెనను ఆనుకొని పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ఇలాగే కొనసాగితే తెలంగాణ-మహారాష్ట్రకు రాకపోకలు నిలిచిపోయే అవకాశముంది. వరద నీరు గంట గంటకూ పెరుగుతుండడంతో తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆయా మండలాల్లో వందలాది ఎకరాల్లో పత్తి పంట నీట మునిగింది.
- మంచిర్యాల జిల్లా వేమనపల్లి, కోటపల్లి మండలాల్లో ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పరీవాహక ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో పత్తి పంటలు నీట మునిగాయి.

కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద...


భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 10.690 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు ప్రవహిస్తోంది. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ(లక్ష్మీ) బరాజ్‌కు వరద ప్రవాహం 6.36 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రూపంలో వస్తోంది. బరాజ్ 85 గేట్లు ఎత్తి అదే స్థాయిలో 6.36 లక్షల క్యూసెక్కుల నీటిని ఔట్‌ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు.

కుమురంభీం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

కుమురంభీం ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో అధికారులు గురువారం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తారు. ఇన్‌ఫ్లో 850 క్యూసెక్కులు ఉండగా.. రెండు గేట్లు ఎత్తి 880 దిగువకు వదులుతున్నారు.

'సీతారామ' ప్రధానకాల్వ కట్టకు కోత

సీతారామ ఎత్తిపోతల పథకం (ఎస్ఆర్ఎల్ఐ) ప్రధాన కాల్వ కట్టకు ప్రమాదం పొంచి ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం వీకే.రామవరంలోని సీతారామ పంప్‌హౌస్-2 నుంచి కమలాపురం వద్ద గల పంప్‌హౌస్-3 వరకు వెళ్లే ప్రధాన కాల్వకు భారీ గొయ్యి ఏర్పడింది. వర్షాల నేపథ్యంలో వరద ఉధృతికి క్రమేపీ కోత పెరుగుతోంది.


నాగార్జునసాగర్ జలాశయం

సాగర్‌కు కొనసాగుతున్న వరద

541 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్: శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగర్‌కు వరద కొనసాగుతోంది. అధికారులు శ్రీశైలం జలాశయం మూడు రేడియల్ క్రస్ట్‌గేట్లతోపాటు కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే మీదుగా 81,195 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 67,552 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జునసాగర్ జలాశయానికి 1,16,833 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 541.20 అడుగులు(190.8366 టీఎంసీలు) ఉంది. నీటిమట్టం 546 అడుగులకు చేరితే నీరు క్రస్ట్‌గేట్లకు తగులుతుంది. వరద ఉధృతితో సాగర్ నీటిమట్టం మూడు రోజుల్లోనే పది అడుగులకుపైగా పెరిగింది.

కడెం గేటు ఎత్తివేత

కడెం: ఎగువన కురుస్తున్న వర్షాలతో కడెం ప్రాజెక్టుకు గురువారం వరద పోటెత్తింది. ఉదయం 1,162 క్యూసెక్కులు రాగా, సాయంత్రం 5 గంటలకు 20,313 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి 9 గంటలకు 7,497 క్యూసెక్కులు తగ్గింది. ప్రాజెక్టులో నీటిమట్టం 693.300 అడుగులకు చేరింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో రాత్రి 10:30 గంటలకు ప్రాజెక్టు 9వ నంబర్ గేట్‌ను 4 అడుగుల మేర ఎత్తి 4,341 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

దేశ పటంలో తెలంగాణను తొలగిస్తారా?

తప్పుబట్టిన కేటీఆర్.. బీజేపీ క్షమాపణకు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: సొంత అస్తిత్వం కోసం తెలంగాణ ప్రాంతం చేసిన పోరాటాన్ని బీజేపీ ప్రశ్నార్థకంగా మారుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు విమర్శించారు. ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు తెలంగాణ లేని భారతదేశ చిత్రపటాన్ని బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ బహూకరించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశ చిత్రపటం నుంచి తెలంగాణను తొలగించిన బీజేపీ నేతలు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని, భౌగోళిక స్వరూపాన్ని గుర్తించకపోవడం బీజేపీ అధికారిక విధానమా అని ప్రధాని మోదీని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని లెక్కచేయకుండా బీజేపీ చేసిన చర్య తమను తీవ్రంగా బాధించిందన్నారు. దేశ చిత్రపటం నుంచి తెలంగాణను తొలగించడం ఇక్కడి ప్రజల త్యాగాలు, రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటాలు, బలిదానాలను అగౌరవపరచడంతోపాటు తెలంగాణ చరిత్రను నిర్లక్ష్యం చేయడమేనని కేటీఆర్ పేర్కొన్నారు.

బుల్డోజర్ రాజ్యం...: పేదలకు ఇందిరమ్మ ఇళ్లు రాకున్నా ఇంటింటికీ బుల్డోజర్లు మాత్రం వస్తాయని మరో ప్రకటనలో కేటీఆర్ విమర్శించారు. మహానగరాన్ని దాటుకొని హైడ్రా మారుమూల పల్లెల వరకు వెళ్తోందని మండిపడ్డారు. జనారణ్యం నుంచి వనారణ్యం దాకా రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని ఆక్షేపించారు. ఆరు గ్యారంటీలను గాలికి వదిలి.. ప్రజలు అడగని 'హైడ్రా'తో పాలన ముందుకు సాగుతోందని దుయ్యబట్టారు.

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 11-7-2025

ధరణికి ఎనిమిదేళ్లు. ఈమధ్య బోర్డు మీద రాసింది స్పష్టంగా కనిపించడం లేదని తరచు చెబుతోంది. అమ్మాయి పూర్తి ఆరోగ్యంగా ఉంటుంది. కళ్లు కూడా మెరుస్తున్నట్టుగా మిలమిలలాడుతూ ఉంటాయి. మొదట్లో తల్లిదండ్రులు పెద్దగా పట్టించుకోలేదు కానీ పదే పదే చెబుతుండటంతో కంటి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లారు. పరీక్షలన్నీ చేసిన డాక్టర్ గారు... ధరణి మయోపియా (షార్ట్‌సైటెడ్‌నెస్)తో బాధపడుతోందనీ, ఈ సమస్య ఉన్నవారిలో కేవలం చాలా దగ్గరివే కనిపిస్తాయనీ, దూరం ఉన్నవి స్పష్టంగా కనిపించవనీ, దాంతో స్కూల్లో బ్లాక్‌బోర్డుపై ఉన్న రాతలు స్పష్టంగా కనిపించడం లేదంటూ చెప్పారు. అంతే... ఆశ్చర్యపోవడం తల్లిదండ్రుల వంతయ్యింది.

* మయోపియా నివారణ



ఆరుబయట ఆట
కంటిపాపలకు మేలు

ఇది కేవలం ఒక్క కేస్ స్టడీ మాత్రమే.

ధరణి లాంటి అమ్మాయిలూ, అబ్బాయిలూ దేశ వ్యాప్తంగా ఎందరో! స్కూలుకెళ్లే ఆరు నుంచి 12 ఏళ్ల చిన్నారులు ఈ కంప్లైంట్‌తో రావడం... వాళ్లలో ఈ సమస్య బయటపడటం చాలా సాధారణం.

ఈ సమస్యకు కారణం మొదటిది వంశపారంపర్యంగా మయోపియా ఉన్న కుటుంబాల్లో ఈ సమస్య రావడం చాలా సాధారణమైతే.... రెండో కారణం పిల్లలు ఎప్పుడూ ఆరుబయట ఆడకుండా ఇన్–డోర్స్‌లోనే ఎక్కువగా గడపడం.

ఆరుబయట ఆడుకునే పిల్లల్లో తక్కువే...

నిజానికి ధరణినే కాదు... ఆ వయసు చిన్నారులు ఇప్పుడు ఆరుబయట ఆటలాడటం చాలా తక్కువ. గతంలో ఆ వయసు పిల్లలు ఆరుబయట విస్తృతంగా ఆడుతుండేవాళ్లు. ''ఆడింది చాలు. ఇక లోపలికి రండి. కాళ్లూ చేతులు కడుక్కుని ఏదైనా కాస్తంత తిని చదువుకోండి'' అంటూ అమ్మలో లేదా ఇంట్లోని పెద్దవాళ్లో కోప్పడుతుండటం మామూలే. దాదాపు నాలుగైదు దశాబ్దాల కంటే ముందు పిల్లలు ఇలా మట్టిలో ఆడుకుంటూ ఉండేవారు. కారణమేమిటో ... ఎందుకో కూడా తెలియదు గానీ ఇలా ఆరుబయట బాగా ఆటలాడుకునే పిల్లల్లో దూరపు వస్తువులు స్పష్టంగా కనిపించని 'షార్ట్‌సైటెడ్‌నెస్' అని పిలిచే మయోపియా చాలా తక్కువ. బయట ఆటలాడకుండా ఇలా ఎక్కువసేపు ఇన్–డోర్స్‌లోనే ఉండే పిల్లలకూ ఇలా మయోపియా ఎందుకు ఎక్కువగా కనిపిస్తుందో పెద్దగా తెలియదు.

సరిదిద్దడమిలా...

మయోపియా (షార్ట్‌సైటెడ్‌నెస్) అనేది రిఫ్రాక్టివ్ సమస్య. అంటే కాంతి కిరణాలు రెటీనాపై కాకుండా కనుగుడ్డులో కాస్తంత లోపలే కేంద్రీకృతం కావడంతో ఈ సమస్య వస్తుంది. కంటి అద్దాలతో చాలా సులువుగా ఈ సమస్యను చక్కదిద్దవచ్చు. కంటి అద్దాలను అంతగా ఇష్టపడనివాళ్లు కాంటాక్ట్ లెన్స్ కూడా ధరించవచ్చు... గానీ వాటిని సంరక్షించుకోవడం మళ్లీ ప్లెయిన్ కళ్లజోడు వాడటం మంచిది. ఇక ఒక వయసు వచ్చాక కళ్లజోడు ధరించడం అంతగా ఇష్టపడకపోతే... పద్దెనిమిదేళ్లు దాటాక 'లేసిక్' అనే శస్త్రచికిత్స (రిఫ్రాక్టివ్ సర్జరీ) ద్వారా కూడా ఈ సమస్యను చక్కదిద్దవచ్చు.

ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే... పిల్లలు స్కూల్లో బోర్డుగానీ లేదా తమ స్కూలు బస్సు తాలూకు బోర్డుగానీ లేదంటే దూరపు వస్తువులుగానీ స్పష్టంగా కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేస్తే తల్లిదండ్రులు తప్పక వెంటనే స్పందించాలి. మరీ ఆలస్యం చేసిన పిల్లల్లో తీవ్రమైన తలనొప్పి వస్తుండటంతో పాటు అరుదుగానైనా మరికొన్ని సమస్యలూ వచ్చే అవకాశాలుంటాయి.



డా॥ రవి కుమార్ రెడ్డి,
సీనియర్ కంటివైద్య నిపుణులు

పిల్లలను ఆడనివ్వండి...

నిర్దిష్టమైన కారణమంటూ తెలియకపోయినప్పటికీ... ఆరుబయట అలసట వచ్చేలా ఆడుతుండే పిల్లల్లో మయోపియా చాలా తక్కువ. అందుకే పిల్లలను హాయిగా ఆడుకోనివ్వండి. ఇలా ఆడనివ్వడం వల్ల వాళ్లకు తగినంత బాల్యం ఇవ్వడంతో పాటు ఈ మయోపియా (షార్ట్‌సైటెడ్‌నెస్) నుంచి నివారణ కూడా ఇచ్చినట్లవుతుంది.

పిల్లలు స్క్రీన్ చూసే సమయం తగ్గించండి...

ఇవాళ టీవీ లేని ఇల్లంటూ లేదు. అంతేకాదు... కంప్యూటరూ, ల్యాప్‌టాప్ వంటివి లేని ఇళ్లు కూడా ఉండవంటే అతిశయోక్తి కాదు. ఇక మొబైల్ అయితే పిల్లలకూ లేకుండా ఉండటం లేదు. టీవీ, కంప్యూటరూ, మొబైల్... ఇలా అది ఏ స్క్రీన్ అయినప్పటికీ దాన్నుంచి వెలువడే కాంతితో చిన్నారుల కళ్లను కాపాడుకోవడం ఎలాగో చూద్దాం.

- పిల్లలు టీవీ లేదా కంప్యూటర్ స్క్రీన్‌ను చూసే వ్యవధిని తల్లిదండ్రులు విధిగా తగ్గించాలి. అంటే రోజూ కొద్దిసేపు మాత్రమే వాళ్లను టీవీ, కంప్యూటర్, మొబైల్‌లను చూడనివ్వాలి.
- మొబైల్ లేదా కంప్యూటర్ కాంతి అదేపనిగా కంటిని తగులుతూ ఉండకూడదు. కాసేపు స్క్రీన్ చూశాక కనీసం కొద్ది నిమిషాల పాటు కంటికి రెస్ట్ ఇవ్వాలి.
- గదిలో చీకటిగా ఉన్నప్పుడు టీవీ వెలుతురులో లేదా కంప్యూటర్ వెలుతురులో పిల్లలు చదవడానికి ప్రయత్నించకూడదు.
- టీవీ లేదా కంప్యూటర్‌ను మసక చీకట్లో చూడటం సరికాదు. అవి ఆన్‌లో ఉన్నప్పుడు గదిలో లైట్ వెలుగుతూ ఉండాలి. చుట్టూ చీకటిగా ఉన్నప్పుడు కంప్యూటర్/మొబైల్ స్క్రీన్ నుంచి లేదా టీవీ నుంచి వెలువడే కాంతి కంటికి హాని చేసే అవకాశం ఎక్కువ.

– యాసీన్

మీ రాముడు దొరికే వరకు వేచి చూడండి!



ఉపాసన

పెళ్లి అనేది భార్యాభర్తలిద్దరూ
మంచి స్నేహితులుగా
మారడానికి చేసే సాధన!
దానికి కావలసింది..
కట్నకానుకలు,
ఆస్తి అంతస్తులు, స్థాయీ
హోదాలు కాదు పరస్పర గౌరవం!
గౌరవం బైప్రొడక్ట్సే ప్రేమాభిమానాలు!
తత్వవేత్తల నుంచి సెలబ్రిటీల దాకా పెళ్లి గురించి
ఎవరిని కదిలించినా పై మాటే చెబుతారు.
ప్రముఖ బిజినెస్ ఉమన్, నటుడు రామచరణ్ జీవిత భాగస్వామి.
సెలబ్రిటీ వైఫ్ ఉపాసన కామినేని కొణిదెల కూడా
తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో అలాంటి భావననే పోస్ట్ చేశారు.



రామ్‌చరణ్, ఉపాసన

'ఇదివరకటిలా కాకుండా ఇప్పుడు అమ్మాయిలంతా ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ఎలాంటి టాస్క్‌నైనా హ్యాండిల్ చేస్తున్నారు. కొంతమంది అమ్మాయిలైతే అబ్బాయిలకన్నా సక్సెస్‌ఫుల్‌గా ఉంటున్నారు. జీవితంలో పురుషుడి సహాయం లేకుండానే కుటుంబాన్ని పోషిస్తున్నారు.. పిల్లలనూ చక్కగా పెంచుతున్నారు.. ఒక్కమాటలో చెప్పాలంటే తాము కోరుకున్నట్లుగా తమ జీవితాన్ని డిజైన్ చేసుకుంటున్నారు.. ఆస్వాదిస్తున్నారు కూడా! ఇదంతా చూస్తుంటే ఆడవాళ్లకి అసలు మగవాళ్ల అవసరమే లేదనిపిస్తోంది. అందుకే పెళ్లికి అమ్మాయిలు తొందరపడాల్సిన అవసరం లేదు. భార్యాభర్తలకున్న అర్థం మారిపోయిందిప్పుడు. భర్త యజమాని కాదిప్పుడు.. సమ భాగస్వామి. అందుకే పెళ్లంటే ఇప్పుడు భర్తను ఎంచుకోవడం కాదు.. భార్యనీ తనతో సమానంగా చూసే భాగస్వామితో సహజీవనం చేయడం. అయితే ఈ ఆచరణ అనుకున్నంత ఈజీ కాదు. పెళ్లి విషయంలో వచ్చిన ఈ మార్పును మహిళలంతా అంగీకరించాలి.

వైవాహిక జీవితంలో ఆడవాళ్ల మీద హింస పెరిగిపోతోంది.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కలే దానికి ఉదాహరణ. భార్యాభర్తలిద్దరూ సమాన హక్కులు, సమాన బాధ్యతలతో ఇంట్లో ప్రజాస్వామిక వాతావరణాన్ని రూపొందించుకున్నప్పుడే కుటుంబం స్ట్రాంగ్‌గా ఉంటుంది. అలాంటి కుటుంబాల్లో హింసకు చోటు ఉండదు. ఆడపిల్ల, మగపిల్లాడు ఇద్దరూ సమానమనే భావన పెంపకంలో కనిపించాలి. అప్పుడే అబ్బాయిలు ఆ స్పృహతో పెరుగుతారు. అమ్మాయిలను తమతో సమానంగా చూడటం మొదలు పెడతారు. ఈ చైతన్యం కల్పించడంలో ప్రివిలేజ్డ్ విమెన్ మిగిలిన మహిళలకు సాయపడాలి. ఆల్రెడీ పెళ్లికి సంబంధించి అబ్బాయిల విషయంలో ఆచితూచి అడుగులేస్తూ సరైన భాగస్వామి కోసం చూస్తున్న అమ్మాయిలు 'నేను మరీ అతిగా ఆలోచిస్తున్నానా? ఈ ధోరణితో పెళ్లికి ఆలస్యమవుతోందా' అనే ఆలోచనల్లో ఉంటే ఆ ఆలోచనలను మానుకోండి. మీరు సరైన ట్రాక్‌లోనే ఉన్నారు. పెళ్లిప్పుడు సామాజిక ఒత్తిడి కాదు. పూర్తిగా వ్యక్తిగత వ్యవహారం. తనతో సమానంగా ట్రీట్ చేసి.. గౌరవించే వ్యక్తి చేతినే అందుకోండి. అలాంటి 'మీ రాముడు' దొరికే వరకు వేచి చూడండి. దొరికితేనే పెళ్లికి సిద్ధమవండి. వేచి చూడడం, దొరక్కపోతే పెళ్లికి దూరంగా ఉండటం.. ఈ రెండూ కరెక్టే.. విలువైన నిర్ణయాలే!' అని షేర్ చేసిన ఉపాసన పోస్ట్ వైరల్ అయింది.

సీక్రెట్ ఆఫ్ సక్సెస్‌ఫుల్ మ్యారేజ్..

ఈ మధ్యనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ మాసూమ్ మీనావాలాతో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఉపాసన 'రామ్ చాలా సెక్యూర్డ్ మ్యాన్. బిజినెస్ మొదలు పర్సనల్ అచీవ్‌మెంట్స్ వరకు అన్నిటికీ సపోర్ట్ చేస్తాడు. మరింత సక్సెస్ సాధించేలా ప్రోత్సహిస్తాడు. ఎక్కడా అభద్రత ఫీలవ్వడు. తన విషయంలో నేనూ అంతే! పెళ్లయిన నాటి నుంచే స్పష్టత ఉంది మా ఇద్దరికీ.. ఇద్దరం ఈక్వలే అని! ఒకరినొకరం గౌరవించుకుంటాం. అర్థం చేసుకుంటాం. ఒడిదుడుకుల్లో ఒకరికొకరం సపోర్ట్‌గా ఉంటాం. ఎవరమెంత బిజీగా ఉన్నా వారానికి ఒకరోజు తప్పకుండా కలిసే గడుపుతాం. ఫోన్లు, టీవీలు ఆఫ్ చేసి క్వాలిటీ టైమ్ స్పెండ్ చేస్తాం. అయితే మా మధ్య గొడవలు అసలే ఉండవా అంటే ఎందుకుండవ్.. ఉంటాయి. గొడవలొచ్చినప్పుడు బేషజాల్లేకుండా డిస్కస్ చేసుకుంటాం. భార్యాభర్తల మధ్య కమ్యూనికేషన్ చాలా అవసరం. అది కీ లాంటిది. సమస్యలు వచ్చినప్పుడు నాన్చకుండా ఎప్పటికప్పుడు డిస్కస్ చేసుకుని పరిష్కరించుకోవాలి. దానివల్ల ఇద్దరి మధ్య అండర్‌స్టాండింగ్ పెరిగి ఆ బంధం బలపడుతుంది. అంతేకాదు మేము మూడునెలలకు ఒకసారి మా రిలేషన్‌షిప్‌కి సంబంధించి రివ్యూ కూడా చేసుకుంటాం. ఇవన్నీ మా మ్యారీడ్ లైఫ్ హ్యాపీగా సాగడానికి హెల్ప్ అవుతున్నాయి. ఒకరకంగా వాటిని మా సక్సెస్‌ఫుల్ మ్యారేజ్ సీక్రెట్స్‌గా చెప్పొచ్చు' అంటూ తన వైవాహిక జీవితం గురించిన విషయాలు, విశేషాలను చెప్పుకొచ్చారు.

ఫ్యాషన్

అద్దమంటి ఆకృతి

ముఖాన్ని మాత్రమే కాదు
మన ఆత్మవిశ్వాసాన్నీ చూపుతుంది అద్దం.
అద్దం లాంటి ఆకృతి కాదు,
ఆకృతే అద్దంగా మారుతోంది.
అద్దాన్ని ఫ్యాబ్రిక్‌కి జత చేసి, ధరించడం
ఎవర్‌గ్రీన్‌గా పేరొందిన స్టైల్.
వాటిలో .. అసిమెట్రిక్ మిర్రర్ స్టైల్
నేడు ఫ్యాషన్ ప్రపంచాన్ని అమితంగా ఆకట్టుకుంటోంది.
అద్దం కేవలం స్టైల్ కాదు ఒక స్టేట్‌మెంట్.



స్టార్స్ స్టెప్స్

సోనమ్ కపూర్ అసిమెట్రిక్ మిర్రర్ గౌన్లు ఎప్పుడూ ట్రెండ్ సెట్టింగ్ అని చెప్పవచ్చు. దీపికా పదుకొనె మెటాలిక్ మిర్రర్ డిజైన్స్‌తో మెరిసిపోతుంటుంది. బాలీవుడ్ నుండి దక్షిణాది వరకు మిర్రర్ ఇన్‌ఫ్లుయెన్స్ స్పష్టంగా కనిపిస్తోంది.

ర్యాంప్ పై రిఫ్లెక్షన్

ప్రముఖ డిజైనర్లు గౌరవ్ గుప్తా, వ్యాన్ హెర్పెన్ వంటి వారు మిర్రర్ వర్క్ డిజైన్స్‌తో తమ హవా కొనసాగించారు. గాలా, కాన్స్ రెడ్ కార్పెట్‌లలోనూ సెలబ్రిటీలు మిర్రర్ షైనింగ్ గౌన్స్‌లో మెరుస్తున్నారు.



స్ట్రీట్ స్టైల్

ఈ ట్రెండ్ ఫ్యాషనబుల్‌గా కనిపించడానికే కాదు, జీన్స్ టాప్స్ లో అసిమెట్రిక్ హేమ్ లైన్, మిర్రర్ బెల్ట్స్, శాలువాలు, బ్యాగ్స్, ఇయర్ రింగ్స్, ఫుట్‌వేర్ .. ఇలా అన్ని యాక్సెసరీస్ లో ఈ బిగ్ మిర్రర్ టచ్ కనిపిస్తోంది.

- అద్దం, డిజైన్‌తో డ్రెస్ స్పెషల్‌గా ఉంటుంది కాబట్టి ఇతర హంగులేవీ అక్కర్లేదు.
- మదిని మరింత మెరుపుగా సింగారించడానికి అద్దం వర్క్ కొత్తగా రూపుకడుతుంది.
- పర్ఫెక్ట్ షేప్‌తో డ్రెస్ అందంగా కనిపిస్తుంది అనేది ఒక కోణం మాత్రమే. నిజమైన ఫ్యాషన్ అనేది మిర్రర్ డిజైన్స్‌లోనూ ఉంటుంది. అసిమెట్రికల్ బ్యూటీని అర్థం చేసుకునే వారికి ఇది ఓ వేడుక కూడా.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సంగీత్ వర్మ మిర్రర్ ఎంబ్రాయిడరీ వర్క్ డిజైన్స్‌లో మేటిగా నిలిచారు. రెడ్ కార్పెట్, వివాహ వేడుకలలో ప్రత్యేకంగా నిలిచే ఈ మిర్రర్ డ్రెస్సులు మరింత అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి.



బులియన్ జూలై 10న ముగింపు (బంగారం 10 గ్రా.: వెండి కిలో) రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,910
బంగారం (22 క్యారెట్లు)	90,345
వెండి	1,09,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	99,630
బంగారం (22 క్యారెట్లు)	90,200
వెండి	1,10,000
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,400
బంగారం (22 క్యారెట్లు)	90,200
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	99,630
బంగారం (22 క్యారెట్లు)	92,900
వెండి	1,10,000
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,200
బంగారం (22 క్యారెట్లు)	89,420
వెండి	1,08,200
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	98,400
బంగారం (22 క్యారెట్లు)	90,200
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● మార్పు

అప్పుడు బంజరు భూమి... ఇప్పుడు ప్లేగ్రౌండ్



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలోని మారుమూల గ్రామం... చింద్నార్. ఈ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వెనక ఉన్న బంజరు భూమి ఇప్పుడు వాలీబాల్ కోర్టు, రన్నింగ్ ట్రాక్, క్లైంబింగ్ వాల్, లాంగ్ జంప్ పిట్... మొదలైన వాటితో అందమైన ప్లేగ్రౌండ్‌గా మారింది. ఈ గ్రామంలోనే కాదు దంతెవాడ జిల్లాలో ఎన్నో మారుమూల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల వెనకాల ఉన్న బంజరు భూములు అందమైన ప్లేగ్రౌండ్స్‌గా మారి ఆహా! అనిపిస్తున్నాయి.

ఈ మార్పుకు కారణం... సచిన్ టెండుల్కర్ ఫౌండేషన్, మన్ దేశీ ఫౌండేషన్. ప్లేగ్రౌండ్స్‌కే పరిమితం కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ కోచ్‌లుగా శిక్షణ ఇస్తున్నారు. ప్లేగ్రౌండ్ నిర్మాణ ప్రక్రియ అనేది కమ్యూనిటీ ఈవెంట్‌గా మారింది. గ్రామప్రజలు ప్లేగ్రౌండ్ నిర్మాణ పనుల్లో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు.

మన దేశంలో 65–70 శాతం స్కూల్స్‌లో సరియైన ప్లేగ్రౌండ్‌లు లేవు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మరిన్ని రాష్ట్రాలలోనూ తన ప్రాజెక్ట్‌ను అమలు చేయాలని సంకల్పించాయి సచిన్, మన్ దేశీ ఫౌండేషన్‌లు.

● సమ్‌థింగ్ స్పెషల్

ఆహా... ఛీఛీ... గాజర్ కె హల్వా కా దోశ!



ఉత్తరాది, దక్షిణాది రుచులు ఒకచోట, ఒకే ఐటమ్‌లో కనిపిస్తే?

ఆ ఐటమ్ పేరే... గాజర్ కే హల్వా కా దోశ!

ఇండోర్‌కు చెందిన ఈ దోశలో అదనపు ఆకర్షణ క్యారట్ హల్వా, రబ్డీ. ప్రస్తుతం ఈ వీడియో నెట్‌లోకంలో హల్‌చల్ చేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్‌పై మిక్స్‌డ్ రియాక్షన్స్ కనిపించాయి.

కొందరు...'ఆహా!' అంటున్నారు.
కొందరు...'ఛీఛీ' అంటున్నారు.

● ఇంటిప్



మినరల్ వాటర్ క్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల రాళ్ల ఉప్పు, టీస్పూను బేకింగ్ సోడా, రెండు స్పూన్ల నిమ్మ రసం, కాసిని గోరు వెచ్చని నీళ్లు పోసి పదిహేను నిమిషాలు నానబెట్టాలి. తరువాత క్యాన్‌ను పైకి కిందకు బాగా గిలకొట్టాలి. పదినిమిషాలపాటు ఇలా గిలకొట్టి రెండుమూడుసార్లు నీటితో కడగాలి. తరువాత డిష్ వాష్ లిక్విడ్‌తో క్యాన్ మురికి వదిలి కొత్తదానిలా మెరుస్తుంది.

● బ్యూటిప్స్


ముఖంపై ముడతలు మాయం



బెల్లంతో తయారు చేసిన ఫేస్ వాష్ యాంటీ ఏజింగ్‌గా పనిచేసి ముడతలను కనిపించనియ్యదు.

- చిన్న బెల్లం ముక్క తీసుకుని ఒక గిన్నెలో వేసి, టీస్పూను నీళ్లుపోసి ఉంచాలి. బెల్లం కరిగిన తరువాత టీస్పూను శనగ పిండి, టీస్పూను పెరుగు వేసి బాగా కలుపుకోవాలి.
- ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఏడు నిమిషాలపాటు వలయాకారంలో మర్దన చేయాలి. ఇరవై నిమిషాలపాటు ఆరనిచ్చి చల్లటి నీటితో కడిగేయాలి. ముఖాన్ని పొడిగా తుడుచుకుని మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్ రాసుకోవాలి.
- ఈ ఫేస్‌వాష్‌ను వాడడం వల్ల ముఖం కాంతిమంతంగా కనిపిస్తుంది. వారానికి రెండుసార్లు క్రమం తప్పకుండా వాడడం వల్ల ముఖం మీద ముడతలు తగ్గుముఖం పడతాయి.

యువ సాధికారతకు జై



తమ భవిష్యత్ చిత్రపటాన్ని తామే తీర్చి దిద్దుకునే బలమైన సాధనాలు యువతరం చేతిలో ఉన్నాయి అని నొక్కి చెబుతుంది ఐక్య రాజ్య సమితి.

యువతను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవం థీమ్‌ను రూపొందించారు.

'తాము కోరుకునే కుటుంబాలను సృష్టించడా నికి యువతకు సాధికారత కల్పించడం' అనేది ఈ సంవత్సరం థీమ్.

యువత తమ భవిష్యత్తును నిర్దేశించుకునేందుకు అవసరమైన హక్కులు, అవకాశాలు, సదుపాయా లను అందించాల్సిన అవసరాన్ని ఈ థీమ్ సూచిస్తోంది.

ఒక దేశ జనాభా అభిలషణీయ స్థాయిని దాటి పెరి గితే అది ఆ దేశ అభివృద్ధికి అడ్డు గోడ అవుతుంది. ఈ ఎరుక ప్రతి ఒక్కరిలో ఉండాలి. అధిక జనాభా అనర్థాల గురించి యువతలో అవగా హన కలిగించడానికి ఐక్యరాజ్య సమితి నుంచి ప్రపంచ ప్రముఖ సంస్థల వరకు ఎన్నో సంస్థలు కృషి చేస్తున్నాయి.

రీప్రొడక్టివిటీ హెల్త్, ఫ్యామిలీ ప్లానింగ్ విషయంలో యువతను చైతన్య పరచడానికి ప్రాధాన్యత ఇస్తోంది ఐక్యరాజ్య సమితి పాపులేషన్ ఫండ్. రీప్రొడక్టివిటీ హెల్త్, ఫ్యామిలీ ప్లానింగ్‌కు సంబంధించిన సమా చారం, సేవలు యువతకు అందుబాటులో ఉండడంపై ఈ సంస్థ దృష్టి పెట్టింది.

ఫ్రాన్స్‌లోని 'డెమోగ్రఫీ రెస్పాన్సిబుల్' జర్మ నీలోని 'సస్టెయినబుల్ పాపులేషన్' స్వీడన్‌లోని 'పాపులేషన్ మ్యాటర్స్' తమ ఉద్యమ కార్యాచర ణలో యువతను భాగస్వాములను చేస్తున్నాయి.

'పాపులేషన్ కనెక్షన్' చాలా సంవత్సరాలుగా జనాభా నియంత్రణపై యువతకు అవగాహన కలిగి స్తోంది. ఈ సంస్థ 1968లో 'జీరో పాపులేషన్ గ్రోత్' పేరుతో ప్రారంభం అయింది. జనాభా, ఆరోగ్యం, పర్యావరణంల మధ్య ఉన్న అంతస్సంబంధాలపై అమెరికాలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసింది.

పర్యావరణ సంక్షోభం, నిరాక్షరాస్యత... మొద లైన సమస్యలపై పని చేస్తున్న యువ సామాజిక కార్యకర్తలు విరివిగా కనిపిస్తారుగానీ జనాభా నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ప్రామి నెంట్ యంగ్ యాక్టివిస్ట్‌లు తక్కువగా కనిపి స్తారు.

అధిక జనాభా వల్ల వచ్చే సమస్యలు ఏమిటి, చిన్న కుటుంబాల వలన మేలు ఏమిటి? అనే కోణంలో పట్టణం, మారు మూల పల్లె అనే తేడా లేకుండా ప్రచారం చేయడానికి యువ సామాజిక కార్యక ర్తలు నడుం కట్టాల్సి ఉంది.

ఇలా చేయాలి...

- ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే సదస్సు, వర్క్‌షాప్... మొదలైన వాటిలో తప్పనిసరిగా పాల్గొనాలి.
- సమావేశాల్లో తెలుసుకున్న విషయాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. ఇన్‌ఫోగ్రాఫిక్స్ రూపంలో ఫ్యాక్ట్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయాలి. కవితలు, కథల రూపంలో కూడా అధిక జనాభా కలిగే సమస్యల గురించి ప్రచారం చేయవచ్చు.
- పాపులేషన్ ట్రెండ్స్‌పై మరింతగా అధ్యయనం చేసి కుటుంబ సభ్యులు, స్నేహితులు... మొదలైన వారితో పంచుకోవాలి.

● టెక్ టాక్

షావోమి ఏఐ గ్లాస్



- ఫీచర్స్: 12-మెగా పిక్సెల్ ఆల్ట్రా వైడ్ కెమెరా
- పవర్డ్ బై: స్నాప్‌డ్రాగన్ ఏఆర్1 ప్లస్ చిప్
- సపోర్ట్: ఫస్ట్-పర్సన్ వీడియో రికార్డింగ్, ఫొటోగ్రఫీ
- యాక్సెస్: లైవ్ అబ్జెక్ట్ రికగ్నిజేషన్, రియల్-టైమ్ టెక్స్ట్ ట్రాన్స్‌లేషన్
- సింగిల్ చార్జ్: 8 గంటలు

హానర్ 400



- డిస్‌ప్లే: 6.55 అంగుళాలు
- రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
- రిజల్యూషన్: 1264×2736 పిక్సెల్స్
- ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ
- మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 8జీబిర్యామ్
- కనెక్టివిటీ: 5జీ ● బ్యాటరీ: 5300 ఎంఏహెచ్

వ్యూ సోనిక్



'వ్యూ సోనిక్' 138-అంగుళాల ఫోల్డబుల్ ఎల్ఈడీ డిస్‌ప్లేను మన దేశంలో లాంచ్ చేసింది. గ్యాలరీలు, ట్రెనింగ్ హాల్స్, కార్పొరేట్ ఆఫీసులు, ఆడిటోరియమ్‌లలో ఇది బాగా ఉపయోగపడుతుంది. పర్మినెంట్‌గా ఇన్‌స్టాల్ చేసేలా కాకుండా సులభంగా ట్రాన్స్‌పోర్ట్ చేసేలా రూపొందించారు. అసెంబ్లెడ్ కిట్‌లో ఎల్ఈడీ మాడ్యూల్స్, క్యాబినెట్స్, మోటరైజ్‌డ్ ఫ్లోర్ స్టాండ్‌లు ఉంటాయి.

టాకింగ్ మెషిన్స్



కొత్త ఫీచర్‌లను ఎప్పటికప్పుడూ తీసుకువస్తుం టుంది క్యారెక్టర్.ఏఐ ప్లాట్‌ఫామ్. ఓపెన్ ఏఐ అడ్వాన్స్‌డ్ వాయిస్ మోడ్‌ను అనుసరిస్తూ 'కాల్‌ఫీచర్'ని తీసుకువచ్చింది. కొన్ని నెలల క్రితం తీసుకువచ్చిన కటింగ్-ఎడ్జ్ వీడియో జనరేషన్ మోడల్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ మోడల్ సింగిల్ ఇమేజ్‌ను వీడియోగా మారుస్తుంది. తాజాగా 'టాకింగ్ మెషిన్స్' అనే కొత్త మోడల్‌ను తీసుకువచ్చింది క్యారెక్టర్.ఏఐ. 'రియల్-టైమ్' 'ఆడియో-డ్రైవెన్' 'ఫేస్ టైమ్-స్టైల్' వీడియో జనరేషన్‌కు ఉపకరించే సరికొత్త ఏఐ మోడల్ ఇది. ఇమేజ్ అండ్ వాయిస్ సిగ్నల్ మాత్రమే ఉపయోగించి రకరకాల స్టైల్స్, జానర్స్‌లో రియల్-టైమ్ వీడియో క్యారెక్టర్‌లను జనరేట్ చేస్తుంది.

● మ్యూజిక్ వరల్డ్

ప్రకృతి గీతం



'సంగీతం అనేది నా డీఎన్ఏలోనే ఉంది' అని సగర్వంగా చెబుతుంటుంది ప్రకృతి మిశ్రా. ఆమె తండ్రి మన్మథ్ మిశ్రా ప్రముఖ ఒడియా మ్యూజిక్ కంపోజర్. 'శాస్త్రీయ సంగీతంలో ప్రాథమిక శిక్షణ కూడా తీసుకోనప్పటికీ సంగీతం నాతో ఉంది. నాన్న సంగీతాన్ని వింటూ పెరిగాను. ఆయన వల్లే ఎన్నో మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ గురించి తెలుసుకునే, ఎన్నో అద్భుతమైన మెలోడీలు వినే అవకాశం వచ్చింది. నాలోని భావాలను సంగీతం ద్వారా వ్యక్తీకరిస్తాను' అంటుంది ప్రకృతి. నిజ జీవిత భావోద్వేగాలే ఆమె పాటకు ముడిసరకు. 'అతిగా ఆలోచించను. ఏదైనా సహజంగా జరిగిపోవాల్సిందే' అంటుంది తన మ్యూజిక్ కంపోజింగ్ గురించి. లేటెస్ట్ సింగిల్ 'ఆయే క్యోం'తో మరోసారి సంగీత అభిమానులను ఆకట్టుకుంది ప్రకృతి. ఒకప్పుడు బాగా సన్నిహితంగా ఉండే ఇద్దరు మిత్రులు ఆ తరువాత దూరం అవుతారు. టెలిఫోన్ సంభాషణల రూపంలో వారి బాధలు, భావోద్వేగాలకు ఈ పాట అద్దం పడుతుంది. 'ఇన్‌స్ట్రుమెంట్ల నుంచి గానం వరకు ప్రతిదీ ఆకట్టుకునేలా పాటను డిజైన్ చేశాం. ప్రేక్షకులను మరో లోకంలో తీసుకువెళ్లే ప్రయత్నం చేశాం' తన తాజా పాట గురించి అని చెబుతుంది ప్రకృతి మిశ్రా.

● కొత్త మాట

నేక్‌డ్ ఫ్లైయింగ్



'నేక్‌డ్ ఫ్లైయింగ్' అనేది ఒక ట్రావెల్ ట్రెండ్. జెన్ జెడ్, మిలీనియల్ ట్రావెలర్స్ ఈ ట్రెండ్‌పై ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. 'నేక్‌డ్ ఫ్లైయింగ్' అంటే భారీ లగేజీకి దూరంగా ఉండడం. అత్యవసరమైన లగేజీకి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం. 'గ్లోబల్ ట్రావెల్ స్టడీ' ప్రకారం అతి తక్కువ లగేజీతో ప్రయాణించడానికి యువ ట్రావెలర్‌లు ఇష్టపడుతున్నారు. 'ఎందుకు ఇలా?' అనేదానికి వారు చెబుతున్న సమాధానాలలో కొన్ని... 'ఒత్తిడి ఉండదు' 'టైమ్ సేవ్ అవుతుంది' 'ఉరుకులు పరుగులు ఉండవు'

● ఏఐ ఏరియా

ఇమేజ్-టు-వీడియో



ఇండిపెండెంట్ రిసెర్చ్ ల్యాబ్ 'మిడ్‌జర్నీ' ఏఐ యానిమేషన్ కోసం ఇమేజ్ టు వీడియో టూల్‌ను తీసుకువచ్చింది. ఈ టూల్‌లో ఆటోమెటిక్ మోడ్, మాన్యువల్ మోడ్‌లు ఉంటాయి. ఆటోమెటిక్ మోడ్‌లో 'జస్ట్ మేక్ ఇట్ మూవ్' బటన్ ఉంటుంది. యానిమేషన్ ఎలా ఉండాలి అనేది వివరించడానికి 'మాన్యువల్ మోడ్' ఉపయోగపడుతుంది. 'లో మోషన్' 'హై మోషన్' సెట్టింగ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. డ్రామాటిక్ సీన్స్‌కు సంబంధించి 'హై మోషన్' ఉపయోగపడుతుంది. ప్రతి వీడియో క్లిప్ 5 సెకన్‌లు ఉంటుంది. కావాలంటే 20 సెకన్‌ల వరకు పెంచుకోవచ్చు. 'మిడ్‌జర్నీ-క్రియేటెడ్ ఇమేజెస్' ఫీచర్ ద్వారా యూజర్‌లు తమ ఇమేజ్‌లను కూడా యానిమేట్ చేసుకోవచ్చు. ఇందుకోసం యూజర్ తన ఇమేజ్‌ను అప్‌లోడ్ చేసి, ప్రాంప్ట్ బార్‌లోకి డ్రాగ్ చేయాలి. మోషన్ ప్రాంప్ట్ ఉపయోగించాలి.

సాక్షి సినిమా

ఆగస్టులో యూనివర్సిటీ



● ఆర్. నారాయణ మూర్తి

ఆర్. నారాయణ మూర్తి లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'. 'పేపర్ లీక్' అనేది ఉపశీర్షిక. ఈ సినిమా ఆగస్టు 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీలు గోరేటి వెంకన్న, అద్దంకి దయాకర్‌లతో పాటు దేశపతి శ్రీనివాస్, అందెశ్రీ, జయరాజ్, నందినీ సిద్దారెడ్డి, ప్రొఫెసర్ ఖాసీం, పలువురు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని, ''యూనివర్సిటీ' సినిమా కేవలం విద్యార్థులే కాదు... ఉపాధ్యాయులు, తల్లిదండ్రులందరూ చూడదగిన మంచి చిత్రం'' అని కొనియాడారు. ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ- ''గత కొన్నేళ్లుగా మన విద్యారంగంలో జరుగుతున్న పేపర్ లీక్స్, గ్రూపు 1, 2 లాంటి ఉద్యోగ ప్రశ్నా పత్రాల లీక్స్ చూస్తుంటే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి? వాళ్లకు పాఠాలు బోధించిన గురువులు ఏం కావాలి? అని మా సినిమా ద్వారా ప్రశ్నిస్తున్నాం. కాపీయింగ్ అనేది చాలా ప్రమాదకరమైనది. చూసి రాసినవాళ్లు డాక్టర్లు అయితే రోగులు బతుకుతారా? అలాంటివాళ్లు ఇంజినీర్ అయితే బ్రిడ్జిలు నిలబడతాయా? అందుకే విద్యను ప్రైవేటు మాఫియా కబంధ హస్తాల నుంచి విముక్తి చేసి, విద్యను జాతీయం చేయాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి అని చాటి చెప్పేదే మా చిత్రం. ఈ సినిమాలో 5 పాటలు ఉన్నాయి. స్వర్గీయ గద్దర్‌గారితో పాటు జలదంకి సుధాకర్, వేల్పుల నారాయణ, మోటపలుకుల రమేశ్ గొప్పగా రాశారు'' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: బాబూరావు దాస్, కథ-స్క్రీన్ ప్లే-మాటలు-సంగీతం-దర్శకత్వం-నిర్మాణం: ఆర్. నారాయణ మూర్తి.

బాహుబలి మళ్లీ వస్తున్నాడు



పదేళ్ల తర్వాత బాహుబలి మళ్లీ థియేటర్స్‌లోకి వస్తున్నాడు. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'బాహుబలి'. రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ ఈ సినిమాలోని ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించిన ఈ 'బాహుబలి' తొలి భాగం 'బాహుబలి: ది బిగినింగ్'గా 2015 జూలై 10న విడుదల కాగా, మలి భాగం 'బాహుబలి: ది కన్‌క్లూజన్' 2017 ఏప్రిల్ 28న విడుదలైంది. ఈ రెండు చిత్రాలూ బ్లాక్‌బస్టర్ విజయాలను నమోదు చేసుకున్నాయి. కాగా 'ది బాహుబలి: బిగినింగ్' సినిమా విడుదలై పదేళ్లు పూర్తయిన సందర్భంగా 'బాహుబలి: ది బిగినింగ్, బాహుబలి: ది కన్‌క్లూజన్' సినిమాలను కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరిట ఒకే చిత్రంగా అక్టోబరు 31న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ గురువారం అధికారికంగా ప్రకటించారు. ''బాహుబలి ఎన్నో ప్రయాణాలకు నాంది. లెక్కలేనన్ని జ్ఞాపకాలు. అంతులేని స్ఫూర్తి. 'బాహుబలి: ది ఎపిక్'ని తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో అక్టోబరు 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం'' అంటూ 'బాహుబలి: ది ఎపిక్' సినిమా పోస్టర్‌ను 'ఎక్స్'లో షేర్ చేశారు రాజమౌళి.

యాక్షన్ స్టార్ట్



● ధనుష్

ధనుష్ హీరోగా కొత్త చిత్రం ఆరంభమైంది. విఘ్నేష్ రాజా దర్శకత్వంలో వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో థింక్ స్టూడియోస్ సహకారంతో డా. ఇషారి కె. గణేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ గురువారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. ఈ చిత్రంలో మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. కేఎస్ రవికుమార్, జయరామ్, కరుణాస్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ ఇంటెన్స్ యాక్షన్ డ్రామా సినిమాకు జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. ''పలు రకాల లొకేషన్స్‌లో ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించనున్నాం. ప్రేక్షకులకు మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఈ చిత్రం ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ సినిమాకు కెమెరా: తేని ఈశ్వర్.

కార్తీ మార్షల్



● కళ్యాణీ ప్రియదర్శన్, కార్తీ

హీరో కార్తీ 'మార్షల్' ప్రయాణం మొదలైంది. కార్తీ హీరోగా 'తానాక్కారన్' ఫేమ్ తమిళ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాకు 'మార్షల్' టైటిల్ ఖరారైంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ పూజా కార్యక్రమాలతో గురువారం ప్రారంభమైంది. కళ్యాణీ ప్రియదర్శన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సత్యరాజ్, ప్రభు, లాల్, జాన్ కొక్కెన్, ఈశ్వరీ రావు, మురళీ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్న ఈ సినిమాకు ఇషాన్ సక్సేనా సహ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, సాయి అభ్యంకర్ స్వరాలు సమకూర్చుతున్నారు. ''అత్యున్నత స్థాయి సాంకేతిక, నిర్మాణ విలువలతో భారీ స్థాయిలో 'మార్షల్' సినిమాను నిర్మించనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమా ప్రధానంగా తీరప్రాంతం, సముద్రం నేపథ్యంలో సాగుతుందని సమాచారం.

తిమ్మరాజుపల్లి టీవీ ఆన్

హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా మారారు. సుమైరా స్టూడియోస్‌తో కలిసి తన నిర్మాణ సంస్థ కేఏ ప్రొడక్షన్స్ పతాకంపై విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో 'తిమ్మరాజుపల్లి టీవీ' అనే ఓ పీరియాడికల్ సినిమాను కిరణ్ అబ్బవరం నిర్మించనున్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన గత సినిమాలకు కెమెరా అసిస్టెంట్‌గా చేసిన సాయితేజ్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తారు. అలాగే కిరణ్ అబ్బవరం గత చిత్రాలకు ఆన్‌లైన్ ఎడిటింగ్ చేసిన వి. మునిరాజు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో వేదశ్రీ హీరోయిన్‌గా, ప్రదీప్ కొట్టె, తేజ విహాన్, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేశ్, సత్యనారాయణ వద్దాది, మాధవి ప్రసాద్, టీవీ రామన్, చిట్టిబాబు ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. ''ఈ ఏడాది చివర్లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభిస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు.



● 'తిమ్మరాజుపల్లి టీవీ' పోస్టర్

నరసింహ గర్జన వస్తోంది



'కేజీఎఫ్, కాంతారా, సలార్' వంటి ప్రతిష్ఠాత్మక సినిమాలు నిర్మించిన ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయూ) ప్రాజెక్ట్‌లో భాగంగా వస్తున్న తొలి చిత్రం 'మహావతార్ నరసింహ'. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధావన్, కుశల్ దేశాయ్, చైతన్య దేశాయ్ నిర్మించిన ఈ సినిమా త్రీడీలో ఐదు భారతీయ భాషల్లో ఈ నెల 25న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా శిల్పా ధావన్ మాట్లాడుతూ- ''శ్రీ నరసింహ, శ్రీ వరాహ ఇతిహాస కథను ఆవిష్కరించడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రతి ఫ్రేమ్, ప్రతి క్షణం, ప్రతి హార్ట్ బీట్ ఈ గొప్ప కథకు ప్రాణం పోసింది... నరసింహ గర్జన వస్తోంది'' అని తెలిపారు.

ప్యారడైజ్‌లో ఎంట్రీ

'దసరా' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. 'కిల్, గ్యారా గ్యారా' వంటి చిత్రాల్లో తనదైన నటనతో ఆకట్టుకున్న రాఘవ్ జుయల్ 'ది ప్యారడైజ్'లో భాగమయ్యారు. ఈ విషయాన్ని ప్రకటించి, ఓ వీడియోతో రాఘవ్ జుయల్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపింది యూనిట్. ''ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'ది ప్యారడైజ్' రూపొందుతోంది. నానీతో కలిసి మరో మరపురాని నటనను కనబరచడానికి రాఘవ్ సిద్ధంగా ఉన్నారు. హాలీవుడ్ స్టూడియోతో కలిసి పని చేయడం కోసం ప్రస్తుతం చర్చలు జరుపుతున్నాం. ఈ సినిమాని తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో 2026 మార్చి 26న విడుదల చేయనున్నాం'' అని యూనిట్ ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, కెమెరా: సీహెచ్ సాయి.



● రాఘవ్ జుయల్

మా రియాక్షన్ ఇలాగే ఉంటుంది

- నయనతార



● నయనతార, విఘ్నేష్ శివన్

'నయనతార, విఘ్నేష్ శివన్ విడిపోతున్నారట... త్వరలో విడాకులు తీసుకోనున్నారట' అనే వార్తలు గత కొన్నాళ్లుగా నెట్టింట చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. ఈ దంపతులు విడిపోనున్నారంటూ తమిళ చిత్ర పరిశ్రమలోనూ ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై నయనతార, విఘ్నేష్ స్పందించలేదు. కానీ, వైవాహిక బంధం గురించి నయనతార ఇటీవల సోషల్ మీడియాలో 'తెలివి తక్కువ వ్యక్తిని వివాహం చేసుకోవడం పొరపాటు. భర్త తప్పులకు భార్య బాధ్యత వహించాల్సిన అవసరం లేదు' అంటూ షేర్ చేసిన ఓ పోస్ట్ వైరల్‌గా మారడంతో పాటు చర్చనీయాంశమైంది. దీంతో ఆ పోస్టును వెంటనే నయనతార తొలగించారు. ఆ పోస్ట్ తర్వాత వీరి విడాకుల రూమర్స్‌పై మరిన్ని వార్తలొచ్చాయి. దీనిపై తాజాగా ఇన్‌డైరెక్ట్‌గా స్పందించారు నయనతార. తన భర్త విఘ్నేష్ శివన్, తానూ ఉన్న లేటెస్ట్ ఫొటోను షేర్ చేసి, ''మాపై వచ్చే కొన్ని సిల్లీ వార్తలు చూసినప్పుడు మా రియాక్షన్ ఇలాగే ఉంటుంది'' అంటూ పోస్ట్ చేసి, విడాకులపై వస్తున్న వార్తలకు చెక్ పెట్టారామె. కాగా నయనతార, విఘ్నేష్ శివన్ 2022 జూన్ 9న వివాహ బంధంలోకి అడుగుపెట్టగా, వీరికి ఉయిర్, ఉలగమ్ అనే ట్విన్స్ ఉన్న సంగతి తెలిసిందే. ఇక ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'మెగా 157' (వర్కింగ్ టైటిల్), యశ్ 'టాక్సిక్' సినిమాల్లో నటిస్తున్నారు నయనతార.

సాక్షి బిజినెస్
శుక్రవారం
11-7-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
346	121
83,190	25,355

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	20,463	▲	31
డోజోన్స్	44,730	▲	271
ఎఫ్‌టీఎస్ఈ 100	8,976	▲	108
డాక్స్	24,457	▽	93
షాంఘై	3,509	▲	17
నికాయ్	39,646	▽	175

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.20	86.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.20	118.13
€	యూరో	ఎస్‌బీఐ	99.22	101.96
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.89	59.39
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.02	57.24
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.59	69.29
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.96	23.45
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.43	24.21
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.06	12.88

టీసీఎస్.. ఓకే!



క్యూ1 నికర లాభం రూ. 12,760 కోట్లు

ఆదాయం రూ. 63,437 కోట్లు • రూ. 11 మధ్యంతర డివిడెండ్
6,013 మంది సిబ్బంది జత • తాజా ఆర్డర్లు @ 9.4 బిలియన్ డాలర్లు

సాఫ్ట్‌వేర్ సేవలకు దేశీయంగా టాప్ ర్యాంక్‌లో నిలుస్తున్న టాటా గ్రూప్ దిగ్గజం టీసీఎస్ ఏప్రిల్–జూన్ (క్యూ1) ఫలితాలు విడుదల చేసింది. తద్వారా ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసిక ఫలితాల సీజన్‌కు బోణీ చేసింది.

న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం టాటాకన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) నికర లాభం ఈ ఏడాది క్యూ1లో 6 శాతం పుంజుకుని రూ. 12,760 కోట్లను తాకింది. అయితే ఇందుకు రూ. 1,660 కోట్ల ఇతర ఆదాయం దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 12,040 కోట్లు ఆర్జించింది. దీనిలో రూ. 962 కోట్ల ఇతర ఆదాయం కలసి ఉంది. మొత్తం ఆదాయం 1 శాతం నామమాత్ర వృద్ధితో రూ. 63,437 కోట్లకు చేరింది. ప్రధాన మార్కెట్లలో సవాళ్లు, బీఎస్ఎన్ఎల్ కాంట్రాక్ట్ తగ్గిపోవడం ప్రభావం చూపాయి. గత క్యూ1లో రూ. 62,613 కోట్ల టర్నోవర్ సాధించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 11 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఈ కాలంలో కొత్తగా 6,013 మందికి ఉద్యోగాలిచ్చినట్లు కంపెనీ తెలియజేసింది.

మార్జిన్ల పెంపుపై దృష్టి

ఈ ఏడాది నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లను 26–28 శాతానికి మెరుగుపరిచే చర్యలు చేపడుతున్నట్లు టీసీఎస్ సీఎఫ్‌వో సమీర్ సెక్సారియా తెలియజేశారు. ఇందుకు అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికింకా వేతన పెంపుపై నిర్ణయం తీసుకోలేదని కంపెనీ మానవ వనరుల చీఫ్ మిలింద్ లక్కడ్ వెల్లడించారు. ముందుగా ప్రకటించిన విధంగానే ఈ ఏడాది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించనున్నట్లు తెలియజేశారు. కంపెనీకి కీలకమైన బీఎఫ్ఎస్ఐ విభాగం 1 శాతమే పుంజుకుంది. ప్రాంతాలవారీగా ఉత్తర అమెరికా ఆదాయం 2.7% క్షీణించగా.. దేశీయ ఆదాయం 22% వెనకడుగు వేసింది. రూ.15,000 కోట్ల బీఎస్ఎన్ఎల్ డీల్ ముగింపునకు రావడం ప్రభావం చూపింది. అయితే పీఎస్‌యూ టెలికం దిగ్గజం నుంచి రూ. 2,900 కోట్ల అదనపు వర్క్ లభించినట్లు కంపెనీ వెల్లడించింది. ఏఐ ఆఫరింగ్స్‌పట్ల ఆసక్తి కనిపిస్తున్నట్లు కంపెనీకి కొత్తగా ఎంపికైన సీవోవో ఆర్తి సుబ్రమణ్యన్ పేర్కొన్నారు. అయితే ఆదాయ అంచనాలు వెల్లడించలేదు.

అనిశ్చితుల ఎఫెక్ట్



“ అంతర్జాతీయంగా అటు ఆర్థిక పరిస్థితులతోపాటు.. ఇటు రాజకీయ, భౌగోళిక అంశాలలోనూ అనిశ్చితులు కొనసాగుతుండటంతో డిమాండ్ క్షీణించింది. వెరసి ఈ ఏడాది రెండంకెల వృద్ధికి వీలులేనట్లే. అయితే ప్రపంచ మార్కెట్ల నుంచి ఆదాయం బలపడే అవకాశముంది. గత త్రైమాసికంలో ఎదురైన నిర్ణయాలలో ఆలస్యం తాజాగా మరింత పెరిగింది. అయినప్పటికీ ఐటీ కంపెనీల ఆదాయానికి కీలకమైన విచక్షణా వ్యయాలు భవిష్యత్‌లో పుంజుకోవచ్చని భావిస్తున్నాం. ”

– కె. కృతివాసన్, ఎండీ, సీఈవో, టీసీఎస్

ఇతర విశేషాలు...

- జూన్‌కల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 6,13,069కు చేరింది.
- ఇబిటా మార్జిన్లు 0.2 శాతం బలహీనపడి 24.5 శాతానికి చేరాయి.
- ఉద్యోగ వలసలు(అట్రిషన్) 13.8 శాతంగా నమోదయ్యాయి.

క్యూ1 ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ షేరు బీఎస్ఈలో నామమాత్ర నష్టంతో రూ. 3,382 వద్ద ముగిసింది.

సూచీలు రెండోరోజూ డీలా

- సెన్సెక్స్ 346 పాయింట్లు డౌన్
- 25,400 దిగువకు నిఫ్టీ



ముంబై: స్టాక్ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో సూచీలు రెండోరోజూ డీలాపడ్డాయి. దేశీయ కార్పొరేట్ క్యూ1 ఆర్థిక ఫలితాల సీజన్ మొదలైన నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. వాణిజ్య సుంకాల(ట్రేడ్ టారిఫ్) సంబంధిత అనిశ్చితులు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 346 పాయింట్లు నష్టపోయి 83,190 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121 పాయింట్లు కోల్పోయి 25,355 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభం నుంచే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 401 పాయింట్లు పతనమై 83,135 వద్ద, నిఫ్టీ 136 పాయింట్లు కోల్పోయి 25,340 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. ఐటీ, టెలికమ్యూనికేషన్, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.28% నష్టపోగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.12% స్వల్పంగా పెరిగింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ఐటీ రంగ దిగ్గజం టీసీఎస్ తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి నేపథ్యంలో పలు ఐటీ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. కోఫోర్జ్ 2.27%, విప్రో, ఇన్ఫోసిస్, పెర్సిస్టెంట్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా షేర్లు 1% పతనమయ్యాయి.

క్విక్ కామర్స్ @ 2 లక్షల కోట్లు

- 2027–28కి చేరే చాన్స్
- 2024–25లో రూ.64,000 కోట్లు
- కెరీర్‌ఎడ్జ్ రేటింగ్స్ అంచనా

ముంబై: క్విక్ కామర్స్ మార్కెట్ ఎక్స్‌ప్రెస్ వేగంతో దూసుకుపోతోంది. గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) రూ.64,000 కోట్ల విలువైన కొనుగోళ్లు క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్‌లపై జరిగినట్లు కెరీర్ ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. అంతేకాదు స్థూల ఆర్డర్ విలువ (జీవోవీ) 2028 మార్చి నాటికి రూ.2 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. అంటే ఇక్కడి నుంచి మరో 200 శాతానికి పైనే వచ్చే మూడేళ్ల కాలంలో పెరగనున్నట్లు తెలుస్తోంది. బలమైన డిమాండ్ నేపథ్యంలో క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు క్రమంగా ఆదాయం పెంచుకునే మార్గాలను అనుసరిస్తుండడాన్ని గమనించొచ్చు. గత ఆర్థిక సంవత్సరంలో కేవలం ఫీజుల రూపంలోనే రూ.10,500 కోట్లను ఇవి సమకుర్చున్నట్టు కెరీర్ ఎడ్జ్ నివేదిక వెల్లడించింది.

2021–22 సంవత్సరంలో ఫీజుల ఆదాయం కేవలం రూ.450 కోట్లుగానే ఉన్నట్టు గుర్తు చేసింది. క్విక్ కామర్స్ కంపెనీల ఆదాయం 2027–28 సంవత్సరం నాటికి రూ.34,500 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. ''ప్రముఖ క్విక్ కామర్స్ కంపెనీలు ప్లాట్‌ఫామ్ ఫీజులను ఎక్కువగా పెంచడం ఆదాయ వృద్ధికి దారితీయనుంది. మొత్తం మీద జీవోవీ గణనీయంగా పెరగనుంది''అని కెరీర్ ఎడ్జ్ నివేదిక తెలిపింది.

లాభదాయకతపై దృష్టి

అధిక వృద్ధి నుంచి లాభదాయకత వైపు ప్లాట్‌ఫామ్‌ల దృష్టి మళ్లినట్టు ఈ నివేదిక తెలిపింది. ప్రకటనలు, సబ్‌స్క్రిప్షన్లు, ప్రైవేటు లేబుళ్లు, టెక్నాలజీ సాయంతో నిల్వలను మెరుగ్గా నిర్వహించడంపై కంపెనీలు దృష్టి సారించినట్టు పేర్కొంది. 2021–22 సంవత్సరంలో క్విక్‌కామర్స్ సంస్థల టేక్‌రేట్ (మొత్తం ఆర్డర్ విలువలో ఆదాయం కింద పరిగణించేది) 7–9%గా ఉంటే, 2024–25 చివరికి 18 శాతానికి పెరిగినట్టు తెలిపింది.



''క్విక్‌కామర్స్ సంస్థలు వేగవంతమైన విస్తరణ నుంచి నిర్వహణ సామర్థ్యం, లాభాలు పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. టెక్నాలజీ ఆధారిత ఆవిష్కరణలు, టైర్ 2, 3 పట్టణాల్లోకి కార్యకలాపాలను విస్తరించడం ఈ రంగం తదుపరి దశ వృద్ధిని నిర్ణయించనున్నాయి''అని కెరీర్ ఎడ్జ్ రేటింగ్స్ హెడ్ తన్విషా తెలిపారు. గ్రోసరీ డిమాండ్‌లో కేవలం ఒక శాతమే క్విక్ కామర్స్ పరిశ్రమ వైపు మళ్లిందని, రానున్న రోజుల్లో సౌకర్యం, వెసులుబాటు ఆధారంగా మరింత మంది వినియోగదారులు క్విక్ కామర్స్ ఆర్డర్లకు మొగ్గు చూపించొచ్చని కెరీర్ ఎడ్జ్ రేటింగ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అమీర్ షేక్ పేర్కొన్నారు. 2024లో 27 కోట్ల మంది ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయగా, ప్రపంచంలో ఈ-రిటైల్ యూజర్ల పరంగా భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. 2023తో పోల్చి చూసినప్పుడు 2024లో ఈ-కామర్స్ మార్కెట్ 23.8% వృద్ధి చెందిందని, 1.12 కోట్ల మొబైల్ కనెక్షన్లు ఉండడం, స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరుగుతుండడం మార్కెట్ వృద్ధికి అనుకూలించనున్నట్టు పేర్కొంది. ఖర్చు చేసే ఆదాయం పెరుగుదల, అధికంగా వెచ్చించే సామర్థ్యం క్విక్ కామర్స్ వృద్ధికి మద్దతుగా నిలుస్తాయని అంచనా వేసింది. ముఖ్యంగా డార్క్‌స్టోర్లు (ఆర్డర్లను ప్రాసెస్ చేసే కేంద్రాలు) క్విక్ కామర్స్ మార్కెట్‌కు కీలక ఇంజిన్లుగా పనిచేస్తాయంటూ.. 2024–25లో వీటి సంఖ్య 70 శాతం పెరిగి 3,072కు చేరుకున్నట్టు తెలిపింది.

చైనా మార్కెట్లోకి 'డెక్కన్' రైస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డెక్కన్ బ్రాండ్ పేరిట బియ్యం ఎగుమతి చేసే డెక్కన్ గ్రెయింజ్ ఇండియా సంస్థ తాజాగా చైనా మార్కెట్లో అడుగుపెట్టింది. బియ్యం ఉత్పత్తిలో భారత్ తర్వాత రెండో స్థానంలో ఉండే చైనా మార్కెట్లో ప్రవేశించడం తమ సంస్థకు కీలక మైలురాయని కంపెనీ డైరెక్టర్ కిరణ్ కుమార్ పోలా తెలిపారు పేర్కొన్నారు. ఇప్పటికే అమెరికా, కెనడా, బ్రిటన్ తదితర దేశాలకు 30 వెరైటీలను ఎగుమతి చేస్తున్నామన్నారు. అమెరికా మార్కెట్లో నాన్-బాస్మతి రైస్ విభాగంలో అగ్రగామిగా ఉన్నట్లు వివరించారు. 2026 ప్రారంభంలో దేశీ మార్కెట్లోనూ తమ ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నట్లు కిరణ్ కుమార్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల రైతుల నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదితో పదిహేనేళ్లు పూర్తి చేసుకున్నామని, ఈ వ్యవధిలో 7 కోట్లకు పైగా బ్యాగ్‌లను ఎగుమతి చేశామని వివరించారు. కంపెనీకి హైదరాబాద్ దగ్గర్లోని సుల్తాన్‌పూర్‌లో నెలకు 5,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రైస్ ప్రాసెసింగ్ ప్లాంటు ఉంది. 100కు పైగా ఉద్యోగులు ఉన్నారు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
లార్జ్‌క్యాప్‌లోకి కొత్తగా 11 కంపెనీలు | గోల్డ్ ఈటీఎఫ్‌లు.. జిగేల్!

అమ్మకాల్లో హ్యుందాయ్ క్రెటా జోరు



జూన్‌లో రికార్డు స్థాయిలో విక్రయాలు

గురుగ్రామ్: భారత వాహన మార్కెట్‌లో హ్యుందాయ్ క్రెటా జోరు కొనసాగుతోంది. ఈ జూన్‌లో రికార్డు స్థాయిలో 15,786 హ్యుందాయ్ క్రెటా కార్లు అమ్ముడయ్యాయి. అలాగే ఈ ఏడాది జనవరి–జూన్‌లో భారత్‌లో అత్యధికంగా అమ్ముడైన ఎస్‌యూవీగా నిలిచింది. మార్చి, ఏప్రిల్, జూన్ సేల్స్ చార్ట్‌లో టాప్‌లో ఉంది. హ్యుందాయ్ క్రెటాను 2015లో లాంచ్ చేశారు 'క్రెటా కేవలం కారు మాత్రమే కాదు, 12 లక్షల మందికి పైగా భారతీయ కుటుంబాల్లో భావోద్వేగంగా మారింది. ఇది భారత్‌లో హ్యుందాయ్ విజయానికి బలమైన పునాది వేసింది' అని హ్యుందాయ్ డైరెక్టర్ తరుణ్ గార్గ్ అన్నారు.

సాక్షి స్పోర్ట్స్



మూడో రౌండ్‌లో హారిక, హంపి

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ చెస్ నాకౌట్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు, తెలుగు తేజాలు ద్రోణవల్లి హారిక, కోనేరు హంపి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. నందిత (భారత్)తో జరిగిన రెండో రౌండ్‌లో హారిక 1.5–0.5తో... హంపి 1.5–0.5తో అఫ్రూజా ఖామ్‌దమోవా (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందారు. గురువారం జరిగిన రెండో రౌండ్ రెండో గేమ్‌లో హారిక 37 ఎత్తుల్లో నందితను ఓడించగా... అఫ్రూజాతో గేమ్‌ను హంపి 44 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. బుధవారం జరిగిన తొలి గేమ్‌లో అఫ్రూజాపై హంపి నెగ్గగా... నందితతో గేమ్‌ను హారిక 'డ్రా' చేసుకుంది. భారత్‌కే చెందిన వైశాలి, దివ్య దేశ్‌ముఖ్ కూడా మూడో రౌండ్‌కు చేరుకున్నారు. మరో ముగ్గురు భారత ప్లేయర్లు వంతిక అగర్వాల్, పద్మిని రౌత్ మూడో రౌండ్‌లో చోటు కోసం నేడు టైబ్రేక్ గేమ్‌లు ఆడనున్నారు.



ఇంగ్లండ్ ఆచితూచి...

దూకుడైన ఆటకు దూరంగా స్టోక్స్ బృందం

తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 251/4

ఇంగ్లండ్ 'బజ్‌బాల్' ఆటకు చెల్లుచీటో... లేదంటే భారత బౌలింగ్ దళమంటే వణుకో... తెలీదు కానీ లార్డ్స్ టెస్టుతో ఆతిథ్య జట్టు ఆట మొదటికొచ్చింది. కొన్నాళ్లుగా ఓడినా... గెలిచినా ఇలా ఫలితాలతో సంబంధం లేకుండా దూకుడు, దంచుడుతో గ్రేటెస్టు ఫార్మాట్‌ను లేటెస్ట్‌గా మార్చేసిన జట్టే... ఇప్పుడు ఆ పాత మధురమంటూ క్లాసిక్‌కు తిరిగొచ్చింది. గంటల తరబడి క్రీజులో నిలిచేందుకు... బంతుల్ని అదేపనిగా డిఫెన్స్ చేసేందుకు తెగ ప్రాధాన్యమిచ్చింది. మొత్తానికి భారత బౌలింగ్ అంటే ఆషామాషీ కాదని తెలుసుకొని స్టోక్స్ బృందం తెలివిగా మూడో టెస్టు మ్యాచ్‌ను ప్రారంభించింది.

- ఒకే ఓవర్లో 2 వికెట్లు తీసిన **నితీశ్ రెడ్డి**
- సెంచరీ ముంగిట రూట్
- భారత్‌తో మూడో టెస్టు



క్రాలీ వికెట్ తీశాక నితీశ్ రెడ్డి సంబరం


లండన్: భారత బౌలర్లు కొత్త **బంతితో** చెలరేగకపోయినా... ఇంగ్లండ్ **బ్యాటర్లను** బెంబేలెత్తించకపోయినా... తొలిరోజు పట్టుబిగించకపోయినా... భారత్‌దే ఓ రకంగా పైచేయి అని చెప్పాలి. గత టెస్టు ఫలితంతో ఈ టెస్టులో ఇంగ్లండ్‌ను ఆచితూచి ఆడేలా చేసింది. ఓవరాల్‌గా బ్యాటింగ్‌నే మార్చేసింది. దీంతో గురువారం మొదలైన మూడో టెస్టులో రోజంతా బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో **4 వికెట్ల** నష్టానికి 251 పరుగులే చేసింది. **జో రూట్** (191 బంతుల్లో 99 బ్యాటింగ్; **9 ఫోర్లు**) సెంచరీ ముంగిట నిలిచాడు. ఓలీ పోప్ (**44; 4 ఫోర్లు**), **బెన్** స్టోక్స్ (39 బ్యాటింగ్; 3 ఫోర్లు) రాణించారు. ఆంధ్రప్రదేశ్ ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి 2 వికెట్లు తీయగా... బుమ్రా, జడేజా చెరో వికెట్ పడగొట్టారు. ప్రసిధ్ కృష్ణ స్థానంలో బుమ్రా రావడం మినహా భారత జట్టులో మరో మార్పు చేయలేదు.

బాగుందిరా... మామ!

ఇంగ్లండ్ ఓపెనర్లు జాక్ క్రాలీ (18; 4 ఫోర్లు), బెన్ డకెట్ (23; 3 ఫోర్లు) తమ స్వభావానికి విరుద్ధంగా లార్డ్స్ టెస్టును మొదలుపెట్టారు. బ్యాటింగ్‌లో దూకుడు, పరుగుల్లో వేగం ఈ రెండు లేనేలేవు. ఆఫ్ స్టంప్‌కు ఆవల పడినా... బ్యాట్‌కు రవ్వంత దూరంగా వెళ్లినా... అలాంటి బంతుల్ని వికెట్ కీపర్‌కే వదిలేశారు. బుమ్రా బౌలింగ్‌లో మరింత జాగ్రత్త పడ్డారు. ఆకాశ్ దీప్, సిరాజ్‌లు బౌలింగ్‌కు వచ్చినా అనవసర షాట్ల జోలికి వెళ్లలేదు. ఇలాంటి పరిస్థితుల్లో 14వ ఓవర్ వేసిన ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి మూడో బంతికి డకెట్‌ను, ఆరో బంతికి క్రాలీని అవుట్ చేయడంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తెలుగు ఆటగాడ్ని తెలుగు మాటలతోనే అభినందించాడు. గిల్ నోట 'బాగుందిరా మామ' మాట వికెట్లలో అమర్చిన మైక్‌లో రికార్డు కావడంతో 'ఎక్స్'లో ఈ క్లిప్ బాగా వైరలైంది. తర్వాత వచ్చిన పోప్, రూట్‌లు మరింత ఆచితూచి ఆడటంతో ఈ సెషన్‌లో ఇంకో వికెట్‌కు ఆస్కారం లేకపోయింది.

'నీరు'గార్చిన రెండో సెషన్

భారత బౌలర్లను రెండో సెషన్ పూర్తిగా నీరుగార్చింది. నితీశ్ ఇచ్చిన వికెట్ల ఊపుతో రెండో సెషన్‌లో వికెట్లను తీద్దామనుకున్న పేసర్లకు నిరాశే ఎదురైంది. రూట్, పోప్ కుదురుగా ఆడుతూ స్కోరుబోర్డు నింపాదిగా నడిపించారు. ఈ సెషన్‌లో 24 ఓవర్లపాటు క్రీజులో ఉన్న బ్యాటర్లు 70 పరుగులు చేయడం చూసిన ప్రేక్షకులకు ఆడుతోంది ఇంగ్లండేనా అనే అనుమానం కలుగకమానదు. ఇంత జిడ్డుగా ఆడుతుండటంతో భారత పేస్ తురుపుముక్క బుమ్రా ఏమీ చేయలేకపోయాడు. షాట్లు ఆడే ప్రయత్నం, పరుగులు తీసే క్రమం ఏమాత్రం పుంజుకోలేకపోవడంతో వికెట్లు తీసే అవకాశమే చిక్కలేదు. పైగా పిచ్ కూడా నిర్జీవంగా మారడంతో భారత బౌలర్లకు, ఫీల్డర్లకు చెమటలే తప్ప సాఫల్యం దక్కనేలేదు. 36వ ఓవర్లో ఇంగ్లండ్ స్కోరు వందకు చేరగా, డ్రింక్స్ విరామం తర్వాతే రూట్ అర్ధసెంచరీ పూర్తయ్యింది. రూట్‌తోపాటు పోప్ మొండిగా నిలబడటంతో ఇంగ్లండ్ వికెట్ నష్టపోలేదు. నింపాదిగా 150 స్కోరును దాటింది.



రూట్

రూట్ 99 బ్యాటింగ్

మూడో సెషన్ మొదలైన బంతికే పోప్ వికెట్‌ను చేజార్చుకున్న ఇంగ్లండ్‌కు కాసేపటికే బుమ్రా కూడా షాకిచ్చాడు. హ్యారీ బ్రూక్ (11)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. దీంతో స్వల్ప వ్యవధిలోనే 2 వికెట్లు కోల్పోవడంతో భారత శిబిరానికి ఈ సెషన్ టర్నింగ్ అవుతుందని అంతా భావించారు. కానీ ఈ పైచేయి అక్కడితే ఆగిపోయింది. రూట్ తన జిడ్డు ఆటతీరును కొనసాగించి బాగా విసిగించాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా దీటుగా ఎదుర్కోవడంతో పట్టుబిగించే అవకాశం లేకపోయింది. అబేధ్యమైన ఐదో వికెట్‌కు రూట్, స్టోక్స్ 79 పరుగులు జోడించారు. రూట్ సెంచరీకి పరుగు దూరంలో ఉన్నాడు.

పంత్‌కు గాయం... జురేల్ కీపింగ్!

భారత డాషింగ్ వికెట్‌కీపర్–బ్యాటర్ రిషభ్ పంత్ తొలిరోజు ఆటలో మైదానంలో గాయపడ్డాడు. దీంతో రెండో సెషన్ నుంచి ధ్రువ్ జురేల్ వికెట్ కీపింగ్ చేశాడు. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ 34వ ఓవర్లో బంతిని ఆపేందుకు డైవ్ చేయగా అతని ఎడమ చేతికి గాయమైంది. నొప్పితో బాధపడుతున్న పంత్‌కు కాసేపు ఫిజియో వచ్చి సపర్యలు చేశాడు. నొప్పినివారణ స్ప్రే చేసిన అతని నొప్పి తగ్గకపోవడంతో మైదానం వీడాల్సివచ్చింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (సి) పంత్ (బి) నితీశ్ రెడ్డి 18; డకెట్ (సి) పంత్ (బి) నితీశ్ రెడ్డి 23; ఓలీ పోప్ (సి) (సబ్) జురేల్ (బి) జడేజా 44; జో రూట్ (బ్యాటింగ్) 99; బ్రూక్ (బి) బుమ్రా 11; స్టోక్స్ (బ్యాటింగ్) 39; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (83 ఓవర్లలో 4 వికెట్లకు) 251. వికెట్ల పతనం:** 1–43, 2–44, 3–153, 4–172. **బౌలింగ్:** బుమ్రా 18–3–35–1, ఆకాశ్‌దీప్ 17–2–75–0, సిరాజ్ 14–5–33–0; నితీశ్ కుమార్ రెడ్డి 14–0–46–2, రవీంద్ర జడేజా 10–1–26–1, వాషింగ్టన్ సుందర్ 10–1–21–0.

ఇంగ్లండ్‌పై తొలిసారి...

- టి20 సిరీస్ గెలిచిన భారత మహిళల జట్టు
- నాలుగో మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలుపు




మాంచెస్టర్: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన భారత మహిళల క్రికెట్ జట్టు... ఇంగ్లండ్ పర్యటనలో చరిత్ర సృష్టించింది. తొలిసారి ఇంగ్లండ్ గడ్డపై టి20 సిరీస్ కైవసం చేసుకొని రికార్డుల్లోకెక్కింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన నాలుగో టి20లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు 6 వికెట్ల తేడాతో ఆతిథ్య ఇంగ్లండ్‌ను ఓడించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 3–1తో సిరీస్ చేజిక్కించుకుంది. గతంలో ఇంగ్లండ్‌పై టెస్టు, వన్డే సిరీస్‌లు నెగ్గిన మన అమ్మాయిలు... ఇప్పుడు తొలిసారి టి20 ఫార్మాట్‌లో సిరీస్ గెలుచుకున్నారు. నాలుగో మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. ఓపెనర్ సోఫియా డంక్లీ (19 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ టామీ బ్యూమాంట్ (19 బంతుల్లో 20; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించగా... మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ శ్రీచరణి, రాధా యాదవ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 17 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. స్మృతి మంధాన (31 బంతుల్లో 32; 5 ఫోర్లు), షఫాలీ వర్మ (19 బంతుల్లో 31; 6 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (24 నాటౌట్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (26) రాణించారు. భారత స్పిన్నర్ రాధా యాదవ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన ఆఖరి టి20 శనివారం బర్మింగ్‌హామ్‌లో జరుగనుంది.

అనిసిమోవా అదరహో



అనిసిమోవా



సబలెంకా

- సెమీఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకాపై విజయం
- కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లోకి
- వింబుల్డన్ టైటిల్ కోసం స్వియాటెక్‌తో తుదిపోరు

లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) వరుసగా మూడోసారి సెమీఫైనల్ అడ్డంకిని దాటలేకపోయింది. అమెరికా ప్లేయర్ అమండ అనిసిమోవా అద్భుత ఆటతీరు కనబరిచి టాప్ సీడ్ సబలెంకాను బోల్తా కొట్టించింది. 2 గంటల 37 నిమిషాలపాటు జరిగిన తొలి సెమీఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ అనిసిమోవా 6–4, 4–6, 6–4తో సబలెంకాను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లింది. 30 విన్నర్స్ కొట్టిన అనిసిమోవా ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు సబలెంకా 37 అనవసర తప్పిదాలు చేసింది. కెరీర్‌లో 22వ సారి గ్రాండ్‌స్లామ్ టోర్నీ బరిలోకి దిగిన 23 ఏళ్ల అనిసిమోవా గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు విజయం దూరంలో నిలిచింది. రేపు జరిగే ఫైనల్లో ఐదు గ్రాండ్‌స్లామ్ టోర్నీల విజేత ఇగా స్వియాటెక్ (పోలాండ్)తో అనిసిమోవా తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ స్వియాటెక్ కేవలం 72 నిమిషాల్లో 6–2, 6–0తో బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించింది.

మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

టుడేస్ గ్రాఫిక్..





ఆలయ శిఖరంపై పున్నమి చంద్రుడు!

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం గురువారం రాత్రి భక్తులకు కనువిందు చేసింది. నిండు చంద్రుడు సప్తతల రాజగోపురాన్ని తాకినట్లుగా కనిపించింది.



శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణ ఉత్సవం గురువారంతో ఘనంగా ముగిసింది. 7 లక్షల మంది ఈ ఏడాది గిరి ప్రదక్షిణ చేసినట్లు దేవస్థానం వర్గాల అంచనా. బుధవారం సింహాచలంలోని తొలిపావంచా నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభించిన భక్తులంతా 32 కిలోమీటర్లు కొండచుట్టూ ప్రదక్షిణ చేసి తిరిగి సింహాచలం చేరుకున్నారు. భక్తులతో గిరి ప్రదక్షిణ మార్గమంతా జన సంద్రంగా మారింది. **- సింహాచలం**

సినీ నటులపై ఈడీ కేసు

- అక్రమ బెట్టింగ్ యాప్‌లకు ప్రచారంపై దర్యాప్తు
- ఈసీఐఆర్‌లో 29 మంది నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు
- జాబితాలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, మంచులక్ష్మి
- త్వరలోనే వీరందరికీ సమన్లు జారీ చేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌లకు ప్రచారకర్తలుగా వ్యవహరించిన సినీ హీరోలు, నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా మొత్తం 29 మందిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసింది. పంజగుట్ట, మియాపూర్, సైబరాబాద్, సూర్యాపేట, విశాఖపట్నంలో నమోదైన వేర్వేరు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్– 1867ను ఉల్లంఘించి, అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లను ప్రోత్సహించినందుకు ఈడీ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు 29 మందిని ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్)లో చేర్చారు. వీరిలో సినీ హీరోలు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి తదితరులున్నారు. జంగ్లీ రమ్మీ, ఏ23, జీత్‌విన్, పరిమ్యాచ్, లోటస్ 365 తదితర యాప్‌లకు ప్రచారం చేసినందుకు వీరికి పెద్ద మొత్తంలో డబ్బు ముట్టిందని, ఇందులో మనీలాండరింగ్ కోణం ఉన్నట్టుగా ఈడీ అనుమానిస్తోంది. వీరందరికీ త్వరలోనే సమన్లు జారీచేసి మరిన్ని వివరాలు సేకరించేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు. కాగా, ఈ సెలబ్రిటీలు తమ తప్పును ఇప్పటికే ఒప్పుకున్నారు. నైతిక సమస్యల కారణంగా తాము కాంట్రాక్టులను ముగించామని పేర్కొన్నారు.

ఈసీఐఆర్‌లో నమోదు చేసిన పేర్లు

రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచులక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగెళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిని సౌందర్‌రాజన్, శోభాశెట్టి, అమృత్ చౌదరి, నాయాని పావని, నేహ పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణుప్రియ, హర్షసాయి, బయ్యాసన్నీయాదవ్,శ్యామల, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు శేష యాని సుప్రిత, మేనేజ్‌మెంట్ ఆఫ్ బెట్టింగ్ యాప్స్ కిరణ్ గౌడ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు అజయ్, సన్నీ, సుధీర్, యూట్యూబర్ లోకల్ బాయ్ నాని.

నా కోడికి న్యాయం చేయండి!

కోడి కాళ్లు విరగ్గొట్టిన వ్యక్తిపై కేసు పెట్టాలని పోలీసులను ఆశ్రయించిన వృద్ధురాలు



నకిరేకల్: తన కోడి కాళ్లు విరగ్గొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని ఓ వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి జరిగింది. నకిరేకల్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన గంగమ్మ కోడిని పెంచుకుంటోంది. ఆ కోడి ప్రతిరోజూ మేత కోసం ఆరుబయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకునేది. బుధవారం గంగమ్మ ఇంటి పక్కనే ఉంటున్న రాకేశ్ ఇంట్లోని గడ్డివాము వద్ద ఆ కోడి గింజలు తింటుండగా.. రాకేశ్ గమనించి కోడి పైకి కర్రను విసిరాడు. ఆ కర్ర తగిలి కోడి రెండు కాళ్లు విరిగాయి. ఇది గమనించిన గంగమ్మ బోరున విలపిస్తూ తన కోడి కాళ్లు విరగ్గొట్టిన రాకేశ్‌పై కేసు నమోదు చేయా లని బుధవారం రాత్రి నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. అయితే కోడి ధర ఎంతో చెబితే రాకేశ్‌తో డబ్బులు ఇప్పిస్తామని పోలీసులు ఆమెకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా.. ఆమె ససేమిరా అనింది. తనకు డబ్బులు వద్దని, రాకేశ్‌ను శిక్షించాల్సిందేనని పట్టుబట్టింది. దీంతో పోలీసులు చేసేదేమీ లేక గ్రామానికి వచ్చి పెద్ద మనుషులతో పంచాయితీ పెట్టి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆమె ఇంటికి వెళ్లింది.

తప్పుడు పత్రాలతో మోసగించారు

- ఫోర్జరీ చేసి శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పత్రాలను జగన్‌మోహన్‌రావు సృష్టించారు
- వాటి ఆధారంగానే హెచ్‌సీఏలోకి ప్రవేశం.. ఆపై నిధుల గోల్‌మాల్
- నిందితుల అరెస్ట్‌పై సీఐడీ అదనపు డీజీ చారు సిన్హా ప్రకటన
- నిందితులకు 22 వరకు జుడీషియల్ రిమాండ్ విధించిన కోర్టు

సాక్షి, హైదరాబాద్: తప్పుడు పత్రాలను సృష్టించి మోసానికి పాల్పడటంతోపాటు నిధుల గోల్‌మాల్‌కు పాల్పడిన నేరంపై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. జగన్‌మోహన్‌రావు సహా ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐడీ అదనపు డీజీ చారు సిన్హా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధర్మ గురువారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రావు, శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రటరీ సి. రాజేందర్ యాదవ్, అయన భార్య జి. కవితతో కలిసి ఈ కుట్రకు తెరతీసినట్లు సీఐడీ అధికారులు ఆధారాలు సేకరించారు. గౌలిపుర క్రికెట్ క్లబ్‌గా పిలిచే శ్రీచక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు సి. కృష్ణ యాదవ్ సంతకాలను ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లను జగన్‌మోహన్‌రావు సృష్టించారు. వాటి ఆధారంగానే ఆయన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగలిగినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. ఆ తర్వా త హెచ్‌సీఏ సీఈఓ సునీల్ కంటే, ట్రెజరర్ సీజే శ్రీనివాసరావు ఇతరులతో కలిసి నిధుల గోల్‌మాల్‌కు పాల్పడ్డారు. అలాగే ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఫ్రాంచైజీ అధికారులను బెదిరించడం.. కాంప్లిమెంటరీ టికెట్ల కోసం బ్లాక్ మెయిల్ చేయడం, కార్పొరేట్ బాక్స్‌లను అధీనంలో పెట్టుకోవడం వంటివి చేసినట్లు సీఐడీ అధికారులు ఆధారాలు సేకరించారు. ప్రాథమిక ఆధారాల మేరకు ఈ నెల 9న జగన్‌మోహన్‌రావు, శ్రీనివాసరావు, సునీల్ కంటే, రాజేందర్‌యాదవ్, జి.కవితలను అరెస్టు చేసినట్టు సీఐడీ అడిష నల్ డీజీ చారు సిన్హా తెలిపారు.

రూ. కోట్లలో అవినీతి!

జగన్‌మోహన్‌రావు కేసులో పలు సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. రెండేళ్లలో రూ. కోట్లలో గోల్‌మాల్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఆటగాళ్ల ఎంపికలో అవినీతి జరిగిందని, ఆటగాళ్ల తల్లిదండ్రులు నుంచి హెచ్‌సీఏ సభ్యులు డబ్బు వసూలు చేశారని సీఐడీ ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. చెక్ పవర్ దుర్వినియోగం, బీసీసీఐ ద్వారా వచ్చిన నిధుల్లో గోల్‌మాల్, ఎస్ఆర్‌హెచ్ నుంచి కాంప్లిమెంట్రీ పాస్‌లను బ్లాక్‌లో విక్రయించి సొమ్ము చేసుకోవడం, క్రీడాకారుల కోసం ఉపయోగించాల్సిన కాంప్లిమెంటరీ పాస్‌లలోనూ భారీ అవినీతి తదితర అంశాలపై సీఐడీ ఫోకస్ పెంచినట్లు సమాచారం. అదేవిధంగా తమను వేధించారంటూ జగన్‌మోహన్‌రావుపై ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఆరోపించిన నేపథ్యంలో యాజమాన్యం వాంగ్మూలాన్ని సైతం సీఐడీ అధికారులు నమోదు చేసినట్లు తెలిసింది.

నిందితులకు 12 రోజుల జుడీషియల్ రిమాండ్

జగన్‌మోహన్‌రావు సహా ఇతర నిందితులను సీఐడీ గురువారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టులో హాజరుపరచగా ఈ నెల 22 వరకు జుడీషియల్ రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. దీంతో మహిళా నిందితురాలు కవితను చంచల్‌గూడలోని మహిళా జైలుకు మిగతా నిందితులను చర్లపల్లి జైలుకు పోలీసులు తరలించారు. పరారీలో ఉన్న మరో నిందితుడు హెచ్‌సీఏ సెక్రటరీ దేవరాజ్ కోసం సీఐడీ గాలిస్తోంది. కాగా, నిందితులను మరింత లోతుగా ప్రశ్నించడం కోసం వారిని తమ కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అధికారులు కోర్టులో కస్టడీ పిటిషన్ వేయనున్నట్లు తెలిసింది.

ప్రభాకర్‌రావుపై సుప్రీంకోర్టుకు సిట్!

- ఆయనకు ఇచ్చిన ఉపశమనం రద్దుకు పిటిషన్ వేసే యోచన
- ఢిల్లీ వెళ్లిన వెస్ట్‌జోన్ పోలీసు అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఎస్ఐబీ కేంద్రంగా జరిగిన ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న టి.ప్రభాకర్‌రావుకు ఇచ్చిన ఉపశమనాన్ని రద్దు చేయాలంటూ సిట్ సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. ఈ మేరకు న్యాయ నిపుణులతో చర్చించి, పిటిషన్ దాఖలు చేయడానికి వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్ఎం విజయ్‌కుమార్, ఏసీపీ పి.వెంకటగిరి గురువారం ఢిల్లీ చేరుకున్నారు. హైదరాబాద్‌లో విచారణకు రాకముందు సుదీర్ఘకాలం అమెరికాలో తలదాచుకున్న ప్రభాకర్‌రావుపై పోలీసులు ఎల్ఓసీ, రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించారు. ఆపై ఆయన పాస్‌పోర్టునూ రద్దు చేయించి, ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు ఇష్యూ చేయించారు. అయితే ఈ ఏడాది మే నెలలో సుప్రీంకోర్టు ఆయనకు స్వల్ప ఊరట ఇచ్చింది. ప్రభాకర్‌రావును భారత్‌కు రానివ్వాలని, కఠిన చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. దీంతో ఆయన గత నెలలో హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. దీంతో ఇప్పటివరకు పలుమార్లు ఆయన్ను సిట్ అధికారులు ప్రశ్నించారు. అయితే ప్రభాకర్‌రావు సరైన సమాధానాలు ఇవ్వడం లేదని పోలీసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్నే సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లనున్నారు.

అరెస్టుకు అనుమతించండి!: అరెస్టుకు, కస్టోడియల్ విచారణకు అనుమతించాలని పోలీసులు అభ్యర్థించనున్నారు. ఈ కేసు నమోదైన తర్వాత పోలీసులు మరో నలుగురు నిందితులు పి.రాధాకిషన్‌రావు, ఎస్.భుజంగరావు, ఎం.తిరుపతన్న, డి.ప్రణీత్‌రావులను అరెస్టు చేశారు. మరో నిందితుడు శ్రవణ్‌కుమార్‌రావుకు సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ ఐదుగురితో పాటు పదుల సంఖ్యలో సాక్షుల్ని విచారించి వాంగ్మూలాలు నమోదు చేశారు. టెలికం సర్వీసు ప్రొవైడర్లతో పాటు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నుంచి అనేక నివేదికలు సేకరించారు. వీటన్నింటినీ క్రోడీకరించిన పోలీసులు సుప్రీం కోర్టులో పిటిషన్ వేయనున్నారు. కాగా ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఆగస్టు 5న మరోసారి విచారించనుంది.

సచివాలయంలో గురుపౌర్ణమి వేడుకలు

పూజల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్అండ్‌బీ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపౌర్ణమి రోజున శాఖ ఉద్యోగులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల మంత్రి వారిని అభినందించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

శతాబ్దాల చరిత్ర.. ఆదరణ లేక దీనావస్థ

నిరాదరణకు గురవుతున్న చారిత్రక సంపద

- నాగర్‌కర్నూల్ జిల్లాలో పురాతన విగ్రహాలు, శిలాశాసనాలకు రక్షణ కరువు
- నిర్వహణకు నిధులలేమి ప్రధాన సమస్య
- ఇటీవలే సాస్కీ ద్వారా కేంద్రం రూ.68.10 కోట్లు కేటాయింపు
- పర్యాటక అభివృద్ధి అంశాలను పరిశీలించిన మంత్రి జూపల్లి
- టూరిజం సర్క్యూట్‌పైనే ఆశలు



నాగర్‌కర్నూల్ జిల్లాలో శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయాలు, చరిత్రను తెలియజేసే శిలాశాసనాలకు రక్షణ కరువవుతోంది. అధికార యంత్రాంగం వీటిపై పెద్దగా దృష్టిపెట్టడం లేదు. కేవలం ఆదాయం ఉన్న ఆలయాలను మాత్రమే పట్టించుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ఆలయాల నిర్వహణతో పాటు పురావస్తు విగ్రహాలు, శాసనాల రక్షణకు నిధుల లేమి ప్రధాన సమస్యగా మారింది. అయితే సోమశిల సర్క్యూట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని పురాతన ఆలయాలకు మేలు జరుగుతుందని స్థానికులు భావిస్తున్నారు.

- కొల్లాపూర్


మల్లేశ్వరం సమీపంలో గుట్టపై ఉన్న విగ్రహం

అద్భుతమైన శిల్పకళతో..

కొల్లాపూర్ నియోజకవర్గంలోని జటప్రోలు సమీపంలో కృష్ణానది తీరాన కొన్ని శతాబ్దాల కిందట సురభి రాజవంశస్తులు అద్భుతమైన శిల్పకళతో మదనగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించారు. రాజుల పాలనలో ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఏటా నెలరోజుల పాటు ఆలయం వద్ద జాతర సాగేది. దాదాపు వంద గ్రామాల ప్రజలు వచ్చేవారు. ప్రతివారం పెద్దఎత్తున పశువుల సంత సాగేది. అయితే శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో ఆలయం నీటిలో మునిగిపోయింది. కాలక్రమేణా ఆలయాన్ని జటప్రోలులో పునర్నిర్మించారు. కొన్నేళ్లపాటు పూజలు యథాతథంగా సాగాయి. రానురాను తన ప్రాభవాన్ని కోల్పోయింది. చివరికి ధూప, దీప, నైవేద్యాలు పెట్టేవారు కూడా కరువయ్యారు. ఏడేళ్ల కిందట దేవాదాయశాఖ అధికారులు ఒక పూజారిని ఏర్పాటు చేశారు. కానీ, భక్తుల రాకమాత్రం పూర్తిగా తగ్గిపోయింది. జటప్రోలులోనే ఉన్న అగస్తేశ్వరాలయం, 19 మూకగుడుల నిర్వహణను పట్టించుకునేవారే లేరు. ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందిన ఈ ఆలయం పూర్వవైభవానికి నోచుకోవడం లేదు.


కల్వకోల్‌లో కాకతీయుల కాలం నాటి శాసనం

మరికొన్ని ఆలయాలు ఇలా..

జిల్లాలోని పలు ఆలయాలకు చారిత్రక ప్రాశస్త్యం ఉన్నప్పటికీ సరైన ఆదరణ లేక వెలవెలబోతున్నాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలోని మంచాలకట్ట వద్ద కృష్ణానది తీరాన శతాబ్దాల చరిత్ర కలిగిన రామతీర్థాలయం ధూప, దీపాలకు నోచుకోవడంలేదు. అమరగిరి సమీపంలో కృష్ణాతీరంలోనే మునులు ప్రతిష్ఠించిన మల్లయ్యస్వామి (మల్లయ్యసెల) గుడి పరిస్థితి కూడా ఇంతే. పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిర్మలాపూర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి రెండో తిరుపతిగా ఒకప్పుడు పేరుండేది. క్రమంగా ప్రాభవం కోల్పోతోంది. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని శివాలయం, చిన్నంబావి మండలంలోని బెక్కెం సమీపాన సూర్యదేవాలయం, పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌లో శివాలయం, నందీశ్వరాలయం, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నందివడ్డెమాన్‌లో ఆలయాలకు సరైన ఆదరణ లభించడం లేదు.

శాసనాలు, శిల్పాలు..

పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌లో 13వ శతాబ్దానికి చెందిన కాకతీయుల కాలం నాటి శిలాశాసనం ఉంది. దీన్ని పట్టించుకునే వారే లేరు. ఇటీవల పురావస్తు నిపుణుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆ శాసనాన్ని సందర్శించారు. చరిత్రను తెలియజేసే శాసనాలను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కొల్లాపూర్‌లోని ఆర్‌ఐడీ కళాశాల సమీపం, పలు ప్రాంతాల్లో సురభి రాజులకు సంబంధించిన శాసనాలు ఉన్నాయి. మల్లేశ్వరం సమీపంలోని గుట్టపై పురాతన దేవతామూర్తుల విగ్రహాలు పూజలకు నోచుకోకుండా నిరుపయోగంగా ఉన్నాయి. సోమశిలలో పురాతన విగ్రహాలను మ్యూజియంలో ఉంచగా.. మరికొన్ని చెట్లకిందే ఉన్నాయి. అయితే వాటి విశిష్టతను తెలియజెప్పేవారు లేరు. జిల్లావ్యాప్తంగా పురాతన విగ్రహాలు, శిలాశాసనాలు చాలాచోట్ల రక్షణ లేకుండా ఉన్నాయి.

ప్రచారం కల్పిస్తే గుర్తింపు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయి. వీటిలో అధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ఉన్నాయి. కృష్ణానది తీరం వెంట శతాబ్దాల కాలం కిందటే మునులు, రుషులు ఆలయాలను నిర్మించారు. వీటికి తగిన ప్రచారం కల్పిస్తే పర్యాటకులు, భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దేదీప్యమానంగా వెలుగొందిన జటప్రోలు మదనగోపాలస్వామి వంటి ఆలయాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సాస్కీ నిధులపైనే ఆశలు..

కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నియోజకవర్గంలోని సోమశిల పరిసర పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల అభివృద్ధికి స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్ (సాస్కీ) ద్వారా కేంద్రం రూ.68.10 కోట్లు కేటాయించింది. ఈ నిధుల వినియోగం, పర్యాటక అభివృద్ధి అంశాలను పరిశీలించేందుకు ఇటీవల మంత్రి జూపల్లి, రాష్ట్ర పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరి క్రాంతి కొల్లాపూర్‌లో పర్యటించారు. సోమశిల, అమరగిరి, జటప్రోలు, మంచాలకట్ట, మల్లేశ్వరం ప్రాంతాలను తిలకించారు. సాస్కీ నిధులతో చేపట్టబోయే పనుల ద్వారా పురాతన ఆలయాలు, శిలాశాసనాలకు తగిన గుర్తింపు లభించవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి



జిల్లాలోని పలు ప్రాంతాల్లో చారిత్రక శిలాశాసనాలు, పురాతన విగ్రహాలున్నాయి. అవన్నీ చరిత్రకు సాక్ష్యాలు. వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంతోపాటు స్థానికులపై ఉంది. పురావస్తు అధికారులు వాటి రక్షణకు చర్యలు చేపట్టాలి. జటప్రోలు మదనగోపాలస్వామి ఆలయం వంటి పురాతన ఆలయాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు అధికారులు కృషిచేయాలి.

– శివకృష్ణయాదవ్, కొల్లాపూర్

అధికారులు దృష్టి సారించాలి



మల్లేశ్వరం సమీపంలోని గుట్టపై పురాతనమైన కాలభైరవ, 11వ శతాబ్దానికి చెందిన శేషశయన విష్ణుమూర్తి విగ్రహాలున్నాయి. వీటిని పరిరక్షించాలని ఏళ్లుగా అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. చారిత్రక ప్రాశస్త్యం ఉన్న విగ్రహాలు, ఆలయాలు, శాసనాలు ధ్వంసం కాకుండా కాపాడాలి. వీటి రక్షణకు చర్యలు చేపట్టాలి.

– అశోక్‌నంద, మల్లేశ్వరం


మదనగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించిన మంత్రి జూపల్లి, జయేశ్‌రంజన్, వల్లూరి క్రాంతి

విద్య.. వైద్యం.. 22 సూత్రాలు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిస్పెషల్ ఫోకస్

- 22 రకాల కార్యక్రమాలతో విద్యాభివృద్ధికి కృషి
- విద్యారంగంలో నూతన ఒరవడి
- సామాజిక రుగ్మతలపై అవగాహన
- బాలికా సాధికారత కోసం 'స్నేహిత'


అనాథ పిల్లల (కోవిడ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు)తో ఓ హోటల్‌లో భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)


కలెక్టరేట్ ఆడిటోరియంలో సమావేశానికి హాజరైన వలస కార్మికుల పిల్లలు (ఫైల్)


ప్రభుత్వ పాఠశాలలో పిల్లలతో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు (ఫైల్)


గంగాధర మండలం గట్టుభూత్కూర్ ప్రభుత్వ పాఠశాలలో వలస కార్మికుల పిల్లలకు అందజేసిన బట్టలు, వారితో పాఠశాలలో జిల్లా విద్యాధికారులు(ఫైల్)

కరీంనగర్: ఆమె ఆలోచనలు వినూత్నం.. కార్యాచరణ విభిన్నం..విద్యార్థులకు గురువులా.. అనాథలను అమ్మలా ఆదరిస్తున్నారు. కలెక్టర్‌గా కరీంనగర్ జిల్లా అభివృద్ధితోపాటు భవిష్యత్ తరాలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని 22 రకాల కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు కలెక్టర్ పమేలా సత్పతి. బాలికల సాధికారత.. సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పిస్తున్నారు. కలెక్టర్‌గా జిల్లాలో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టిని సారించారు. కరీంనగర్ కలెక్టర్‌గా పమేలా సత్పతి చేస్తున్న పనులపై ప్రత్యేక కథనం.

ఏబీసీ ఆఫ్‌లైఫ్ రైమ్

పిల్లలకు ఏ నుంచి జెడ్ వరకు 26 విలువలను సరదాగా, సంగీతం ద్వారా అవగాహన కల్పించే వినూత్న విద్యాసాధనం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో దృశ్యరూపకం రూపొందించి ప్రదర్శిస్తున్నారు. 2025 మే 6న లక్నోలో జరిగిన 10 రాష్ట్రాల ఉన్నతాధికారులకు ఇచ్చిన నాయకత్వ శిక్షణ కార్యక్రమంలో ఈ రైమ్ ప్రదర్శించారు.

- స్నేహిత అనే కార్యక్రమం ద్వారా విద్యార్థినుల్లో గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. బాలికల్లో విద్య, నైపుణ్యత, సాధికారత గురించి వివరిస్తున్నారు. సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిప్తిస్తున్నారు. ఆపద సమయంలో 1098 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించడమే స్నేహిత లక్ష్యం.
- బ్రిక్స్ టు బుక్స్.. దీని ద్వారా ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన 500 మంది విద్యార్థులను సమీప పాఠశాలల్లో చేర్పించారు. ఈ పిల్లలకు ఇటుక బట్టీల యజమానులను గార్డియన్‌లుగా ఉంచి.. వారి ద్వారానే విద్యార్థులకు రెండు జతల ట్రాక్ సూట్లు, బ్లేజర్, రవాణా సౌకర్యం కల్పించారు. జిల్లాలోని వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి విద్యార్థికి 3 జతల చొప్పున మొత్తం 22,033 జతల షూలు, 66,099 జతల సాక్స్ పంపిణీ చేశారు.
- గత నాలుగైదేళ్లుగా ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తీర్ణత కాని విద్యార్థుల పరీక్ష రుసుం చెల్లించారు. వ్యక్తిగతంగా మార్గనిర్దేశనం చేయగా 483 మందిలో 432 మంది 2024 జూన్‌లో జరిగిన అడ్వాన్స్‌డ్ పరీక్షలకు హాజరై 418 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన వారిలో 2025 మార్చిలో 13 మంది పాస్ అయ్యారు.
- విద్యావాహిని-బడి బాట.. ద్వారా కరీంనగర్ జిల్లాలోని 16 మండలాల్లో విద్యావాహిని ద్వారా వేసవి సెలవులలో బడిబాట నిర్వహించారు. దీని ద్వారా ప్రస్తుత విద్యా సంవత్సరంలో 7,642 (58.18శాతం) మంది విద్యార్థులు పెరిగారు. 'విద్యావాహిని కరీంనగర్'ప్రత్యేకంగా యూట్యూబ్ చానల్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా విద్యాసంబంధిత, ప్రేరణ, సృజనాత్మక అంశాలను అప్‌లోడ్ చేస్తున్నారు.


విద్యార్థులకు బుక్స్, బ్యాగ్‌లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు(ఫైల్)


తిమ్మాపూర్ మండలం రేణికుంట పాఠశాలలో చిన్నారితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి(ఫైల్)

- వాయిస్ ఫర్ గర్ల్స్.. బాలికల సామాజిక జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. చిన్న వయసులో పెళ్లి, చదువు మానేయడం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం.
- కాన్షియస్‌నెస్ క్లబ్స్.. డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగం ద్వారా కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగించడం దీని ఉద్దేశం. ఈ క్లబ్‌లో ఇద్దరు టీచర్లు, తల్లి లేదా తండ్రి, విద్యార్థి, ఎక్సైజ్ సిబ్బంది సభ్యులుగా ఉంటారు.
- టెడ్ ఎడ్ టాక్స్... రాష్ట్రంలో మొదటిసారిగా గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సాధికారత కోసం పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా పారమిత విద్యాసంస్థల సహకారంతో టెడ్ టాక్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపికైన 300పైగా విద్యార్థులు మండల స్థాయిలో పోటీపడి.. జిల్లా స్థాయికి చేరిన 40 మంది నుంచి 20 మందిని ఎంపికచేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థుల టెడ్ ఎడ్ ప్రసంగాలు రాష్ట్రంలో వైరల్‌గా మారాయి. న్యూయార్క్‌లోని టెడ్ ఎడ్ ప్రధాన కార్యాలయం ప్రచురించింది. జూన్ 25న మరో నలుగురు విద్యార్థులు వారి టెడ్ ఎడ్ ప్రసంగాలు చేశారు. ఈ టెడ్ ఎడ్ టాక్స్ లైసెన్స్‌ను జంగపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, ముల్కనూర్ తెలంగాణ మోడల్ స్కూల్ పొందాయి. ఈ కార్యక్రమం జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో విశేషమైన ఆదరణ పొందుతూ 2024-25 విద్యాసంవత్సరంలో 4,831 ఉన్న విద్యార్థుల నమోదు కాగా 2025-26లో 6,393కు చేరింది.

గణిత ఒలింపియాడ్స్

- జిల్లాలోని 175 పాఠశాలల నుంచి మండల, జిల్లా స్థాయిలకు రెసిడెన్షియల్ పద్ధతిలో 350 మంది విద్యార్థులను గణిత, సైన్స్ ఒలింపియాడ్‌లో పాల్గొనేందుకు నామినేట్ చేశారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం కింద అల్ఫోర్స్ పాఠశాలతో చేసుకున్న ఒప్పంద సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. 40 మంది టాపర్లు వేసవి సెలవుల్లో ప్రత్యేక కోచింగ్ తీసుకొని మోడల్ పరీక్షల్లో ప్రతిభ చూపారు.
- సైన్స్ టీచర్లకు, యునైటెడ్ కింగ్‌డమ్ రాయల్ సొసైటీ వారిచే శిక్షణ ఇప్పిస్తున్నారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా వీరితో ఎంవోయూ చేసుకొని 2024 నవంబర్ 5 నుంచి 8 వరకు ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

ఉచిత సమ్మర్ క్యాంపులు

- 27 విభాగాల్లో అల్ఫోర్స్, సెయింట్‌జార్జ్, పారమిత, వివేకానంద, సాధన ప్రైవేట్ పాఠశాలల సహకారంతో ఉచిత సమ్మర్ క్యాంపులు నిర్వహించారు. దాదాపు 1,500 మంది విద్యార్థులు ఈత, కంప్యూటర్ శిక్షణ, యాంకరింగ్, ఇంగ్లిష్ భాషనైపుణ్యాలు నేర్చుకున్నారు.
- విటమిన్ గార్డెన్స్ (స్కూల్ లైఫ్ స్కిల్స్ చాలెంజ్).. విటమిన్ గార్డెన్‌లలో పెంచుతున్న వివిధ కూరగాయలను, జిల్లాలోని అన్ని ప్రాథమిక, ఉన్నత, కస్తూర్బా, మోడల్ స్కూల్స్‌లలో మధ్యాహ్న భోజన వంటల్లో ఉపయోగిస్తున్నారు. ప్రకృతితో అనుసంధానంగా గణిత, సైన్స్ ప్రయోగాలు చేస్తూ గార్డెన్స్ పెంచుతున్నారు.
- 30 ప్రేరణాత్మక దృశ్య చిత్రాలను ఎంపిక చేసి ప్రతీ మొదటి, మూడో శనివారం ప్రదర్శిస్తున్నారు. విద్యార్థులు ఈ సినిమాలు చూసిన తర్వాత వీటిపై సమీక్షలు రాయిస్తున్నారు. తద్వారా భాషాభివృద్ధి, భావవ్యక్తీకరణ, చదవడం, కుదిరించి రాయడం నేర్చుకునే అవకాశం కలుగుతుంది.


వలస కార్మికుల పిల్లల సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి (ఫైల్)

- ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి 2024 నవంబర్ 10న ప్రారంభించి 14 ఆదివారాలపాటు నటన నైపుణ్యాల్లో శిక్షణ ఇప్పించి వారితో కరీంనగర్ కళాభారతిలో థియేటర్ ఫెస్టివల్ నిర్వహించారు.
- విద్యార్థుల చదువు నైపుణ్యాల అభివృద్ధికి ప్రతీ బుధవారం ఒక పాఠం శబ్దపూర్వకంగా చదవడాన్ని ప్రోత్సహించడం, విద్యార్థులు ఇంటి వద్ద వారి తల్లిదండ్రులు, పెద్దవారిముందు గట్టిగా చదివి వినిపించడం ద్వారా వారు అవసరాన్ని బట్టి సరిచేసి చదివించే అవకాశం ఉంటుంది.
- రోజూ ఒక పేజీ రాత వలన విద్యార్థులు రాతలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం జరుగుతుంది. ఉపాధ్యాయులు రాత నైపుణ్యాలను పరిశీలిస్తూ తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుంది.
- వీధుల్లో ఉన్న జంతువులను చూస్తే ఎలా స్పందించాలనే అంశాలపై సైతం అవగాహన కల్పిస్తున్నారు. రేబిస్ వంటి వ్యాధులు, టీకాలు చికిత్స విషయాలు తెలుసుకుంటారు. జిల్లా స్థాయిలో 630 మంది హెచ్ఎంలు, 900 ఎకో క్లబ్ సభ్యులకు ఓరియంటేషన్ నిర్వహిస్తున్నారు.
- 2005లో ప్రారంభమైన సైన్స్ మ్యూజియంను 2024లో పునర్నిర్మించారు. 56 వర్కింగ్ మోడల్స్, 80 నమూనాలు, సైన్స్ మోడల్స్, డైనోసార్ మోడల్, ప్లానెటోరియం ఉన్నాయి.
- సారథి ట్రాఫిక్ పార్క్.. విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుంది. రోడ్డు భద్రత, ట్రాఫిక్ సంకేతాలు, రోడ్డు గుర్తుల అవగాహన కల్పిస్తున్నారు. తిమ్మాపూర్ మండలానికి చెందిన విద్యార్థులు 2024 డిసెంబర్ 21 నుంచి 2025 ఏప్రిల్ 4 వరకు కరీంనగర్ ఆర్టీవో ఉన్న సారథి ట్రాఫిక్ పార్క్‌ను సందర్శించి రోడ్ సేఫ్టీపై అవగాహన పొందారు. ఇప్పటివరకు 450 మంది విద్యార్థులు, 44 మంది ఉపాధ్యాయులు సందర్శించారు.
- కెరీర్ గైడెన్స్ చార్ట్.. జిల్లాలోని ఉన్నత, కస్తూర్బా, మోడల్ స్కూల్స్‌లో చదివి పాస్ అయిన విద్యార్థులకు (5,595 మంది) పదో తరగతి తరువాత ఏం చదవాలో తెలిపే డిటైల్డ్ చార్ట్‌ను, కౌన్సెలింగ్ బుక్‌లెట్స్‌ను పదోతరగతి ఫలితాలు రాగానే అందజేశారు.



సింహగిరికి మబ్బుల గొడుగు

పచ్చని కొండల మధ్య సుందర నగరాన్ని నల్లటి మబ్బులు కమ్మేశాయి. గురు పౌర్ణమి రోజున లక్షల మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తుంటే వారికి గొడుగు పట్టినట్లు కారు మబ్బులు అలముకున్నాయి. ఆ మబ్బులను చీల్చుకుంటూ వస్తున్న సూర్యుడి కిరణాల అద్భుత దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



పంట పండింది..

మత్స్యకారుల పంట పండింది. గురువారం విశాఖ హార్బర్‌లో వేటకు వెళ్లిన వారి వలలకు భారీ చేపలు చిక్కాయి. కొమ్ము కోనెం, ట్యూనా చేపలు పెద్ద సంఖ్యలో లభించాయి. దీంతో సాయంత్రం ఫిషింగ్ హార్బర్‌లో సందడి నెలకొంది. కొంత మంది వాటికి అక్కడే వేలం నిర్వహించగా.. మరికొందరు ఎగుమతులకు సిద్ధం చేసుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



బెళ్లియం వంతెనలు కాదు.. బెజవాడ సౌందర్యం

కొండపై కొలువైన దుర్గమ్మ భక్తులను కాపాడుతుండగా.. బిరబిరా ప్రవహించే కృష్ణమ్మ సిరుల పంటలు పండిస్తూ, బెజవాడ అందాన్ని మరింత పెంచుతోంది. నదిపై నిర్మించిన వంతెనలు, వాటిగుండా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు, చుట్టూ పచ్చదనం.. విజయవాడ సహజ సౌందర్యాన్ని ఇనుమడింపచేస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా...

సత్యకుమారికి సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ 2025 అవార్డు



దాబాగార్డెన్స్: సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డ్–2025లో ఛేంజ్ మేకర్ విభాగం పురస్కారానికి విశాఖ నగరానికి చెందిన ఉన్నవ వెంకట సత్యకుమారి ఎంపికయ్యారు. గురువారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డుల కార్యక్రమం చెన్నైలోని ఎంసీసీ స్కూల్ ఆడిటోరియంలో ఈనెల 9న జరిగిందన్నారు.ట్విల్ మ్యాగజైన్ వ్యవస్థాపకుడు దీపక్ టాటర్ జైన్ నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. సేవ, మహిళల సాధికారత రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ పురస్కారాలను అందిస్తారని సత్యకుమారి వివరించారు.

కరెంట్ కాటుకు విద్యార్థి బలి

మెగా పీటీఎంకు వెళ్లొచ్చిన కాసేపటికే ఘటన



మెళియాపుట్టి : శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి నవగాపు మహేష్ (10) విద్యుదాఘాతంతో గురువారం మృతిచెందాడు. గొప్పిలి ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎంకు హాజరయ్యాడు. స్కూల్‌లో ఇచ్చిన మొక్కను తీసుకుని సాయంత్రం ఇంటి మేడపై ఉన్న కుండీలో నాటేందుకు వెళ్లాడు. అక్కడ పడి ఉన్న జీఏ వైరును తీసి పక్కన పెడదామనుకుని పట్టుకోగా.. షాక్ కొట్టి అక్కడే పడిపోయాడు. శ్లాబ్ గోడకు బలంగా తగలడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. మెట్ల నుంచి రక్తం బొట్టుబొట్టుగా రావడం చూసిన కుటుంబ సభ్యులు మేడపైకి వెళ్లేసరికి బాలుడు విగతజీవిగా పడి ఉన్నాడు. బిడ్డ మృతదేహాన్ని చూసి తల్లి గుండెలవిసేలా రోదించింది. విద్యార్థి తండ్రి చంద్రరావు ఇటీవలే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పీఐబీ ఏపీ డైరెక్టర్‌గా రత్నాకర్

సాక్షి, అమరావతి: ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఆంధ్రప్రదేశ్ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా పి.రత్నాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అండ్ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాకు(పీఆర్‌జీఐ) డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) సీనియర్ అధికారైన రత్నాకర్ పీఐబీలో బాధ్యతలు స్వీకరించడానికి ముందు విజయవాడలోని సీబీసీ ప్రాంతీయ కార్యాలయంలో డైరెక్టర్‌గా సేవలందించారు. రాష్ట్రంలోని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన వివిధ క్షేత్ర ప్రచార విభాగాలు, వార్తా విభాగాల్లోనూ పని చేశారు.

నర్సాపూర్ ప్రత్యేక రైలుకు వీరవాసరంలో హాల్టింగ్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పయాణికుల అవసరా మేరకు నర్సాపూర్–తిరువన్నమలై ప్రత్యేక రైలుకు పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం స్టేషన్‌లో రెండు నిమిషాలు హాల్టింగ్ సదుపాయం కల్పించినట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ నుంచి తిరువన్నమలై వెళ్లే ప్రత్యేక రైలు (07219) వీరవాసరం స్టేషన్‌కు మధ్యాహ్నం 1.23 గంటలకు చేరుకుని, 1.25 గంటలకు బయలుదేరి వెళుతుంది. అదే విధంగా తిరువన్నమలై నుంచి నర్సాపూర్ వెళ్లే రైలు (07220) రాత్రి 11.28 గంటలకు వీరవాసరం స్టేషన్‌కు చేరుకుని, తిరిగి 11.30 గంటలకు బయలుదేరి వెళుతుంది.

కూటమి వల.. క్యాంపస్ విలవిల

ఒంగోలు ట్రిపుల్ ఐటీకి నో ఆప్షన్

- 183 ఖాళీలతో రాష్ట్రంలో అత్యధిక సీట్లు మిగిలిపోయిన కాలేజీగా గుర్తింపు
- కూటమి ప్రభుత్వ నిర్వాకంతో కాలేజీలో చేరడంపై విద్యార్థుల అనాసక్తి
- అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో చిరాకు
- తరచూ క్యాంపస్‌లను మార్చడమే ప్రధాన కారణం
- నిత్యం సమస్యలు సృష్టించడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో భయాందోళనలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ట్రిపుల్ ఐటీల ప్రతిష్ట మసకబారింది. ఒంగోలు ట్రిపుల్ ఐటీ కాలేజీలో బయటి వ్యక్తుల పెత్తనంతో భ్రష్టుపట్టిపోయింది. కాలేజీలో పచ్చ బ్యాచ్‌ను నాన్ టీచింగ్ సిబ్బందిగా నియమించడం ద్వారా క్యాంపస్ ఎత్తివేత కుట్రలకు ప్రభుత్వం తెరదీసింది. ఏడాది పాటు ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్ అద్దె చెల్లించకుండా నిలిపేసింది. కరెంటు బిల్లులూ చెల్లించలేదు. మౌలిక సదుపాయాలపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. చివరకు క్యాంపస్‌ను ఎత్తివేసింది. ఈ పరిణామాలతో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో చేరాలంటే విద్యార్థులు భయపడిపోయే పరిస్థితి దాపురించింది. తాజాగా జరిగిన కౌన్సెలింగ్‌లో రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు మిగిలిపోయిన కాలేజీగా నిలవడం పరిస్థితికి అద్దం పడుతోంది.



ఒంగోలు ట్రిపుల్ ఐటీ ఎస్ఎస్ఎన్ క్యాంపస్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లు ఉండగా ఒక్కో క్యాంపస్‌కు 1100 సీట్లున్నాయి. ఈ ఏడాది జూన్ 30 నుంచి జూలై 5వ తేదీ వరకు కౌన్సెలింగ్ జరిగింది. ఈ కౌన్సెలింగ్‌లో మొత్తం 598 సీట్లు ఖాళీగా మిగిలాయి. ఇందులో ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి 183 సీట్లు ఖాళీగా మిగిలి రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు మిగిలిపోయిన కాలేజీగా నిలిచింది. గతంలో ఎన్నడూ ఇన్ని సీట్లు మిగలలేదని కాలేజీ ఉద్యోగులు చెబుతున్నారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో ఈ సీట్లు ఎన్ని భర్తీ అవుతాయో చూడాలి.

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో రాజకీయ జోక్యం మితిమీరిపోయింది. రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత కీలక పదవిలో ఉన్న మంత్రికి సన్నిహితుడైన ఒక ప్రైవేటు కాలేజీ అధినేత కాలేజీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం మొదలుపెట్టారు. తన గ్రామానికి చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలకు నాన్ టీచింగ్ స్టాఫ్‌గా నియమించినట్లు సమాచారం. అప్పటి వరకు ప్రశాంతంగా కొనసాగిన ఒంగోలు క్యాంపస్‌లో రచ్చ మొదలైంది. ఆ 50 మంది పచ్చ బ్యాచ్‌కు ఎలాంటి విధులు అప్పగించకుండా కూర్చోబెట్టి జీతాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. క్యాంపస్‌లోని ఎగ్జామ్ సెల్ పక్కనే ఉన్న ఒక గదిని డెన్‌గా మార్చుకున్న సదరు ఎల్లో బ్యాచ్ డ్యూటీ చేయకుండా టీవీలు చూస్తూ టైం పాస్ చేసేవారని విమర్శలు వచ్చాయి. అంతేకాకుండా కాలేజీ నిబంధనలకు వ్యతిరేకంగా తమ ఇష్టమొచ్చినప్పుడు కాలేజీకి వచ్చి సంతకాలు చేసేసి వెళ్లిపోయేవారని సమాచారం. దీంతో క్యాంపస్‌లో గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే క్యాంపస్ అద్దె చెల్లించలేదు. దాంతో రూ.2.50 కోట్ల అద్దె బకాయి మిగిలిపోయింది. కరెంటు బిల్లు సైతం కోటి రూపాయలకు పైగానే చెల్లించకుండా నిలిపేశారు. దీంతో తరచుగా కరెంటు కట్ చేయడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. మోటార్లు కాలిపోయి నీటి సరఫరా ఆగిపోయినా పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. రకరకాల సాకులు చూపి రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌ను ఎత్తివేశారు. ఇది విద్యార్థుల మీద తీవ్ర ప్రభావం చూపిందని కాలేజీ అధ్యాపకులు చెబుతున్నారు.

సొంత భవనాలు ఎప్పుడు నిర్మిస్తారో...

ఒంగోలు ట్రిపుల్ ఐటీలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపకపోవడానికి ప్రధాన కారణాల్లో ఒకటి తరచుగా క్యాంపస్‌లను మార్చడం. తొలుత ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీలో ఒంగోలు క్యాంపస్‌ను నిర్వహించారు. అక్కడ నుంచి మార్చి ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. అంతా బాగుందనుకుంటున్న విద్యార్థులకు ఐదేళ్ల తరువాత కూటమి ప్రభుత్వం వచ్చి ఒంగోలు క్యాంపస్‌ను నూజివీడుకు మార్చింది. పిల్లి పిల్లను తీసుకొని ఇంటింటికి తిరుగుతున్నట్లు విద్యార్థులు తరచుగా క్యాంపస్‌లు మారాల్సి రావడంతో చిరాకుకు గురౌతున్నారు. కొత్తగా చేరే విద్యార్థులపై తీవ్రమైన ప్రభావం పడింది.

ఒంగోలులో ట్రిపుల్ ఐటీకి సొంత భవనాలను నిర్మించడం ఒక్కటే దీనికి పరిష్కారమని కొందరు అధ్యాపకులు చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ విషయంలో కూడా తరచుగా మాట మారుస్తోంది. తొలుత పామూరులో ట్రిపుల్ ఐటీ కాలేజీని నిర్మిస్తామన్నారు. తాజాగా కనిగిరిలో ట్రిపుల్ ఐటీ కాలేజీ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. ఒకవేళ మార్కాపురాన్ని జిల్లాగా మారిస్తే కనిగిరి.. మార్కాపురం జిల్లా పరిధిలోకి వెళ్లిపోతుంది. అప్పుడు ఒంగోలుకు అసలు ట్రిపుల్ ఐటీ కాలేజీ లేకుండా పోయే ప్రమాదం ఉందని మరికొందరు వాదిస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులోనే ట్రిపుల్ ఐటీ కాలేజీకి సొంత భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

ఎస్ఎస్ఎన్‌లో ఆదిలోనే హంసపాదు...

రావ్ అండ్ నాయుడు క్యాంపస్ ఎత్తేసిన తరువాత ఒంగోలులో మిగిలింది ఎస్ఎస్ఎన్ క్యాంపస్. కాలేజీ తరగతులు ప్రారంభం కాకముందే ఇక్కడ మరో పచ్చ బ్యాచ్ రచ్చ రచ్చ చేసి విద్యార్థుల్లో భయాందోళనలు సృష్టించిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కాలేజీ క్యాంటీన్ నిర్వహణను రెండుగా విభజించి ఇద్దరికి ఇచ్చారు. బాలికల క్యాంటీన్‌ను చవటపాలెం గ్రామానికి చెందిన ఒకరికి, బాలుర క్యాంటీన్‌ను కొత్తపట్నం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చారు. ఈ ఇద్దరూ టీడీపీ నాయకులు, సానుభూతిపరులు కావడం గమనార్హం. గత బుధవారం బాలికల క్యాంటీన్‌ను తెరవడంతో బాలుర క్యాంటీన్ కాంట్రాక్టర్ గొడవకు దిగారు. 20 మంది యువకులను తీసుకొచ్చి కాలేజీలోకి బలవంతంగా ప్రవేశించి బాలికల క్యాంటీన్ నిర్వాహకురాలి భర్త మీద దాడి చేశారు.

క్యాంటీన్‌లోని వస్తువులతోపాటు ఆహార పదార్థాలను రోడ్డు మీద పడేశారు. ఈ దాడితో కాలేజీలో రిపోర్టింగ్ చేయడానికి వచ్చిన విద్యార్థులు, వారి తలిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. అసలు క్యాంటీన్ నిర్వహణ బాధ్యతను ఇద్దరికి కట్టబెట్టడం వలన గొడవలు జరిగే అవకాశం ఉందని అంచనా వేయడంలో అధికారులు వైఫల్యం చెందారన్న విమర్శలు వినవస్తున్నాయి. ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌ను కూడా ఎత్తివేసే క్రమంలోనే అధికార పార్టీ పక్కా ప్రణాళికతో గొడవలు సృష్టించిందని కొందరు విశ్లేషిస్తున్నారు.

పోలీసు బందోబస్తు మధ్య క్యాంటిన్ నిర్వహణ..

బాలికల క్యాంటీన్ నిర్వాహకుడి మీద దాడి జరిగిన రోజు రాత్రి జిల్లాకు చెందిన ఒక కీలక ఎమ్మెల్యే నివాసంలో అర్ధరాత్రి వరకు రాజీ ప్రయత్నాలు సాగినట్లు ప్రచారం జరిగింది. అంతా అయిపోయింది. తెల్లారేసరికల్లా ఇద్దరూ కలిసిపోయారని చెప్పారు. ఈ లోపు ఏం జరిగిందో ఏమో కానీ దాడికి గురైన బాలికల క్యాంటీన్ నిర్వాహకులు శుక్రవారం సంతనూతలపాడు పోలీసు స్టేషన్లో కేసు పెట్టినట్లు సమాచారం. అదే రోజు క్యాంపస్‌కు వచ్చిన పోలీసులు విచారణ జరిపి దాడి తాలుకు సీసీ ఫుటేజీలను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. శనివారం నుంచి పోలీసు బందోబస్తు మధ్య బాలికల క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారని సమాచారం. కాలేజీ క్యాంపస్‌లో పోలీసు పహారా మధ్య విద్యార్థులు భోజనాలు చేయడానికి భయపడిపోతున్నట్లు తెలుస్తోంది. ట్రిపుల్ ఐటీ అధికారుల వైఫల్యం వల్లనే ఇలాంటి దౌర్భాగ్యం నెలకొందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమాలకు అడ్డా.. ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కలకలం రేపిన బాధితుని ఆందోళన



ఉండి రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రంగబాబు

ఉండి: భూ అక్రమార్కులకు పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అడ్డాగా మారిందంటూ రంగబాబు అనే వ్యక్తి గురువారం కార్యాలయం ముందు టెంట్ వేసి ఆందోళనకు దిగడం స్థానికంగా కలకలం రేపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చినగొల్లపాలెంలో తమ ఆస్తికి సంబంధించి అక్రమాలు జరుగుతున్నాయన్నారు. భూ అక్రమాలకు సంబంధించి తనతో పాటు మరికొందరు గత కొద్దికాలం నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రావడంతో సబ్ రిజిస్ట్రార్ సెలవుపై వెళ్లిపోయినట్టు పేర్కొన్నారు. కృష్ణాజిల్లాతో పాటు రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల నుంచి రిజిస్ట్రేషన్‌ల కొరకు ఉండికి తరలివస్తున్నట్టు తెలిపారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు లంచాలు తీసుకుంటున్న అధికారులు భూ ఆక్రమణ దారులకు కొమ్ముకాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు తగిన న్యాయం చేయకపోతే భార్యాబిడ్డలతో ఉండి రిజిస్ట్రార్ ఆఫీసు ముందు ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించారు. తమకు సంబంధించిన 32 ఎకరాల భూమిని అక్రమంగా ఆక్రమించుకునేందుకు ఓ మంత్రి సమీప ఉద్యోగి, రిజిస్ట్రేషన్ శాఖలో ఓ ఉన్నతాధికారి ప్రయత్నిస్తున్నట్లు తనకు అనుమానంగా ఉందని చెప్పారు. దీనిపై అధికారులు స్పందించిన తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, అక్రమ రిజిస్ట్రేషన్ల ఆరోపణలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌చార్జి టి.శరాబందురాజు ఖండించారు. ఇలా చేయడం ఎవరివల్లా కాదన్నారు. ఆరోపణలు చేస్తున్న రంగబాబు ఆస్తి కోర్టు పరిధిలో, అదీ నిషేధిత భూముల జాబితాలోనూ ఉందని పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రార్ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్ళారు గానీ, ఎవ్వరికీ భయపడికాదని స్పష్టం చేశారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్లు అరెస్ట్

22ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పోలీసుల అదుపులో ఉన్న స్మగ్లర్లు, స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

తిరుపతి మంగళం: అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజ్ అటవీ ప్రాంతంలో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేయడంతో పాటు, వారి నుంచి 22 ఎర్రచందనం దుంగలు, మూడు మోటారు సైకిళ్లను గురువారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్, డిఎస్పీ జి.బాలిరెడ్డి అధ్వర్యంలో ఆర్ఎస్ఐ ఎం. మురళీధరరెడ్డి టీమ్ బుధవారం రాత్రి నుంచి సానిపాయ పరిధిలోని వీరబల్లి మీదుగా గడికోట వైపు కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున నాయనూరు ప్రాంతం చేరుకోగా అక్కడ మూడు మోటారు సైకిళ్లు కనిపించాయి. సమీపంలో కొందరు వ్యక్తులు గుమికూడి కనిపించారు. వారిని చుట్టు ముట్టే క్రమంలో వారు పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. అక్కడ పరిశీలించగా 22ఎర్రచందనం దుంగలు కనిపించాయి. పట్టుబడిన వారిని అన్నమయ్య జిల్లా వాసులుగా గుర్తించారు. వారిని దుంగలతో సహా తిరుపతిలోని టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ కు తరలించి కేసు నమోదుచేశారు.

భార్య దారుణ హత్య

ఆస్తి పెద్ద కొడుక్కి రాసివ్వమన్నందుకు అంతమొందించాడు

అనంతరం ఆత్మహత్యకు యత్నించిన భర్త



దారుణ హత్యకు గురైన భార్య జయలక్ష్మి

కైకలూరు: ఆస్తిని పెద్ద కొడుక్కి రాసివ్వమని అడిగిన భార్యను అంతమొందించాడో భర్త. ఈ ఘటన ఏలూరు జిల్లా కలిదిండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారంలో చోటుచేసుకుంది. వివరాలివీ.. గ్రామానికి చెందిన కట్టా పెద్దిరాజు (50), జయలక్ష్మి (47) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు మగ సంతానం. పెద్ద కుమారుడికి ఇటీవల పెళ్లైంది. ఇద్దరు కుమారులు వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. పెద్దిరాజుకు గ్రామంలో 40 సెంట్ల భూమి ఉంది. దీనిని అమ్మకానికి సిద్ధం చేస్తున్నాడు. పెద్ద కొడుక్కి వివాహం జరగడంతో దంపతులు ఇల్లు కట్టుకుంటారని, స్థలం పెద్ద కొడుక్కి రాయాలని జయలక్ష్మి భర్తను కోరింది. ఈ విషయంలో తరచూ భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. తన కంటే బిడ్డలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని పెద్దిరాజు భార్యపై ద్వేషం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి నిద్రపోతున్న జయలక్ష్మిపై కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. దీంతో ఆమె ఘటనాస్థలిలోనే ప్రాణం విడిచింది. అనంతరం పెద్దిరాజు భయపడి పురుగు మందు తాగి, చాకుతో పీక కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఇరుగు పొరుగువారు పోలీసులకు సమాచారమందించారు. ప్రాణాలతో ఉన్న పెద్దిరాజును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోజు గడవకముందే మరో హత్య

ఇదిలా ఉండగా ఇదే మండలం పోతుమర్రు శివారు గొల్లగూడెంలో తన భార్యను వివాహేతర సంబంధానికి సహకరిస్తోందనే అనుమానంతో ఎదురింటి వరలక్ష్మీదేవి (39)ని కట్టా రామాంజనేయులు అనే వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం కత్తితో నరికి చంపాడు. ఈ ఘటన జరిగిన ఒకరోజు వ్యవధిలోనే కలిదిండి మండలంలో మరో హత్య జరగడం గమనార్హం.

పరుపుల పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

- ఏలూరు నగర శివారు వంగాయగూడెంలో ఘటన
- తప్పిన పెనుప్రమాదం



ఏలూరు క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలోని పరుపుల పరిశ్రమలో ఎగిసిపడుతోన్న అగ్నికీలలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో శివారు వంగాయగూడెంలోని పరుపుల పరిశ్రమలో గురువారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. వంగాయగూడెం క్యాన్సర్ హాస్పిటల్ సమీపంలో గల సుస్మిత ఫర్నిర్ కుషనింగ్ పరిశ్రమలో ఉదయం 9.30 గంటల సమయంలో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ప్రాణనష్టం లేకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఎవరూ రాకముందే ఈ ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం తప్పింది. ఇక్కడ అత్యంత ప్రమాదకరమైన రసాయనాలతో ఫోమ్‌ను తయారు చేస్తారు. ఈ రసాయనాల మిక్సింగ్‌కు వినియోగించే ట్యాంకర్‌ను మైనస్ డిగ్రీల్లో చల్లబరుస్తారు. కెమికల్ మిక్సింగ్ ట్యాంకర్‌కు సంబంధించిన ఏసీలను ఆన్ చేసిన వాచ్‌మెన్లు ఇద్దరూ కాలకృత్యాలు తీర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ వ్యాప్తి చెందటంతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్, పోలీస్ సిబ్బంది సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు.

కంటైనర్ బోల్తా.. 14 ఆవులు మృతి



దెందులూరు: జాతీయరహదారిపై ఆవులను తరలిస్తున్న కంటైనర్ వాహనం బోల్తా పడి 14 ఆవులు మృతి చెందాయి. ఈ ఘటన ఏలూరు జిల్లా దెందులూరు మండలం సోమవరప్పాడు వద్ద జరిగింది. విశాఖ నుంచి ఇతర ప్రాంతాలకు ఆవులను తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో మరో 6 ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. మరో 15 ఆవులు స్వల్ప గాయాలకు గురయ్యాయి. సమాచారం అందుకున్న దెందులూరు ఎస్ఐ ఆర్.శివాజీ, సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ ఘటనపై వెంటనే మండల పశువైద్యాధికారి డాక్టర్ హరికి సమాచారం అందించి ఘటనాస్థలికి రావాల్సిందిగా సూచించారు. ఘటనాస్థలికి చేరుకున్న డాక్టర్ హరి, వైద్య సిబ్బంది తీవ్ర, స్వల్ప గాయాలకు గురైన ఆవులను సమీపంలోని గేదెల ఫారం వద్దకు తరలించి వైద్య సేవలందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి సినిమా



మృణాల్ ఠాకూర్ • మీనాక్షీ చౌదరి • శ్రీలీల • త్రిప్తి దిమ్రి • భాగ్యశ్రీ బోర్సే



మమితా బైజు

కథ కుదిరింది... క్యాస్టింగ్ కూడా ఫైనలైజ్ అయిపోయింది. ఆల్ సెట్ అనుకునే టైమ్‌లో అప్పటికే సెట్ అయిన హీరోయిన్ 'ఊహూ' అనేశారు. ఒకవేళ హీరోయిన్‌కి ఓకే అయినా... వేరే ప్రాబ్లమ్ వల్ల దర్శక-నిర్మాతలు 'ఊహూ' అన్నా ఆమె ఆ ప్రాజెక్ట్‌లో కొనసాగలేని పరిస్థితి. ఇలా హీరోయిన్-డైరెక్టర్-ప్రొడ్యూసర్ ఎవరు 'ఊహూ' అన్నా 'ఊ' అనడానికి ఇంకో హీరోయిన్ ఉంటారు కదా... అలా ఈ మధ్య కాలంలో కొన్ని సినిమాల్లో ఏయే కథానాయికలను వేరే కథానాయికలు రీప్లేస్ చేశారో తెలుసుకుందాం.

ఒకరు ఊహూ అంటే ఇంకొకరు ఊ అన్నారు

శ్రుతి ఔట్ మృణాల్ ఇన్

ఇద్దరు మాజీ ప్రేమికులు తమకు ఇష్టం లేకపోయినా కలిసి ఓ క్రైమ్‌ను చేయాల్సి వస్తే ఏం జరుగుతుంది? అనే కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'డెకాయిట్'. ఈ చిత్రంలో మాజీ ప్రేమికులుగా అడివి శేష్, శ్రుతీహాసన్‌ని ఖరారు చేశారు. అయితే ఆ తర్వాత ఈ చిత్రానికే శ్రుతి మాజీ అయిపోయారు. కొన్ని కారణాల వల్ల ఆమె ఈ చిత్రం నుంచి తప్పుకున్నారు. దాంతో శ్రుతి స్థానంలో మృణాల్ ఠాకూర్‌ని తీసుకున్నారు. షానిల్ డియో దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఇంటెన్స్ యాక్షన్ లవ్ స్టోరీకి 'ఏక్ ప్రేమ్ కథ' అనేది ట్యాగ్‌లైన్. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తి కావొచ్చింది. కాగా ఈ సినిమాలోని కొంత భాగం రాయలసీమ నేపథ్యంలో ఉంటుందని తెలిసింది. అడివి శేష్ క్యారెక్టర్ మదనపల్లె యాస మాట్లాడుతుందని సమాచారం. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 25న విడుదల కానుంది.

శ్రీలీల నో... మీనాక్షీ చౌదరి.... భాగ్యశ్రీ ఎస్

యంగ్ సెన్సేషన్ శ్రీలీల చేతిలో నుంచి ఈ మధ్య ఒకటి కాదు రెండు సినిమాలు జారిపోయాయి. ఆ చిత్రాలు మీనాక్షీ చౌదరి, భాగ్యశ్రీ భోర్సేలకి చిక్కాయి. శ్రీలీల ఈ మధ్య తెలుగుతో పాటు హిందీ, తమిళ సినిమాలకు 'యస్' చెప్పడంవల్ల రెండు తెలుగు సినిమాలకు 'నో' చెప్పాల్సి వచ్చింది. ఆ ఆఫర్స్ మీనాక్షీ, భాగ్యశ్రీకి వెళ్లగానే 'ఎస్' అనేశారు. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం....

• అనగనగా ఒక రాజు. ఆ రాజుగారికి ఒక రాణి ఫిక్స్ అయింది. కానీ ఆ తర్వాత రాజుగారిని రాణి వదులుకుంది. ఇదంతా నవీన్ పొలిశెట్టి హీరోగా రూపొందుతున్న 'అనగనగా ఒక రాజు' చిత్రం గురించే. ఈ చిత్రంలో రాజు ఎవరో కాదు... నవీన్ అని ఊహించే ఉంటారు. ఆయన్ను పెళ్లాడే రాణిగా ముందు శ్రీలీలను తీసుకున్నారు. కానీ డేట్స్ క్లాష్ వల్ల ఈ చిత్రం నుంచి శ్రీలీల ఔట్. ఆమె స్థానంలోకి మీనాక్షీ చౌదరిని ఎంపిక చేసింది చిత్రబృందం. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. పెళ్లి నేపథ్యంలో ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది. శ్రీకర స్టూడియో సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఒక మంచి ఫ్యామిలీ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం సంక్రాంతికి పర్ఫెక్ట్ అని యూనిట్ భావించడంవల్లే పండగకి పెద్ద సినిమాలు ఉన్నప్పటికీ ఈ సినిమాని విడుదల చేయాలనుకుని ఉంటారు.

• ఓ వారం రోజులు షూటింగ్‌లో పాల్గొని, ఆ తర్వాత 'లెనిన్' సినిమా నుంచి శ్రీలీల తప్పుకున్నట్లు సమాచారం. కారణం ఇంతకుముందు చెప్పినట్లు వేరే చిత్రాల డేట్స్ ఈ సినిమాతో క్లాష్ కావడమే. అఖిల్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'లెనిన్'. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అయితే ఆ తర్వాత తప్పుకున్న విషయాన్ని వెల్లడించలేదు. శ్రీలీల స్థానంలో భాగ్యశ్రీ భోర్సేని నాయికగా తీసుకున్నారట. మురళీకృష్ణ అబ్బూరు దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

దీపికా ఔట్ త్రిప్తి ఇన్

'కల్కి 2898ఏడీ'లో ప్రభాస్-దీపికా పదుకోన్ జంటగా నటించలేదు కానీ... ఈ ఇద్దరూ 'స్పిరిట్'లో జోడీగా నటించనున్నారని వార్త వచ్చిన విషయం తెలిసిందే. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఈ చిత్రం ప్రకటన ఎప్పుడో వచ్చింది. దీపికా పదుకోన్‌ని ఎంపిక చేశారనే టాక్ కూడా ఆ మధ్య ప్రచారంలోకి వచ్చింది. అయితే ఈ జోడీ సెట్ కాలేదు. తక్కువ పని గంటలు, ఎక్కువ పారితోషికం వంటి కారణాలతో దీపికా పదుకోన్ ఈ ప్రాజెక్ట్‌కి దూరమయ్యారనే వార్త వచ్చింది. మరి... ఈ భామను రీప్లేస్ చేసే తార ఎవరు? అనే చర్చ జరిగిన నేపథ్యంలో 'నా సినిమాలో ఫిమేల్ లీడ్ చేయబోయేది తనే' అంటూ త్రిప్తీ దిమ్రీ పేరుని ప్రకటించారు సందీప్ రెడ్డి. రణ్‌బీర్ కపూర్, రష్మికా మందన్నా జంటగా సందీప్ రెడ్డి దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'యానిమల్'లో చేసిన కీ రోల్ త్రిప్తీ దిమ్రీని బాగా పాపులర్ చేసింది. ఇప్పుడు మరోసారి సందీప్ దర్శకత్వంలో సినిమా అవకాశం రావడం పట్ల... అది కూడా హీరోయిన్ పాత్ర కావడంతో త్రిప్తీ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. సెప్టెంబరులో ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కానుంది.

పూజ ఔట్ శ్రీలీల.... మమితా ఇన్

సౌత్‌లో స్టార్ హీరోయిన్ రేంజ్‌కి... ముఖ్యంగా తెలుగులో మంచి స్థాయికి ఎదిగిన పూజా హెగ్డేకి ఇప్పుడు టాలీవుడ్‌లో పరిస్థితులు అనుకూలిస్తున్నట్లుగా లేదు. పూజా కథానాయికగా నటిస్తారనుకున్న రెండు చిత్రాల అవకాశం వేరే నాయికలకు వెళ్లింది. ఆ వివరాల్లోకి వెళితే...

• పవన్ కల్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ చిత్రంలో ముందు పూజా హెగ్డేని కథానాయికగా అనుకున్నారట. ఆ తర్వాత ఆమె స్థానంలోకి శ్రీలీల వచ్చారు. వాస్తవానికి ఈ చిత్రం షూటింగ్ ప్లాన్ చేసిన ప్రకారం జరగలేదు. పవన్ కల్యాణ్ రాజకీయాల్లో ఇన్‌వాల్వ్ కావడంవల్ల ఈ చిత్రం షూటింగ్ వాయిదా పడుతూ వచ్చింది. ఈ డేట్స్ క్లాష్ వల్లే పూజా హెగ్డే ఈ చిత్రం నుంచి ఔట్ అయ్యారని సమాచారం.

• 2017 నుంచీ సినిమాలు చేసుకుంటూ వచ్చినప్పటికీ 2024లో విడుదలైన 'ప్రేమలు'తో మమితా బైజు క్రేజ్ పెరిగిపోయింది. ఈ చిత్రం తర్వాత ఈ మలయాళ బ్యూటీకి అవకాశాలు పెరిగాయి. తాజాగా ధనుష్ సరసన నటించే అవకాశం మమితాకి దక్కింది. అది కూడా ఈ సినిమాలో ముందుగా పూజా హెగ్డేని కథానాయికగా తీసుకున్నారనే వార్త వచ్చింది. కారణాలు బయటకు రాలేదు కానీ పూజా హెగ్డేని మమితా రీప్లేస్ చేశారు. ఈ చిత్రానికి విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్నారు. మరోవైపు పూజా హెగ్డే విషయానికొస్తే... తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారామె.

ఒకర్ని అనుకున్న ప్రాజెక్ట్‌లోకి మరొకరు రావడం అనేది సినిమా ఇండస్ట్రీలో చాలా కామన్. ఒకవేళ ఆ ప్రాజెక్ట్ హిట్ అయితే, 'ఔట్' అయిన వారికి కాస్త బాధ ఉంటుంది. అదే... ఫట్ అయితే 'ఇన్' అయినవాళ్లు ఫీలైపోతారు. రీప్లేస్ చేయడం ఎలా సాధారణమో హిట్టూ... ఫట్టూ కూడా సాధారణమే కాబట్టి.... కష్టాన్ని నమ్ముకుంటూ ముందుకు సాగడమే.

– డి.జి. భవాని



కియారా • కృతీ సనన్

లేడీ డాన్ ఎవరు?

డాన్ అంటే షారుక్ ఖాన్ అన్నట్లుగా 'డాన్, డాన్ 2' చిత్రాలు ఫిక్స్ చేసేశాయి. ఆ చిత్రాల దర్శకుడు ఫర్హాన్ అక్తర్ 'డాన్ 3' చిత్రంలో డాన్‌ని మార్చారు. ఆ కొత్త డాన్ ఎవరంటే... రణ్‌వీర్ సింగ్. అలాగే ఆ 'డాన్' చిత్రాల్లో ప్రియాంకా చోప్రా లేడీ డాన్‌గా చేశారు. 'డాన్ 3'లో లేడీ డాన్ ఎవరు? అనే చర్చ జరుగుతోంది. ఈ పాత్రకు కియారా అద్వానీని ఎంపిక చేశారు. అయితే కియారా ప్రస్తుతం గర్భవతి కావడంతో ఆమె స్థానంలో వేరే నాయికను తీసుకోవాలనుకుంటున్నారట. మెరుపు తీగలా కనిపించే కృతీ సనన్ అయితే లేడీ డాన్‌గా పర్ఫెక్ట్‌గా ఉంటారని ఆమెను దాదాపు ఖరారు చేశారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. అయితే ఈ చిత్రం షూటింగ్‌ని జనవరిలో ఆరంభించాలనుకుంటున్నారట. ఈలోపు కియారా డెలివరీ కూడా అయిపోతుంది. సో... ముందు అనుకున్నట్లుగా ఆమెనే కథానాయికగా ప్రొసీడ్ అయితే అనే ఆలోచన కూడా చేస్తోందట యూనిట్. మరి... ఫైనల్‌గా కియారా... కృతీ.... ఈ ఇద్దరిలో లేడీ డాన్ ఎవరు? అనేది కొన్ని నెలలు ఆగితే తెలుస్తుంది.



నాగచైతన్య


కాంబినేషన్ కుదిరేనా?

హీరో నాగచైతన్య–తమిళ దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో ఓ స్పై డ్రామా చిత్రం తెరకెక్కేందుకు సన్నాహాలు మొదలయ్యాయని కోలీవుడ్ సమాచారం. తమిళంలో 'ఇరంబుదురై' (తెలుగులో 'అభిమన్యుడు'), 'సర్దార్' వంటి హిట్ సినిమాలను తీసిన దర్శకుడు పీఎస్ మిత్రన్ ఇటీవల ఓ స్పై కథను నాగచైతన్యకు వినిపించారని, ఈ కథకు నాగచైతన్య అంగీకారం తెలిపారని భోగట్టా. దీంతో దర్శకుడు పీఎస్ మిత్రన్ ఈ సినిమా స్క్రిప్ట్‌కి మరింత మెరుగులు దిద్దే పనిలో ఉన్నారని, ఈ పని పూర్తయిన తర్వాత నాగచైతన్యకు మరోసారి కథ వినిపిస్తారని ఫిల్మ్‌నగర్ సమాచారం. మరి... నాగచైతన్య–పీఎస్ మిత్రన్‌ల కాంబినేషన్ సెట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.



మిత్రన్

మరోవైపు ప్రస్తుతం 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు డైరెక్షన్‌లో 'వృషకర్మ' (వర్కింగ్ టైటిల్) అనే సినిమా చేస్తున్నారు నాగచైతన్య. అలాగే కార్తీ 'సర్దార్ 2' పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉన్నారు పీఎస్ మిత్రన్. వీరి ప్రస్తుత కమిట్‌మెంట్స్ పూర్తయిన తర్వాత వీరి కాంబినేషన్‌లోని సినిమాపై సరైన స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




రష్మిక

ప్రతినాయిక పాత్రలో..?

'పుష్ప' ఫ్రాంచైజీలోని 'పుష్ప: ది రైజ్, పుష్ప: ది రూల్' సినిమాల తర్వాత హీరో అల్లు అర్జున్, హీరోయిన్ రష్మికా మందన్నా మరోసారి సిల్వర్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారనే టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న సినిమాలో కథ రీత్యా ఐదుగురు హీరోయిన్లు నటించే అవకాశం ఉందని సమాచారం. ఈ చిత్రంలోని ఓ హీరోయిన్ పాత్రలో దీపికా పదుకోన్ నటించనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించారు. అధికారిక ప్రకటన అయితే రాలేదు కానీ... ప్రస్తుతం ముంబైలో జరుగుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు మరో హీరోయిన్ మృణాల్ ఠాగూర్. మిగిలిన ముగ్గురు హీరోయిన్స్ పాత్రల్లో రష్మికా మందన్నా, జాన్వీ కపూర్, భాగ్యశ్రీ భోర్సే, బాలీవుడ్ నటి ఆలియా. ఎఫ్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ఈ చిత్రంలో రష్మికా మందన్నా, జాన్వీ కపూర్‌ల పేర్లు దాదాపు ఖరారయ్యాయని సమాచారం. ఆసక్తికరమైన విషయం ఏంటంటే... ఈ సినిమాలో రష్మికా మందన్నాది రెగ్యులర్ హీరోయిన్ పాత్ర కాదట. ఆమె పాత్రకు ప్రతినాయిక ఛాయలు ఉంటాయని, కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లలో కూడా రష్మిక కనిపిస్తారని, ఈ యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె ప్రత్యేకమైన శిక్షణ తీసుకోనున్నారని టాక్. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం 2027లో విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి.

నిజమో... అబద్ధమో కాదు... నమ్మకం!

మనోజ్ చంద్ర, మోనిక .టి హీరో హీరోయిన్లుగా, ఉషా బోనెల, రవీంద్ర విజయ్, ప్రవీణ పరుచూరి, బెనర్జీ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన రూరల్ కామెడీ అండ్ థ్రిల్లర్ ఫిల్మ్ 'కొత్తపల్లిలో ఒకప్పుడు..'. 'కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్ర రూపస్య' సినిమాలను నిర్మించిన నటి–ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా మారారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాలకృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'సావిత్రి నీతో ఏదో మాట్లాడాలంట. సాయంత్రం తూర్పు తోటలో గడ్డివాము దగ్గరకు రమ్మంది... సావిత్రి నన్ను గడ్డివాము దగ్గరకు రమ్మందా..!, నా సావిత్రి నుంచి నన్ను దూరం చేయాలని చూస్తున్నావ్ కదా..., దేవుడంటే నిజమో... అబద్ధమో కాదు... నమ్మకం' అనే డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి. 0



మనోజ్

బిజినెస్ రీల్

హెచ్‌యూఎల్ కొత్త ఎండీ సీఈవో, ప్రియా నాయర్

ఆగస్టు 1న పదవీ స్వీకరణ

న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో), మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ)గా ప్రియా నాయర్ నియతులయ్యారు. ఆగస్టు 1న పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. అయిదేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ఆమె యూనిలీవర్‌లో బ్యూటీ, వెల్‌బీయింగ్ విభాగానికి ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ప్రస్తుత సీఈవో రోహిత్ జావా వ్యక్తిగత కారణాలతో జూలై 31న తన బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు. ఆ స్థానాన్ని ప్రియా నాయర్ భర్తీ చేయనుంది.



'ప్రియా హెచ్‌యూఎల్, యూనిలీవర్‌లో అత్యుత్తమ కెరియర్ కలిగి ఉంది. భారత మార్కెట్‌పై అవగాహన, వృత్తి పరంగా అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. తన అత్యుత్తమ పనితీరుతో హెచ్‌యూఎల్‌ను మరో స్థాయికి తీసుకెళ్లగలదు' అని హెచ్‌యూఎల్ చైర్మన్ నితిన్ పరంజపే తెలిపారు. ప్రియా నాయర్ 1995 నుంచి హెచ్‌యూఎల్‌కు సేవలు అందిస్తున్నారు. సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగంలో ఉద్యోగంతో కెరియర్ ప్రారంభించారు. 2014 నుంచి 2020 వరకు హోమ్‌కేర్ విభాగానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, 2020 నుంచి 2022 వరకు బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ విభాగానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. తదుపరి యూనిలీవర్‌లో బ్యూటీ, వెల్‌బీయింగ్ విభాగానికి గ్లోబల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్‌గా, 2023 నుంచి ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

టాటా ఎలక్సీ లాభం డౌన్

క్యూ1లో రూ. 144 కోట్లు

న్యూఢిల్లీ: డిజైన్, టెక్నాలజీ సర్వీసుల టాటా గ్రూప్ కంపెనీ టాటా ఎలక్సీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 22% క్షీణించి రూ. 144 కోట్లను తాకింది. స్థూలఆర్థిక అనిశ్చితులకుతోడు.. పరిశ్రమ సంబంధ సవాళ్లు ఆర్ అండ్‌డీ వినియోగాలు, నిర్ణయాలపై ప్రతికూల ప్రభావం చూ పాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 184 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం వార్షికంగా 4% నీరసించి రూ. 892 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయంలో 50% వాటా ఆక్రమించే ట్రాన్స్‌పోర్టేషన్ బిజినెస్ త్రైమాసికవారీగా 4 % పుంజుకున్నట్లు కంపెనీ పేర్కొంది. అయితే మీడియా, కమ్యూనికేషన్ బిజినెస్ 5.5 % క్షీణించగా.. లైఫ్ సైన్సెస్ విభాగం 6.7% వెనకడుగు వేసినట్లు వెల్లడించింది.

టాటా ఎలక్సీ షేరు బీఎస్ఈలో 0.2 శాతం నష్టంతో రూ. 6,136 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-7-2025	
విశాఖ	540–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	853.9	1.56
MARUTI	12,644.00	1.4
TATASTEEL	160.63	1.03
BAJFINANCE	946.85	0.66
JIOFIN	331.85	0.61

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	1,964.00	-2.76
ASIANPAINT	2,447.50	-2.06
HDFCLIFE	770.15	-2.05
APOLLOHOSP	7,353.00	-1.55
SHRIRAMFIN	671.75	-1.37

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,454
ఎన్ఎస్ఈ	86,650
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,38,103
ఎఫ్ఐఐ	+ 221
డీఐఐ	+ 591

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66.73 (రాత్రి 11.30కు)	$ 68.38 (క్రితం ముగింపు)
బ్రెంట్	68.72 (రాత్రి 11.30కు)	$ 70.19 (క్రితం ముగింపు)

లార్జ్‌క్యాప్ విభాగంలోకి కొత్తగా 11 కంపెనీలు

- ఇండియన్ హోటల్స్, అపోలో హాస్పిటల్స్, లుపిన్
- లార్జ్‌క్యాప్ నుంచి ఇంతే మేర మిడ్‌క్యాప్ విభాగంలోకి
- మిడ్‌క్యాప్‌లోకి తొమ్మిది స్మాల్‌క్యాప్ కంపెనీలు
- నువమా క్వాంటిటేటివ్ రీసెర్చ్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ విభాగంలో కంపెనీలకు స్థానచలనం చోటుచేసుకోనుంది. లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పరంగా సవరించిన జాబితాను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ప్రకటించింది. ఈ సందర్భంగా ఇండియన్ హోటల్స్, సోలార్ ఇండస్ట్రీస్, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్, అపోలో హాస్పిటల్స్ తదితర కంపెనీలు మిడ్‌క్యాప్ నుంచి లార్జ్‌క్యాప్ విభాగం కిందకు రానున్నాయి. సీమెన్స్ ఎనర్జీ నేరుగా లార్జ్‌క్యాప్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. దీంతో లార్జ్‌క్యాప్ విభా గం నుంచి మిడ్‌క్యాప్ కిందకు రైల్ వికాస్ నిగమ్ (ఆర్‌వీఎస్ఎల్), హీరో మోటోకార్ప్, స్విగ్గీ, పాలీ క్యాబ్ ఇలా 11 కంపెనీలు చేరనున్నాయి. దీనిపై నువమా అల్టర్నేటివ్ అండ్ క్వాంటిటేటివ్ రీసెర్చ్ ఒక నివేదికను విడుదల చేసింది. 9 స్మాల్ క్యాప్ కంపెనీలు మిడ్‌క్యాప్ విభాగం కిందకు అప్‌గ్రేడ్ కానున్నాయి.

అలాగే, మిడ్‌క్యాప్ కిందకు కొ త్తగా హెక్సావేర్ టెక్నాలజీస్, ఐటీసీ హోటల్స్ చేరనున్నాయి. ఇవి ఇటీవలే స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కావడం గమనార్హం. ఏటా జనవరి, జూలైలో యాంఫి (ప్రతి 6 నెలలకు ఒకసారి) కంపెనీల మార్కెట్ విలువ ఆధారంగా జాబితాను ప్రకటిస్తుంటుంది. ఫిబ్రవరి1, ఆగస్ట్ 1 నుంచి మార్పులు అమల్లోకి వస్తాయి. యాంఫి వర్గీకరణకు అనుగుణంగా ఫండ్స్ సంస్థలు తమ పెట్టుబడుల కోసం స్టాక్స్‌ను ఎంపిక చేసుకుంటాయి. లార్జ్‌క్యాప్ ఫండ్స్, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్, మిడ్‌క్యాప్ ఫండ్స్, స్మాల్‌క్యాప్, మల్టీక్యాప్, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్ ఈ వర్గీకర జాబితాకు అనుగుణంగా పోర్ట్‌ఫోలియోలో మార్పులూ చేస్తుంటాయి. కనుక ఫండ్స్ పెట్టుబడులకు ఈ జాబితా కీలకంగా పనిచేస్తుంటుంది. ఫండ్స్ పెట్టుబడులకు అనుగుణంగా ఆయా స్టాక్స్ ధరల్లోనూ మార్పులు చూడొచ్చు.

మిడ్‌క్యాప్ నుంచి లార్జ్‌క్యాప్ విభాగంలోకి	లార్జ్ క్యాప్ నుంచి మిడ్‌క్యాప్ విభాగంలోకి
ఇండియన్ హోటల్స్	ఆర్‌వీఎస్ఎల్
సోలార్ ఇండస్ట్రీస్	హీరో మోటోకార్ప్
మజ్‌గాన్ షిప్ బిల్డర్స్	ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
మ్యాక్స్ హెల్త్‌కేర్	కమిన్స్ ఇండియా
శ్రీ సిమెంట్స్	స్విగ్గీ
మ్యాన్‌కైండ్ ఫార్మా	పాలీక్యాబ్ ఇండియా
అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్	బోష్ లిమిటెడ్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	ఐసీఐసీఐ ప్రుడెన్షియల్‌లైఫ్
లుపిన్	డాబర్ ఇండియా
జిందాల్ స్టీల్ అండ్ పవర్	జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ
సీమెన్స్ ఎనర్జీ (కొత్త చేరిక)	ఎన్‌టీపీసీ గ్రీన్



మార్కెట్ విలువ కటాఫ్ తగ్గింపు

మార్కెట్ విలువ పరంగా టాప్–100 కంపెనీలు లార్జ్‌క్యాప్ కిందకు వస్తాయి. మార్కెట్ విలువ పరంగా 101 నుంచి 250 వరకు మొత్తం 150 కంపెనీలు మిడ్‌క్యాప్ కిందకు పరిగణనలోకి తీసుకుంటారు. మిగిలినవి స్మాల్‌క్యాప్ కిందకు వస్తాయి. గత ఆరు నెలల కాలంలో స్టాక్ వారీ సగటు మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుంటారు. ''గత ఆరు నెలల్లో మార్కెట్ ఎంతో అస్థిరతలను చూసింది. దీంతో 2024 డిసెంబర్ నుంచి చూస్తే మార్కెట్ విలువ కటాఫ్ తగ్గింది. లార్జ్‌క్యాప్ విభాగం కటాఫ్ విలువ 2024 డిసెంబర్ చివరికి ఉన్న రూ.లక్ష కోట్లు నుంచి రూ.91,600 కోట్లకు దిగొచ్చింది. మిడ్‌క్యాప్ విభాగం కటాఫ్ (గరిష్ట విలువ) సైతం రూ.33,200 కోట్ల నుంచి రూ.30,800 కోట్లకు తగ్గింది''అని నువమా నివేదిక తెలిపింది. గత నాలుగేళ్లలో లార్జ్‌క్యాప్ విభాగం కటాఫ్ విలువ గణనీయంగా తగ్గడం ఇదే మొదటిసారి. స్టాక్స్ విలువలు దిద్దుబాటునకు గురి కావడమే ఇందుకు దారితీసింది.

ఎల్ఐసీ ప్రీమియం ఆదాయం జూమ్

జూన్‌లో రూ.5,313 కోట్లు



న్యూఢిల్లీ: ప్రముఖ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ జూన్‌లో రూ.5,313 కోట్లు ప్రీమియం ఆదాయాన్ని సమకూర్చుకుంది. క్రితం ఏడాది ఇదే నెలలో ఆదాయంతో పోల్చి చూస్తే 14.60 శాతం పెరిగింది. ప్రైవేటు జీవిత బీమా సంస్థలతో పోల్చి చూసినా 12 శాతం పెరిగినట్టు ఎల్ఐసీ ప్రకటించింది. జూన్‌లో 25 ప్రైవేటు జీవిత బీమా సంస్థలు సంయుక్తంగా వసూలు చేసిన ఇండివిడ్యువల్ పాలసీల ప్రీమియం ఆదాయం రూ.8,408 కోట్లుగా ఉంది. ఈ ఏడాది జూన్‌లో ఎల్ఐసీ 12.49 లక్షల కొత్త పాలసీలను జారీ చేసింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఇలా జారీ చేసిన కొత్త పాలసీలు 14.65 లక్షలుగా ఉండడం గమనార్హం. ఇందులో వ్యక్తులకు సంబంధించిన పాలసీలు 12.48 లక్షలగా ఉంటే, గ్రూప్ పాలసీలు 1,290గా ఉన్నాయి. ఎల్ఐసీకి గ్రూప్ పాలసీల ప్రీమియం ఆదాయం జూన్ నెలలో రూ.22,087 కోట్లుగా ఉంది. గతేడాది జూన్ కంటే 7 శాతం తక్కువ. ప్రైవేటు జీవిత బీమా కంపెనీల గ్రూప్ ప్రీమియం ఆదాయం క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 19 శాతం తగ్గి రూ.5,315 కోట్లుగా ఉంది. ఎల్ఐసీ మొత్తం ప్రీమియం (ఇండివిడ్యువల్, గ్రూప్ కలసి) ఆదాయం జూన్ నెలలో 3.43 శాతం తక్కువగా రూ.27,395 కోట్లుగా నమోదైంది. ప్రైవేటు కంపెనీల మొత్తం ప్రీమియం ఆదాయం సైతం 2.45 శాతం తగ్గి రూ.13,722 కోట్లకు పరిమితమైంది.

వేదాంతా 3డీ వ్యూహం

- విడదీత, వివిధీకరణ, రుణాల తగ్గింపు
- 100 బిలియన్ డాలర్ల బిజినెస్‌పై దృష్టి



న్యూఢిల్లీ: మైనింగ్ రంగ దిగ్గజం వేదాంతా బిజినెస్‌ను రెట్టింపునకు పెంచుకునేందుకు వీలుగా 3డీ వ్యూహానికి తెరతీయనుంది. దీనిలో భాగంగా విడదీత, వివిధీకరణ(డైవర్సిఫికేషన్), రుణ భారాన్ని తగ్గించుకోవడంపై దృష్టి పెట్టనుంది. కంపెనీ 60వ సాధారణ వార్షిక సమావేశంలో కంపెనీ చైర్మన్ అనిల్ అగర్వాల్ సెప్టెంబర్‌లోగా వివిధ బిజినెస్‌ల విడదీతను పూర్తి చేగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాటాదారులనుద్దేశించి ప్రసంగిస్తూ పలు అంశాలను ప్రస్తావించారు. ప్రత్యేక కంపెనీగా విడదీసే ప్రతీ బిజినెస్ 100 బిలియన్ డాలర్ల విలువైన సంస్థగా ఆవిర్భవించేందుకు వీలున్నట్లు పేర్కొన్నారు. 3డీ వ్యూహం కంపెనీ పరిమాణాన్ని రెట్టింపు చేయనున్నట్లు తెలియజేశారు. తద్వారా వాటాదారులకు గరిష్ట ప్రయోజనం చేకూరనున్నట్లు తెలియజేశారు. వ్యాపార పునర్వ్యవస్థీకరణ చివరి దశలో ఉన్నట్లు వెల్లడించారు. ఇందుకు 99.5 శాతం వాటాదారులు, రుణదాతల అనుమతి పొందినట్లు తెలియజేశారు. విడదీత పూర్తయితే వేదాంతా వాటాదారులకు తమ వద్దగల ప్రతీ షేరుకీ విడదీసిన 4 బిజినెస్‌ల నుంచి ఒక్కో షేరు చొప్పున కేటాయించనున్నట్లు వివరించారు. కాగా.. యూఎస్ షార్ట్‌సెల్లర్ సంస్థ వైస్రాయ్ రీసెర్చ్.. ఒక రోజు ముందు వేదాంతా రిసోర్సెస్ ఒక పారసైట్ వంటిదని, దేశీ యూనిట్(వేదాంతా లిమిటెడ్)ను వ్యవస్థాగతంగా బలహీనపరుస్తున్నదంటూ వ్యాఖ్యానించిన నేపథ్యంలో అనిల్ అగర్వాల్ ప్రసంగానికి ప్రాధాన్యత ఏర్పడింది. అయితే వైస్రాయ్ రీసెర్చ్ ఆరోపణలకు ఎలాంటి ప్రాతిపదిక లేదని వేదాంతా కొట్టిపారేసిన సంగతి తెలిసిందే.

ఏటీజీసీ బయోటెక్‌కు ఇన్నోవేషన్ లీడర్‌షిప్ అవార్డు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డీప్ టెక్ ఆవిష్కరణలతో పంటల సంరక్షణ ఉత్పత్తులపై కృషి చేస్తున్నందుకు గాను ప్రతిష్టాత్మకమైన ఇన్నోవేషన్ లీడర్‌షిప్ అవార్డ్ పురస్కారం లభించినట్లు ఏటీజీసీ బయోటెక్ సంస్థ వెల్లడించింది. అగ్రికల్చర్ టుడే నిర్వహించిన 16వ అగ్రికల్చర్ లీడర్‌షిప్ సదస్సులో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, వాణిజ్య మంత్రి పీయుష్ గోయల్ దీన్ని ప్రదానం చేసినట్లు వివరించింది. తమ సంస్థకు 26 పేటెంట్లు, 50కి పైగా ఉత్పత్తులు ఉన్నట్లు కంపెనీ చైర్మన్ మార్కండేయ గోరంట్ల, ఈడీ వీబీ రెడ్డి తెలిపారు. బియ్యం, పత్తి తదితర పంటల్లో ఫెరోమోన్ టెక్నాలజీని విస్తరించడంలో తమ కంపెనీని కేస్ స్టడీగా పరిగణించవచ్చని 2024లో ప్రపంచ ఆర్థిక ఫోరం సైతం సూచించినట్లు పేర్కొన్నారు.

తెలంగాణలో ఏఎం/ఎన్ఎస్ ఆప్టిగల్ ఉక్కు ఉత్పత్తులు



హైదరాబాద్: తెలంగాణ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణ, మౌలిక సదుపాయాల రంగాల కోసం ప్రత్యేక ఉక్కు ఉత్పత్తులను ప్రవేశపెట్టినట్లు ఆర్సెలర్‌మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్ ఇండియా) వెల్లడించింది. ఆప్టిగల్ ప్రైమ్, ఆప్టిగల్ పినకిల్ వీటిలో ఉన్నట్లు వివరించింది. తుప్పు నుంచి మూడు రెట్లు అధిక రక్షణ కల్పించేలా ఇవి ఆరు వేరియంట్స్‌లో ఉంటాయి. దేశీయంగా, ముఖ్యంగా దక్షిణాదిన కలర్ కోటెడ్ ఉక్కు ఉత్పత్తుల విభాగంలో గణనీయంగా మార్కెట్ వాటాను లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ డైరెక్టర్ రంజన్ ధర్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ మార్కెట్ 3.4 మిలియన్ టన్నులుగా ఉండగా, దక్షిణాది మార్కెట్ వాటా సుమారు 0.6 మిలియన్ టన్నులుగా ఉంటుందని పేర్కొన్నారు.

ఎన్ఎండీసీ గనులకు 5 స్టార్ రేటింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ దిగ్గజం ఎన్ఎండీసీకి చెందిన గనులకు ప్రతిష్టాత్మక 5 స్టార్ రేటింగ్ లభించింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను చత్తీస్‌గఢ్‌లోని మూడు ఇనుప ఖనిజ గనులకు, కర్ణాటకలోని ఒక గనికి ఇది లభించినట్లు సంస్థ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. పర్యావరణ అనుకూల విధంగా మైనింగ్ కార్యకలాపాలను నిర్వహించడంలో తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని ముఖర్జీ చెప్పారు. కేంద్ర గనుల శాఖ, ఐబీఎం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ పురస్కారాన్ని అందించారు.

గ్రామీణ రంగంలో పెట్టుబడులకు చేయూత

- వ్యవసాయం లాభసాటిగా మారాలి
- పేదరికాన్ని మరింతగా రూపుమాపొచ్చు
- ఐఎఫ్ఏడీ ప్రెసిడెంట్ అల్వారో లారియో



న్యూఢిల్లీ: గ్రామీణ రంగంలోకి మరిన్ని ప్రైవేటు పెట్టుబడులు తీసుకురావడానికే తమ ప్రాధాన్యతని ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐఎఫ్ఏడీ) ప్రెసిడెంట్ అల్వారో లారియో తెలిపారు. మరే ఇతర రంగంతో పోల్చి చూసినా వ్యవసాయ రంగంలో పెట్టుబడులు మూడు రెట్లు అధికంగా పేదరిక నిర్మూలనకు సాయపడతాయని చెప్పారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అంతర్జాతీయంగా 75 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయన్నారు. 1977లో ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ఏజెన్సీ, ఆర్థిక సంస్థగా ఏర్పాటైన ఐఎఫ్ఏడీ గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక, ఆకలి బాధల నిర్మూలన కోసం కృషి చేస్తుంటుంది. గ్రామీణ ప్రాంతాల కోసం దీర్ఘకాలిక రుణాలను సమీకరించడం, తద్వారా దీర్ఘకాల ఫలితాలను సాధించడం ఐఎఫ్ఏడీ ప్రాధాన్యతగా లారియో చెప్పారు. భారత్‌తో 50 ఏళ్లకు పైగా అనుబంధం ఉందని, ఐఎఫ్ఏడీ వ్యవస్థాపక సభ్య దేశాల్లో భారత్ కూడా ఒకటని గుర్తు చేశారు. అతిపెద్ద రుణ గ్రహీతతోపాటు నిధుల విరాళంలోనూ భారత్ కీలక పాత్ర పోషిస్తున్నట్టు పేర్కొన్నారు.

భారత్ ముందు మూడు కీలక ప్రశ్నలు..

''భారత్ ముందు మూడు ముఖ్యమైన ప్రశ్నలున్నాయి. రైతులకు వ్యవసాయం మరింత లాభదాయకంగా ఎలా మార్చగలం? వాతావరణపరమైన ఎన్నో సవాళ్ల మధ్య ఉత్పాదకతను పెంచడం ఎలా? ఆహార భద్రత నుంచి పోషకాహార భద్రత దిశగా ఎలా ముందుకు వెళ్లాలి?''అని అల్వారో లారియో ప్రశ్నలు సంధించారు. ఉష్ణోగ్రతలు పెరగడం, అసహజ వర్షపాతం తదతర వాతావరణపరమైన మార్పులు ప్రపంచ ఆహార భద్రతకు అతిపెద్ద ముప్పుగా పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విధమైన మార్పులు పంట దిగుబడులు, ఉపాధిపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నట్టు తెలిపారు. భారత్‌లో సీజన్‌వారీ నీటి కరువు, ఉష్ణోగ్రతల పెరుగుదల, కరువు సమస్యలున్నట్టు చెప్పారు. భారత జీడీపీలో వ్యవసాయం 20 శాతం వాటాతో, 42 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో పురోగతి సాధించినప్పటికీ.. పేదలను సైతం ఆర్థిక సేవల్లో భాగం చేయడం, చిన్న ఉత్పత్తిదారులకు మార్కెట్ అనుసంధానత కల్పించడం కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ప్రైవేటు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు.

ఈఎస్ఆర్ లాజిస్టిక్స్ పార్క్‌లో జీహెచ్ఐఏఎల్‌కు 70% వాటా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈఎస్ఆర్ జీఎంఆర్ లాజిస్టిక్స్ పార్క్‌లో (ఈజీఎల్‌పీపీఎల్) 70 శాతం వాటాలను దక్కించుకున్నట్లు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీహెచ్ఐఏఎల్) వెల్లడించింది. ఇప్పటికే తమ అనుబంధ సంస్థ జీఎంఆర్ హైదరాబాద్ ఏరోట్రోపోలిస్ (జీహెచ్ఏఎల్)కు ఇందులో 30 శాతం వాటాలు ఉన్నట్లు పేర్కొంది. తాజా పరిణామంతో జీహెచ్ఏఎల్ ద్వారా ఈజీఎల్‌పీపీఎల్‌లో తమకు 100 శాతం వాటాలు లభించినట్లవుతుందని వివరించింది. హైదరాబాద్‌లో వేర్‌హౌసింగ్, లాజిస్టిక్స్ పార్క్‌లను నెలకొల్పేందుకు 2020 జనవరిలో జీహెచ్ఏఎల్, ఈఎస్ఆర్ హైదరాబాద్1 కలిసి ఈజీఎల్‌పీపీఎల్‌ను ఏర్పాటు చేశాయి. 17 లక్షల చ.అ. ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసింది.

ఎంబసీ రీట్ యూనిట్ల విక్రయం

బెయిన్ క్యాపిటల్‌కు రూ. 691 కోట్లు

న్యూఢిల్లీ: పీఈ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ అనుబంధ సంస్థ ద్వారా తాజాగా రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్‌లో 1.87 శాతం హోల్డింగ్‌ను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 1.78 కోట్లకుపైగా యూనిట్లు అమ్మివేసింది. బీఎస్ఈ బల్క్ డీల్ గణాంకాల ప్రకారం ఒక్కో యూనిట్‌ను సగటున రూ. 388 ధరలో వీటిని సొమ్ము చేసుకుంది. తద్వారా రూ. 691 కోట్లకుపైగా అందుకుంది. అయితే కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. కాగా.. గత నెలలో ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్ డిబెంచర్ల జారీ, కాలావధి రుణాల సమీకరణ ద్వారా రూ. 1,550 కోట్లు సమీకరించిన విషయం విదితమే. 6.97 శాతం కూపన్ రేటుతో జారీ చేసిన ఎన్‌సీడీల ద్వారా రూ. 750 కోట్లు అందుకోగా.. 15ఏళ్ల కాలానికి బ్యాంక్ నుంచి 7.4 శాతం ఫ్లోటింగ్ వడ్డీ రేటుతో రూ. 800 కోట్లు సమకూర్చుకుంది. ఈ నిధులను రుణాల రీఫైనాన్సింగ్‌కు వినియోగించనుంది. తద్వారా వడ్డీ వ్యయాలను ఆదా చేసుకునే ప్రణాళికల్లో ఉంది. కంపెనీ బెంగళూరు, ముంబై, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణేలలో 14 ఆఫీస్ పార్క్‌లను నిర్వహిస్తోంది.

బల్క్ డీల్ నేపథ్యంలో ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్ బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 390 వద్ద ముగిసింది.

యూపీఐతో చెల్లింపుల్లో భారత్ సూపర్‌ఫాస్ట్: ఐఎంఎఫ్



న్యూఢిల్లీ: యూపీఐ దన్నుతో, మిగతా ప్రపంచ దేశాలన్నింటిలోకెల్లా భారత్‌లో చెల్లింపుల విధానం అత్యంత వేగవంతంగా ఉంటోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) తెలిపింది. 2016లో ప్రవేశపెట్టిన యూపీఐ విధానం చాలా వేగంగా వినియోగంలోకి వచ్చిందని ఫిన్‌టెక్ నోట్‌లో పేర్కొంది. అదే సమయంలో నగదుకు ప్రత్యామ్నాయాలైన డెబిట్, క్రెడిట్ కార్డుల్లాంటి ఇతరత్రా సాధనాల వినియోగం గణనీయంగా తగ్గిందని వివరించింది. ప్రస్తుతం యూపీఐ ప్రతి నెలా 1,800 కోట్ల లావాదేవీలు ప్రాసెస్ చేస్తోందని ఐఎంఎఫ్ పేర్కొంది. వివిధ పేమెంట్ ప్రొవైడర్స్ సేవలు ఉపయోగించుకునే యూజర్ల మధ్య నిరాటంకంగా చెల్లింపు లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు క్లోజ్డ్ లూప్ సిస్టమ్‌లతో పోలిస్తే యూపీఐలాంటి ఇంటర్‌ఆపరబుల్ పేమెంట్ సిస్టమ్‌లు సమర్థవంతంగా ఉంటాయని తెలిపింది. అయితే, ఇది మరింత వినియోగంలోకి వచ్చే కొద్దీ ప్రైవేట్ రంగ సంస్థల గుత్తాధిపత్యానికి కూడా దారి తీయొచ్చని, అలాంటిది జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

గోల్డ్ ఈటీఎఫ్‌లు.. జిగేల్!



- జూన్‌లో పెట్టుబడుల వరద...
- రూ.2,081 కోట్లు జత...
- రూ.65వేల కోట్లకు నిర్వహణ ఆస్తులు

న్యూఢిల్లీ: బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు)కు జూన్‌లో బలమైన డిమాండ్ కనిపించింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో బంగారం ధరలు ఇటీవలి కాలంలో స్థిరమైన ర్యాలీ చేస్తుండడం ఇన్వెస్టర్లను మరింతగా ఆకర్షిస్తోంది. జూన్ నెలలో ఏకంగా రూ.2,081 కోట్లను గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేశారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఈ గణాంకాలను విడుదల చేసింది. ఈ ఏడాది మే నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి వచ్చిన పెట్టుబడులు రూ.292 కోట్లతో పోల్చి చూస్తే జూన్‌లో ఏడింతలైనట్లు తెలుస్తోంది. ఇక ఈ ఏడాది ఏప్రిల్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.6 కోట్లు, మార్చిలో రూ.77 కోట్ల చొప్పున ఇన్వెస్టర్లు ఉపసంహరించుకోవడం గమనార్హం. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ కాలాన్ని పరిశీలించి చూస్తే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి వచ్చిన నికర పెట్టుబడులు రూ.8,000 కోట్లుగా ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో గోల్డ్ ఈటీఎఫ్‌లు రూ.3,751 కోట్లను ఆకర్షించగా, ఆ తర్వాత తిరిగి జూన్‌లోనే గరిష్ట స్థాయిలో పెట్టుబడులు రావడం గమనించొచ్చు. జూన్‌లో రెండు గోల్డ్ ఈటీఎఫ్‌లు మొదటిసారి మార్కెట్లోకి వచ్చి (ఎన్ఎఫ్‌వోలు) ఇన్వెస్టర్ల నుంచి రూ.41 కోట్లను సమీకరించాయి. జూన్ చివరికి గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణ ఆస్తుల విలువ మే చివరితో పోల్చి చూసినప్పుడు 4% పెరిగి (మే చివరి నుంచి) రూ.64,777 కోట్లకు చేరింది.

స్థిరమైన ధరలు, అనిశ్చిత పరిస్థితులు..

''జూన్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి బలమైన పెట్టుబడులు రావడం సెంటిమెంట్‌లో మార్పునకు నిదర్శనం. ధరలు స్థిరంగా ఉండడం, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ఈక్విటీ, డెట్ సాధనాల్లో అస్థిరతలు ఇందుకు కారణమై ఉండొచ్చు''అని మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మెష్రామ్ తెలిపారు. కొత్త పథకాల ద్వారా నిధుల సమీకరణ కూడా మెరుగ్గానే ఉన్నట్టు చెప్పారు. గోల్డ్ ఈటీఎఫ్‌ల పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న ఆసక్తికి నిదర్శనంగా పేర్కొన్నారు. గోల్డ్ ఈటీఎఫ్‌లకు సంబంధించి ఫోలియోలు (పెట్టుబడి ఖాతాలు) జూన్‌లో 2.85 లక్షలు పెరిగాయి. మొత్తం ఫోలియోలు 76.54 లక్షలకు చేరాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల ధరలు బంగారం మార్కెట్ ధరలనే ప్రతిఫలిస్తుంటాయి. ఒక ఈటీఎఫ్ యూనిట్ గ్రాము బంగారంతో సమానం. కానీ, కొన్ని ఫండ్స్ సంస్థలు ఇంతకంటే తక్కువ పరిమాణంలోనూ పెట్టుబడులకు అనుమతిస్తున్నాయి.

భారత 'ఎ' జట్టులో షబ్నమ్

- వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో పర్యటించనున్న టీమిండియా
- కెప్టెన్‌గా రాధా యాదవ్ ఎంపిక


షబ్నమ్

న్యూఢిల్లీ: గాయాల నుంచి తేరుకున్న ఆఫ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్... పేస్ బౌలర్ టిటాస్ సాధు మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టనున్నారు. వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో పర్యటించే భారత 'ఎ' మహిళల క్రికెట్ జట్టును గురువారం ప్రకటించారు. ఆగస్టు 7 నుంచి 24వ తేదీ వరకు జరిగే ఈ పర్యటనలో భారత 'ఎ' జట్టు మూడు టి20 మ్యాచ్‌లు, మూడు వన్డేలు, ఒక నాలుగు రోజుల మ్యాచ్ ఆడుతుంది. మహిళల అండర్-19 టి20 వరల్డ్ కప్‌ను రెండుసార్లు నెగ్గిన భారత జట్టులో సభ్యురాలైన ఆంధ్రప్రదేశ్ పేస్ బౌలర్ షబ్నమ్ షకీల్‌కు కూడా భారత 'ఎ' జట్టులో చోటు లభించింది. ఎడంచేతి వాటం స్పిన్నర్ రాధా యాదవ్ భారత 'ఎ' జట్టుకు కెప్టెన్‌గా... కేరళకు చెందిన మిన్ను మణి వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు.

భారత మహిళల 'ఎ' టి20 జట్టు: రాధా యాదవ్ (కెప్టెన్), మిన్ను మణి (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, వృంద, సజన సజీవన్, ఉమా ఛెత్రి, రాఘ్వీ బిస్త్, శ్రేయాంక పాటిల్, ప్రేమా రావత్, నందిని కశ్యప్, తనుజా కన్వర్, వీజే జోషిత, షబ్నమ్ షకీల్, సైమా ఠాకూర్, టిటాస్ సాధు.

భారత 'ఎ' వన్డే, నాలుగు రోజుల టెస్టు జట్టు: రాధా యాదవ్ (కెప్టెన్), మిన్ను మణి (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, తేజల్ హసబ్నిస్, రాఘ్వీ బిస్త్, తనుశ్రీ సర్కార్, ఉమా ఛెత్రి (వికెట్ కీపర్), ప్రియా మిశ్రా, తనుజా కన్వర్, నందిని కశ్యప్ (వికెట్ కీపర్), ధారా గుజ్జర్, వీజే జోషిత, షబ్నమ్ షకీల్, సైమా ఠాకూర్, టిటాస్ సాధు.


హరేంద్ర సింగ్

ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

అనుభవ లేమితోనే ప్రో లీగ్‌లో పేలవ ప్రదర్శన

- సీనియర్లు లేకపోవడంతో జట్టు డీలా
- భారత మహిళల హాకీ జట్టు హెడ్ కోచ్ హరేంద్ర సింగ్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: యువ క్రీడాకారిణులు మరింత బాధ్యతగా ఆడాల్సిన అవసరముందని భారత మహిళల హాకీ జట్టు ప్రధాన కోచ్ హరేంద్ర సింగ్ అన్నాడు. లేకుంటే జట్టు సీనియర్ ప్లేయర్లపై ఎక్కువ ఆధారపడాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. మ్యాచ్‌కు ముందు ఎంత బాగా శిక్షణ పొందినా... ఒక్కసారి మైదానంలో అడుగు పెట్టాక అప్పటికప్పుడు వ్యూహాలు మార్చుకుంటూ ముందుకు సాగితేనే ఫలితాలు అనుకూలంగా వస్తాయని ఆయన వెల్లడించాడు. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రో లీగ్ యూరప్ అంచె పోటీల్లో భారత మహిళల హాకీ జట్టు ఎనిమిది మ్యాచ్‌ల్లోనూ ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. ఈ నేపథ్యంలో హరేంద్ర సింగ్ మాట్లాడుతూ... 'ప్రో లీగ్‌లో యువ జట్టుతో బరిలోకి దిగాం. పలువురు అనుభజ్ఞులైన ప్లేయర్లు గాయాలతో యూరప్ అంచె పోటీలకు దూరమవడం ఫలితాలపై ప్రభావం చూపింది. ముఖ్యంగా డిఫెన్స్ మరీ బలహీనంగా మారింది. దీంతో ప్రత్యర్థులు సులువుగా గోల్స్ చేస్తూ జట్టుపై ఒత్తిడి పెంచారు. దీనిపై మరింత కృషి చేయాల్సిన అవసరముంది. అనుభవరాహిత్యం కారణంగా యువ ప్లేయర్లు తాము మైదానంలో ఎక్కడ ఉన్నాం... తమ బాధ్యత ఏంటి అనే విషయంలో కాస్త అయోమయానికి గురయ్యారనేది సుస్పష్టం. అందుకే పరిస్థితులకు తగ్గట్లు ముందుకు సాగాలి. లేకుంటే తిరిగి సీనియర్ ఆటగాళ్లపైనే భారం మోపాల్సి ఉంటుంది. ఫీల్డ్‌లో నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం పనికి రాదు. ఎంత వేగంగా స్పందిస్తే అంత మెరుగైన ఫలితం సాధించవచ్చు. ప్రత్యర్థి సర్కిల్‌లోకి ప్రవేశిస్తే... గోల్ పోస్ట్‌పై దాడులు చేసేందుకు వెరవకూడదు. పదేపదే దాడులు చేస్తూ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెడితేనే మ్యాచ్‌పై పట్టు చిక్కుతుంది' అని అన్నాడు.

సీనియర్లు అందుబాటులో లేకే...

అంతర్జాతీయ స్థాయిలో అపార అనుభవం ఉన్న ప్లేయర్లు వేర్వేరు కారణాలతో జట్టుకు దూరం కావడంతోనే యూరప్ అంచె పోటీల్లో భారత ఆటతీరు మరీ తీసుకట్టులా మారిందని హరేంద్ర సింగ్ అన్నాడు. 'ప్రో లీగ్ ప్రారంభానికి ముందు సుశీలా చాను జట్టుకు దూరమైంది. నిక్కీ ప్రధాన్, ఉదిత గాయాలతో ఇబ్బంది పడుతుండటంతో వారికి విశ్రాంతినివ్వాల్సి వచ్చింది. దీంతో ముగ్గురు ప్రధాన డిఫెండర్లు లేకపోవడంతో మన రక్షణ పంక్తి బలహీనపడింది. యువ స్ట్రయికర్ సంగీత కుమారి కూడా గాయం కారణంగా జట్టుకు దూరమైంది' అని హరేంద్ర వెల్లడించాడు. ప్లేయర్ల మానసిక బలాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు హరేంద్ర అన్నాడు. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ప్లేయర్లకు మానసికంగా దృఢంగా ఉండేవిధంగా శిక్షణ ఇచ్చిన మోహన్ అనే వ్యక్తిని జట్టు సహాయక సిబ్బందిలో చేర్చినట్లు తెలిపారు. ఒత్తిడిని అధిగమించడం, తక్షణం స్పందించే గుణం వంటి పలు కీలక అంశాల్లో అతడి శిక్షణ మన ప్లేయర్లకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచి 15 వరకు హాంగ్జౌ వేదికగా ఆసియా కప్ జరగనుండగా... ఆ లోపు ప్లేయర్లను మానసికంగా మరింత సంసిద్ధం చేస్తామని హరేంద్ర అన్నాడు.

అవకాశాలను వినియోగించుకుంటేనే...

ప్రో లీగ్ యూరప్ అంచె పోటీల్లో భారత జట్టుకు ఎన్నో అవకాశాలు వచ్చినా... వాటిని సద్వినియోగ పరుచుకోలేకపోయింది. అనుభజ్ఞులు లేకపోవడంతో డిఫెన్స్ విభాగంలో వెనుకబడిన టీమిండియా... అటాకింగ్‌లోనూ ఆకట్టుకోలేకపోయింది. ముఖ్యంగా పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచడంలో మనవాళ్లు మరింత దృష్టి పెట్టాల్సిన అవసరముంది. 'పెనాల్టీ కార్నర్‌ల విషయంలో చాలా మెరుగపడాల్సి ఉంది. మెరుగైన ప్రత్యర్థులతో తలపడుతున్నప్పుడు ప్రతి అంశంలో పక్కాగా ఉండాలి. అది లోపించడం వల్లే ప్రో లీగ్ నుంచి ఉద్వాసన ఎదురైంది. అయితే ఇక్కడితో ఆగిపోము. ఈ లోపాలను సవరించుకొని మరింత బలంగా పుంజుకుంటాం. ప్రత్యర్థికి పదే పదే పెనాల్టీ కార్నర్ అవకాశాలు ఇవ్వడం దెబ్బకొట్టింది. అయితే సానుకూల అంశాలు కూడా ఉన్నాయి. మనకంటే మెరుగైన జట్లతో మ్యాచ్‌ల్లో సైతం అమ్మాయిలు ఆకట్టుకున్నారు. కొన్ని తప్పిదాలను పక్కన పెడితే ప్రపంచ స్థాయి ఆటతీరు కనబర్చారు. ఆసియా కప్ ప్రారంభానికి ముందే ఈ తప్పులను సరిదిద్దుకుంటాం. ప్లేయర్లకు పెద్దగా అనుభవం లేదు. వారిని నిందించాలనుకోవడం లేదు. ఏడుగురు ఆటగాళ్లకు ఇదే తొలి ప్రో లీగ్' అని హరేంద్ర అన్నాడు.

ముగిసిన శ్రీజ పోరు




లాస్‌వేగస్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టూర్‌లో భాగంగా యునైటెడ్ స్టేట్స్ (యూఎస్) 'స్మాష్ లెవెల్' టీటీ టోర్నీలో భారత క్రీడాకారిణి, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 64వ ర్యాంకర్ శ్రీజ 6-11, 9-11, 3-11తో ప్రపంచ 23వ ర్యాంకర్ హొనోకా హాషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయింది. 22 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీజ తన సర్వీస్‌లో 9 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 9 పాయింట్లు సాధించింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో భారత ప్లేయర్ సత్యన్ జ్ఞానశేఖరన్ 11-9, 6-11, 2-11, 9-11తో జియాంగ్ పెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. పురుషుల డబుల్స్‌లో మానవ్ ఠక్కర్-మనుశ్ షా (భారత్) ద్వయం క్వార్టర్ ఫైనల్ చేరింది. రెండో రౌండ్‌లో మానవ్-మనుశ్ జోడీ 12-14, 11-9, 11-8, 11-7తో తొమిస్లావ్ పుకార్ (క్రొయేషియా)-లుబోమిర్ పిస్టెజ్ (స్లొవేకియా) జంటను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మనుశ్ షా-దియా చిటాలె (భారత్) జోడీ 3-11, 7-11, 11-5, 11-4, 7-11తో వోంగ్ చున్-డూ హోయ్ (హాంకాంగ్) ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది. రెండో రౌండ్‌లో ఓడిన శ్రీజ, సత్యన్‌లకు 6 వేల డాలర్ల (రూ. 5 లక్షల 14 వేలు) చొప్పున ప్రైజ్‌మనీ తోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

శ్రీలంక శుభారంభం

తొలి టి20లో 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి


కుశాల్ మెండిస్

పల్లెకెలె: సొంతగడ్డపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన శ్రీలంక జట్టు... బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌లో శుభారంభం చేసింది. ఇప్పటికే టెస్టు, వన్డే సిరీస్‌లను చేజిక్కించుకున్న ఆతిథ్య జట్టు... టి20ల్లోనూ అదే జోరు కొనసాగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన మొదటి టి20లో లంక 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. మొదట బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. పర్వేజ్ హుసేన్ (22 బంతుల్లో 38; 5 ఫోర్లు, 1 సిక్స్), నదీమ్ (29 బంతుల్లో 32; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు.శ్రీలంక బౌలర్లలో తీక్షణ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 19 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కుశాల్ మెండిస్ (51 బంతుల్లో 73; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఓపెనర్ నిసాంక 16 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42 పరుగులు చేయడంతో లంక జట్టుకు ఘనమైన ఆరంభం దక్కింది. ఇన్నింగ్స్ తొలి మూడు బంతులకు నిసాంక ఫోర్లు కొడితే... రెండో ఓవర్‌లో మెండిస్ 4, 4, 6తో ఆకట్టుకున్నాడు. మూడో ఓవర్ చివరి మూడు బంతులకు నిసాంక 6, 4, 4 బాదగా... నాలుగో ఓవర్ తొలి మూడు బంతులకు మెండిస్ 6, 4, 6 కొట్టాడు. దీంతో 4 ఓవర్లు ముగిసేసరికి లంక వికెట్ నష్టపోకుండా 64 రన్స్ చేసింది. మెహదీ ఓవర్‌లో రెండు సిక్స్‌లు బాదిన నిసాంక మరో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో ఔటయ్యాడు. అప్పటికే లంక విజయానికి చేరువైంది.



లార్డ్స్‌లో సచిన్ అపు'రూపం'

భారత దిగ్గజ క్రికెటర్ చిత్రపటం ఆవిష్కరణ

లండన్: భారత విఖ్యాత క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌కు 'క్రికెట్ మక్కా' లార్డ్స్ లో అరుదైన గౌరవం దక్కింది. మూడో టెస్టు మొదలైన సందర్భంగా లార్డ్స్'లోని మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) మ్యూజియంలో అతని చిత్రపటాన్ని ఆవిష్కరించారు. స్టువర్ట్ పియర్సన్ రైట్ అనే కళాకారుడు ఈ చిత్రరాజాన్ని గీశారు. 18 ఏళ్ల క్రితం సచిన్ ఇంట్లో తీసుకున్న ఫొటోను ఆధారంగా చేసుకొని లెజెండ్ అపు'రూపాని'కి తన కుంచెతో వన్నెతెచ్చారు. సచిన్ చిత్రరాజం ఈ ఏడాది అక్కడే ఉంటుంది. ఆ తర్వాతే పెవిలియన్‌కు మార్చుతారు. క్రీడా దిగ్గజాల చిత్రాలను గీయడంతో పియర్సన్ రైట్‌ది అందెవేసిన చేయి. గతంలో అతను భారత లెజెండ్స్ కపిల్ దేవ్, బిషన్ సింగ్ బేడీ, దిలీప్ వెంగ్‌సర్కార్ చిత్రాలను గీశారు. గురువారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో సచిన్ తన సతీమణి అంజలీతో కలిసి పాల్గొన్నారు. ఇంగ్లండ్ మాజీ ప్రధాని రిషి సునాక్, దిగ్గజం ఫరూఖ్ ఇంజినీర్‌లు సైతం ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెండూల్కర్ మాట్లాడుతూ 'నాకు దక్కిన అపూర్వ గౌరవమిది. 1983లో భారత్ ప్రపంచకప్ గెలిచినపుడే నాకు లార్డ్స్ గురించి తెలిసింది. మా కెప్టెన్ కపిల్ దేవ్ ప్రపంచకప్‌ను అందుకోవడం చూసిన ఆ క్షణమే నా క్రికెట్ ప్రయాణానికి నాంది పలికింది. ఈ రోజు నా చిత్రపటం పెవిలియన్‌కు వెళ్లినపుడు నా పయనం సంపూర్ణమైందనిపిస్తుంది. నా కెరీర్‌ను తలచుకున్న ప్రతిసారి నాకు నా ముఖంలో చిరునవ్వు కనబడుతుంది. నిజంగా ఇది ప్రత్యేకమైంది' అని అన్నాడు. 1950లో మొదలైన ఈ మ్యూజియం యూరోప్‌లోనే పురాతనమైన క్రీడా మ్యూజియం. ఇందులో 3000 పైచిలుకు చిత్రమాలికలు కొలువుదీరగా... ఇందులో సుమారు 300 వరకు కుంచెనుంచి జాలువారిన చిత్రాలున్నాయి. మూడు దశాబ్దాల క్రితం ఈ పెయింటింగ్‌లను ప్రారంభించారు.

సెమీఫైనల్లో జ్యోతి సురేఖ, పర్ణీత్


జ్యోతి సురేఖ

మాడ్రిడ్: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4 టోర్నమెంట్ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు చెందిన వెన్నం జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి సురేఖ 147-144తో హాజల్ బురున్ (తుర్కియే)పై, పర్ణీత్ కౌర్ 142-141తో క్యూర్ గిరిడి (తుర్కియే)పై విజయం సాధించారు. మరోవైపు రికర్వ్ విభాగంలో భారత జట్లకు నిరాశ ఎదురైంది. భారత పురుషుల, మహిళల జట్లు కనీసం మూడో రౌండ్‌కు కూడా చేరుకోలేకపోయాయి. ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, రాహుల్, నీరజ్ చౌహాన్‌లతో కూడిన భారత పురుషుల జట్టు రెండో రౌండ్‌లో 2-6 (55-56, 54-57, 57-56, 54-56) సెట్ పాయింట్ల స్కోరుతో జ్విక్ ఎలీ, మార్కస్ అల్మీదా, మథియాస్ గోమ్స్‌లతో కూడిన బ్రెజిల్ జట్టు చేతిలో ఓడిపోయింది. దీపిక కుమారి, అంకిత, గాథ ఖడకేలతో కూడిన భారత మహిళల జట్టు కూడా రెండో రౌండ్‌లోనే వెనుదిరిగింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన భారత జట్టు రెండో రౌండ్‌లో 3-5 (58-54, 55-55, 54-55, 53-54) సెట్ పాయింట్ల స్కోరుతో అమెలీ కార్డెయు, లీసా బార్బెలిన్, విక్టోరియా సెబాస్టియన్‌లతో కూడిన ఫ్రాన్స్ జట్టు చేతిలో ఓటమి పాలైంది.



ఆరు స్థానాలు పడిపోయి...

133వ ర్యాంక్‌లో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు

న్యూఢిల్లీ: అంతర్జాతీయస్థాయిలో ఆశించిన ఫలితాలు సాధించడంలో విఫలమవుతోన్న భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ దిగజారింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) గురువారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ఆరు స్థానాలు పడిపోయి 133వ ర్యాంక్‌లో నిలిచింది. గత తొమ్మిదేళ్లలో భారత్‌కిదే అత్యల్ప ర్యాంక్ కావడం గమనార్హం. ఈ ఏడాది జూన్ 4న థాయ్‌లాండ్‌తో జరిగిన అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత బృందం 0-2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఆ తర్వాత ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో హాంకాంగ్ చేతిలో 0-1తో పరాజయం పాలైంది. భారత జట్టు నిరాశాజనక ప్రదర్శన నేపథ్యంలో హెడ్ కోచ్ మనోలో తన పదవి నుంచి వైదొలిగాడు. 2016 డిసెంబర్‌లో భారత జట్టు అత్యల్పంగా 135వ ర్యాంక్‌లో నిలువగా... 1996 ఫిబ్రవరిలో అత్యుత్తమంగా 94వ స్థానాన్ని దక్కించుకుంది. 1113.22 రేటింగ్ పాయింట్లతో భారత జట్టు ఆసియాలో 24వ స్థానంలో ఉంది. 210 దేశాలు ఉన్న 'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... స్పెయిన్, ఫ్రాన్స్, ఇంగ్లండ్, బ్రెజిల్ జట్లు వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి.

రాహిల్ రెండు గోల్స్


రాహీల్

ఎయిండ్‌హోవెన్ (నెదర్లాండ్స్): యూరోప్ పర్యటనలో భారత 'ఎ' పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో భారీ విజయం నమోదు చేసింది. గురువారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత 'ఎ' జట్టు 6-0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున మిడ్‌ఫీల్డర్ మొహమ్మద్ రాహీల్ మౌసీన్ రెండు గోల్స్ చేయగా... ఉత్తమ్ సింగ్, అమన్‌దీప్ లాక్రా, వరుణ్ కుమార్, కెప్టెన్ సంజయ్ ఒక్కో గోల్ సాధించారు. ఐర్లాండ్ జట్టుతోనే జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 'ఎ' జట్టు 6-1 గోల్స్ తేడాతో నెగ్గింది. ఈ పర్యటనలో భాగంగా శనివారం జరిగే మ్యాచ్‌లో ఫ్రాన్స్‌తో భారత్ 'ఎ' తలపడుతుంది.



భోటెకోషి నదిపై చైనా, నేపాల్‌ను కలిపే కీలక 'ఫ్రెండ్‌షిప్' బ్రిడ్జి భారీ వరదల ధాటికి ఇలా కొట్టుకుపోయింది. ఎడమ వైపు కనిపిస్తున్నది చైనా. కాగా కుడివైపు ప్రాంతం నేపాల్



గురువారం రష్యా మరోసారి భారీ దాడులకు దిగడంతో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో జనం తాత్కాలిక బాంబ్ షెల్టర్‌గా మార్చిన మెట్రో స్టేషన్లో ఇలా తలదాచుకున్నారు.



భారీ వానల కారణంగా రోడ్డుపై పడ్డ భారీ గుంతలో బోల్తా పడ్డ మద్యం లోడు లారీ. ఈ ఉదంతం హరియాణాలోని గురుగ్రాంలో గురువారం చోటుచేసుకుంది.

చైనాలో ప్రాణాంతక మైనింగ్

విచ్చలవిడిగా రేర్ ఎర్త్ మినరల్స్ తవ్వకాలు

- గాలి, నీరు, భూమి విషతుల్యం
- లాభాల వేటలో కంపెనీలు.. రోగాల బారిన జనం

అత్యంత అరుదైన ఖనిజాలు(రేర్ ఎర్త్ మినరల్స్)... రెండు అగ్రరాజ్యాలైన అమెరికా, చైనా మధ్య వాణిజ్య వివాదానికి దారితీస్తున్న అంశమిది. తమకు తక్కువ ధరకే ఈ ఖనిజాలు సరఫరా చేయాలని చేయాలని అమెరికా డిమాండ్ చేస్తుండగా, డ్రాగన్ దేశం అందుకు ఒప్పుకోవడం లేదు. ఎంతో అరుదైన, విలువైన ఈ ఖనిజాలు చైనా గడ్డపై ఉండడం, అవి తమకు సులువుగా దక్కకపోవడం సహజంగానే అమెరికాకు రుచించడం లేదు. అందుకే చైనాపై ఒత్తిడి పెంచుతూనే ఉంది. రాజకీయంగా, ఆర్థికంగా అమెరికాను చైనా బహిరంగంగా ధిక్కరిస్తోంది అంటే అందుకు కారణం ఈ ఖనిజాలే అనే చెప్పొచ్చు. ఆధునిక యుగంలో స్మార్ట్‌ఫోన్లు, బ్లూటూత్ స్పీకర్లు, కంప్యూటర్లు, టీవీ స్క్రీన్లు, ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు సోలార్ ప్యానెళ్లు, ఎంఆర్ఐ మిషన్లు, జెట్ ఇంజన్లు, విద్యుత్తు పరికరాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ వాడకం తప్పనిసరిగా మారింది. ఇదే ఇప్పుడు చైనా పంట పండిస్తోంది. ప్రపంచంలో ఉత్పత్తి అవుతున్న ఈ ఖనిజాల్లో సగానికిపైగా చైనా నుంచే వస్తున్నాయి. అరుదైన ఖనిజాల మైనింగ్, శుద్ధి, ఎగుమతుల విషయంలో చైనా మొదటి స్థానంలో నిలుస్తోంది. ఇదంతా నాణేనికి ఒకవైపే. మరోవైపు ఏముందో చూస్తే...

నీరు, భూమి కలుషితం

చైనాలో ఉత్తరాన ఉన్న ఇన్నర్ మంగోలియా ప్రాంతంలోని బయాన్ ఓబో, దక్షిణాన జియాంగ్జీ ప్రావిన్స్‌లోని గాంగ్‌ఝౌలో రేర్ ఎర్త్ ఖనిజాల గనులున్నాయి. ఆయా ప్రాంతాల్లో దశాబ్దాలుగా తవ్వకాలు సాగుతున్నాయి. భారీ యంత్రాలు, వాహనాల రొదతో అవి నిత్యం దద్దరిల్లుతుంటాయి. పొరలు పొరలుగా భూమిని పెకిలించి వేస్తున్నారు. బడా కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలతోపాటు ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపిస్తున్న గనులు స్థానికులకు మాత్రం నరకానికి నకలుగా మారిపోయాయి. పచ్చని మైదానాలు మసిబారిపోయాయి. గడ్డి భూములు ప్రమాదకరమైన దుమ్ము ధూళితో నిండిపోయాయి. లోతైన గనుల నుంచి దట్టమైన దుమ్ము మేఘాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. భూమాతకు గాయాలవుతూనే ఉన్నాయి. గాలి, నీరు, భూమి దారుణంగా కలుషితం అవుతున్నాయి.

గ్రామాలకు గ్రామాలే ఖాళీ

గనుల వల్ల జరగాల్సిన నష్టం చాలా వరకు ఇప్పటికే జరిగిపోయింది. మైనింగ్ ప్రాంతాల్లో అడవులు అంతరించిపోయాయి. భూముల్లో గోతులే మిగిలాయి. నదులు, పంట పొలాలు పనికిరాకుండా పోయాయి. భూగర్భ జలాలు సైతం విషతుల్యంగా మారుతున్నాయి. ఒక విధానం అంటూ లేకుండా తవ్వకాలు సాగిస్తుండడంతో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. మైనింగ్ కంపెనీలు రైతుల పొలాలను కూడా వదలిపెట్టడం లేదు. వారు ఎంత మొర పెట్టుకున్నా ఫలితం శూన్యం. బడా కంపెనీలపై చట్టపరంగా కోర్టుల్లో పోరాడే శక్తి లేక మిన్నకుండిపోతున్నారు. కొన్నిచోట్ల గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయి. మరోవైపు గనుల తవ్వకం ఆపాల్సిందేనని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నాయి.

చట్టవిరుద్ధంగా తవ్వకాలు

గనుల నుంచి వెలువడే రేడియోయాక్టివ్ బురదను నిల్వ చేయడానికే సమీపంలో కృత్రిమంగా సరస్సులు నిర్మించారు. కాలుష్యం కారణంగా స్థానికులు రోగాల బారినపడుతున్నారు. పెద్దలకు క్యాన్సర్లతోపాటు శిశువులకు పుట్టుకతో లోపాలు పరిపాటిగా మారాయి. ఇదంతా బాహ్య ప్రపంచానికి తెలియకుండా చైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. అపరిచితులను గనుల వైపు అనుమతించడం లేదు. మైనింగ్ ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుద్ధి చేస్తున్నామని అధికారులు చెబుతున్నా అందులో వాస్తవం లేదని నిపుణులు అంటున్నారు. గనుల తవ్వకంతో వెలువడే మట్టి, బురదలో ప్రాణాంతకమైన భార లోహాలు, రేడియోయాక్టివ్ అవశేషాలు ఉంటున్నాయి. టన్నుల కొద్దీ అమ్మోనియం సల్ఫేట్, అమ్మోనియం క్లోరైడ్‌తో పాటు ఇతర రసాయనాలు భూ ఉపరితలంపై పేరుకుపోతున్నాయి. చైనాలో వేలాది మైనింగ్ సైట్లు ఉన్నాయి. వీటిలో చట్టవిరుద్ధమైనవే ఎక్కువ. ఒక చోట తవ్వకానికి అనుమతులు తీసుకొని మరికొన్ని చోట్ల అక్రమంగా మైనింగ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గనుల నియంత్రణకు ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. మైనింగ్ లైసెన్స్‌ల సంఖ్య తగ్గించింది. అయినప్పటికీ అక్రమ గనులు సంఖ్య పెరిగిపోతోంది తప్ప తగ్గడం లేదు. కేవలం ఒక టన్ను ఖనిజాలు కావాలంటే ఏకంగా 2,000 టన్నుల మట్టిని తవ్వాల్సి ఉంటుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

శాస్త్ర సాంకేతికత మండళ్లకు నిధుల కొరత

- కేరళ, యూపీ, హరియాణా, గుజరాత్‌లు తప్ప ఏ రాష్ట్రంలోనూ రూ.100 కోట్లు దాటని బడ్జెట్
- 2023–24లో తెలంగాణ రూ.8.40 కోట్లే
- ఏపీలో అయితే 2024–25 కాలంలో జీరో బడ్జెట్
- నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక పురోగతి, ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా ఉండాల్సిన రాష్ట్రాల సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్‌లు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని నీతి ఆయోగ్ వెల్లడించింది. వ్యవసాయం, పునరుత్పాదక శక్తి, విపత్తు నిర్వహణ, డిజిటల్ హెరిటేజ్ సెంటర్ల అభివృద్ధి, జీవ మ్యాపింగ్, రిమోట్ సెన్సింగ్, ఆరోగ్య సంరక్షణ పరికరాల తయారీ వంటి రంగాల పరిశోధనలో కౌన్సిల్‌లు కీలక పాత్ర పోషించేవి. అయితే సంస్థాగత లోపాలు, మానవ వనరుల కొరతకుతోడు కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులు బాగా తగ్గడంతో సైన్స్, టెక్నాలజీ మండళ్లు పూర్తిగా నీరుగారిపోతున్నాయని నీతి ఆయోగ్ ఆక్షేపించింది. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర శాస్త్రసాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'రాష్ట్రాల శాస్త్రసాంకేతికత మండళ్ల బలోపేతానికి మార్గసూచీ'నివేదికలో నీతి ఆయోగ్ పలు అంశాలను ప్రస్తావించింది.

సిబ్బంది, నిధుల కరువు

శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణల కోసం రాష్ట్రాలు వెచ్చిస్తున్న బడ్జెట్ 2023–24 ఏడాదితో పోలిస్తే 2024–25లో సగటున 17 శాతం మేర పెరిగినట్లు కనిపిస్తున్నా వాస్తవంలో కొన్ని రాష్ట్రాలు మాత్రమే సమధిక నిధులు కేటాయించాయి. ప్రతిరాష్ట్రానికి కేంద్రం నుంచి అందాల్సిన నిధుల వాటా తెగ్గోసుకుపోతోంది. 2024–25లో కేరళ అత్యధికంగా రూ.173.34 కోట్లు, గుజరాత్ రూ.161 కోట్లు, హరియాణా రూ.130కోట్లు, ఉత్తర్ ప్రదేశ్ రూ.140 కోట్లు కేటాయించారు. ఇవి మినహా మరే ఇతర రాష్ట్రం వంద కోట్లకు మించి బడ్జెట్‌ను కేటాయించకపోవడం విచారకరమని నీతి ఆయోగ్ పేర్కొంది. తెలంగాణ సర్కార్ 2023–24లో రూ.8.40 కోట్ల నిధులు కేటాయించింది, 2024–25లో రూ.19.23 కోట్లకు పెంచారు. అయితే ఇందులో రాష్ట్రానికి కేంద్ర నిధులు రూ.96 లక్షలు మాత్రమే అందాయని వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో 2023–24లో రూ.4.84 కోట్లు కేటాయించారు. 2024–25 ఏడాదిలో ఒక్క రూపాయి నిధులు పెంచలేదు. కొన్ని రాష్ట్రాలు పాక్షిక కేంద్ర సహాయాన్ని పొందుతున్నప్పటికీ, కేంద్రం నుంచి కేటాయింపులు 2024–25 ఏడాదిలో రూ.50 కోట్ల కన్నా తక్కువగా ఉన్నాయని నీతి ఆయోగ్ తెలిపింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ఏజెన్సీల నుండి ప్రాజెక్టు ఆధారిత నిధులను రాబట్టడంతో రాష్ట్రాల మండళ్లు పూర్తిగా వెనుకబడ్డాయని వివరించింది. కొన్ని రాష్ట్రాల కౌన్సిల్‌లు మాత్రం సైన్స్ పార్కులు, సైన్స్ సిటీలను ఏర్పాటు చేయడానికి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, సాంస్కృతిక శాఖలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అనేక రాష్ట్రాలు తమ పాలక మండలి సమావేశాలను క్రమం తప్పకుండా ఏర్పాటు చేయడంలో విఫలమవుతున్నాయి. దాంతో నిర్ణయం తీసుకోవడంలో జాప్యం అవుతోంది. దీంతో కీలక కార్యక్రమాల అమలు కుంటుపడుతోంది. కొన్ని మండళ్లకు కాస్తంత మెరుగ్గా నిధులు మంజూరైనప్పటికీ ఆ నిధుల సద్వినియోగం జరగట్లేదు. ఆర్థికంగా బలంగా లేకపోవడం, పరిపాలనా అడ్డంకులు, సిబ్బంది కొరత కారణంగా మండళ్లలో విస్తృత స్థాయిలో పరిశోధనలు జరగట్లేదు. దీంతో వాటి సామర్థ్యం తగ్గిపోతోందని నీతి ఆయోగ్ పేర్కొంది.

యూరప్‌లో వడగాడ్పుల మరణ మృదంగం

10 రోజుల్లో 2,300 మంది మృతి

ఓ అధ్యయనంలో వెల్లడి

లండన్: యూరప్ దేశాల్లో ఎండల తీవ్రతకు జనం పిట్టల్లా రాలిపోతున్నారు. ప్రధానమైన 12 యూరప్ నగరాల్లో కేవలం పది రోజుల వ్యవధిలోనే ఏకంగా 2,300 మరణాలు నమోదయ్యాయి. ఇందులో మూడింట రెండొంతుల మరణాలకు వాతావరణ మార్పులే కారణమని ఓ అధ్యయనం తేల్చింది. తాము వేసిన మరణాల అంచనాలు స్వతంత్ర సంస్థల నుంచి సేకరించినవని, ప్రభుత్వాల పరంగా గణాంకాలు అందేందుకు సమయం పట్టొచ్చని పరిశోధకులు తెలిపారు. జూన్ 23 నుంచి జూలై 2వ తేదీల మధ్యలో పశ్చిమ యూరప్‌తో అత్యంత తీవ్ర స్థాయిలో ఎండలు కాశాయి. స్పెయిన్‌లో ఏకంగా 40 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు చేరుకున్నాయి. వడగాడ్పులు తోడవ్వడంతో ఫ్రాన్స్‌లో కార్చిచ్చు చెలరేగింది. యూరప్‌లోని ప్రధాన నగరాలైన బార్సిలోనా, మాడ్రిడ్, లండన్, మిలాన్ తదితర ప్రధానమైన 12 నగరాల జనాభా 3 కోట్లకు పైమాటే. ఈ నగరాల్లో సాధారణానికి మించి నాలుగు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధ్యయనం గుర్తించింది. పది రోజుల సమయంలో ఎండలకు సంబంధించిన ఘటనలకు సంబంధించిన మరణాల్లో కనీసం 1,500 మరణాలు అత్యంత తీవ్రమైన వడగాడ్పులు వంటి వాతావరణ మార్పుకు సంబంధించినవేనని తెలిపింది. యూకే, నెదర్లాండ్స్, డెన్మార్క్, స్విట్జర్లాండ్‌లకు చెందిన ఐదు సంస్థలు, 12మందికి పైగా పరిశోధకులు అధ్యయనంలో భాగస్వాములయ్యారు. 'వాతావరణ మార్పుల వల్లనే సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ పరిస్థితి మున్ముందు మరింత ప్రమాదకరంగా మారనుంది'అని లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీ పరిశోధకులు బెన్ క్లార్క్ చెప్పారు. అప్పుడిక మనిషి శరీరం ఆ ఉష్ణోగ్రతలను తట్టుకునే పరిస్థితి ఏమాత్రం ఉండదన్నారు. ఈ ప్రభావం వృద్ధులు, చిన్నారులు, బయట పనిచేసే సిబ్బందిపై ఎక్కువగా ఉంటుందన్నారు. మానవ ప్రేరేపిత వాతావరణ మార్పు ప్రభావమే లేకుంటే ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశముందన్నారు. రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగినా వేలాదిగా జనం ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని మరో పరిశోధకుడు గ్యారీఫల్లోస్ అన్నారు. వడగాడ్పులు సైలెంట్ కిల్లర్స్‌గా ఆయన అభివర్ణించారు. మన ఇళ్లు, ఆస్పత్రుల్లో సంభవించే ఎండలకు సంబంధించిన మరణాలను పెద్దగా ఎవరూ పట్టించుకోరని ఆయన పేర్కొన్నారు.

భలే ఇంగ్లిష్ మీది!

- లైబీరియా అధ్యక్షునికి ట్రంప్ కితాబు
- అవమానించారంటూ ఆఫ్రికాలో నిరసనలు

వాషింగ్టన్: ఏదో ఒక వివాదం లేనిదే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పొద్దుపోవడం లేదు. తాజాగా లైబీరియా అధ్యక్షుడు జోసెఫ్ బొవాకై ఇంగ్లిష్ చాలా బాగుందంటూ ఆయన ఇచ్చిన కితాబు కూడా వివాదానికే దారితీసింది. బుధవారం వైట్‌హౌస్‌లో ఐదుగురు ఆఫ్రికా దేశాధినేతలతో భేటీ సందర్భంగా జోసెఫ్ ఇంగ్లిష్‌కు ట్రంప్ ముగ్ధుడయ్యారు. ''చాలా బాగా మాట్లాడుతున్నారు. ఇంత చక్కని ఇంగ్లిష్ ఎక్కడ నేర్చుకున్నారు?''అంటూ ఆరా తీశారు. ఆయన ధోరణి తమను అవమానించేలా ఉందంటూ లైబీరియాలోనే గాక ఆఫ్రికావ్యాప్తంగా విమర్శలు, నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామీణ ఆఫ్రికా ప్రాంతాలవాళ్లు నిరక్షర కుక్షులనే ఉద్దేశంలోనే ట్రంప్ వ్యాఖ్యలున్నాయని మండిపడుతున్నారు. దీనిపై లైబీరియా దౌత్యవేత్తలు కూడా అభ్యంతరం వెలిబుచ్చారు. ట్రంప్ తీరుకు నిరసనగా తమ అధ్యక్షుడు వాకౌట్ చేయాల్సిందని లైబీరియన్లు అభిప్రాయపడుతున్నారు. అయితే వైట్‌హౌస్ ప్రెస్ కరోలినా లెవిట్ ట్రంప్ వ్యాఖ్యలను సమర్థించారు. వాటిలో తప్పేమీ లేదని, తమ అధ్యక్షుడు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారని లైబీరియా విదేశాంగ మంత్రి కూడా అన్నారు.

ఆంగ్లమే అధికార భాష

లైబీరియా అధికారిక భాష ఇంగ్లిషే. ఆఫ్రికాలో బానిసత్వం నుంచి విముక్తి పొందిన వారి పునరావాసం నిమిత్తం అమెరికా వలస సమాజం 1822లో ఆ దేశాన్ని ఏర్పాటు చేసింది. 1847లోనే అమెరికా నుంచి స్వతంత్రం ప్రకటించుకుంది. ఆంగ్లంతో పాటు అక్కడ పలు భాషలు మాట్లాడతారు. గతంలో జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడెరిక్ మెర్జ్ ఇంగ్లిష్‌నుకూడా ట్రంప్ ఇలాగే మెచ్చుకున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ 'అమెరికా ఫస్ట్'నినాదంతో భాగంగా ఆంగ్లానికి ఆయన అధిక ప్రాధాన్యమిస్తున్నారు. దాన్ని అమెరికా అధికార భాషగా గుర్తిస్తూ గత మార్చిలో ఉత్తర్వులు కూడా ఇచ్చారు!

రెచ్చిపోయిన హౌతీలు

ఎర్రసముద్రంలో నౌకపై దాడిచేసి ముంచేసిన రెబల్స్



దాడి కారణంగా ధ్వంసమై సముద్రజలాల్లో మునిగిపోతున్న వాణిజ్య నౌక

దుబాయ్: యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు మరోసారి రెచ్చిపోయారు. ఎర్రసముద్రంలో ప్రయాణిస్తున్న గ్రీక్ దేశానికి చెందిన అంతర్జాతీయ సరకు రవాణా నౌక 'ఎటర్నిటీ సి'పై హౌతీలు గ్రనేడ్లు, ఆత్మాహుతి డ్రోన్లతో దాడిచేశారు. దీంతో నౌకకు కిందవైపు భారీ రంధ్రం పడి సముద్రంలో మునిగిపోయింది. విషయం తెల్సుకున్న యురోపియన్ యూనియన్ నేవీ బలగాలు హుటాహుటిన అక్కడికి చేరుకుని 10 మంది నౌక సిబ్బందిని రక్షించాయి. అయితే ఆలోపే కొంతమంది సిబ్బందిని హౌతీలు కిడ్నాప్‌చేసి గుర్తుతెలియని చోటుకు తీసుకెళ్లారు. లైబీరియా జెండాతో ఉన్న ఈ నౌక మునిగిన ఘటనలో ముగ్గురు సజీవసమాధి అయ్యారు. ఎర్రసముద్రంలో ఈ వారం వ్యవధిలో హౌతీలు ఇలా వాణిజ్యనౌకపై దాడిచేయడం ఇది రెండోసారి. హమాస్‌ను అంతమొందించేందుకు సాహసించిన ఇజ్రాయెల్‌పై కక్షతో హౌతీలు ఇలా పశ్చిమ దేశాలకు చెందిన నౌకలపై తరచూ దాడులకు పాల్పడుతున్నారు. ఎటర్నిటీ సి నౌక ఇజ్రాయెల్‌లోని ఎలాట్ ఓడరేవుకు వెళ్తుండగా ఇలా దాడికి గురైంది. '' పాలస్తీనియన్లకు మద్దతుగా మేం దాడులను కొనసాగిస్తాం. గాజా ఆక్రమణను ఇజ్రాయెల్ ఆపాల్సిందే'' అని హౌతీలు బుధవారం ఒక ప్రకటన విడుదలచేశారు.

ఆరేళ్ల పాపను పెళ్లాడాడు..

- మూడేళ్లు ఆగాలన్న సర్కారు!
- తాలిబన్ల అఫ్గాన్‌లో ఘోరం

తాలిబన్ల అఫ్గానిస్తాన్‌లో బాల్య వివాహాలు నానాటికీ విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి. ఆ ఘోరాల పరంపరకు పరాకాష్ట వంటి ఉదంతం తాజాగా దక్షిణ అఫ్గాన్‌లో చోటుచేసుకుంది! 45 ఏళ్ల వయసున్న ఓ ప్రబుద్ధుడు ఆరేళ్ల పాపను పెళ్లాడాడు. కాసుల కక్కుర్తితో తండ్రే ఆ చిన్నారిని పెళ్లి పేరిట ఇలా సదరు కామాంధునికి కట్టబెట్టాడట. ఇదే ఘోరమంటే, దీనిపై తాలిబన్ సర్కారు మరీ అరాచకంగా స్పందించింది. 'నువ్వు చేసిన పని మమ్మల్ని షాక్‌కు గురి చేసింది. అంత చిన్న వయసు పాపను పెళ్లాడకుండా ఉండాల్సింది. కనీసం తనకు తొమ్మిదేళ్లు వచ్చేదాకా, అంటే మరో మూడేళ్ల దాకా కాపురానికి తీసుకెళ్లడానికి వీల్లేదు' అని సదరు నవ వరుడిని ఆదేశించింది. అతనితో పాటు పాప తండ్రిని లాంఛనంగా అరెస్టు చేసింది. అమెరికాకు చెందిన అఫ్గాన్ సంస్థ ఏఎంయూ.టీవీ ఈ మేరకు పేర్కొంది. మనవాడికి అప్పటికే రెండు పెళ్లిళ్లయ్యాయట. పాప ప్రస్తుతానికి తల్లి దగ్గరే ఉన్నట్టు స్థానిక మీడియా పేర్కొంది. ఇదెక్కడి పాడు పని అంటూ సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగుతోంది. చిన్న పాప పక్కన పెళ్లి దుస్తుల్లో ఉన్న వరుని ఫొటోలు వైరల్‌గా మారాయి. మానవ హక్కుల సంఘాలు కూడా తాలిబన్ల తీరుపై దుమ్మెత్తిపోస్తున్నాయి.

రూపురేఖలను బట్టి రేటు!

అఫ్గాన్‌లో అమల్లో ఉన్న దుర్మార్గమైన వాల్వార్ సంప్రదాయం మేరకు ఈ పెళ్లి జరిగింది. ఇందులో వధువు శరీరాకృతి, చదువు తదితరాల ఆధారంగా తనకు ధర నిర్ణయిస్తారు. అది చెల్లించిన వాడికిచ్చి పెళ్లి చేస్తారు. 2021లో తాలిబన్లు అఫ్గాన్‌ను హస్తగతం చేసుకున్న నాటినుంచీ బాల్య వివాహాలు పెచ్చరిల్లాయి. దుర్భర దారిద్ర్యం దీనికి తోడైంది. పిల్లలను పెంచలేక తల్లిదండ్రులు ఇలా ఆడపిల్లలను పెళ్లి సాకుతో అయినకాడికి అమ్ముకుంటున్నారు. దేశంలో అమ్మాయిలకు అసలు కనీస వివాహ వయసు నిబంధనే లేదు. అమ్మాయిల చదువుపై నిషేధం విధించడంతో అఫ్గాన్‌లో కొన్నేళ్లుగా బాల్య వివాహాలు దేశంలో ఏకంగా 45 శాతానికి పెరిగినట్టు ఐరాస నివేదిక పేర్కొంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

యజమానిని కాపాడిన కుక్కపిల్ల

పెంపుడు జంతువులు, అందులోనూ కుక్కల విశ్వాసం అంతా ఇంతా కాదు. దక్షిణ స్విట్జర్లాండ్‌లో ఇది మరోసారి నిరూపితమైంది. యజమానితో కలిసి హైకింగ్‌కు వెళ్లిన బుల్లి బొచ్చు కుక్క అతను ప్రమాదంలో పడితే కాపాడి గానీ అక్కడి నుంచి కదల్లేదు. గత శుక్రవారం అతను కుక్కపిల్లతో కలిసి ఫీ గ్లేసియర్‌పైకి హైకింగ్‌కు వెళ్లాడు. అక్కడి మంచులో 26 అడుగుల లోతున్న గుంతలో పడిపోయాడు. సాయం కోసం వాకీ టాకీలో సమీపంలోని వ్యక్తికి కాల్ చేశాడు. అతడు వెంటనే అత్యవసర సేవల విభాగానికి సమాచారమిచ్చాడు. హెలికాప్టర్ రెస్క్యూ బృందం వెంటనే అక్కడికి చేరుకున్నా పైనుంచి తెల్లగా కనిపిస్తున్న మంచులో ఎక్కడ పడిపోయిందీ గుర్తించలేకపోయింది. చివరికి ఓ రాయిపై చిన్న కదలికను వ్యక్తి గమనించారు. వెంటనే సమీపానికి వెళ్తే కుక్కపిల్ల యజమాని పడిపోయిన దగ్గరే కూచుని కనిపించింది. దాంతో అతన్ని వెంటనే కాపాడి కుక్కతో పాటు ఆస్పత్రికి తరలించారు. సహాయక సంస్థ ఎయిర్ జెర్మాట్ దీన్ని తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. 'నాలుగు కాళ్ల హీరో'అంటూ కుక్కపిల్ల ఫొటో ప్రచురించింది. ''అదే లేకపోతే ప్రమాద స్థలాన్ని గుర్తించడం కష్టమయ్యేది. రెస్క్యూ ఆపరేషన్ పూర్తయ్యేదాకా అది అక్కడి నుంచి అంగుళం కూడా కదల్లేదు''అని వివరించింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

దక్షిణాది వాళ్లు డ్యాన్స్ బార్లు నడుపుతారు

శివసేన ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్య

ముంబై: ముంబైలో క్యాంటీన్ కాంట్రాక్టర్‌ను కొట్టిన శివసేన (షిండే) ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ నోరు పారేసుకున్నారు. ''దక్షిణ భారతీయులు డాన్స్ బార్లు, లేడీస్ బార్లు నడుపుతారు. వారికి వారికి మహారాష్ట్రలో ఆహార సరఫరా కాంట్రాక్టులు ఇవ్వొద్దు''అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శెట్టి అనే కాంట్రాక్టర్‌ను ఆయన కొట్టిన వీడియో రాజకీయ దుమారం రేపడం తెలిసిందే. గైక్వాడ్ దీనిపై గురువారం మాట్లాడుతూ, ''కాంట్రాక్ట్ అతనికెందుకు ఇచ్చారు? మరాఠీ వ్యక్తికి ఇవ్వండి. మనమేం తింటామో మరాఠీలకు తెలుస్తుంది. వారే నాణ్యమైన ఆహారం అందిస్తారు. డ్యాన్స్ బార్లు, లేడీస్ బార్లు నడిపే దక్షిణ భారతీయులు మహారాష్ట్ర సంస్కృతిని పాడు చేస్తున్నారు. మన పిల్లలను భ్రష్టు పట్టించారు. అలాంటివాళ్లు మంచి ఆహారం ఎలా అందిస్తారు?''అన్నారు. పాత ఆహారం వడ్డించారంటూ గతంలో క్యాంటీన్ కాంట్రాక్టర్‌ను కొట్టిన చరిత్ర గైక్వాడ్‌కు ఉంది. 'కాంట్రాక్టర్‌కు నా స్టైల్లో పాఠం చెప్పా'అంటూ దీన్ని గొప్పగా చెప్పుకున్నారు. అలా ఎవరు చేసినా మళ్లీ కొడతానన్నారు.

ట్రంప్‌పై హత్యాయత్నం.. సీక్రెట్ సర్వీస్ వైఫల్యమే

ఆరుగురు సీక్రెట్ ఏజెంట్ల సస్పెన్షన్

వాషింగ్టన్: గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా డొనాల్డ్ ట్రంప్‌పై పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో జరిగిన హత్యాయత్న సీక్రెట్ సర్వీస్ వైఫల్యమేనని ఆ సంస్థ అంతర్గత దర్యాప్తు తేల్చింది. ఇందుకు బాధ్యులుగా ఆరుగురు ఏజెంట్లను సస్పెండ్ చేశారు. 2024 జూలై 13న బట్లర్‌లో ప్రచార ర్యాలీలో ఒక వ్యక్తి ట్రంప్‌పైకి కాల్పులు జరపడం తెలిసిందే. తూటా ఆయన చెవిని గాయపరుస్తూ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా ఇద్దరు గాయపడ్డారు. కాల్పులు జరిపిన థామస్ మాథ్యూ క్రూక్స్ అనే 20 ఏళ్ల వ్యక్తిని సీక్రెట్ సర్వీస్ స్నైపర్స్ కాల్చి చంపారు. సమాచార లోపం, అప్రమత్తత లేమి ఇందుకు కారణమైందని సీక్రెట్ సర్వీస్ దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఉదంతం సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కింబర్లీ చీటిల్ రాజీనామాకు దారితీసింది.

లాస్ ఏంజెలెస్‌లో కూలిన సొరంగం

31 మందిని కాపాడిన అగ్నిమాపక శాఖ

కాలిఫోర్నియా: అమెరికాలో లాస్ ఏంజెలెస్‌లోని విల్మింగ్టన్ ప్రాంతంలో పారిశ్రామిక సొరంగం ఒకటి కుప్పకూలింది. అందులో చిక్కుకుపోయిన 31 మంది కార్మికులను అగ్నిమాపక శాఖ రక్షించింది. వారంతా గాయాల్లేకుండా బయటపడ్డారు. ఈ ఘటన బుధవారం జరిగింది. 100 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది, సహాయకులు తక్షణం రంగంలోకి దిగారు. సొరంగం ఏకైక యాక్సెస్ పాయింట్ గుండా అందరినీ రక్షించారు. సొరంగం 18 అడుగుల వ్యాసం ఉందని, మురుగు నీటి నిర్వహణ కోసం దీనిని నిర్మిస్తున్నారని నగర అగ్నిమాపక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఉత్తరప్రదేశ్‌లో మత మార్పిళ్ల బాబా అరెస్టు

చాంగుర్ బాబాకు రూ.106 కోట్ల ఆస్తులు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్‌లో పెద్ద ఎత్తున మత మార్పిళ్లకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలతో జలాలుద్దీన్ అలియాస్ చాంగుర్‌బాబా అలియాస్ పీర్ బాబాను యూపీ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ పోలీసులు ఈ నెల 5న అరెస్టు చేశారు. మత మార్పిళ్ల రాకెట్ వెనుక అతడు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. గతంలో డొక్కు సైకిల్‌పై తిరుగుతూ ఉంగరాలు, చేతి కంకణాలు విక్రయిస్తూ పొట్టపోసుకున్న చాంగుర్ బాబా ఇప్పుడు కోట్ల రూపాయలకు పడగలెత్తాడు. అతడికి రూ.106 కోట్ల విలువైన ఆస్తులు, 40 బ్యాంక్ ఖాతాలు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. విరాళాల రూపంలో విదేశాల నుంచి సైతం నిధులు అందినట్లు పేర్కొంటున్నారు. చాంగుర్ బాబా ప్రధానంగా ముస్లిమేతర మహిళలను లక్ష్యంగా చేసుకుంటాడు. వారికి డబ్బు ఆశ చూపించి మతం మార్పిస్తుంటాడు. 3 వేల నుంచి 4 వేల మంది హిందువులను మతం మార్చినట్లు తెలిసింది. వీరిలో 1,500 మంది మహిళలు ఉన్నట్లు సమాచారం. ఎవరికి ఎంత ఇచ్చాడో అతడు ఒక జాబితా కూడా తయారు చేశాడట! బలరాంపూర్‌లో చాంగుర్ బాబా నిర్మించిన భారీ భవనాన్ని ఈ నెల 8న పోలీసులు కూల్చివేశారు. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) చాంగుర్ బాబాపై దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. ఆర్థిక నేరాలకు పాల్పడడంతోపాటు ఉగ్రవాద ముఠాలతో సంబంధాలు పెట్టుకున్నట్లు బాబాపై కేసులు నమోదయ్యాయి.


రఫేల్ ఫైటర్ జెట్ గుట్టుమట్ల కోసమేనా?

గ్రీస్‌లో ఫొటోలు తీసిన నలుగురు చైనా పౌరుల అరెస్టు

ఏథెన్స్: గ్రీస్ దేశంలోని తనగ్రాలో రఫేల్ యుద్ధ విమానాలను ఫొటోలు తీసినందుకు నలుగురు చైనా జాతీయులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒక మహిళ ఉన్నట్లు తెలిసింది. తనగ్రాలో గ్రీస్ వైమానిక, సైనిక స్థావరాలు ఉన్నాయి. హెలినిక్ ఏరోస్పేస్ ఇండస్ట్రీ(హెచ్ఏఐ) ఇక్కడే ఉంది. తాజాగా చైనా పౌరులు ఈ ప్రాంతంలో రఫేల్ యుద్ధ విమానాలతోపాటు ఇతర రక్షణ సదుపాయాలను కెమెరాల్లో బంధిస్తున్నట్లు హెలినిక్ ఎయిర్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. దూరంగా వెళ్లిపోవాలని ఆ నలుగురిని హెచ్చరించారు. దాంతో వారు కొంతదూరం వెళ్లి మళ్లీ ఫొటోలు తీస్తుండడంతో అనుమానం వచ్చి వెంటనే అదుపులోకి తీసుకొని, స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసులకు అప్పగించారు. రక్షణపరంగా తనగ్రా చాలా సున్నితమైన ప్రాంతం కావడంతో ఈ ఫొటోల వ్యవహారాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు. స్థానికంగా హైఅలర్ట్ ప్రకటించారు. చైనా జాతీయుల ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందని, వారు గూఢచారులు కావొచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. రక్షణపరంగా భారత్–గ్రీస్ మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. ఇరు దేశాలు కలిసి తరచుగా సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. భారత వైమానిక దళం ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో రఫేల్ ఫైటర్ జెట్లతో పాకిస్తాన్‌పై దాడి చేసింది. ఈ ఫైటర్ జెట్ల గుట్టుమట్లు తెలుసుకోవడానికే చైనా పౌరులు వాటిని ఫొటోలు తీశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గుర్రం ఆధారాలు లభించిన ప్రాంతం?





1. కింది వాటిలో వృత్తాకార పట్టణ ప్రణాళిక కలిగిన హరప్పా నగరం?
   1) మొహంజోదారో 2) లోథాల్
   3) చన్హుదారో 4) బనవాలి
2. కింది వాటిలో హరప్పా ప్రజలు పూజించిన పక్షి?
   1) పావురం 2) నెమలి
   3) కాకి 4) గద్ద
3. హరప్పా ప్రజలు కింది వారిలో ఎవరితో అంతర్జాతీయ సంబంధాలను కలిగి ఉన్నారు?
   1) ఇరాన్ 2) ఈజిప్ట
   3) బహ్రెయిన్ 4) మెసపటోమియా
4. సరైన దాన్ని గుర్తించండి?
   A) కాలిబంగన్ 1. కుండలు
   B) లోథాల్ 2. టెర్రకోట బొమ్మలు
   C) చన్హుదారో 3. పశుపతి ముద్రిక
   D) మొహంజోదారో 4. ఇటుకతో నిర్మించిన ప్రాంగణం

   కోడ్‌ల వరుసలు

	A)	B)	C)	D)
1)	1	3	4	2
2)	4	1	2	3
3)	3	2	4	1
4)	2	4	1	3

5. సింధూ లిపికి చిహ్నంగా సిరా పాత్ర లభించిన నగరం?
   1) చన్హుదారో 2) అమ్రి
   3) లోథాల్ 4) హరప్పా
6. గుర్రం ఆధారాలు లభించిన ప్రాంతం?
   1) హరప్పా, లోథాల్
   2) లోథాల్, రంగపూర్
   3) సుర్కొటోడా, బనవాలి
   4) సుర్కొటోడా, లోథాల్
7. సతి ఆచారాన్ని సూచించే సమాధి బయట పడిన సింధూనగరం?
   1) కాలిబంగన్ 2) హరప్పా
   3) లోథాల్ 4) కోట్‌డిజి
8. కింది వాటిలో సింధన్ అంటే?
   1) వరి 2) గోధుమ
   3) బార్లీ 4) పత్తి
9. కింది వాటిలో సరికాని జత?
   సింధూ నగరాలు ప్రస్తుత రాష్ట్రాలు
   1) మొహంజోదారో సింధూ రాష్ట్రం
   2) రోపార్ పంజాబ్
   3) మాండ జమ్మూకశ్మీర్
   4) దైమాబాద్ గుజరాత్
10. హరప్పా సంస్కృతికి చెందిన వ్యవసాయ పద్ధతులకు సంబంధించిన ఆధారాలు లభిస్తున్న ప్రాంతం?
    1) కాలిబంగన్, రోపార్
    2) లోథాల్, రంగపూర్
    3) చన్హుదారో, ఖేత్రి
    4) మొహంజోదారో, హరప్పా
11. నాగలిబొమ్మ బయటపడిన సింధూ నగరం?
    1) కాలిబంగన్ 2) బనవాలి
    3) లోథాల్ 4) రంగపూర్
12. సింధూ నాగరికత అవశేషాలను మొదటగా గుర్తించినవారు?
    1) చార్లెస్ మాసన్ 2) డి.ఆర్. సాహ్ని
    3) ఎం.ఎం.వీలర్ 4) ఎం.ఎస్.వాట్స్
13. కింది వాటిలో సింధూ ప్రజల దిగుమతులు, వాటి ప్రాంతాల్లో సరికానిది?
    దిగుమతులు - ప్రాంతాలు
    1) జేడ్ - మధ్య ఆసియా
    2) స్టీ టైట్ - ఇరాన్
    3) లేపిస్ లెజులి- బదక్షాన్
    4) రాగి - మోసపటోమియా
14. అత్యధిక జనాభా కలిగిన సింధూ నగరం?
    1) హరప్పా 2) మొహంజోదారో
    3) కాలిబంగన్ 4) లోథాల్
15. ప్రపంచంలో తొలిసారిగా పత్తిని పండించిన వారు?
    1) ఈజిప్ట ప్రజలు 2) చైనీయులు
    3) సింధూ ప్రజలు
    4) మోసపటోమియన్లు
16. రుగ్వేదంలోని గాయత్రీమంత్రం ఏ దేవతకు సంబంధించింది?
    1) అదితి 2) ఉషస్సు
    3) సావిత్రి 4) అరణ్యాని
17. కింది నాలుగు వేదాలు - వాటి పురోహితులతో సరికాని జత?
    1) రుగ్వేదం- హోత్రి
    2) సామవేదం - ఉద్గాత్రి
    3) యజుర్వేదం - అధ్వర్యు
    4) అధర్వణ వేదం - బ్రామణుడు
18. కుటుంబ గ్రంథాలు అని ఏ వేదాన్ని పిలుస్తారు?
    1) రుగ్వేదం 2) సామవేదం
    3) యజుర్వేదం 4) అధర్వణ వేదం
19. ప్రసిద్ధమైన "తమసోమా జ్యోతిర్గమయ" అనే శ్లోకం ఏ గ్రంథంలో ఉంది?
    1) ఐతరేయ బ్రాహ్మణం
    2) బృహదారణ్యక ఉపనిషత్
    3) యజుర్వేద సంహిత
    4) భాగవత పురాణం
20. ఏ వేదాన్ని కృష్ణ, శుక్ల అనే రెండు భాగాలుగా విభజించారు?
    1) అధర్వణ వేదం 2) యజుర్వేదం
    3) సామవేదం 4) రుగ్వేదం
21. అష్టాదశ పురాణాల్లో అతి ప్రాచీనమైంది?
    1) విష్ణు పురాణం 2) భాగవత పురాణం
    3) వాయుపురాణం 4) గరుడ పురాణం
22. కిందివాటిలో రేఖాగణిత శాస్త్రం మూలాలు కలిగి ఉంది?
    1) సుళ్వ సూత్రాలు 2) శ్రౌత సూత్రాలు
    3) గృహ సూత్రాలు
    4) ధర్మ సూత్రాలు
23. రుగ్వేదంలో ప్రస్తావించని పర్వతశ్రేణి?
    1) వింధ్య, సాత్పురా
    2) సాత్పురా, ఆరావళి పర్వతాలు
    3) ఆరావళి, హిమాలయాలు
    4) హిమాలయాలు, ముజావంత్ పర్వతాలు
24. కింది వాటిలో సరైన సమాధానాన్ని గుర్తించండి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భారతదేశ చరిత్ర

లిస్ట్-ఎ	లిస్ట్-బి
A. వేదాంగాలు	1. 4
B. ఉపనిషత్తులు	2. 108
C. పురాణాలు	3. 6
D. ఉపవేదాలు	4. 18

	A	B	C	D
1)	3	2	4	1
2)	3	4	1	2
3)	4	3	2	1
4)	1	2	3	4

25. ప్రపంచంలోనే అతి ప్రాచీన గ్రంథం?
    1) రుగ్వేదం 2) సామవేదం
    3) యజుర్వేదం 4)అధర్వణ వేదం
26. కిందివాటిలో సరికాని జత?
    వేదాలు-అనుబంధంగా ఉన్న ఉపనిషత్తులు
    1) రుగ్వేదం- ఐతరేయ, కౌసితాకి
    2) సామవేదం- చాంద్యోగ్య, కేనోపనిషత్
    3) యజుర్వేదం- కఠ, బృహదారణ్యక
    4) అధర్వణవేదం- తైత్తిరీయ, శ్వేతాశ్వతార, ఇసా
27. కిందివాటిలో చాతుర్వర్ణ వ్యవస్థకు సంబంధించిన మొదటి సంకేతం దేనిలో కనిపిస్తుంది?
    1) పురుష సూక్తం 2) రుగ్వేదం
    3) శతపథ బ్రాహ్మణం 4) మనుస్మృతి
28. పురాణాల్లోని ప్రసంగాలు దేనికి సంబంధించినవి?
    1) గాథలు 2) మత నియమాలు
    3) నైతిక న్యాయ నిబంధనలు
    4) పైవన్నీ
29. కిందివాటిలో ఇండో-ఆర్యన్ భాషా సమూహానికి సంబంధించనిది?
    1) అవెస్తా 2) ఇంగ్లిష్
    3) అరబ్బీ 4) పర్షియన్
30. కిందివాటిలో మలివేద సాహిత్యంగా దేన్ని పరిగణిస్తారు?
    1) అధర్వణ వేదం
    2) బ్రాహ్మణాలు, అరణ్యకాలు
    3) ఉపనిషత్తులు 4) పైవన్నీ
31. మాక్స్‌ముల్లర్ ప్రకారం రుగ్వేద సంకలన కాలం ?
    1) క్రీ.పూ. 2000- 1500
    2) క్రీ.పూ. 1500- 1000
    3) క్రీ.పూ. 2000- 1200
    4) క్రీ.పూ. 1200- 1000
32. పూర్తిగా గద్యశైలిలో రచించిన వేదం?
    1) రుగ్వేదం 2) సామవేదం
    3) యజుర్వేదం 4) అధర్వణ వేదం
33. విజ్ఞానేశ్వరుని 'మితాక్షర'కు మూలంగా ఉన్న స్మృతి?
    1) మనుస్మృతి 2) యాజ్ఞవల్క్య స్మృతి
    3) పరాశర స్మృతి 4) నారద స్మృతి
34. ఆర్యేతరుల కృతిగా భావించే వేదం?
    1) రుగ్వేదం 2) సామవేదం
    3) యజుర్వేదం 4) అధర్వణ వేదం
35. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
    1) కినాస 2) శూద్ర 3) క్షేత్రక 4) కర్షక
36. కిందివాటిలో సరికాని జత?
    1) గొఘన - అతిధి
    2) దౌహిత్రి- కూతురు
    3) గొప - పశుకాపరి
    4) గవిష్టి- యుద్ధం
37. పురోహితుల దైవంగా ఎవరిని పరిగణించారు?
    1) ఇంద్రుడు 2) అగ్ని
    3) వరుణుడు 4) సూర్యుడు
38. కిందివారిలో వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
    1) సభ, సమితి 2) సమితి, విధాత
    3) విధాత, గణ 4) గణ, పరిషత్
39. వేదకాలంలో ఏ వృత్తివారికి ఉపనయనం ధరించే అర్హత కల్పించారు?
    1) స్వర్ణకారులు 2) రథకారులు
    3) చర్మకారులు 4) లోహకారులు
40. కిందివాటిలో సరైన జతను గుర్తించండి?
    1) కులాల-కుండలు తయారు చేసేవారు
    2) నిషాద - చేపలు పట్టేవారు
    3) కైవర్త -బుట్టలు అల్లేవారు
    4) వేణ - వేటాడేవారు
41. మహావీరుడు ఏ భాషలో తన బోధనలను కొనసాగించాడు?
    1) అర్ధమాగధి 2) పాళి
    3) బ్రాహ్మి 4) మార్వారీ
42. అజీవిక మత స్థాపకుడు?
    1) పురాణ కశ్యప 2) పకుధ కాత్యాయన
    3) గోసల మస్కరిపుత్ర
    4) అజిత కేశ కంబలి
43. కింది వారిలో అశోక వృక్షాన్ని పూజించిన మతశాఖ?
    1) శక్త 2) పాశుపత
    3) దిగంబర 4) అజీవిక
44. జైన మత వాస్తవ స్థాపకుడు?
    1) రుషభనాథ 2) పార్శ్వనాథ
    3) నేమినాథ 4) వర్ధమాన మహావీర
45. మహావీరుడు జ్ఞానోదయం పొందిన ప్రదేశం?
    1) కుంద గ్రామం 2) వైశాలి
    3) గయ 4) జృంభిక గ్రామం
46. మహావీరుడి మొదటి శిష్యుడు?
    1) జామాలి 2) ఆనందుడు
    3) గోసల మస్కరిపుత్ర 4) భద్రబాహు
47. మహావీరుడు మరణించిన ప్రదేశం?
    1) కుశినగర 2) వైశాలి
    3) రాజగృహ 4) పావా
48. మొదటి జైన సంగీతి ఎక్కడ జరిగింది?
    1) పాటలీపుత్రం 2) వల్లభి
    3) జృంభిక గ్రామం 4) వైశాలి
49. జైన పండితుడు హేమచంద్రుడు ఎవరి ఆస్థానంలో ఉండేవాడు?
    1) అమోఘవర్షుడు
    2) కుమార పాలుడు
    3) జయసింహ సిద్ధరాజు
    4) ఖారవేలుడు
50. దక్షిణాదిలో జైనమతాన్ని ప్రచారం చేసిన వారు?
    1) చంద్రగుప్త మౌర్యుడు 2) భద్రబాహు
    3) స్థూలబాహు 4) సుదర్శన్
51. జైనమతాన్ని లిచ్ఛవీల రాజమతంగా చేసిన వారు?
    1) చేతక 2) కుమారదేవ
    3) అభయ 4) ఉదయనుడు
52. జైనమతంలో పోసద లేదా ఉపోసత అంటే?
    1) కొత్తవారిని జైన మతంలోకి సభ్యులుగా తీసుకునే కార్యక్రమం
    2) జైన ఉపాసకులు పున్నమి రోజు ఉపవాసం ఉండడం
    3) జైనులు తమ తప్పులను అంగీకరించే కార్యక్రమం
    4) నియమ ఉల్లంఘనకు విధించే శిక్ష
53. బసదులు ఏ మతానికి సంబంధించినవి?
    1) బౌద్ధం 2) జైనం
    3) హిందూ 4) అజీవిక
54. జైన కల్ప సూత్ర గ్రంథకర్త?
    1) కల్యాచార్య 2) గార్ధబిల్ల
    3) భద్రబాహు 4) స్థూల భద్ర
55. కింది వాటిలో సరికాని జత?
    1) రుషభనాథుడు - వృషభం
    2) అరిష్టనేమి - గవ్వ
    3) పార్శ్వనాథ - పాము
    4) వర్ధమాన మహావీరుడు - ఏనుగు
56. భారతదేశంలో వాడుకలోకి వచ్చిన మొదటి లిపి?
    1) బ్రాహ్మి 2) దేవనాగరి
    3) ఖరోష్టి 4) అరామిక్
57. బౌద్ధమతంలో తొలి చీలిక ఏ సమావేశంలో సంభవించింది?
    1) మొదటి 2) రెండవ
    3) మూడవ 4) నాలుగవ
58. శ్రీలంకలో బౌద్ధమతాన్ని ప్రవేశపెట్టిన వారు?
    1) మహేంద్ర, సంఘమిత్ర
    2) చారుమతి, మహాదేవ
    3) అతిష దీపాంకర, పద్మసంభవ
    4) సంతరక్షిత, కమలశీల
59. బౌద్ధ తర్క సిద్ధాంత స్థాపకుడు?
    1) అసంగుడు 2) వసుబంధుడు
    3) దిగ్నాగుడు 4) బుద్ధఘోషుడు
60. భారతదేశంలో తొలిసారిగా విగ్రహారా ధనను ప్రారంభించినవారు?
    1) హీనయానులు 2) మహాయానులు
    3) వజ్రయానులు 4) హిందువులు
61. బార్హుత్ శిల్పాల్లో కిందివారిలో ఏ రాజు బుద్ధుడితో సమావేశమైన దృశ్యం కనిపిస్తుంది?
    1) అజాతశత్రు 2) బింబిసార
    3) బిందుసార 4) అశోకుడు
62. అశోకుడి శాసనాల్లోని బ్రాహ్మి లిపిని తొలిసారిగా కనుగొన్నది?
    1) కన్నింగ్ హామ్ 2) మాక్స్‌ముల్లర్
    3) జేమ్స్ ప్రిన్సెప్ 4) మార్టిమర్ వీలర్
63. కింది వాటిలో మౌర్యుల గురించి సమాచారమివ్వని గ్రంథం?
    1) మహావంశం 2) దీపవంశం
    3) దివ్యవదన 4) అశోక వదన
64. భారత చరిత్రలో తొలిసారిగా సింహాసనాన్ని త్యజించిన రాజు?
    1) చంద్రగుప్తమౌర్య 2) బిందుసార
    3) అశోకుడు 4) దశరథ

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 2; 5) 1; 6) 4; 7) 3; 8) 4; 9) 4; 10) 1; 11) 2; 12) 1; 13) 4; 14) 2; 15) 3; 16) 3; 17) 4; 18) 1; 19) 2; 20) 2; 21) 3; 22) 1; 23) 4; 24) 1; 25) 1; 26) 4; 27) 1; 28) 4; 29) 3; 30) 4; 31) 2; 32) 4; 33) 2; 34) 4; 35) 1; 36) 3; 37) 2; 38) 1; 39) 2; 40) 1; 41) 1; 42) 3; 43) 4; 44) 2; 45) 4; 46) 1; 47) 4; 48) 1; 49) 3; 50) 2; 51) 3; 52) 2; 53) 2; 54) 3; 55) 4; 56) 1; 57) 2; 58) 1; 59) 3; 60) 2; 61) 1; 62) 3; 63) 4; 64) 1.

1992లో మొదటిరోజు ఏ వారం?

టెట్/డీఎస్సీ ప్రత్యేకం

మెంటల్ ఎబిలిటీ



క్యాలెండర్

క్యాలెండర్ చాప్టర్ నుంచి ప్రతి పోటీ పరీక్షలో 2 - 5 వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

గమనిక: ఈ చాప్టర్‌లోని ప్రశ్నలు సాధించాలంటే బేసి రోజులను గుర్తించడం తెలిస్తే చాలు.

బేసి దినాలు గుర్తించడం

క్యాలెండర్‌లో రెండు రకాల సంవత్సరాలుంటాయి.

- సాధారణ సంవత్సరంలో 365 రోజులు అంటే 52 వారాలు + 1 రోజు. ఆ మిగిలిన ఒక రోజునే 'బేసిదినం' అంటాం.

గమనిక: ఆదివారం నుంచి శనివారం వరకు ఏడు రోజులు ఉంటాయి. కాబట్టి ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చిన శేషాన్ని 'బేసి దినాలు'గా గుర్తించాలి.

- లీపు సంవత్సరంలో 366 రోజులు అంటే 52 వారాలు + 2 బేసి దినాలు ఉంటాయి.

  గమనిక: లీపు సంవత్సరంలో ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.

లీపు సంవత్సరాన్ని గుర్తించడం

- ఇచ్చిన ఏడాదిలోని చివరి రెండు అంకెల(అంటే ఒకట్లు, పదుల స్థానం)ను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లేకపోతే సాధారణ సంవత్సరం.

శతాబ్దంలోని లీపు సంవత్సరం గుర్తించడం

- శతాబ్దాలన్నీ లీపు సంవత్సరాలు కావు. ఏదైనా ఒక శతాబ్దాన్ని 400 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం.

  ఉదా: 400, 800, 1200, 1600, 2000 లీపు సంవత్సరాలు. కానీ 500, 600, 1100, 1500, 1700, 1800, 1900 లీపు సంవత్సరాలు కావు.

శతాబ్దం చివరి రోజు వచ్చే వారాలను కనుక్కోవడం

- వంద సంవత్సరాల్లో ఐదు బేసిదినాలు ఉంటాయి. అంటే 76 సాధారణ సంవత్సరాలు + 24 లీపు సంవత్సరాలు ఉంటాయి.

  76×1 బేసిదినం + 24×2 బేసిదినాలు
  = 76+48 = 124 రోజులు.
  124 రోజులను 7తో భాగిస్తే 5 శేషం వస్తుంది. కాబట్టి 100 ఏళ్లలో ఐదు బేసి దినాలు ఉంటాయి. అంటే ఆ రోజు శుక్రవారం.
  200 ఏళ్లలో 5×2 = 10ని 7తో భాగిస్తే 3 బేసి దినాలు అంటే బుధవారం.
  300 సంవత్సరాల్లో 5×3=15ను 7తో భాగిస్తే 1 బేసిదినం అంటే సోమవారం. 400 సంవత్సరాల్లో 0 బేసిదినాలు అంటే ఆదివారం.
  శతాబ్దం చివరి రోజున శుక్రవారం, బుధవారం, సోమవారం, ఆదివారం వస్తాయి.
  లీపు సంవత్సరంలో జనవరి, జూలై..

సాధారణ సంవత్సరంలో జనవరి అక్టోబర్ నెలలకు ఒకే విధమైన క్యాలెండర్ ఉంటుంది.

కింద ఇచ్చిన కోడ్స్ సహాయంతో క్యాలెండర్ సమస్యలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

శతాబ్దం - కోడ్

1600-1699→6	2000-2099→6
1700-1799→4	2100-2199→4
1800-1899→2	2200-2299→2
1900-1999→0	2300-2399→0

వారం - కోడ్

ఆదివారం - 0	గురువారం - 4
సోమవారం - 1	శుక్రవారం - 5
మంగళవారం - 2	శనివారం - 6
బుధవారం - 3	

నెల - కోడ్

జనవరి - 0	జూలై - 6
ఫిబ్రవరి - 3	ఆగస్టు - 2
మార్చి - 3	సెప్టెంబర్ - 5
ఏప్రిల్ - 6	అక్టోబర్ - 0
మే - 1	నవంబర్ - 3
జూన్ - 4	డిసెంబర్ - 5

గమనిక: బేసి దినాలను కోడ్స్‌గా రాశాం.

వీటిని జ్ఞాపకం ఉంచుకోవడానికి టిప్స్

- శతాబ్దపు కోడ్‌లను గమనిస్తే 6, 4, 2, 0 పునరావృతం అవుతున్నాయి.
- నెలకోడ్‌లను 12 అంకెల మొబైల్ నెంబర్‌గా గుర్తుపెట్టుకోవాలి.
  అది 033 614, 625 035

ఒక తేదీ ఇచ్చి అది ఏ వారమో గుర్తించడానికి కోడ్

తేది + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్

ఉదా: 22-04-1984 ఏ వారం అవుతుంది?

సాధన: పైన ఇచ్చిన కోడ్ ప్రకారం అన్నింటిని కూడాలి.
22 + 6 + 84 + 21 + 0 = 133
133ను 7తో భాగిస్తే శేషం సున్నా.
అంటే కోడ్ ప్రకారం ఆదివారం అవుతుంది.
తేది = 22, ఏప్రిల్ నెలకోడ్ = 6,
సంవత్సరం = 84,
లీపు సంవత్సరాలు 84/4 = 21
శతాబ్దం కోడ్ = 0
అన్నింటిని కూడితే 133 వస్తుంది.

పై విధంగా ప్రాక్టీస్ చేస్తే తక్కువ సమయంలో కచ్చితత్వంతో సమాధానాన్ని గుర్తించగలం.

సమానమైన క్యాలెండర్‌ను గుర్తించడం

ఉదా:

1. 2003 లాంటి క్యాలెండర్ మళ్లీ ఏ సంవత్సరంలో పునరావృతం అవుతుంది? (ఎస్ఐ-2012)
   ఎ) 2006 బి) 2013
   సి) 2012 డి) 2014
   జవాబు (డి)

సాధన: ఇచ్చిన సంవత్సరం నుంచి బేసి దినాలను లెక్కిస్తూ పోతే ఎక్కడైతే బేసి దినాల మొత్తం 7 అవుతుందో అది సమానమైన క్యాలెండర్ అవుతుంది. ఒకవేళ బేసిదినాల మొత్తం 7 కాకపోతే 14 వరకు లెక్కించాలి.

2003-1, 2004-2 (లీపు సంవత్సరం)
2005-1, 2006-1
2007-1, 2008-2 (లీపు సంవత్సరం)
2007 వరకు బేసిదినాల మొత్తం = 6
2008 వరకు = 8
కాబట్టి 14 వచ్చే వరకు చూద్దాం.
2009-1 2010-1 2011-1
2012-2 2013-1
2013 వరకు బేసి దినాల మొత్తం = 14
కాబట్టి 2014 జవాబు అవుతుంది.
అంటే 2003 లాంటి క్యాలెండర్ 2014లో వస్తుంది.

తేలిక పద్ధతి:

కోడ్: 6 11 11

స్టెప్1: ముందుగా ఇచ్చిన సంవత్సరానికి ముందు, వెనుక లీపు సంవత్సరాలను గుర్తించాలి.

2000	2001	2002	2003	*2004*
	+	+	+	
	6	11	11	
			2014	

స్టెప్ 2: వాటికి మధ్య ఉన్న సంవత్సరాలకు 6, 11, 11లను కలిపితే వాటికి సమాన క్యాలెండర్ వస్తుంది.

స్టెప్ 3: మన ప్రశ్నలోని 2003కు 11ను కలిపితే 2014 సమాధానం వచ్చింది.

గమనిక: అడిగిన ప్రశ్నలోని సంవత్సరం లీపు సంవత్సరం అయితే + *28*తో కూడాలి.

ఉదా: 2000 లాంటి లీపు సంవత్సరం 2028లో వస్తుంది..

మాదిరి ప్రశ్నలు

1. 12 ఫిబ్రవరి, 1991 ఏ వారం అవుతుంది?
   ఎ) సోమవారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) గురువారం

   సాధన: తేది + నెలకోడ్ + సం. + లీపు సం. + శతాబ్దం కోడ్‌ను ఉపయోగించాలి.
   12 + 3 + 91 + 22 + 0 = 128
   (91/4 = 22 లీపు సంవత్సరాలు)
   128ను 7తో భాగిస్తే శేషం 2.
   కాబట్టి మంగళవారం అవుతుంది.
2. కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?
   ఎ) 1500 బి) 1700
   సి) 1800 డి) 1600

   సాధన: ఇచ్చినవన్నీ శతాబ్దాలు కాబట్టి శతాబ్దాన్ని 400తో భాగించాలి. అప్పుడు శేషం సున్నా వస్తే అది లీపు సంవత్సరం అవుతుంది.
   400) 1600 (4
   1600
   0
   శేషం సున్నా
   కాబట్టి 1600 మాత్రమే లీపు సంవత్సరం.
3. 1992లో మొదటిరోజు ఏ వారం?
   ఎ) మంగళవారం బి) బుధవారం
   సి) గురువారం డి) నిర్ణయించలేం

   సాధన: 1992లో మొదటిరోజు అంటే జనవరి 1 కోడ్ ప్రకారం
   1 + 0 + 92 + 23 + 0 = 116
   116ను 7 తో భాగిస్తే శేషం 4.
   అంటే గురువారం అవుతుంది.
4. మొదటి శతాబ్దంలోని జనవరి 1 ఏ రోజు అవుతుంది?
   ఎ) మంగళవారం బి) సోమవారం
   సి) బుధవారం డి) గురువారం

   సాధన: క్యాలెండర్‌లోని మొత్తం సమస్యలు, కోడ్‌లు వీటన్నింటికీ 1 - జనవరి - 01 సంవత్సరం సోమవారం నుంచి మొదలైనట్లుగానే తీసుకున్నారు.
   గమనిక: క్యాలెండర్‌లో మొదటి ఆదివారం 7వ తేది అవుతుంది.
   కాబట్టి 1 - జనవరి - 01న సోమవారం అవుతుంది.
   కోడ్ ప్రకారం తేదీ + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్
   1 + 0 + 1 + 0 + 6 = 8
   8ను 7తో భాగిస్తే శేషం 1.
   అంటే సోమవారం అవుతుంది.
5. ఒక సంవత్సరంలో ఎన్ని నెలలు సమాన క్యాలెండర్ కలిగి ఉంటాయి?
   ఎ) జనవరి, జూన్ బి) జనవరి, ఏప్రిల్
   సి) జనవరి, మార్చి డి) నిర్ణయించలేం

   సాధన: జవాబు నిర్ణయించలేం (డి)
   ఎందుకంటే ఒక సంవత్సరం అని అడిగారు. కానీ అది సాధారణ సంవత్సరమా లీపు సంవత్సరమా ఇవ్వలేదు.
6. 11 - జనవరి - 1996 రోజు ఏ వారం అవుతుంది?
   ఎ) బుధవారం బి) గురువారం
   సి) శుక్రవారం డి) శనివారం

   సాధన: కోడ్ ప్రకారం
   11 + 0 + 96 + 24 + 0 = 131
   131ను 7తో భాగిస్తే శేషం 5 అంటే శుక్రవారం.
   కానీ ఇచ్చిన ప్రశ్నలో 1996 లీపు సంవత్సరం. 1996లో జనవరి నెలలోని తేది అడిగారు. ఇది మార్చి నెలకు ముందు కాబట్టి 131-1 = 130ను 7తో భాగించాలి.
   అప్పుడు శేషం = 4 అంటే గురువారం అవుతుంది.
   శుక్రవారం అనేది తప్పు జవాబు.
   గమనిక: ఇచ్చిన ప్రశ్న లీపు సంవత్సరంలోని జనవరి లేదా ఫిబ్రవరిలో ఉంటే బేసిదినాల నుంచి 1ని తీసివేసి మిగిలిన దినాలను 7తో భాగించాలి.
7. 1 మార్చి 1996 రోజు ఏ వారం?

   సాధన: 1 + 3 + 96 + 24 + 0 = 124
   124ను 7తో భాగిస్తే 5 శేషం అంటే శుక్రవారం
   1996 లీపు సంవత్సరం అయినప్పటికీ బేసి దినాల నుంచి '1' తీసివేయలేదు. ఎందుకంటే కనుక్కోవాల్సింది మార్చి నెలలోని తేది.
   ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. కాబట్టి జనవరి, ఫిబ్రవరిలో అడిగిన ప్రశ్నకు బేసి దినాల నుంచి '1' తీసివేయాలి.
8. 2001 జనవరి 1 సోమవారం అయితే ఈ సంవత్సరంలో చివరిరోజు ఏ వారం?
   ఎ) సోమవారం బి) మంగళవారం
   సి) బుధవారం డి) గురువారం

   సాధన: 2001 సాధారణ సంవత్సరం
   = 52 వారాలు + 1 బేసి దినం కాబట్టి సోమవారమే అవుతుంది.
9. మన మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?
   ఎ) శుక్రవారం బి) శనివారం
   సి) గురువారం డి) మంగళవారం

   సాధన:
   మన మొదటి రిపబ్లిక్ డే
   26 జనవరి 1950
   కోడ్ ప్రకారం
   26 + 0 + 50 + 12 + 0 = 88
   88ను 7తో భాగిస్తే శేషం 4 వస్తుంది.
   అంటే గురువారం అవుతుంది.

నిజాం కాలంనాటి 'రెవెన్యూ విధానం' ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు

1. వేయి స్తంభాల గుడి నిర్మాణానికి సంబంధించని అంశం?
   1) ఏకశిల 2) త్రికూట శైలి నిర్మాణం
   3) నక్షత్ర ఆకారం
   4) నల్లని రాతి పనితనం
2. బౌద్ధ మతస్థులకు అభయం ఇస్తున్నట్లుగా ఉన్న మాంధాత శిల్పం ఎక్కడ ఉంది?
   ఎ) ఏలేశ్వరం బి) జగ్గయ్యపేట
   సి) నాగార్జునకొండ డి) బావికొండ
   1) ఎ, బి మాత్రమే 2) సి మాత్రమే
   3) సి, డి మాత్రమే 4) బి మాత్రమే
3. ఆంధ్రుల గురించి పేర్కొనే అశోకుడి శిలాశాసనం ఏది?
   1) 9వ 2) 13వ 3) 6వ 4)10వ
4. శాతవాహనుల నిజమైన రాజ్యస్థాపకుడు?
   1) గౌతమీపుత్ర శాతకర్ణి
   2) యజ్ఞశ్రీ శాతకర్ణి
   3) సిముఖుడు 4) శాతకర్ణి-1
5. 'ట్రాజెడీ ఆఫ్ హైదరాబాద్' గ్రంథ రచయిత?
   1) వెల్లోడి 2) కె.ఎం. మున్షీ
   3) లాయక్ అలీ 4) జె.ఎన్. చౌదరి
6. కంచి, పొన్న అనే నాట్యగత్తెలు ఏ పాలకుల కాలంలో ప్రసిద్ధి?
   1) వెలమ 2) రెడ్డి
   3) కాకతీయ 4) పైవన్నీ
7. శాతవాహనుల కాలం నాటి అంతర్జాతీయ నౌకా కేంద్రం?
   1) అరికమేడు(పుదుచ్చేరి) 2) బారిగజ
   3) మైసోలియా 4) కళ్యాణి
8. ప్రఖ్యాత అమరావతి స్తూపాన్ని నిర్మించిన శాతవాహన రాజు?
   1) గౌతమీ పుత్ర శాతకర్ణి
   2) యజ్ఞశ్రీ శాతకర్ణి
   3) మూడో పులోమావి
   4) రెండో పులోమావి
9. కాకతీయుల కాలం నాటి ఉద్యోగుల గురించి పేర్కొన్న రచన ఏది?
   1) క్రీడాభిరామం
   2) సకల నీతి సమ్మతం
   3) సుమతీ శతకం 4) భోగినీ దండకం
10. తెలంగాణ సాయుధ పోరాట సమయంలో బండెనక బండి కట్టి... అనే గేయం రచించింది ఎవరు?
    1) గద్దర్ 2) బండి యాదగిరి
    3) దాశరథి 4) దొడ్డి కొమురయ్య
11. శాతవాహనుడి వంశ స్థాపకుడైన శ్రీముఖుడి నాణేలు ఎక్కడ లభించాయి?
    1) పెద్ద బంకూరు 2) కొండాపురం
    3) ధూళికట్ట 4) కోటి లింగాల



12. కుతుబ్‌షాహీల కాలంలో గోల్కొండ రాజ్యంలో ప్రసిద్ధి చెందిన పరిశ్రమ?
    1) వస్త్ర 2) పింగాణీ
    3) గాజు 4) వజ్ర
13. 'కలంకారీ' అంటే?
    1) చిత్రకళ 2) నాట్యకళ
    3) శిల్పకళ 4) లలితకళ
14. 'సుగ్రీవ విజయం' అనే తొలి యక్షగానాన్ని రచించింది?
    1) పొన్నగంటి తెలగనార్యుడు
    2) కందుకూరి రుద్రకవి
    3) సారంగు తమ్మయ్య మంత్రి
    4) పిల్లలమర్రి పిన వీరభద్రుడు
15. 'బిద్రి' పాత్రల తయారీలో రాగి, తుత్తునాగాలను ఏ నిష్పత్తిలో ఉపయోగించారు?
    1) 1:16 2) 4:15
    3) 5:8 4) 2:3
16. ఆర్యసమాజ్ శాఖను హైదరాబాద్‌లో ఎప్పుడు స్థాపించారు?
    1) 1892 2) 1893 3) 1884 4) 1895
17. హైదరాబాద్ నగర వాస్తు శిల్పి ఎవరు?
    1) షోయబుల్లా ఖాన్
    2) మీర్ మొమిన్ అస్త్రాబాదీ
    3) సుల్తాన్ కులీ 4) మీర్ ఖాసీం అలీ
18. మూసీనదిపై వంతెనను ఇబ్రహీం కుతుబ్‌షా ఎప్పుడు నిర్మించాడు?
    1) 1558 2) 1578
    3) 1568 4) 1548
19. 1944లో భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆంధ్ర మహాసభ రెండుగా చీలిపోయింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించినవారు?
    1) మాడపాటి హనుమంతరావు
    2) బద్దం ఎల్లారెడ్డి
    3) రావి నారాయణరెడ్డి
    4) కె.వి.రంగారెడ్డి
20. అచ్చ తెలుగు గ్రంథం 'యయాతి చరిత్ర'ను రచించింది?
    1) తెలగనార్యుడు
    2) కందుకూరి రుద్రకవి
    3) గంగాధరుడు 4) సారంగు తమ్మయ్య
21. గోల్కొండ రాజ్యంలో తొలి మసీదు ఏది?
    1) మక్కా మసీదు 2) టోలి మసీదు
    3) తారామతి మసీదు
    4) జామా మసీదు
22. 'బిద్రి' కళకు ప్రసిద్ధి చెందిన కేంద్రాలు ఏవి?
    ఎ) బీదర్ బి) హైదరాబాద్
    సి) గుల్బర్గా
    1) ఎ మాత్రమే 2) ఎ, సి మాత్రమే
    3) ఎ, బి 4) ఎ, బి, సి
23. నల్లటి రూపం, అమ్మోనియం క్లోరైడ్, సోడియం క్లోరైడ్‌ల మిశ్రమంతో కూడిన కళ ఏది?
    ఎ) కలంకారీ బి) బిద్రి
    సి) ఫిలిగ్రి
    1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
    3) బి మాత్రమే 4) ఎ, బి, సి
24. 'దక్కన్' చిత్రకళ పితామహుడు?
    1) మీర్ సయ్యద్ అలీ 2) అబ్దుల్ సమద్
    3) మీర్ మొమిన్ 4) మీర్ హకీం
25. రుద్రమదేవి 'మరణశాసనం' ఏది?
    ఎ) చందుపట్ల శాసనం
    బి) కందుకూరు శాసనం
    సి) మోటుపల్లి శాసనం
    1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
    3) బి, సి మాత్రమే 4) ఎ, సి మాత్రమే
26. కింది వాటిలో సరైంది?
    ఎ) ఉస్మానియా విశ్వవిద్యాలయ స్థాపన -1918
    బి) నిజాం కళాశాల స్థాపన -1887
    సి) మహబూబియా కళాశాల స్థాపన -1894
    1) ఎ, బి మాత్రమే 2) బి మాత్రమే
    3) ఎ, బి, సి మాత్రమే
    4) బి, సి మాత్రమే
27. సాలార్‌జంగ్ ప్రవేశపెట్టిన నూతన నాణేలు ఏవి?
    ఎ) దినార్ బి) హాలి సిక్కా సి) రూక
    1) బి మాత్రమే 2) ఎ, బి మాత్రమే
    3) బి, సి మాత్రమే
    4) ఎ మాత్రమే
28. కిందివాటిలో సరైంది?
    ఎ) 1883లో చందానగర్ రైల్వే సంఘటన
    బి) 1849లో వహాబీ ఉద్యమం
    సి) 1888లో ముల్కీ ఉద్యమం
    1) ఎ మాత్రమే 2) ఎ, సి మాత్రమే
    3) బి, సి మాత్రమే 4) పైవన్నీ
29. నిజాం కాలంనాటి 'రెవెన్యూ విధానం' ఏది?
    ఎ) మహాకామా - ఇ- నసిరి
    బి) జిలాబంది సి) గల్లాబక్ష్
    1) ఎ మాత్రమే 2) బి, సి మాత్రమే
    3) బి మాత్రమే 4) ఎ, సి మాత్రమే
30. 'సుల్తానిల్ అహదే-వజ్జమాన్ హమియు మిల్లతిరసూలిర్ రహమాన్' అని తమ నాణేలపై ముద్రించిన రాజ్యవంశం ఏది?
    ఎ) బీజాపూర్ - ఆదిల్‌షాహీలు
    బి) బీదర్ - బరీద్‌షాహీలు
    సి) గోల్కొండ - కుతుబ్‌షాహీలు
    1) ఎ మాత్రమే 2) సి మాత్రమే
    3) బి, సి మాత్రమే 4) ఎ, సి మాత్రమే
31. తెలుగు అక్షరాలతో నాణేలు ముద్రించిన విజయనగర రాజ్యవంశం?
    1) సంగమ 2) సాళువ
    3) తుళు 4) అరవీటి
32. జాజ్‌నగర్ అంటే ఏ ప్రాంతం?
    1) తెలంగాణ 2) పాండ్య - మధురై
    3) ఒడిశా - కళింగ
    4) హోయసల - ద్వారసముద్రం
33. దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లోని తిరుగుబాట్ల గురించి ప్రస్తావించిన శాసనం ఏది?
    1) బయ్యారం 2) కలువచేరు శాసనం
    3) ధర్మసాగరం 4) హన్మకొండ శాసనం
34. 'దక్షిణ భారతదేశపు నాణేలు' గ్రంథం రచయిత ఎవరు?
    1) ఇలియట్ 2) అబ్దుల్ వాలీ
    3) శేర్వాణి 4) రాంప్సన్
35. 'జరిబా హైదరాబాద్' పేరిట నాణేలు ముద్రించింది?
    1) మహమ్మద్ కుతుబ్‌షా
    2) మహమ్మద్ కులీ కుతుబ్‌షా
    3) అబుల్ హసన్ తానీషా
    4) అబ్దుల్లా కుతుబ్‌షా
36. తొలి ఆంధ్ర మహాసభ 1930లో మెదక్ జిల్లాలోని జోగిపేటలో జరిగింది. దీనికి అధ్యక్షత వహించింది ఎవరు?
    1) మాడపాటి హనుమంతరావు
    2) బూర్గుల రామకృష్ణారావు
    3) సురవరం ప్రతాపరెడ్డి
    4) కొండా వెంకట రంగారెడ్డి

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2; 4) 4; 5) 3;
6) 2; 7) 1; 8) 4; 9) 2; 10) 2;
11) 4; 12) 4; 13) 1; 14) 2; 15) 1;
16) 1; 17) 2; 18) 3; 19) 3; 20) 1;
21) 3; 22) 3; 23) 3; 24) 4; 25) 1;
26) 1; 27) 1; 28) 2; 29) 3; 30) 1;
31) 4; 32) 3; 33) 2; 34) 1;35)4; 36) 3.

రామకేశవ అనే బిరుదున్న శాతవాహన రాజెవరు?

శాతవాహనుల ఆర్థిక విధానం

శాతవాహనుల కాలం నాటి ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. ముఖ్య ఆదాయ వనరు భూమి శిస్తు. పండిన పంటలో 1/6వ వంతు లేదా 18 శాతం భూమి శిస్తు (దేవమేయ) విధించేవారు.

- టాలమి రచించిన 'గైడ్ టు జియోగ్రఫీ', అజ్ఞాత రచయిత రాసిన 'పెరిప్లెస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సి' గ్రంథాల్లో శాతవాహనుల వర్తక, వాణిజ్యాలను వివరించారు. ఈ గ్రంథాల్లో వాడిన పదజాలం..

1. **రజువాహక:** భూమి సర్వే చేసే అధికారి
2. **రజకంటేట:** భూస్వామి
3. **నిష్టి:** సేద్య బానిసలు
4. **ఉదక యంత్రం:** భూమిని దున్నేందుకు ఉపయోగించే సాధనం.
5. **ఘటీ యంత్రం:** బావుల నుంచి నీటిని తోడేందుకు ఉపయోగించే సాధనం.

- శాతవాహనులకు అనేక పట్టణాలు, తీరప్రాంతాలు ఉన్నాయని మెగస్తనీస్ తెలిపారు. అద్యాంతిక అనే వర్తక సంఘాలు ప్రముఖ పాత్ర వహించేవని ఇండికా గ్రంథంలో పేర్కొన్నారు.
- ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి కోసం శాతవాహనులు 17 వృత్తి సంఘాలను నెలకొల్పారు. ధాన్యం వ్యాపారులను దంమ్మికులని, నూనె వ్యాపారులను తెలపికలని, స్వర్ణకారులను సుహానక అని పిలిచేవారు.
- వృత్తి ఆధారిత ఉపకులాలు కూడా 17 వరకు ఉన్నాయని భట్టిప్రోలు శాసనంలో తెలిపారు. అందులో ముఖ్యమైనవి.

1. **హాలికులు:** సేద్యం చేసే రైతులు
2. **వధకులు:** వడ్రంగులు. వ్యవసాయానికి వాడే పరికరాలు చేసేవారు. వీరికి సమాజంలో గౌరవప్రదమైన స్థానం ఉండేది.
3. **గధికులు** : యోగాచార్యం గ్రంథంలో వీరి ప్రస్తావన ఉంది. ఔషధాలు తయారు చేసేవారు. వీరిని గ్రామాల్లో వైద్యులుగా గుర్తించేవారు. ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన మందులు తయారు చేసేవారు.
4. **కౌలికులు:** నేతపనివారు. వీరు నేసే వస్త్రాలను 'రోమ్'కు చెందిన రాజులు అమితంగా ఇష్టపడేవారు.
5. **సేలవగదులు:** వీరు శిల్పులు. శాతవాహన కాలంలో వీరికి మంచి గుర్తింపు ఉండేది. రసరత్నాకరం గ్రంథంలో వీరి వివరాలున్నాయి.

- బౌద్ధుల వల్ల ఈ రాజ్యంలో నౌకాకేంద్రాలు అభివృద్ధి చెందాయని హోలెంట్ హోప్‌మెన్ జర్మన్ పండితుడు పేర్కొన్నాడు.

కవులు - గ్రంథాలు

ఆర్యదేవుడు	: చిత్తశుద్ధి
నాగార్జునుడు	: దశభూమిక సూత్ర
ఆర్యమంజూశ్రీ	: కల్ప సూత్రం

అర్థికాంశాలు

గుల్మిక	: గ్రామపెద్ద
రజవాహక	: భూమిని సర్వే చేసే అధికారి
సోపార	: ప్రాచీన ఓడరేవు
ఎగుమతులు	: సుగంధ ద్రవ్యాలు
ఉషభదాతుడు	: యాత్రికులకు, వ్యాపారులకు వసతి కల్పించేవాడు

రాజులు - వారి బిరుదులు

మొదటి శాతకర్ణి	: దక్షిణాపథపతి
యజ్ఞశ్రీ శాతకర్ణి	: త్రి సముద్రాధిపతి
రెండో పులోమావి	: దక్షిణాపథేశ్వరుడు
గౌతమీపుత్ర శాతకర్ణి	: రామకేశవ

ఇతర అధికారిక పదజాలం

కటకం: సైన్యాగారం
స్కందావారం: సైనిక శిబిరం (హతిగుంఫా శాసనంలో ఈ పదం ఉంది)
గుల్మిక: గ్రామపెద్ద (మ్యాకదోని శాసనంలో ఉంది)
నిగమ సభ: పట్టణ పాలన (నానాఘాట్, భట్టిప్రోలు శాస నంలో ఉంది)
గ్రహపతులు: నిగమసభలోని సభ్యుల (ఆదోని శాసనంలో ఉంది)
మహాతారక: గ్రామ ప్రభువు (గ్రామ పాలకుడు)
శ్రేణి లేదా గిల్డ్‌లు: బ్యాంకులు
సార్థవాహనులు: వ్యాపార వర్గం
త్రప్పగ: విదేశీ నౌకలకు మార్గం చూపే నౌకలు.

What is the code for "manage"?

BANK EXAMS

Reasoning

Model Questions

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between E and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
   1) April 2) June 3) July
   4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
   1) The person whose joining date is in May
   2) The person whose joining date is in January
   3) D 4) A
   5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
   1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
   1) Only two people sit to the left of D
   2) D is sitting second to the right of the person whose joining date is in July
   3) E and B are immediate neighbours of D
   4) D's joining date is in May
   5) None is true
5. Who among the following has joining date in June?
   1) F 2) E 3) G 4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
   1) A and the person whose joining date is in August
   2) The person whose joining date is in May and E
   3) C and G
   4) The persons whose joining dates are in March and June
   5) None of these



Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
   1) D sits at one of the extreme ends of the line
   2) A sits on the immediate left of D
   3) Q faces D
   4) C is an immediate neighbour of D
   5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
   1) P 2) Q 3) R 4) S
   5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
    1) P 2) Q 3) R 4) S
    5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
    1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
    1) A 2) B 3) C 4) D
    5) Cannot be determined

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
    1) si 2) ru 3) ha 4) ma
    5) Cannot be determined
14. Which of the following represents "more time" ?
    1) pa jo 2) zi ki 3) ma ki
    4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
    1) ru 2) pa 3) jo
    4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
    1) ki to 2) ma pa 3) fi ma
    4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
    1) well 2) manage
    3) time 4) enough
    5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
    1) ru si 2) da ha 3) si pa
    4) si da 5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone

Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
    How many steps will be required to complete the rearrangement?
    1) Five 2) Six 3) Seven
    4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
    Which of the following is definitely the input?
    1) enemy 25 joy defeat yes 52 37 46
    2) 37 enemy 25 joy yes defeat 52 46
    3) enemy joy defeat 25 52 yes 46 37
    4) Cannot be determined
    5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
    How many more steps will be required to complete the rearrangement?
    1) Three 2) Four 3) Five
    4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
    Which of the following steps will be the last but one?
    1) VII 2) IV 3) V
    4) VIII 5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
    Which of the following will be step VI?
    1) 33 store 52 of 75 81 full goods
    2) 33 store 52 of 75 full 81 goods
    3) 33 store 52 of 75 goods 81 full
    4) There will be no such step
    5) None of these .

Explanations

(1-7):

March June May Jan July April Feb Aug
A E C B F G H D

1. 4 **2.** 1 **3.** 1 **4.** 5 **5.** 2
6. 3 **7.** 1

(8-12):

Q P S R — Row 2
B C D A — Row 1

8. 4 **9.** 1 **10.** 2 **11.** 5
12. 1

(13-18):

time and money → ma jo ki... (i)
manage time well → pa ru jo...(ii)
earn more money→ zi ha ma..(iii)
earn well enough → si ru ha ...(iv)
From (i) and (ii), time → jo
From (i) and (iii), money → ma
From (i), and → ki
From (ii) and (iv) well → ru
From (ii), manage → pa
From (iii) and (iv), earn → ha
From (iii), more → zi
From (iv), enough → si

13. 3 **14.** 5 **15.** 2

16. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**

17. 1

18. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):

The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

19. Input: 86 open shut door 31 49 always 45
Step I: 31 86 open shut door 49 always 45
Step II: 31 shut 86 open door 49 always 45
Step III: 31 shut 45 86 open door 49 always
Step IV: 31 shut 45 open 86 door 49 always
Step V: 31 shut 45 open 49 86 door always
Step VI: 31 shut 45 open 49 door 86 always
Ans: 2

20. Can't proceed backward. **Ans: 4**

21. Step II: 18 win 71 34 now if victory 61
Step III: 18 win 34 71 now if victory 61
Step IV: 18 win 34 victory 71 now if 61
Step V: 18 win 34 victory 61 71 now if
Step VI: 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement.
Ans: 2

22. Input: where 47 59 12 are they going 39
Step I: 12 where 47 59 are they going 39
Step II: 12 where 39 47 59 are they going
Step III: 12 where 39 they 47 59 are going
Step IV: 12 where 39 they 47 going 59 are
Ans: 5

23. Step II: 33 store 81 75 full of goods 52
Step III: 33 store 52 81 75 full of goods
Step IV: 33 store 52 of 81 75 full goods
Step V: 33 store 52 of 75 81 full goods
Step VI: 33 store 52 of 75 goods 81 full
Ans: 3